

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 311


మంగళవారం 25-7-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



రికార్డు 'సృష్టి'

127 గంటల సేపు నాట్యం చేసి గిన్నిస్‌లోకి ఎక్కిన సృష్టి సుధీర్‌పై కథనం - 11లో



రెండో రోజూ నష్టాలే..

అధిక వెయిటేజీ షేర్లలో అమ్మకాలు.. సెన్సెక్స్ 299 పాయింట్ల నష్టం - 13లో



ఆరని మంటలు

పార్లమెంట్‌ను మణిపూర్ హింసాకాండ కుదిపేస్తోంది. సభ కార్యక్రమాలను అడ్డుకున్నందుకు ఆప్ ఎంపీ సంజయ్‌ను సస్పెండ్ చేశారు.


వివరాలు 6లో ▸



చీతాలకు రేడియో కాలర్ల తొలగింపు

మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కులో ఉన్న ఆరు చీతాలకు రేడియో కాలర్లను తొలగించినట్లు అధికారులు చెప్పారు.

వివరాలు 6లో ▸



జ్ఞానవాపిలో శాస్త్రీయ సర్వేపై స్టే

వారణాసిలోని జ్ఞానవాపి మసీదు.. ఆలయంపై నిర్మించిందా? కాదా? అని తేల్చేందుకు శాస్త్రీయ సర్వే చేపట్టాలన్న ఆదేశాలపై సుప్రీం స్టే ఇచ్చింది.

వివరాలు 6లో ▸



130 కోట్ల మందికి మధుమేహం

ప్రపంచవ్యాప్తంగా 2050 నాటికి 130 కోట్ల మంది మధుమేహం బారినపడే అవకాశం ఉందని లాన్సెట్ అధ్యయనం వెల్లడించింది.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్ చెక్

హామీ అమలు చేస్తున్నా హాహాకారాలేనా?

- పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసంపై రామోజీ నీతిమాలిన రాతలు
- హామీని చిత్తశుద్ధితో సీఎం వైఎస్ జగన్ అమలు
- ప్రాజెక్టువల్ల ప్రయోజనం పొందే రైతులకు దీటుగా నిర్వాసితులకు పునరావాసం
- ఐదేళ్లలో కేవలం రూ.193.4 కోట్ల వ్యయంతో 3,073 కుటుంబాలకే చంద్రబాబు పునరావాసం
- నాలుగేళ్లలో రూ.1,728.42 కోట్ల వ్యయంతో 8,878 కుటుంబాలకు వైఎస్ జగన్ పునరావాసం
- తొలిదశలో మిగతా కుటుంబాలకు నాలుగు నెలల్లో పునరావాసం కల్పించే దిశగా అడుగులు
- కాంట్రాక్టు పనుల్లో కమీషన్ల కోసం కేవలం రూ.15,667 కోట్లకే పోలవరాన్ని పూర్తిచేస్తానని అంగీకరించిన చంద్రబాబు
- కానీ.. భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికే రూ.28,172 కోట్లు అవసరం
- ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలు దక్కించుకున్నాక కమీషన్ల రావనే నెపంతో పునరావాసంపై దృష్టిపెట్టని చంద్రబాబు

5 లో



వెంకటపాలెంలో జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

అమరావతి అందరిదీ

పెత్తందారులపై మూడేళ్లుగా పోరాడి గెలిచాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- పేదలకు స్థలాలివ్వకుండా, ఇళ్లను కట్టనివ్వకుండా ఎన్నో ఆటంకాలు
- చంద్రబాబు, దత్తపుత్రుడు, అనుకూల మీడియా అడుగడుగునా అడ్డు తగిలారు
- పేదలకు రాజధానిలో ఇళ్లు ఇస్తే సామాజిక సమతుల్యత, కులాల సమతుల్యం దెబ్బ తింటుందని వాదించిన చరిత్ర వాళ్లది
- కేంద్రంలో వారు ఎక్కని గడప దిగని గడప లేదు.. కలవని మంత్రి లేరు
- ఏకంగా హైకోర్టు, సుప్రీంకోర్టు దాకా వెళ్లిన దౌర్భాగ్య పరిస్థితిని చూస్తున్నాం
- ఆ కేసులను పరిష్కరించేందుకు మీ తరఫున మీ బిడ్డ పోరాటం చేశాడు
- ఎంతో సంఘర్షణ, ఎన్నెన్నో అవరోధాలను అధిగమించి ఇవాళ 50,793 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నాం
- ఈ రోజు రాష్ట్ర చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుంది
- ఇకపై అమరావతి మనందరిది.. 'సామాజిక అమరావతి'కి పునాదిరాయి వేస్తున్నా
- ఒక్క ఇళ్లే కాదు.. ప్రతి విషయంలోనూ పెత్తందారులు అవరోధాలు కల్పించారు
- పేద బిడ్డలకు పెద్ద చదువులు, ఇంగ్లిష్ మీడియాన్ని వ్యతిరేకించారు
- చంద్రబాబు కూటమితో మనం పెద్ద యుద్ధమే చేస్తున్నాం

2 లో

"పేద వర్గాలపై పెత్తందారుల దోపిడీలను సహించి భరించే కాలం పోయింది. ఈ మార్పు ఇక మీదట రాజకీయాలను శాసిస్తుంది. అలాంటి మార్పులకు మనసా వాచా కర్మణా సహకరించే ప్రభుత్వంగా, మీ అన్నగా.. నిరుపేద అక్కచెల్లెమ్మల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపనతో 'సామాజిక అమరావతి'కి పునాదిరాయి వేస్తున్నా. ఇక నుంచి అమరావతి మనందరిది.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్



గుంటూరు జిల్లా కృష్ణాయపాలెంలో ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అక్కచెల్లెమ్మలకు విలువైన స్థిరాస్తి

- సీఆర్డీఏలో పేదల ఇళ్ల శంకుస్థాపన సభలో సీఎం జగన్.. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు'తో 30.75 లక్షల మందికి స్థలాలు
- వివిధ దశల్లో నిర్మాణంలో 22 లక్షల గృహాలు
- స్థలం, ఇంటి విలువ కలిపి రూ.15 లక్షల వరకూ ఉంటుంది.. ఒక్క ఇళ్లే కాకుండా నాలుగేళ్లలో ఏ ప్రభుత్వమూ చేయనంత మంచి చేశాం

2 లో

పేద పిల్లల విద్యపైనా రామోజీ ఏడుపు

- పేద విద్యార్థులను ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దుతుంటే ఉక్రోషం
- తప్పుడు వార్తలతో ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసే కుట్ర
- పిల్లలకు మంచి చదువులు అందిస్తున్న ప్రభుత్వం.. ప్రజల్లో పెరుగుతున్న నమ్మకం
- ప్రపంచం మన్ననలు అందుకుంటున్న సీఎం జగన్ సంస్కరణలు
- ఒక్క పాఠశాలా మూతపడకుండా ప్రభుత్వం చర్యలు
- బాబు హయాంలో మూతపడిన 1,785 స్కూళ్లనూ తెరిపించిన సీఎం
- ఫౌండేషన్ విద్యతో పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం
- 3వ తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లతో బోధన.. పిల్లల్లో పెరిగిన ప్రమాణాలు

- వివరాలు 3లో



తుంగభద్ర రిజర్వాయర్‌లోకి చేరిన వరద నీరు

కృష్ణాలో పెరిగిన వరద

పశ్చిమ కనుమల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలు

ఆల్మట్టిలోకి 1.14 లక్షల క్యూసెక్కులు.. నేడు మరింత పెరగనున్న నీటి ప్రవాహం

తుంగభద్రలో జోరుగా వరద.. ప్రకాశం బ్యారేజ్ నుంచి 3,132 క్యూసెక్కులు కడలిలోకి..

సాక్షి, అమరావతి/హొళగుంద(కర్నూలు)/శ్రీశైలం ప్రాజెక్ట్: పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా నదిలో ఎగువన వరద ఉద్ధృతి పెరుగుతోంది. సోమవారం ఆల్మట్టి డ్యామ్‌లోకి 1,14,445 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 64.41 టీఎంసీలకు చేరుకుంది. దాంతో ఆల్మట్టి డ్యామ్ సగం నిండినట్లయింది. మరో 65 టీఎంసీలు చేరితే డ్యామ్ పూర్తిగా నిండిపోతుంది. మహారాష్ట్ర, కర్ణాటకలో సోమవారం విస్తారంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో ఆల్మట్టిలోకి మంగళవారం వరద ఉద్ధృతి మరింత పెరగనుంది. ప్రస్తుతం ఆల్మట్టిలో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు వదులుతున్న జలాలకు.. స్థానికంగా కురిసిన వర్షాలు తోడవుతుండటంతో నారాయణపూర్ డ్యామ్‌లోకి 13,675 క్యూసెక్కులు చేరుతున్నాయి. దాంతో ఆడ్యామ్‌లో నీటి నిల్వ 19.09 టీఎంసీలకు చేరుకుంది. డ్యామ్ నిండాలంటే ఇంకా 18 టీఎంసీలు అవసరం. ఇక జూరాల ప్రాజెక్టులోకి 26,244 క్యూసెక్కులు చేరుతుండగా.. నీటి నిల్వ గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో విద్యుదుత్పత్తి చేస్తూ 33,235 క్యూసెక్కులను దిగువకు

మిగతా 14వ పేజీలో ▸

గోదావరి వరద తగ్గుముఖం

12 లో



ఏపీ హైకోర్టు సీజేగా జస్టిస్ ధీరజ్ సింగ్

రాష్ట్రపతి ఆమోదముద్ర

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను నియమించాలన్న సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ సోమవారం రాత్రి ట్వీట్ చేశారు. జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని జూలై 5న సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం సిఫార్సు చేసిన విషయం విదితమే. జస్టిస్ ఠాకూర్ ప్రస్తుతం బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నారు.

నేడు 11 ఆహారశుద్ధి పరిశ్రమలకు శ్రీకారం

6 యూనిట్లకు ప్రారంభోత్సవం.. ఐదు యూనిట్లకు భూమిపూజ

- 11 యూనిట్లకు మొత్తం రూ.1,719 కోట్ల వ్యయం
- తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్న సీఎం వైఎస్ జగన్
- రూ.63.15 కోట్లతో నిర్మించిన 421 కలెక్షన్ సెంటర్లు, రూ.5.37 కోట్లతో నిర్మించిన 43 కోల్డ్ రూమ్స్ ప్రారంభం



చిత్తూరు జిల్లా గంగవరం మండలం పత్తికొండ వద్ద ఏర్పాటు చేసిన టమాటా ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్

సాక్షి, అమరావతి: రైతులు పండించిన పంట ఉత్పత్తులకు అదనపు విలువ చేకూర్చడం ద్వారా వాటికి గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా రూ.1,719 కోట్లతో తలపెట్టిన 11 ఆహారశుద్ధి ప్రాజెక్టులకు మంగళవారం ఉదయం 11 గంటలకు వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుడుతున్నారు. ఆరు యూనిట్లకు ప్రారంభోత్సవం, ఐదు యూనిట్లకు శంకుస్థాపన చేయనున్నారు. ఏటా 3.14 లక్షల టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్ల ద్వారా 925 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కలుగుతుండగా.. 40,307 మంది రైతులకు మేలు జరగనుంది. వీటితోపాటు ఆర్బీకేలకు అనుబంధంగా నిర్మించిన 421 కలెక్షన్ సెంటర్లు, 43 కోల్డ్ రూమ్స్‌ను ముఖ్యమంత్రి రైతులకు అంకితం చేయనున్నారు. ఈ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం అవసరమైన ముడిసరుకును రైతుల నుంచి సేకరించే సందర్భంగా వారికి ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధరకు మించి

మిగతా 3వ పేజీలో ▸



రహస్యంగా టామాటా కర్రీ తింటుంటే మాటువేసి పట్టుకున్నాం సార్!

'మెడికల్' రికార్డు..!

ఈ ఏడాదే ఐదు కొత్త వైద్య కళాశాలలు

తరగతుల ప్రారంభానికి తుది మెరుగులు

- నెలాఖరున రిపోర్టు చేయనున్న విద్యార్థులు
- వైద్య విద్యలో నూతన అధ్యాయం ఆవిష్కరణ
- రూ.8,480 కోట్లతో మొత్తం 17 కొత్త మెడికల్ కాలేజీలు
- వచ్చే ఏడాది మరో ఐదు.. ఆ తర్వాత మిగిలిన 7 ప్రారంభించేలా ప్రణాళిక

వడ్డే బాలశేఖర్–మచిలీపట్నం నుంచి సాక్షి ప్రతినిధి

వందల ఏళ్ల క్రితమే సముద్రయానం ద్వారా వర్తక వాణిజ్యంతో అలరారిన మచిలీపట్నం నగరం క్రీ.శ. మూడో శతాబ్దం నాటిదని చరిత్ర చెబుతోంది. ఆధునిక కాలంలో బ్రిటీష్ పాలకులు బందరు తీరం నుంచి వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించారు. ఇంత ప్రాముఖ్యత కలిగిన

మిగతా 14వ పేజీలో ▸



మచిలీపట్నం మెడికల్ కాలేజీ భవనాలు

17 కొత్త కాలేజీలు

రాష్ట్రంలో ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాలను ఏర్పాటు చేయడం ద్వారా స్పెషలిస్ట్ వైద్య సేవలను చేరువ చేసేలా సీఎం జగన్ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో రూ.8,480 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా 2,550 ఎంబీబీఎస్ సీట్లను అదనంగా సమకూరుస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం 5 కాలేజీలు ప్రారంభం అవుతుండగా వచ్చే విద్యా సంవత్సరం మార్కాపురం, మదనపల్లె, పాడేరు, పులివెందుల, ఆదోని కాలేజీలను ప్రారంభిస్తారు. మిగిలిన వాటిని 2025–26లో ప్రారంభించేందుకు వీలుగా ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వాస్పత్రులను 330 పడకల జిల్లా ఆస్పత్రులుగా నోటిఫై చేసింది.

మరో 2 'ఎంఎస్ఎంఈ' సెంటర్లు

గుంటూరు, కొప్పర్తిలో ఏర్పాటుకు కేంద్రం ఆమోదం



రాష్ట్రంలో చిన్న, మధ్యతరహా తయారీ రంగాన్ని మరింత ప్రోత్సహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా మరో రెండు ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయనుంది. విశాఖ సమీపంలో రూ.250 కోట్లతో 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన టెక్నాలజీ సెంటర్ తరహాలోనే గుంటూరు, కొప్పర్తిలో కూడా ఏర్పాటు చేయడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్రం ఆమోదించింది.

14లో

పెరిగిన డ్రోన్ పైలెట్లు!



- దేశంలో ఈ ఏడాది జూలై 1 నాటికి 5,072 మంది పైలెట్లు
- గత ఏడాది జూలై 1 నాటికి 346 మందే
- 427 మందితో ఏపీకి దేశంలోనే మూడో స్థానం
- 1,087 మందితో తమిళనాడు తొలి స్థానంలో
- 744 మందితో రెండో స్థానంలో మహారాష్ట్ర
- పార్లమెంట్‌లో పౌర విమానయాన శాఖ వెల్లడి

10 లో


సభాప్రాంగణానికి తరలివస్తున్న లబ్ధిదారులు


వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గొడుగులు వేసుకుని మరీ సభాప్రాంగణానికి వెళుతున్న లబ్ధిదారులు


లబ్ధిదారుకు ఇంటి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అమరావతి అందరిదీ

పేదల కోసం మూడేళ్లుగా పెత్తందారులతో మీ బిడ్డ పోరాటం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- పేదలకు స్థలాలివ్వకుండా, ఇళ్లను కట్టనివ్వకుండా ఎన్నో ఆటంకాలు
- చంద్రబాబు, దత్తపుత్రుడు, అనుకూల మీడియా అడుగడుగునా అడ్డు తగిలారు
- ఎంతో సంఘర్షణ, ఎన్నెన్నో అవరోధాలను అధిగమించి ఇవాళ 50,793 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నాం


వెంకటపాలెం సభలో మాట్లాడుతున్న సీఎం జగన్


సభాప్రాంగణం నిండిపోవడంతో బయటే నిలిచిపోయిన జనసందోహం

సాక్షి, అమరావతి: పేదలకు మేలు జరిగే ప్రతి విషయంలో మనందరి ప్రభుత్వానికి, చంద్రబాబు పెత్తందారుల కూటమికి మధ్య పెద్ద యుద్ధమే జరుగుతోందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలకు మంచి జరగకూడదని రాక్షస బుద్ధితో అడ్డుకుంటున్న వారితో పెద్ద యుద్ధమే చేస్తున్నామన్నారు. సోమవారం సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు 50,793 ఇళ్ల నిర్మాణం, 45 సామాజిక వసతుల ప్రాజెక్టులకు శంకుస్థాపన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో సీఎం జగన్ మాట్లాడారు. తొలుత తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి గుంటూరు జిల్లా కృష్ణాయపాలెం లేఅవుట్ వద్దకు చేరుకున్న సీఎం జగన్ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం వెంకటపాలెం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకుని లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే...

ఆ తర్వాత కూడా బుద్ధి మారలేదు..

సీఆర్‌డీఏలో నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద కుటుంబ సభ్యులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా, ఇళ్లు కట్టించకుండా చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు సృష్టించిన ఊరుపేరూ లేని సంఘాలు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ – 5 అడ్డు తగిలాయి. వీరంతా మొదట పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు వీల్లేదన్నారు. ఇందుకోసం ఏకంగా హైకోర్టు, సుప్రీం కోర్టుకు వెళ్లిన దౌర్భాగ్యమైన పరిస్థితిని మన రాష్ట్రంలో మాత్రమే చూస్తున్నాం. ఈ పెద్దమనుషులు, పెత్తందార్లు, పేదల వ్యతిరేకులంతా హైకోర్టులో 18 కేసులు, సుప్రీం కోర్టులో 5 కేసులు వేశారు. ఈ కేసులను పరిష్కరించేందుకు మీ తరఫున మీ బిడ్డ మూడేళ్ల పాటు పోరాటం చేస్తూ వచ్చాడు. దేవుడు, ప్రజల చల్లని ఆశీస్సులు ఎప్పుడూ మంచికే ఉంటాయి. హైకోర్టు, సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వమే కేసులు గెలిచింది. అనుమతులు తెచ్చుకుని మీకు ఇళ్ల పట్టాలు ఇచ్చాం. ఆ తర్వాత కూడా వారి బుద్ధి మారలేదు. ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా ఆపలేకపోయారు కాబట్టి పేదల ఇళ్ల నిర్మాణానికి అడ్డు తగిలేందుకు అన్ని ప్రయత్నాలూ చేశారు. కేంద్ర ప్రభుత్వంలో వారు ఎక్కని గడప దిగని గడప లేదు. కలవని కేంద్ర మంత్రీ, కేంద్ర సెక్రటరీలు కూడా లేరు. ఇంతమందిని కలిశాక చివరి ప్రయత్నంగా మళ్లీ హైకోర్టులో కేసు వేశారు. ఇలాంటి దారుణమైన పరిస్థితి ఎప్పుడూ ఎక్కడా ఉండదు.

చరిత్రలో నిలిచిపోయే రోజు

ఇంతమంది పెత్తందార్లు ఒక్కటై పేదవాడికి ఇళ్లు రాకూడదని అడ్డుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నించిన పరిస్థితులు దేశ చరిత్రలో ఎప్పుడూ గుర్తుండిపోతాయి. ఇలా పేదల శత్రువులతో ఎంతో సంఘర్షణ, ఎన్నెన్నో అవరోధాలను అధిగమించి విజయం సాధించి పేదల ఇళ్లకు శంకుస్థాపన చేస్తున్నాం. ఈరోజు రాష్ట్ర చరిత్రలో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతుంది. మీ ఇళ్ల నిర్మాణానికి, మీ ఇంటి కలల సాకారానికి ఇవాళ ఇక్కడ పునాదులు కూడా వేస్తున్నాం. అక్కచెల్లెమ్మల సొంతింటి కలల సాకారానికి మనం చేసిన సామాజిక న్యాయ పోరాటం చరిత్ర ఉన్నంత వరకూ ఎప్పుడూ మర్చిపోలేనిది. పెత్తందారులపై పేదవాడు, పేదల ప్రభుత్వం సాధించిన విజయంగా చరిత్రలో పదిలంగా ఉంటుంది.

గతంలో ఎన్నడూ చూడలేదు

అమరావతిని పేరుకేమో రాజధాని అంటారు. రాజధానిలో నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద అక్కచెల్లెమ్మలకు ఒక సెంటు స్థలం ఇచ్చి ఇళ్లు కట్టిస్తామంటే అడ్డుపడి కోర్టులకు వెళ్లారు. పేదలకు ఇళ్లు ఇస్తే డెమోగ్రాఫిక్ ఇంబ్యాలెన్స్ (సామాజిక అసమతుల్యత) వస్తుందని, కులాల సమతుల్యం దెబ్బతింటుందని న్యాయస్థానాల్లో వాదించిన చరిత్ర వీళ్లది. ఇలాంటి పెత్తందారులున్న వ్యవస్థతో మనం యుద్ధం చేస్తున్నాం. ఇంత దుర్మార్గమైన మనుషులను, మనస్తత్వాలను, వాదనలను, రాతలను, టీవీల్లో డిబేట్లను, రాజకీయ పార్టీలను గతంలో ఎప్పుడూ చూడలేదు.

నయా జమీందార్ల మొసలి కన్నీరు

పేద పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడుతుంటే ఈ నయా జమీందార్లు, పెత్తందార్లంతా అడ్డుతగిలే కార్యక్రమం చేశారు. తెలుగు భాష ఏమైపోతుందని మొసలి కన్నీరు కారుస్తారు. ఈ పెత్తందార్ల పిల్లలు, మనవళ్లు, మనవరాళ్లను మాత్రం ఇంగ్లిష్ మీడియం బడులకే పంపిస్తారు. మన పిల్లలు మాత్రం తెలుగు బడులకే పోవాలంటారు. నా అక్కచెల్లెమ్మలకు 30 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అడుగులు ముందుకు వేస్తే రకరకాల కోర్టు కేసులు వేశారు. పేదవాడు ఎప్పుడూ పేదవాడుగానే మిగిలిపోవాలన్న పెత్తందారీ ఆలోచనకు ఇవొక నిదర్శనాలు. మీ బిడ్డ పేదల కోసం అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి ఎలాంటి లంచాలు, వివక్షకు చోటివ్వకుండా బటన్ నొక్కి రూ.2.25 లక్షల కోట్లు పంపిస్తే దాన్ని కూడా అడ్డుకునే కార్యక్రమం చేస్తున్నారు. మీ బిడ్డ మాదిరిగా పరిపాలన చేస్తే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని గగ్గోలు పెడుతున్నారు.

ప్రతి ఒక్కరూ ఆలోచించండి

గతంలోనూ ఇదే రాష్ట్రం, ఇదే బడ్జెట్. చంద్రబాబు హయాంలో కన్నా మీ బిడ్డ ప్రభుత్వంలో అప్పుల వృద్ధి రేటు తక్కువ. మరి మీ బిడ్డ ఈ రోజు ఎలా చేయగలుగుతున్నాడు? ఆ రోజు గజదొంగల ముఠా ఎందుకు చేయలేకపోయింది? మీ బిడ్డ హయాంలో ఎటువంటి లంచాలు, వివక్ష లేకుండా నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు ఎలా వస్తున్నాయి? చంద్రబాబు హయాంలో ఎందుకు రాలేదు? ప్రతి ఒక్కరూ ఆలోచించండి. ఏ పేదవాడు, అవ్వాతాతలు ఇబ్బంది పడకూడదని వలంటీర్, సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చాం. లంచాలు, వివక్షకు తావివ్వకుండా ఒకటో తారీఖునే అది ఆదివారమైనా, పండగరోజైనా సరే తెల్లవారుజామునే తలుపు తట్టి గుడ్ మార్నింగ్ చెప్పి చేతిలో పెన్షన్ డబ్బులు పెడుతున్నారు. ఈ వ్యవస్థను కూడా పెత్తందార్లు, పేదల వ్యతిరేకులు అడ్డుకునే కార్యక్రమం చేస్తున్నారు.

హీరోయిజంగా చిత్రీకరిస్తున్నారు

ఏ సమాజమైనా, కుటుంబమైనా నిన్నటి కంటే రేపు, రేపటి కంటే భవిష్యత్ బాగుండాలని కోరుకుంటుంది. అలాంటి వారి ఎదుగుదలకు సహకరిస్తే దాన్ని మంచి ప్రభుత్వం అంటారు. అలాంటి ఎదుగుదలను, అభివృద్ధిని అడ్డుకుంటే, వ్యతిరేకిస్తే దాన్ని దుర్మార్గం, అమానుషత్వం, రాక్షసత్వం అంటారు. విచిత్రమేంటంటే పేదలకు మంచి చేయడాన్ని అడ్డుకుంటూ దాన్ని వారు హీరోయిజంగా చిత్రీకరిస్తున్నారు. ఈ రోజు ఉదయాన్నే ఈనాడు పేపర్‌లో చూశా. వాళ్లు రాసిన రాతలు చూసి ఆశ్చర్యం అనిపించింది. దిగజారుడుతనం ఏ స్థాయికి వెళ్లిందంటే చంద్రబాబు బినామీల అమరావతిలో ఉండేందుకు అమెరికా, సింగపూర్‌ల నుంచి మనుషులు రావచ్చట. కానీ ఇదే అమరావతిలో చుట్టుపక్కల ఉన్న పేదలకు మాత్రం ఇళ్ల స్థలాలు ఇవ్వకూడదని ఈనాడులో రాస్తారు. ఇంత దిక్కుమాలిన పెత్తందారులు, పేదల వ్యతిరేక భావజాలం ఎక్కడైనా ఉంటుందా?

జగనన్నను టచ్ కూడా చేయలేరు

ఎన్నికల సీజన్ రాగానే కొందరు రోడ్డెక్కి మాట్లాడుతున్నారు. చంద్రబాబునాయుడు పేదలను పీక్కుతిన్నాడు. పవన్‌కళ్యాణ్ ఎన్నో పార్టీలు మార్చాడు. బీఎస్పీ, బీజేపీ, టీడీపీ, సీపీఐ, సీపీఎం.. ఇలా ఎన్ని పార్టీలైనా మార్చగలడు. మా జగనన్నను ఓడిస్తారా.. ఎంతమంది వచ్చినా ఆయన్ను టచ్ కూడా చేయలేరు. ఇంకొకడు జగనన్నతో పోటీ అంటూ నడుస్తున్నాడు. నువ్వెంత నీ స్థాయి ఎంత? పెత్తందార్ల కోటలను బద్దలుకొట్టి, పేదల పక్షాన నిలిచి సుప్రీంకోర్టు దాకా వెళ్లి వారిని గెలిపించి జగన్ చరిత్రను తిరగరాశారు. పేదలకు ఇళ్ల స్థలాలు వద్దు అని కోర్టుకెళ్లిన వ్యక్తి చంద్రబాబు.

– జోగి రమేష్, గృహ నిర్మాణ శాఖ మంత్రి

మీరొచ్చాకే బడుగు వర్గాలకు ధైర్యం వచ్చింది

మీరు పాదయాత్ర చేస్తే రోడ్లపై పసుపు నీళ్లు చల్లిన వ్యక్తులను ఇక్కడ చూశాం. మా సమస్యలు చెప్పుకునే పరిస్థితి కూడా లేదు. జగనన్న వచ్చిన తర్వాత మాకు ధైర్యం, భరోసా వచ్చింది. జగన్ పేదల పక్కనుంటే చంద్రబాబు పెత్తందార్ల తరఫున యుద్ధం చేస్తున్నాడు. కోర్టులలో సైతం జగన్ గెలిచి ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణం చేపట్టారు. జీవితకాలం పేద వాడి గుండెల్లో మీ పేరు నిలిచిపోతుంది. ఇచ్చిన మాటకు కట్టుబడి పేదలను లక్షాధికారులను చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుంది.

– బాపట్ల ఎంపీ నందిగం సురేష్

పాలకుడంటే ప్రజల కన్నీటిని తుడిచేవాడు..



పాలకుడంటే పాలించేవాడే కాదు, ప్రజల సంక్షేమాన్ని కోరుతూ వారి కన్నీటిని తుడిచేవాడని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త అర్థం చెప్పారు. మేం మీకు రుణపడి ఉంటాం. మీరే మా ధైర్యం అన్నా. మీకు పక్కనే ఉన్న వెంకన్న స్వామి, కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎప్పటికీ ఉంటాయి. మాకు పట్టాలు ఇచ్చినప్పుడు చాలా సంతోషం వేసింది. ఇప్పుడు ఇళ్ల నిర్మాణం జరుగుతుంది. మేం అనేక పథకాల ద్వారా కూడా లబ్ధిపొందుతున్నాం. నగదు రూపంలో మొత్తం రూ.1,89,250, స్థిరాస్తి రూపంలో రూ.పది లక్షల నుంచి రూ. పదిహేను లక్షలు వరకు లబ్ధిపొందాను.

– రోజా, లబ్ధిదారు, మంగళగిరి

వలంటీర్లపై బురద జల్లుతున్నారు



నేను సొంత ఇల్లులేక, అద్దెలు కట్టుకోలేక ఇబ్బందులు పడ్డాను, నాకు ఏ ప్రభుత్వంలో ఇల్లు రాలేదు, కానీ, మీరు రాగానే మంజూరైంది, మా పేదల తరఫున మీరు నిలబడి చేసిన న్యాయపోరాటానికి మీకు జీవితాంతం రుణపడి ఉంటాం. నేను వైఎస్సార్ ఆసరా ద్వారా లబ్ధిపొందాను, నా కొడుకు ఈ రోజు ఇంగ్లీష్ మీడియం చదువుతున్నాడంటే మీరే కారణం. అన్నా.. నేను నాలుగేళ్లుగా వలంటీర్‌గా సేవలు అందిస్తున్నాను, ఈ మధ్యకాలంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మాపై బురద జల్లుతున్నారు. మీరు మాకు ధైర్యం ఇచ్చారు, థాంక్యూ అన్నా.

– స్వప్న, లబ్ధిదారు, రాణిగారితోట, విజయవాడ తూర్పు నియోజకవర్గం


ఇళ్ల లబ్ధిదారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మొక్కలు నాటిన సీఎం వైఎస్ జగన్

కృష్ణాయపాలెం లేఔట్‌లో మోడల్ హౌస్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి

సాక్షి, అమరావతి: అమరావతిలోని పేదల ఇళ్ల స్థలాల లేఔట్‌లలో పచ్చదనాన్ని పెంపొందించే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొక్కలు నాటారు. సోమవారం కృష్ణాయపాలెం లేఔట్‌లో మొక్కలు నాటి నగర వన మహోత్సవాన్ని ప్రారంభించారు. తర్వాత ఈ లేఔట్‌లో నిర్మించిన మోడల్ హౌస్‌ను పరిశీలించారు. ఆ ఇంటి యజమానురాలు ఈపూరి జీవరత్నం, ఆమె భర్త, పిల్లలతో మాట్లాడారు. వారి కోరిక మేరకు ఫొటో కూడా దిగారు. కాగా, మొత్తం 25 లేఔట్లలో పచ్చదనం అభివృద్ధి కోసం కేటాయించిన 10 శాతం భూమిలో అర్బన్ ఫారెస్ట్ కార్యక్రమంలో భాగంగా రూ.1.68 కోట్లతో 28 వేల మొక్కలు నాటనున్నట్టు సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. రావి, వేప, నేరేడు, బాదం, రెయిన్‌ట్రీ, పచ్చతురాయి, పొగడ, ఆకాశమల్లె వంటి నీడను, పళ్లను ఇచ్చే మొక్కలతో కృష్ణాయపాలెం లేఔట్ హరిత వనంగా మారుతుందన్నారు. ఇక్కడ నివసించే ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించడంతో పాటు ఆహ్లాదభరిత వాతావరణాన్ని కల్పిస్తామన్నారు.


కృష్ణాయపాలెంలో మొక్కలకు నీళ్లు పోస్తున్న సీఎం జగన్

నేనున్నానంటూ సీఎం భరోసా


సీఎం జగన్‌కు గోడు వెళ్లబోసుకుంటున్న త్రివేణి


గౌతమ్‌వెంకట్ కుటుంబానికి చెక్కు అందిస్తున్న సబ్ కలెక్టర్ అదితిసింగ్


సూర్యఆదిత్యరెడ్డికి చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, కలెక్టర్ శివశంకర్

సాక్షి ప్రతినిధి, విజయవాడ/, గుంటూరు, నరసరావుపేట : అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న వారికి నేనున్నానంటూ సీఎం జగన్ అండగా నిలిచారు. తలసేమియాతో బాధపడుతున్న విజయవాడకు చెందిన దుర్గాభవానీ, సీతారామ్ దంపతులు కుమారుడు గౌతమ్‌వెంకట్, బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న పల్నాడు జిల్లా రొంపిచర్లకు చెందిన సూర్యఆదిత్యరెడ్డి, ప్రమాదంలో కళ్లు కోల్పోయి, మానసిక స్థితి సరిగా లేని దుగ్గిరాలకు చెందిన నాగూర్‌తో పాటు కుమార్తె త్రివేణిలు వెంకటపాలెం వద్ద సీఎం జగన్‌కు గోడు వెళ్లబోసుకున్నారు. వారి కష్టాలు ఓపికగా విన్న సీఎం.. తక్షణ ఆర్థిక సాయంతో పాటు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ మేరకు గంటల వ్యవధిలోని అయా జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. వైద్యం అందిస్తామన్నారు.

అక్కచెల్లెమ్మలకు విలువైన స్థిరాస్తి

- సీఆర్డీఏలో పేదల ఇళ్ల శంకుస్థాపన సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు'తో 30.75 లక్షల మందికి స్థలాలు
- వివిధ దశల్లో నిర్మాణంలో 22 లక్షల గృహాలు
- స్థలం, ఇంటి విలువ కలిపి రూ.15 లక్షల వరకూ ఉంటుంది
- ఒక్క ఇళ్లే కాకుండా నాలుగేళ్లలో ఏ ప్రభుత్వమూ చేయనంత మంచి చేశాం




కృష్ణాయపాలెం జగనన్న లేఅవుట్లో నిర్మించిన మోడల్ హౌస్, మోడల్ హౌస్‌లో సౌకర్యాలను పరిశీలిస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇంటి స్థలం, ఇంటి రూపంలో పేద అక్కచెల్లెమ్మల చేతిలో ప్రాంతాన్ని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల విలువైన స్థిరాస్తిని పెడుతున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ పథకం కింద 30.75 లక్షల మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశామన్నారు. వివిధ దశల్లో 22 లక్షల గృహాలు నిర్మాణాల్లో ఉన్నాయని తెలిపారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.70 లక్షల మేర ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. సీఆర్డీయేలో పేదల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా సోమవారం వెంకటపాలెంలో నిర్వహించిన సభలో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలను సీఎం జగన్ అందించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

సంతోషంగా స్వీకరిస్తున్నాం..

సీఆర్‌డీఏలో 50,793 మంది అక్కచెల్లెమ్మల పేరిట ఇళ్ల స్థలాలిచ్చాం. ఈ రోజు గృహ నిర్మాణాలను ప్రారంభిస్తున్నాం. ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని అత్యధికంగా ఆప్షన్–3 ఎంపిక చేసుకున్నారు. వారి నిర్ణయానికి అనుగుణంగా మన ప్రభుత్వం ఇళ్ల నిర్మాణ బాధ్యతను సంతోషంగా స్వీకరిస్తోంది. సీఆర్డీఏ ప్రాంతంలో గజం స్థలం కనీసం రూ.15 వేలు ఉంది. ఈ లెక్కన పేద మహిళలకు ఇచ్చిన స్థలం విలువే రూ.7.50 లక్షలు ఉంటుంది. మరో రూ.2.70 లక్షలు వెచ్చించి ఇళ్లను నిర్మిస్తున్నాం. మౌలిక వసతుల కోసం ప్రతి ఇంటి మీద మరో రూ.లక్ష పైచిలుకు ఖర్చు చేస్తున్నాం. ఇంటి నిర్మాణం పూర్తయ్యే సరికి ఈ ఆస్తి విలువ కనీసం రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పలుకుతుంది.

అన్ని సదుపాయాలతో..

మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల పరిధిలో 1,400 ఎకరాల్లో 25 లేఅవుట్లను అభివృద్ధి చేసి 50,793 మంది పేదలకు ఇళ్ల స్థలాలతోపాటు ఇళ్లను నిర్మించే బాధ్యత తీసుకుంటున్నాం. ప్రతి లేఅవుట్ వద్దకు అక్కచెల్లెమ్మలను తీసుకుని వెళ్లి ఇళ్ల పత్రాలిచ్చి ఆ ఇంటి స్థలంలో ఫొటోలు తీసి జియో ట్యాగింగ్ చేశాం. సీఆర్డీఏ పరిధిలో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.70 లక్షలు ఖర్చు చేస్తున్నాం. లేఅవుట్ల అభివృద్ధిలో భాగంగా ల్యాండ్ లెవలింగ్, ప్లాట్ల సరిహద్దు రాళ్లు కూడా పాతాం. దీనికోసం ఇప్పటికే రూ.56 కోట్లు ఖర్చు చేశాం. ఇళ్ల నిర్మాణం కోసం రూ.1,370 కోట్లు ఖర్చు చేస్తున్నాం. లేఅవుట్‌లలో నీటి సరఫరా కోసం రూ.32 కోట్లతో టెండర్లు ఖరారయ్యాయి. విద్యుత్ కనెక్షన్ కోసం రూ.326 కోట్లు, అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి మరో రూ.8 కోట్లతో పనులకు శ్రీకారం చుడుతున్నాం. పేదల ఇళ్లు నిర్మించే కాలనీల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లు, షాపింగ్‌మాల్స్, పార్కులు వస్తాయి. మిమ్మల్నందరినీ ఆయా సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో మ్యాపింగ్ చేశారు. కౌంటర్లలో మీ ఇంటికి సంబంధించిన పత్రాలు మీ చేతుల్లో పెడతారు. ఇందుకోసం 25 కౌంటర్లు ఏర్పాటు చేశాం.


లబ్ధిదారు కుటుంబానికి ఇంటి నిర్మాణ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

వరుణుడి ఆశీస్సులు

సీఆర్డీఏలో సీఎం జగన్ చేతుల మీదుగా పేదల ఇళ్లకు శంకుస్థాపన కార్యక్రమం పండుగ వాతావరణంలో కొనసాగింది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన మహిళా లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కృష్ణాయపాలెం లేఅవుట్‌లో భూమి పూజ అనంతరం వెంకటపాలెంలోని సభా ప్రాంగణానికి సీఎం జగన్ చేరుకున్న కొద్ది సేపటికే వర్షం ప్రారంభం అయింది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కొందరు లబ్ధిదారులు సభాప్రాంగణం వెలుపల నిల్చుని సీఎం ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకించారు. సుమారు అర గంట పాటు కొనసాగిన సీఎం జగన్ ప్రసంగాన్ని మహిళలు ఆసక్తిగా విన్నారు. ''అమరావతిలో పేదల ఇళ్ల నిర్మాణం పెత్తందారులపై పేద వర్గాల విజయానికి తార్కాణం. పేదల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన ద్వారా సామాజిక అమరావతికి పునాది రాయి వేశాం...' అని సీఎం జగన్ పేర్కొన్నప్పుడు హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. జై జగన్ నినాదాలు హోరెత్తాయి. 'రాజధానిలో పేదలకు ఇళ్లు ఇస్తామంటే కులాల సమతుల్యం దెబ్బతింటుందని వాదించారు. ఇలాంటి పెత్తందారులు, దుర్మార్గమైన మనుషులను, పార్టీలను గతంలో ఎప్పుడైనా మనం చూశామా..?' అని సీఎం ప్రశ్నించడంతో.. చూడలేదని మహిళలు బిగ్గరగా సమాధానమిచ్చారు.

ఏ ప్రభుత్వమూ చేయనంతగా

గత నాలుగేళ్లలో ఏ ప్రభుత్వమూ చేయనంత మంచిని మీ బిడ్డ చేసి చూపించాడు. పిల్లల చదువులు, అవ్వాతాతల సంక్షేమం, వివక్షకు తావులేకుండా సేవలు, ఆర్బీకేల ద్వారా రైతన్నలకు దన్నుగా నిలిచాం. గ్రామాల్లో విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్.. ఇలా వైద్య ఆరోగ్య సేవలలో ఎన్నో సంస్కరణలు చేపట్టాం. ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలు మార్చడంతో పాటు ఏకంగా 17 కొత్త వైద్య కళాశాలలను తీసుకొస్తున్నాం. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిని పెంచి ఆరోగ్య ఆసరాను అమలు చేస్తున్నాం. వైద్య ఆరోగ్యసేవల్లో, అక్కచెల్లెమ్మల సాధికారతలో, పెద్ద ఎత్తున పేదల ఇళ్ల నిర్మాణం, సామాజిక వర్గాల సంక్షేమం, ప్రాంతాల సంక్షేమం, డీసెంట్రలైజేషన్, పోర్టులు.. ఇలా ఏ అంశాన్ని తీసుకున్నా గతంలో ఏ ప్రభుత్వమూ చేయనంత మంచిని చేశాం.

భావోద్వేగంతో కంటతడి

ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలు అందుకున్న పలువురు మహిళలు భావోద్వేగంతో కంటతడి పెట్టారు. వాస్తవానికి 2020 డిసెంబర్‌లోనే ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేసింది. అయితే ప్రతిపక్షాల కుట్రలతో సీఆర్డీఏలో ఇళ్ల పట్టాల పంపిణీ నిలిచిపోయింది. న్యాయపరమైన చిక్కులు పరిష్కారం అయ్యాక మూడేళ్ల అనంతరం తమకు ఇళ్ల పట్టాలను ప్రభుత్వం అందచేయడంతో ఉద్వేగానికి గురయ్యారు. వెంటనే ఇళ్ల నిర్మాణం కూడా ప్రారంభం కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాడు లోకేశ్.. నేడు మాజీ మంత్రి కన్నా

జయంతికి, వర్ధంతికి తేడా తెలియని టీడీపీ నేతలు



సత్తెనపల్లి: టీడీపీలోని నేతలకు జయంతికి, వర్ధంతికి తేడా తెలియదని మరోసారి రుజువైంది. సత్తెనపల్లి పట్టణంలో సోమవారం ప్రముఖ కవి, రచయిత, సాహితీవేత్త గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమం జరిగింది. దీనికి హాజరైన టీడీపీ నేత, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గుర్రం జాషువా జయంతికి ఘన నివాళి అని ప్రకటించటం స్థానికులను ఆశ్చర్య పరిచింది. గతంలో టీడీపీ నేత నారా లోకేశ్ కూడా బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజున వర్ధంతి శుభాకాంక్షలు తెలియజేయటం అందరికీ తెలిసిందే. మాజీ మంత్రిగా సుదీర్ఘకాలం రాజకీయాల్లో పనిచేసిన కన్నా టీడీపీలో చేరిన తర్వాత ఉన్న బుర్ర కాస్త పోయిందని వారి అనుచరులే బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

ఈ వలంటీర్లను తొలగిద్దాం.. కొత్తవారిని నియమిద్దాం

పవన్‌కళ్యాణ్‌కు మాజీ ఎంపీ హరిరామ జోగయ్య లేఖ



పాలకొల్లు సెంట్రల్: జనసేన అధికారంలోకి వస్తే ప్రస్తుతం ఉన్న 2.50 లక్షల మంది వలంటీర్లను తొలగించి, కొత్తవారిని నియమించాలని ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌కు కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకుడు చేగొండి హరిరామ జోగయ్య సూచించారు. ఈ మేరకు పవన్‌కళ్యాణ్‌కు సోమవారం ఆయన లేఖ రాశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మీడియాకు దానిని విడుదల చేశారు. వలంటీర్లలో అధిక శాతం వైఎస్సార్‌సీపీకి చెందిన వారే ఉన్నారని చెప్పారు. కనీసం పదో తరగతి విద్యార్హతగా కొత్తగా 2.50 లక్షల మంది మహిళలనే వలంటీర్లుగా నియమించాలని సూచించారు. ఇతరత్రా పలు అంశాలకు సంబంధించి ఆ లేఖలో సూచనలు చేశారు.

బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలి: ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టి బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ మహిళలకు సబ్ కోటా ఇచ్చినప్పుడే వారికి కూడా రాజ్యాధికారం దక్కుతుందన్నారు. జాతీయ బీసీ మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పద్మలత ఆధ్వర్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంటులో ఆమోదం తెలపాలన్న డిమాండ్‌తో సోమవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో కృష్ణయ్య ప్రసంగిస్తూ మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి గొంతు చించుకుని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బీసీ మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాల గురించి, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆగస్ట్ 7న తిరుపతిలో ఓబీసీ మహాసభ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): ఆగస్టు 7వ తేదీ బీపీ మండల్ డే సందర్భంగా తిరుపతిలో ఓబీసీ మహాసభ నిర్వహించనున్నట్లు బీసీ సక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమవారం విజయవాడలో జరిగిన విలేకరుల సమావేశంలో మహాసభ వాల్‌పోస్టర్‌ను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ దేశంలో బీసీలకు మొదటిసారిగా విద్యా, ఉద్యోగ రంగాల్లో 27 శాతం రిజర్వేషన్ అమలు జరిగిన రోజు ఆగస్టు 7ను బీపీ మండల్ డేగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 8వ జాతీయ మహాసభ తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరుగుతుందన్నారు. దేశంలోని 36 పార్టీల ప్రతినిధులు సభకు హాజరవుతారని చెప్పారు. బీసీ సంఘాల నేతలు బీసీ రమేష్ గౌడ్, వందాడి వేంకటేశ్వరరావు, అల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఎవరినీ వదలను: లోకేశ్



చీమకుర్తి: 'మేం అధికారంలోకి వస్తే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎవరినీ వదిలిపెట్టను. వడ్డీతో సహా చెల్లిస్తా. సింగపూర్‌లో ఉన్నా... ఎక్కడ దాక్కున్నా వారి సంగతి తేలుస్తా..' అని టీడీపీ నేత నారా లోకేశ్ అన్నారు. పాదయాత్రలో భాగంగా సోమవారం సాయంత్రం ప్రకాశం జిల్లా చీమకుర్తిలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలను వేధించిన వైఎస్సార్‌సీపీ నాయకుల సంగతి చూస్తానని హెచ్చరించారు. టీడీపీకి చెందిన ప్రతి పసుపు సైనికుడిని గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటానని చెప్పారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతం పరిసరాల్లోని ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడింది. అది మరింతగా బలపడి బుధవారం నాటికి వాయుగుండంగా మారనుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ వాయుగుండం పశ్చిమ వాయవ్య దిశగా, ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపింది. మరోవైపు నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయి. వీటన్నింటి ఫలితంగా రానున్న మూడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురవనున్నాయి.

మన్యంలో ప్రాజెక్టులకు జలకళ

- నిండుకుండలా చెరువులు, ప్రాజెక్టులు
- ఎగువ నుంచి భారీగా వచ్చిన వరద నీరు
- 35 వేల ఎకరాలకు అందనున్న సాగునీరు


నిండుకుండలా ఉన్న బుట్టాయగూడెం మండలంలోని పోగొండ రిజర్వాయర్

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత కొద్దిరోజులుగా వర్షాలు దంచి కొడుతున్నాయి. ప్రతి రోజూ ఏదో సమయంలో వానలు కురుస్తూనే ఉండడంతో మన్య ప్రాంతంలోని చెరువులు, ప్రాజెక్టుల్లోకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. దీంతో చెరువులు, ప్రాజెక్టులు నిండు కుండలా మారి జలకళను సంతరించుకున్నాయి.

పుష్కలంగా సాగునీరు

మన్యంలోని సుమారు 128 మైనర్ ఇరిగేషన్ చెరువుల పరిధిలోని సుమారు 30 వేలకు పైగా సాగు భూములు ఉన్నాయి. ఇప్పటికే ఈ భూముల్లో రైతులు వివిధ రకాల పంటలను ఈ ఖరీఫ్ సీజన్‌లో పండిస్తున్నారు. ప్రధానంగా వరి, ప్రత్తి, మొక్కజొన్న, వేరుశనగ, చెరకు పంటలను రైతులు వేశారు. సుమారుగా 18 వేల ఎకరాల భూముల్లో రైతులు పంటలు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఈ భూములన్నీ వర్షాలపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం భారీగా కురుస్తున్న వర్షాలతో చెరువుల్లోకి నీరు చేరడంతో తమకు సాగునీరు కొరత తీరినట్లే అని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా చెరువులు, ప్రాజెక్టుల్లో నీరు భారీగా చేరడంతో భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల బోర్లలో నీరు సమృద్ధిగా లభించనుంది.

జలాశయాలు కళకళ

మన్యప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయం నీటితో కళకళలాడుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా ప్రస్తుత వర్షాలతో ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో 212.40 మీటర్లు సామర్థ్యంతో నిండి ఉంది. అదేవిధంగా పోగొండ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 157 మీటర్లు కాగా సామర్థ్యాన్ని మించి నీరు బయటకు ప్రవహిస్తుంది. అదేవిధంగా కొవ్వాడ ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 90.50 మీటర్లు కాగా ప్రస్తుతం 87.50 మీటర్లతో ప్రాజెక్టులో నీరు నిల్వ ఉంది.

అప్రమత్తంగా ఉన్నాం

భారీ వర్షాలు కురుస్తుండడంతో చెరువుల పరిస్థితిపై అప్రమత్తంగా ఉన్నాం. చెరువులకు గండ్లు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. చెరువులు, ప్రాజెక్టుల్లో భారీగా నీరు ఉండడంతో ఆయకట్టు రైతులకు పుష్కలంగా నీరు అందించేందుకు కృషి చేస్తాం. ప్రస్తుతం ఖరీఫ్‌కు నీటి కొరత లేదు. అలాగే రబీలో కూడా సాగునీరు అందించేలా కృషి చేస్తాం. – టి.సురేష్, మైనర్ ఇరిగేషన్ ఏఈ, కేఆర్‌పురం

పేద పిల్లల విద్యపైనా రామోజీ ఏడుపు

ఒక్క పాఠశాలా మూతపడకుండా ప్రభుత్వం చర్యలు

తప్పుడు వార్తలతో ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసే కుట్ర

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి విద్యార్థులను ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. రాష్ట్ర బాలలు అత్యున్నతస్థాయి ప్రమాణాలను అందుకుంటున్నారు. సీఎం జగన్ చేపట్టిన సంస్కరణలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్నాయి. పలు రాష్ట్రాలు, విదేశీ ప్రతినిధులు ఇక్కడి పాఠశాలల్ని పరిశీలించి, ఇవే చర్యలు వారి ప్రాంతాల్లోనూ అమలు చేసేందుకు నిర్ణయిస్తున్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యల కారణంగా ఏ ఒక్క పాఠశాలా మూతపడకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. ఈ మేరకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చింది. వాస్తవానికి చంద్రబాబునాయుడు హయాంలో 1,785 స్కూళ్లు మూతపడగా, వాటన్నింటినీ వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి తెరిపించింది. విద్యా రంగం అభివృద్ధికి తీసుకున్న చర్యలతో ప్రజల్లో ముఖ్యమంత్రి పట్ల, ప్రభుత్వం పట్ల ఆదరణ రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ఈనాడు రామోజీరావుకు నిద్ర పట్టడంలేదు. విద్యా రంగంపై రోజూ అసత్యాలతో ఈనాడులో వార్తలు వండి వారుస్తున్నారు. అందులో భాగంగానే సోమవారమూ ఓ అసత్య కథనాన్ని ఈనాడు ప్రచురించింది.

గత మూడేళ్లలో తీసుకొచ్చిన సంస్కరణలతో విద్యా రంగంలో ప్రమాణాలు ఎంతో మెరుగుపడ్డాయి. పిల్లల్లో ఆరేళ్ల లోపు మెదడు ఎదుగుదల ఉంటుందని, ఆ సమయంలో వారికి అవసరమైన పరిజ్ఞానాన్ని అందించాలన్న సత్సంకల్పంతో కేంద్ర నూతన విద్యా విధానానికి అనుగుణంగా ప్రభుత్వం ఫౌండేషన్ స్కూలు విధానాన్ని చేపట్టింది. పీపీ 1, పీపీ 2, 1, 2 తరగతుల పిల్లలకు ప్రత్యేకంగా ఫౌండేషన్ స్కూళ్లను ఏర్పాటు చేసింది. 3 వ తరగతి నుంచి పిల్లలకు సబ్జెక్టు టీచర్లతో బోధన సాగించేందుకు అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్లకు అనుసంధానం చేసింది. దీని వల్ల 3వ తరగతి నుంచే సబ్జెక్టులపై పరిపూర్ణమైన పరిజ్ఞానం పెరుగుతుంది. పై తరగతుల్లోకి వెళ్లేకొద్దీ సబ్జెక్టుల్లో రాటుదేలుతారు. ఉన్నత విద్యలోనూ ఉన్నత ప్రమాణాలు అందుకుంటారు. తద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎలాంటి పోటీనయినా ఎదుర్కొనగలుగుతారు. హైస్కూళ్లలోని ఆట స్థలాలు, లైబ్రరీ, లేబొరేటరీ వంటివి కూడా వారికి అందుబాటులోకి వస్తాయి. గతంలోలా కాకుండా 3 వ తరగతి నుంచే పిల్లలు హైస్కూల్ వాతావరణానికి అలవాటు పడి, డ్రాపవుట్ల సంఖ్య కూడా పూర్తిగా తగ్గుతుంది. మన బడి నాడు – నేడు, ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ తరగతులు, ఐఎఫ్‌పీ ప్యానెళ్ల ఏర్పాటు, జగనన్న అమ్మ ఒడి, విద్యా కానుక, గోరుముద్ద, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన సహా అనేక పథకాలు విద్యా రంగం రూపురేఖలనే మార్చివేశాయి. వీటికోసం ప్రభుత్వం నభూతో నభవిష్యతి అన్నట్లు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. పిల్లల చదువులపై మేనమామగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధను తల్లిదండ్రులు కొనియాడుతున్నారు.

జీర్ణించుకోలేకపోతున్న రామోజీరావు



ప్రజల్లో ప్రభుత్వానికి పెరిగిపోతున్న మంచి పేరును చూసి రామోజీరావు జీర్ణించుకోలేకపోతున్నారు. చంద్రబాబు హయాంలో 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో వేల స్కూళ్లు మూతపడ్డాయి. తన బినామీ సంస్థలుగా ఉన్న నారాయణ, చైతన్య స్కూళ్లను పెంచి పోషించడానికి చంద్రబాబు ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు సాధారణంగా ఇవ్వాల్సిన నిధులు కూడా ఇవ్వకుండా స్కూళ్లను నిర్వీర్యం చేసినా ఈనాడు ఒక్క అక్షరమూ రాయలేదు. ఇప్పుడు వైఎస్ జగన్ ప్రభుత్వం పేద విద్యార్థులను అన్ని రకాలుగా తీర్చిదిద్దుతుంటే ఈనాడు కడుపు మంటతో తప్పుడు కథనాలు ప్రచురిస్తోంది. ఇలాంటి చర్యలు ఆపకపోతే ఈనాడు, రామోజీరావుపై న్యాయపరమైన చర్యలు తప్పవని విద్యా శాఖ హెచ్చరించింది.

ఎన్నో కార్యక్రమాలతో విద్యా రంగం ముందంజ

- గత ప్రభుత్వ నిర్వాకం వల్ల పాఠశాల విద్యార్థులు తరగతులకు తగ్గ సామర్థ్యాలను అందుకోలేకపోయారు. దీన్ని సరిచేయడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం ఫౌండేషన్ విద్య, మ్యాపింగ్ వంటి చర్యలు చేపట్టింది. దీనివల్ల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెరిగాయి. ప్రభుత్వ పరిధిలోని అన్ని వనరులను సమర్థంగా వినియోగించుకొని పిల్లలను ప్రపంచపౌరులుగా తీర్చిదిద్దేందుకు కొత్త విధానం ఉపకరిస్తోంది
- గతంలో లేని ప్రీప్రైమరీ విద్యను పిల్లలకు అందుబాటులోకి తెచ్చి పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసింది.
- 3వ తరగతి నుంచే పిల్లలకు సబ్జెక్టు టీచర్లతో బోధన వల్ల వారిలో ప్రమాణాలు పెరుగుతున్నాయి
- గతంలో 1 నుంచి 5వ తరగతి వరకు ఉండే 18 సబ్జెక్టులను ఒకరిద్దరు టీచర్లు పూర్తి చేయడం కష్టంగా ఉండేది. విద్యార్థులకు సరైన పరిజ్ఞానం కూడా అందేది కాదు. 5వ తరగతి నుంచి 6వ తరగతిలో చేరే విద్యార్థులు ఎలాంటి ప్రమాణాలు లేనందున పై తరగతుల్లో వారిని తీర్చిదిద్దడం ఉపాధ్యాయులకు భారంగా ఉండేది. కొత్త విధానంతో విద్యార్థుల్లో ఆ లోపం కనుమరుగైంది. దీనిని టీచర్లు, హెడ్మాస్టర్లు కూడా స్వాగతించారు.
- 2022–23 విద్యా సంవత్సరంలో 1 కిలోమీటర్ పరిధిలో 8,643 స్కూళ్లు ఉండగా వాటిలో కేవలం 4,943 ప్రైమరీ, యూపీ స్కూళ్లను మాత్రమే 3,557 హైస్కూళ్లకు మ్యాపింగ్ చేసింది. 2,43,540 మంది విద్యార్థులు హైస్కూళ్లకు మ్యాపింగ్ అయ్యారు.
- మ్యాపింగ్ అయిన హైస్కూళ్లలో 66,245 మంది సబ్జెక్టు టీచర్లు అవసరం కాగా ఇప్పటికే 59,663 మంది పనిచేస్తున్నారు. 6,582 మంది సబ్జెక్టు టీచర్లను ప్రభుత్వం పదోన్నతుల ద్వారా అందుబాటులోకి తెచ్చింది.
- విద్యార్థుల సదుపాయం కోసం 13,868 అదనపు తరగతులను కూడా ప్రభుత్వం నాడు – నేడు ద్వారా నిర్మించింది.
- జననాల రేటు తగ్గడం వల్ల 2019 నుంచి ఫౌండేషన్, ఫౌండేషన్ ప్లస్ స్కూళ్లలో చేరికల్లో తగ్గుదల కనిపిస్తోంది.

పత్తిపాడు మండలం నిమ్మగడ్డవారిపాలెం స్కూలు వాస్తవం ఇది

- ఈనాడులో అసత్యపు వార్తలో పేర్కొన్న పత్తిపాడు మండలం నిమ్మగడ్డవారిపాలెం ఎంపీపీఎస్ స్కూలు అసలు మ్యాపింగ్ చేయలేదు. గత ఏడాది 5 మంది విద్యార్థులలో ఇద్దరు రెండో తరగతి, ఇద్దరు నాలుగో తరగతి, ఒకరు ఐదో తరగతి చదివారు. 2023–24 విద్యా సంవత్సరంలో వీరిలో నలుగురు ప్రైవేటు స్కూల్లో చేరగా, మరో విద్యార్థి రేపల్లె ఎస్టీ హాస్టల్‌లో చేరాడు.
- ఈ స్కూలుకు అనుసంధానంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో మూడేళ్ల వయసు పిల్లలు 8 మంది ఉన్నారు. 2023–24లో ఐదుగురు చేరారు.

నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం కొలుములపేట ఎంపీపీ స్కూలు వాస్తవాలు ఇవీ..

- కొలుముల పేట గ్రామం చింతలచెరువు గ్రామానికి కిలోమీటర్ దూరంలో శివారు గ్రామంగా ఉంది. గత ఏడాది ఈ స్కూల్లో 2వ తరగతిలో ఐదుగురు, 3వ తరగతిలో ఐదుగురు, 4వ తరగతిలో నలుగురు, 5వ తరగతిలో ఐదుగురు ఉండేవారు. 3 నుంచి 5 తరగతులను కిలోమీటర్ లోపు దూరంలో ఉన్న చింతలచెరువు హైస్కూలుకు మ్యాపింగ్ చేశారు. విద్యార్థులందరూ హైస్కూలుకు వెళ్తున్నారు. గత ఏడాది కానీ, ఈ ఏడాది కానీ ఎలాంటి సమస్యా ఇక్కడ లేదు.
- మిగిలిన 1, 2 తరగతుల్లో ఇద్దరు ఒకటో తరగతి చదువుతుండగా, రెండో తరగతిలో ఎవరూ లేరు. ఒకటో తరగతిలో ఉన్న ఇద్దరు పిల్లలను తల్లిదండ్రుల అభీష్టం మేరకు చింతలచెరువు ఎంపీపీ స్కూలులో చేర్చారు. వారు రెగ్యులర్‌గా ఆ స్కూలుకు వెళ్తున్నారు. చింతలచెరువు స్కూల్లో 348 మంది విద్యార్థులున్నారు. వారికి సరిపడా టీచర్లను ప్రభుత్వం నియమించింది.

అనకాపల్లి జిల్లా గొలుగొండపేట స్కూలు స్థితి ఇదీ

- ఈ స్కూలులో 31 మంది విద్యార్థులున్నారు. 3 నుంచి 5 తరగతులను చినగొలుగొండపేట యూపీ స్కూలుకు మ్యాపింగ్ చేశారు. కిలోమీటర్‌లోపు ఉన్న ఈ స్కూలుకు ఇక్కడి విద్యార్థులు రెగ్యులర్‌గా వెళ్తున్నారు. గొలుగొండపేట ప్రైమరీ స్కూలులోని 1, 2 తరగతుల్లో ఆరుగురు విద్యార్థులున్నారు. ఈ ఏడాది కొత్తగా ఎవరూ చేరలేదు. రెండో తరగతి విద్యార్థులు చినగొలుగొండపేట యూపీ స్కూల్లో చేరారు.

తిరుపతి అర్బన్‌లోని మున్సిపల్ స్కూలు.. వాస్తవం ఇదీ

- ఈ స్కూలును మ్యాపింగ్ చేయలేదు. గత ఏడాది ఇక్కడ ఏడుగురు విద్యార్థులు ఉండేవారు. వారిలో ఐదుగురు ప్రత్యేక అవసరాలున్న పిల్లలు. వారిని తిరుపతిలోని టీటీడీ డఫ్ అండ్ డమ్ స్కూలులో చేర్చారు. మిగతా ఇద్దరు పిల్లలు 5వ తరగతి పూర్తి చేయడంతో సమీపంలోని హైస్కూలులో చేరారు.

- ఈ స్కూళ్లకు సంబంధించి ప్రత్యేకంగా చేరికల డ్రైవ్ నిర్వహించి పిల్లలను చేర్చే ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ యుద్ధప్రాతిపదికన చేపట్టింది. త్వరలోనే ఈ స్కూళ్లలో పిల్లలను చేర్చి తరగతులను కొనసాగించేలా చర్యలు తీసుకుంటోంది.

నేడు 11 ఆహార శుద్ధి పరిశ్రమలకు శ్రీకారం

▶ మొదటి పేజీ తరువాయి

కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిబంధన విధించింది.

భారీ చాక్లెట్ల పరిశ్రమ సహా ఐదింటికి భూమిపూజ

- రూ.1,692 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఐదు ఆహారశుద్ధి పరిశ్రమలకు సీఎం జగన్ భూమిపూజ చేస్తున్నారు. వీటిలో చాక్లెట్ల కంపెనీ, వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్, మూడు టమాటా ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. 745 మందికి ఉపాధి లభించనుండగా, 36,588 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.
- వీటిలో ప్రధానమైది మాండలిజ్ చాక్లెట్ కంపెనీ యూనిట్. బిస్కెట్లు, చాక్లెట్ల తయారీలో ప్రపంచంలోనే ప్రముఖ కంపెనీల్లో ఒకటైన మాండలిజ్ కంపెనీ రూ.1,600 కోట్లతో శ్రీసిటీలో అతిపెద్ద చాక్లెట్ల తయారీ కంపెనీ నిర్మిస్తోంది. ఏటా 2.20 లక్షల టన్నుల కోకోవా ప్రాసెసింగ్ సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశ్రమ ద్వారా 500 మందికి ఉపాధి లభిస్తుంది. 18 వేలమంది రైతులకు లబ్ధి కలుగుతుంది.
- సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామం వద్ద 11 ఎకరాల్లో రూ.75 కోట్లతో వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ వేరుశనగ నూనె, పీనట్ బటర్, చిక్కీ, రోస్టర్డ్ సాల్టెడ్ పీనట్స్ తయారు చేస్తారు. ఏటా 55,620 టన్నుల వేరుశనగను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఏర్పాటవుతున్న ఈ యూనిట్ ద్వారా 200 మందికి ఉపాధి లభిస్తుంది. 15వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది.
- ఆపరేషన్ గ్రీన్స్ స్కీమ్‌లో భాగంగా ఒక్కొక్కటి రూ.5.5 కోట్ల అంచనాతో అనంతపురం జిల్లాలో కల్యాణదుర్గం, కుందుర్పి, సత్యసాయి జిల్లాలో చెన్నేకొత్తపల్లిల్లో టమాటా ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్క యూనిట్ సామర్థ్యం ఏటా 3600 టన్నులు. వీటి ద్వారా 45 మందికి ఉపాధి లభిస్తుంది. 3,588 మంది రైతులకు లబ్ధి కలుగుతుంది.

ఉద్యాన రైతులకు అంకితం

- ఉద్యానపంట ఉత్పత్తుల నిల్వ, గ్రేడింగ్ కోసం గ్రామ స్థాయిలో రూ.63.15 కోట్లతో నిర్మించిన 421 కలెక్షన్ సెంటర్లు, రూ.5.37 కోట్లతో నిర్మించిన 43 కోల్డ్ రూమ్స్‌ను సీఎం జగన్ రైతులకు అంకితం చేయనున్నారు. 1,912 ఆర్బీకేలకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన ఈ కలెక్షన్ సెంటర్ల సామర్థ్యం ఒక్కొక్కటి వందటన్నుల వంతున మొత్తం 42,100 టన్నులు. ఈ సెంటర్ల ద్వారా 1.80 లక్షలమంది రైతులకు మేలు జరగనుంది. 194 ఆర్బీకేలకు అనుబంధంగా ఒక్కొక్కటి 10 టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన 43కోల్డ్ రూమ్స్ ద్వారా 26,420మంది రైతులు లబ్ధి పొందనున్నారు.

సీఎం ప్రారంభిస్తున్న ప్రాజెక్టులివే..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న ఆరు ప్రాజెక్టుల్లో నాలుగు టమాటా విలువ ఆధారిత యూనిట్లు, ఒక మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్, ఉల్లి విలువ ఆధారిత ఉత్పత్తుల పరిశ్రమలు ఉన్నాయి.

- ఆపరేషన్ గ్రీన్స్ కింద ఒక్కొక్కటి రూ.5.5 కోట్లతో అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం తుమ్మగుంటపల్లి, చిత్తూరు జిల్లా గంగవరం మండలం పత్తికొండ, బైరెడ్డిపల్లి మండలం చప్పిడిపల్లి, సోమల మండలం కామిరెడ్డివారిపల్లెల్లో నాలుగు టమాటా విలువ ఆధారిత యూనిట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో యూనిట్ సామర్థ్యం ఏడాదికి 3,600 టన్నులు. ఒక్కో యూనిట్‌లో 15 మంది చొప్పున నాలుగు యూనిట్ల ద్వారా 60 మందికి ఉపాధి లభిస్తుంది. 2,414 మంది రైతులకు లబ్ధి కలుగుతుంది.
- విజయనగరంలో రూ.4 కోట్లతో నిర్మించిన ఆరోగ్య మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సీఎం ప్రారంభించనున్నారు. ఏటా 7,600 టన్నుల ప్రాసెసింగ్ సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ యూనిట్ ద్వారా రాగిపిండి, మిల్లెట్ చిక్కీలు, బిస్కెట్లు, సేమ్యా తయారు చేస్తారు. 20 మందికి ఉపాధి లభిస్తుంది. ఈ యూనిట్ నిర్వహణ కోసం వెయ్యిమంది రైతులతో ఏర్పడిన ఆరోగ్య మహిళా రైతు ఉత్పత్తిదారుల్లో సభ్యులంతా మహిళలే. యూనిట్‌ను నిర్వహించేది, పనిచేసేది అందరూ మహిళలే.
- కర్నూలు జిల్లాలో ఉల్లి ఆధారిత ఉత్పత్తుల కోసం ఒక్కో యూనిట్ రూ.లక్ష చొప్పున రూ.కోటితో 100 సోలార్ డీహైడ్రేషన్ యూనిట్లు ఏర్పాటు చేశారు. ఒక్కో యూనిట్ ఆరుటన్నుల చొప్పున ఏటా ఆరువేల టన్నుల ఉల్లిని ప్రాసెస్‌చేస్తాయి. వీటిద్వారా 100 మందికి ఉపాధి లభించనుండగా 500 మంది రైతులకు లబ్ధిచేకూరనుంది.

పవన్‌కళ్యాణ్‌పై కేసు నమోదు

- వలంటీర్లపై పవన్ అనుచిత వ్యాఖ్యలు తనను బాధించాయని రంగవల్లి ఫిర్యాదు
- ఫిర్యాదును స్వీకరించిన విజయవాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
- విచారణకు ఆదేశం


ఫిర్యాది రంగవల్లి

సాక్షి ప్రతినిధి, విజయవాడ: వలంటీర్లను ఉద్దేశించి నిరాధార, అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌పై కేసు నమోదైంది. విజయవాడ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆదేశాలతో 499, 500, 504, 505,507 రెడ్‌విత్ 511 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. రాష్ట్రంలోని గ్రామ, వార్డు వలంటీర్లు సంఘ వ్యతిరేక శక్తులుగా తయారయ్యారని, ఒంటరి మహిళల వివరాలను సంఘ విద్రోహశక్తులకు ఇస్తున్నారని, దీని కారణంగానే రాష్ట్రంలో ఇప్పటి వరకు 29 వేల మంది ఒంటరి మహిళలు అదృశ్యమయ్యారని, వీరిలో ఇప్పటి వరకు 14 వేల మంది జాడ లభించలేదని పవన్ మాట్లాడారు. ఈ నెల 9, 10 తేదీల్లో ఏలూరులో జరిగిన వారాహి యాత్రలో పవన్ చేసిన ఈ వ్యాఖ్యలను కొన్ని టీవీ చానళ్లు, పత్రికలు ప్రముఖంగా ప్రచారం చేశాయి. ఈ వ్యాఖ్యలపై విజయవాడ సింగ్‌నగర్‌లోని శాంతినగర్ వార్డు వలంటీర్ బగ్గా రంగవల్లి తీవ్ర మనస్తాపానికి గురై అప్పట్లోనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో విజయవాడ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం పథకాలను ఇంటింటికి సజావుగా చేరవేస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తున్న తనను పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు బాధించాయని ఫిర్యాదులో రంగవల్లి పేర్కొన్నారు. రాజకీయ స్వలాభం కోసమే ఎన్‌సీఆర్‌బీ తనకు చెప్పినట్టు పవన్ వ్యాఖ్యానించారని తెలిపారు. వలంటీర్లపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని పోగొట్టేందుకే వలంటీర్ల ప్రతిష్ట దిగజార్చే వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. సోషల్ మీడియాలోనూ ఈ వ్యాఖ్యలు అత్యధికంగా సర్క్యులేట్ అయ్యాయని.. ఈ వ్యాఖ్యలు సమాజంతో తన పరువుకు, గౌరవానికి భంగం కలిగించాయని వివరించారు. తన వృత్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్‌పై చర్యలు తీసుకోవాలని రంగవల్లి న్యాయస్థానాన్ని కోరారు. ఈ ఫిర్యాదును న్యాయస్థానం విచారణకు ఆదేశించింది. కేసులో ఈనాడు, ఆంధ్రజ్యోతి, టైమ్స్ ఆఫ్ ఇండియా వార్తా పత్రికల ఎడిటర్‌లను, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, టీవీ9, ఎన్‌టీవీ, సాక్షి టీవీ మేనేజింగ్ ఎడిటర్/ప్రజంటేటర్‌లతో పాటు మరో ఇద్దరిని సాక్షులుగా చేర్చారు. ఆయా పత్రికల్లో, న్యూస్ చానళ్లలో వచ్చిన క్లిప్పింగ్‌లను న్యాయస్థానానికి సమర్పించారు.


పేదోడి సొంతింటి కల నెరవేర్చిన జగనన్న


రిలే దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: కులవాదుల కుట్రలను పటాపంచలు చేసి పేదవాడి సొంతింటి కల నెరవేర్చిన జగనన్న బహుజనుల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు తెలిపారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 1,030వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో పేదవాడు ఇల్లు కట్టుకోవాలంటే ఎదురుచూపులు చూడాల్సిన దుస్థితి ఉండేదని చెప్పారు. నాయకులు పెరికే వరప్రసాద్, మాదిగాని గురునాథం, బేతపూడి సాంబయ్య, పులిదాసు, కారుమూరి పుష్పరాజ్, బొలిమేర శ్యామ్యూల్, ఈపూరి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మేల్కొలిపిన గొప్ప కవి జాషువా

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నివాళులు


వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జాషువా విగ్రహానికి పూలమాల వేస్తున్న నేతలు

సాక్షి,అమరావతి: తన రచనలతో సమాజాన్ని మేల్కొలిపిన గొప్ప కవి గుర్రం జాషువా అని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. అవమానాలు పొందినచోటే సత్కారాలు అందుకున్న మహోన్నతుడని కొనియాడారు. గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగింది. గుర్రం జాషువా విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సమాజానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ సమాజంలోని కుళ్లు, అంటరానితనాన్ని తన రచనల ద్వారా పారద్రోలిన వ్యక్తి గుర్రం జాషువా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దాళి గిరి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ ఎం.శేషగిరిరావు, నవరత్నాల ప్రోగ్రామ్ వైస్ చైర్మన్ నారాయణ మూర్తి, గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు మంత్రుల ఘన నివాళి

ప్రముఖ కవి, సాహితీవేత్త గుర్రం జాషువా వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున సోమవారం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. విజయవాడలోని మంత్రి సురేష్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొని జాషువాకు నివాళులర్పించారు.

కాసులు కురిపిస్తున్న చేపలు

మత్స్యగెడ్డలో జోరుగా వేట



సాక్షి,పాడేరు: జిల్లాలో జి.మాడుగుల,పాడేరు,హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో విస్తరించిన మత్స్యగెడ్డలో చేపల వేట జోరందుకుంది. వర్షాలు కురుస్తుండడంతో గెడ్డలో నీటి ఉధృతి అధికంగా ఉంది. చేపల వేటకు అనుకూలంగా ఉండడంతో ఏజెన్సీలోని గిరిజన మత్స్యకారులతో పాటు ఒడిశాలోని పాడువా ప్రాంత గిరిజనులు నాటుపడవల ద్వారా వలలు వేసి చేపలను వేటాడుతున్నారు.పెద్ద సైజు చేపలు వలలో పడుతుండడంతో మంచి లాభాలు వస్తున్నాయి.మత్స్యగెడ్డలో లభించే చేపలకు పెదబయలు,ముంచంగిపుట్టు,జోలాపుట్టు,హుకుంపేట,పాడేరు.అరకులోయతో పాటు ఒడిశాలోని ఒనకఢిల్లీ,లమతాపుట్టు,పాడువా,చటువా, నందపూర్ ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది.రుచికరంగా ఉండే బంగారుపాప, బొచ్చు, వంటి చేపలు 10కిలోలకు పైగా బరువు ఉన్నవి లభ్యమవుతున్నాయి. ఇవి హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. కిలో రూ.300ధర పలుకుతుండడంతో మత్స్యకారులకు మంచి ఆదాయం లభిస్తోంది.

> ధనవంతులు, కులీనులు అహంకారం చూపితే అది వారికి వినాశనం అవుతుంది. యోగ్యత, కీర్తి పొందాలంటే అణకువగా ఉండాలి. అదే స్వర్గపు దారి.
> – తావోయిజం

సాక్షి
మంగళవారం, 25 జూలై 2023

బియ్యమో... రామచంద్రా!

గడచిన కొద్దిరోజులుగా అమెరికాలోని దుకాణాల వద్ద భారతీయుల భారీ క్యూలు ఓ హాట్ టాపిక్. రానున్న రోజుల్లో బియ్యానికి కొరత రావచ్చనే భయంతో, నిల్వ చేసుకొనేందుకు ప్రవాస భారతీయులు పెద్దయెత్తున కొనుగోళ్ళకు దిగడంతో తలెత్తిన దృశ్యమది. ఉరుము లేని పిడుగులా బాస్మతి బియ్యం మినహా మిగతా రకాల తెల్ల బియ్యం ఎగుమతుల్ని తక్షణమే నిషేధిస్తూ భారత సర్కార్ గత గురువారం తీసుకున్న ఆకస్మిక నిర్ణయంతో రేపు ఇలాంటి దృశ్యాలు ఇంకేం తలెత్తుతాయో తెలీదు. ప్రపంచ బియ్యం మార్కెట్‌ను ఇది ఆశ్చర్యపరిచినప్పటికీ, పెరిగిపోతున్న ధాన్యం ధరలను నియంత్రించడం రానున్న ఎన్నికల దృష్ట్యా పాలకులకు అనివార్యమైంది. దేశీయంగా సరఫరా పెంచడానికీ, ద్రవ్యోల్బణానికి ముకుతాడు వేసేందుకూ బియ్యం ఎగుమతులపై ఈ తక్షణ నిషేధం ఉపకరిస్తుందని సర్కార్ భావన. అందుకే, 10 నెలల క్రితం బియ్యం ఎగుమతులపై 20 శాతం సుంకం వేసి, ఆంక్షలు పెట్టిన పాలకులు అది ఫలించక ఇప్పుడు నిషేధమే విధించారు.


భారత్ మాటిలా ఉన్నా ఇది ప్రపంచానికి ప్రాణసంకటమే. ఇటీవలే నల్లసముద్రపు ఆహార ధాన్యాల ఒప్పందాన్ని రష్యా రద్దు చేసుకోవడంతో వివిధ దేశాల్లో గోదుమలు, మొక్కజొన్నల ధర నింగికెగసింది. ఇప్పుడు భారత బియ్యం ఎగుమతి నిషేధమూ తోడయ్యేసరికి, ప్రపంచ ఆహార ధరలు ఇంకా పెరగవచ్చని ఆందోళన రేగుతోంది. ప్రపంచ దేశాల్లో అత్యధికంగా బియ్యం ఎగుమతయ్యేది మన దేశం నుంచే! ప్రపంచ పామాయిల్ ఎగుమతుల్లో ఇండొనేసియా, మలేసియా ఎలాగో బియ్యానికి సంబంధించి మనం అలా! ఎగుమతుల్లో 40 శాతానికి పైగా మన దేశానివే! ఇప్పుడు మన ఉత్పత్తుల్లో ఉన్నతశ్రేణిదిగా భావించే బాస్మతి మినహా మిగతా రకాల బియ్యానికి తాజా నిషేధం వర్తిస్తుంది. పెరిగిన అంతర్జాతీయ అమ్మకాలు సైతం ఈ నిషేధానికి కారణం. గత ఆర్థిక సంవత్సరం భారత్ నుంచి బియ్యం ఎగుమతులు 23 శాతం పెరిగాయి. ఈ ఏడాదిలో జూన్ వరకు మన బియ్యం అంతర్జాతీయ అమ్మకాలు 35 శాతం హెచ్చాయి. వెరసి, గత నెల రోజుల్లో దేశంలో బియ్యం రేటు 3 శాతం పెరిగింది. ఏడాది క్రితంతో పోలిస్తే 11.5 శాతం పెరిగిందని సర్కారే చెబుతోంది.

అదేసమయంలో, దేశీయంగా వరి ఉత్పత్తి పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఒకపక్క పంజాబ్, హర్యానా లాంటి చోట్ల వర్షాలతో వరి పంట దెబ్బతింది. మరోపక్క అదనులో తగినంత వర్షాలు పడక కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు వగైరాల్లో వరి నాట్లు ఆలస్యమయ్యాయి. దీంతో భవిష్యత్తులో బియ్యం సరఫరాకు కొరత రావచ్చు. అదే జరిగితే నింగినంటుతున్న ధరలు నేలకు రావడం కష్టమే. ఎన్నికల వేళ అది దెబ్బ తీస్తుందని భావించిన పాలకులు ఎగుమతులపై నిషేధాస్త్రం సంధించారు. మన దేశపు బియ్యం ఎగుమతుల్లో 25 నుంచి 30 శాతం ఇప్పుడు నిషేధానికి గురైన ఈ బాస్మతీయేతర తెల్ల బియ్యమే. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో మన దేశం 1.7 కోట్ల టన్నులకు పైగా బియ్యాన్ని భారత్ ఎగుమతి చేస్తోంది. నిషేధంతో ఈ ఎగుమతులు 40 శాతం పడిపోవచ్చు. సహజంగానే దీనిపై దేశంలోని ఎగుమతిదారుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే, ఈ నిషేధం తాత్కాలికమేననీ, మహా అయితే ఆరు నెలల వరకే ఉండచ్చనీ, ప్రపంచ వాణిజ్య సంస్థ బరిలోకి దిగాక పరిస్థితి చక్కబడుతుందనే ఆశ లేకపోలేదు.

బంగ్లాదేశ్, అంగోలా, గినియా, కెన్యా, నేపాల్ సహా 140కి పైగా దేశాలకు మన దేశం బియ్యం ఎగుమతి చేస్తోంది. థాయిలాండ్, వియత్నామ్, పాకిస్తాన్, మయన్మార్ లాంటి ఇతర ఎగుమతి దేశాలూ ఉన్నా భారత నిర్ణయంతో ఏర్పడ్డ లోటును అవి భర్తీ చేయలేవు. ఫలితంగా, విపణిలో ఇతర ఆసియా దేశాల నుంచి వచ్చే బియ్యం ధరలూ పెరిగాయి. బియ్యం ఎగుమతిలో ప్రపంచంలో రెండు, మూడు స్థానాల్లో ఉన్న థాయిలాండ్, వియత్నామ్‌ల బియ్యం రేటు హెచ్చింది. రష్యా యుద్ధంతో ఉక్రెయిన్ నుంచి ఎగుమతులకు ఆటంకం చాలదన్నట్టు అమెరికాలో ధాన్యం పండించే ప్రాంతాలు అధిక ఉష్ణోగ్రతలు, వర్షాభావంతో సతమతమవుతున్నాయి. ఈసారి అమెరికాలో గోదుమల దిగుబడి తగ్గవచ్చు. 16 ఏళ్ళలో ఎన్నడూ లేనంత తక్కువకు నిల్వలు పడిపోవచ్చు. గోదుమలు, బియ్యం – రెంటికీ అగ్రరాజ్యంలో కటకట రావచ్చు.

గత ఏడాది మేలో గోదుమల ఎగుమతిపై నిషేధం, సెప్టెంబర్‌లో విరిగిన బియ్యంపైన నిషేధం, బాస్మతీయేతర బియ్యంపై 20 శాతం సుంకం విధింపు... ఆ వరుసలో వచ్చినదే భారత సర్కార్ తాజా ఉత్తర్వు. ఈ ఏడాది మే నుంచి పంచదార ఎగుమతుల్నీ ఆపారు. ఇవన్నీ తిరోగామి చర్యలైనా, దేశీయ సరఫరాలో ఇబ్బందులతో అనివార్యమైంది. ఇప్పుడిప్పుడే వర్షాలు పుంజుకుంటున్నా, నాట్లలో జరిగిన జాప్యం దెబ్బతీయవచ్చు. ఇక, ఎల్‌నినో పొంచి ఉండనేవుంది. వీటన్నిటి మధ్య ఈ ఏటి దిగుబడి పరిస్థితి ఏమిటో ఇప్పుడే చెప్పలేం. కానీ, గత ఆర్థిక సంవత్సరం బియ్యం, గోదుమలు – రెండూ ఎన్నడూ లేనంత అధిక దిగుబడినిచ్చాయని జబ్బలు చరుచుకున్నాం. ప్రపంచానికి మనమే ఆహారం అందిస్తున్నామన్నాం. తీరా అప్పుడు గోదుమలు, ఇప్పుడు బియ్యంపై ఇలా నిషేధం విధించాల్సి రావడమేమిటి? ఇది బేతాళ ప్రశ్న. అలాగే, ఏళ్ళ తరబడి కష్టంతో ప్రపంచ విపణిలో ఎగుమతిదారుగా సంపాదించుకున్న పేరుకు ఈ నిషేధపుటుత్తర్వులు చేటు చేస్తాయి. గుండుగుత్తగా ఎగుమతులపై నిషేధమనే కన్నా, నిర్ణీత కనీస ధరకు తక్కువైతే ఎగుమతుల్ని అనుమతించబోమని చెప్పవచ్చు. దేశీయంగా ఆహార ధరలు నియంత్రించాలంటే పాలకులు ప్రత్యామ్నాయాలు ఆలోచించక తప్పదు. వాణిజ్య విధానాన్ని ఘడియకోసారి మార్చడం మార్గం కానే కాదు!

వేధిస్తున్న విపరిణామాలు



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

వందేళ్లలో ప్రపంచ ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగాయి. ఫలితంగా వ్యవసాయోత్పత్తులు దెబ్బతింటున్నాయి. దీనివల్ల ఆహారోత్పత్తుల ధరలు చుక్కలనంటి, ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. అయితే, వందేళ్లలో మారిన ప్రకృతి విపరిణామాల గురించి ఆలోచిస్తున్నాం సరే, మరి సమాజంలో ఇంకా మారని దుష్పరిణామాల గురించి ఆలోచిస్తున్నామా? మనుషుల మధ్య ఉన్న పెక్కు సామాజిక అసమానతలు ఇప్పటికీ తొలగిపోవడం లేదు. అంటరానితనమనే రుగ్మత ఇంకా పీడిస్తున్న పెను'రోగం'గానే ఉంది. 'ఎల్‌నినో' వాతావరణాన్ని ప్రభావితం చేస్తే... కుల వ్యవస్థ, మత వ్యవస్థలు సంఘ జీవనాన్ని ఇప్పటికీ కలుషితం చేస్తూనే ఉన్నాయి.

"గత వందేళ్లలోనే ప్రపంచ ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ పెరిగాయి. 2100 సంవత్సరానికల్లా అనూహ్యంగా 4 సెంటిగ్రేడ్ డిగ్రీలు పెరగనున్నాయి. కాగా, ఇంతవరకు ప్రపంచ వాతావరణ రికార్డులో లేని వేడిమి 2022లో నమోదైంది. అంతేగాదు, తరచుగా దక్షిణ ఆసియాలో బ్లిబ్లీటుగా ఉధృతమవుతున్న వేడిగాలులు రానున్న సంవత్సరాల్లో కూడా కొనసాగబోతున్నాయి. ఇంతగా వేడి గాలులు భారతదేశంలోని ఉత్తరాది రాష్ట్రాలలోనే గాక, దక్షిణాది రాష్ట్రాలను కూడా అమితంగా పీడిస్తున్నాయి. ఢిల్లీని 72 ఏళ్ల చరిత్రలో ఎరగని ఉష్ణోగ్రతలు ఈ ఏడాది కుదిపేశాయి. ప్రపంచ వాతావరణంలో అనూ హ్యమైన స్థాయిలో (40 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు మించి) వేడిగాలులు వీచే ఈ పరిస్థితుల్లో, భారత్, చైనా, పాకిస్తాన్, ఇండోనేసియా లాంటి దేశాల్లో బయటి పనిచేసుకుని బతకాల్సిన దినసరి కార్మికులు యమ యాతనలకు గురికావల్సి వస్తుంది. 1971–2019 సంవత్సరాల మధ్య ఇండియాను చుట్టబెట్టిన అసాధారణ వేడిగాలుల ఫలితంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిస్థితులు మళ్లీ పునరావృతమయ్యే ప్రమాదం ఉంది."

– ప్రొఫెసర్స్ వినోద్ థామస్, మెహతాబ్ అహ్మద్ జాగిల్, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్

ఈ 'మిడిమేల'మంతా భారతదేశాన్ని ఎలా చుట్టబెడుతోంది? మరోవైపు, గత ఏడేళ్లుగా పసిఫిక్ మహాసముద్రం నుంచి ఏనాడూ ఎరుగనంతటి వేడి గాలులకు నిలయమైన 'ఎల్‌నినో' వాతావరణ దృశ్యం భారత దేశాన్ని 'కుమ్మేస్తూ' ముంచుకొస్తోంది. ఫలితంగా వ్యవసాయోత్పత్తులు దెబ్బతింటున్నాయి. దీనివల్ల తీవ్రమైన సామాజిక పరిస్థితులు తలెత్తి, ఆహారోత్పత్తుల ధరలు చుక్కలనంటి, ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందని సిడ్నీ యూనివర్సిటీ ఆర్థిక శాస్త్రాచార్యులు డేవిడ్ యుబిలావా హెచ్చరిస్తున్నారు. 'ఎల్‌నినో' ప్రభావం అన్ని చోట్లా ఒకే తీరుగా ఉండదు. కాకపోతే, పెక్కు దేశాలకు వర్తక వ్యాపారాల సంబంధ బాంధవ్యాలున్నందువల్ల ఆర్థికపరమైన ఒడిదుడుకులు అనివార్యమవుతాయి. కొన్నిచోట్ల కరువు కాటకాలతో పాటు,

రెండో మాట



సామాజిక ఒడిదుడుకులు అనివార్యమనీ అంచనా!

ఇప్పటికే మనుషుల మధ్య పెక్కు సామాజిక అసమానతలు ఉన్నాయి. అంటరానితనమనే రుగ్మత పెక్కుమందిని ఇంకా పీడిస్తున్న పెను'రోగం'గానే ఉంది. 'ఎల్‌నినో' లాంటి వాతావరణం వల్ల వారి జీవితాలకు మరిన్ని అవాంతరాలు తోడవుతున్నాయి. ఈ జాఢ్యం ఇప్పుడే గాదు, 'ఏలినాటి శని'గా మనదాకా దాపురించి ఉన్నందుననే – మహాకవి జాషువా ఏనాడో ఇలా చాటాడు:

"అంటరాని తనంబునంటి భారత జాతి
భువన సభ్యత గోలుపోయె...
నిమ్న జాతుల కన్నీటి నీరదములు
పిడుగులై దేశమును కాల్చివేయు"

అంతేనా? తాను 'పుట్టరాని చోట పుట్టినందుకు' అసమానతా భారతంలో ఎన్ని అగచాట్లకు గురయ్యాడో వెలిబుచ్చిన గుండె బాధను అర్థం చేసుకోగల మనస్సు కావాలని ఇలా కోరుకున్నాడు:

"ఎంత కోయిల పాట వృథయయ్యెనొ కదా
చిక్కు చీకటి వన సీమలందు
ఎన్ని వెన్నెల వాగు లింకి పోయెనొ కదా
కటిక కొండల మీద మిటకరించి
ఎన్ని కస్తూరి జింక లీడేరెనొ కదా
మురికి తిన్నెల మీద పరిమళించి
ఎన్ని ముత్తెపురాలు భిన్నమయ్యెనొ కదా
పండిన వెదురు జొంపములలోన
ఎంత గంధవహన మెంత తంగేటి జున్ను
యెంత రత్నకాంతి యెంత శాంతి
ప్రకృతి గర్భమందు భగ్నమైపోయెనో
పుట్టరాని చోట బుట్టుకతన..."

'ఎల్‌నినో' వాతావరణాన్ని ప్రభావితం చేస్తే... కుల వ్యవస్థ, మత వ్యవస్థలు సంఘ జీవనాన్ని ఇప్పటికీ ఎలా కలుషితం చేస్తున్నాయో 'గబ్బిలం' దీనావస్థ ద్వారా జాషువా వ్యక్తం చేశారు. 'పూజారి' లేని సమయం చూసి నీ బాధను శివుడి చెవిలో విన్నవించుకోమంటాడు. అప్పటికీ ఇప్పటికీ – పిడుక్కీ, బియ్యానికీ ఒకే మంత్రంగా వ్యవస్థ అవస్థ పడుతూనే ఉంది. కనుకనే జాషువా 'ముప్పయి మూడు కోట్ల దేవతలు ఎగబడ్డ దేశంలో భాగ్యవిహీనుల కడుపులు చల్లారుతాయా' అని ప్రశ్నించాడు!

అలాగే అనేక ప్రకృతి వైపరీత్యాల నుంచి మానవుల్ని క్షేమంగా గట్టెక్కించే ఔషధాలు, వాటి విలువల్ని తొలిసారిగా ప్రపంచానికి వెల్లడించిన 18వ శతాబ్ది కవి చెళ్లపిళ్ల నరస కవి. ఒక్క 'కరణి' అన్న పదంతోనే (ఒక రీతి, ఒక పద్ధతి) ధరణిని శ్వాసించి, శాసించిన కవి! ఆయన గ్రంథం 'యామినీ పూర్ణతిలకా విలాసం' ఎన్ని రకాల ఔషధాలనో వెల్లడించింది: చనిపోయిన వారిని బతికించే ఔషధి – 'సంజీవకరణి', విరిగిపోయిన ఎముకల్ని అతికించేది– 'సంధానకరణి', తేజస్సును కోల్పోయిన మనిషికి తేజస్సు ప్రసాదించే ఔషధం – 'సౌవర్ణకరణి', మనిషి శరీరంలో విరిగి పోయిన ఎముక ముక్కల్ని తొలగించేసేది – 'విశల్యకరణి'. ఇవన్నీ నరస కవి చూపిన ప్రకృతిలోని పలు రకాల ఔషధాలు! కళల్ని మెచ్చుకుని వాటికి కాంతులు తొడిగే శిల్పుల్ని నిరసించడం తగదు గదా! ఎందుకని? 'వానతో వచ్చే వడగండ్లు' నిలుస్తాయా?!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

తిండి తిప్పలు



గందరగోళం మొదలైంది. కొన్ని రకాల బియ్యం ఎగుమతులను ఇండియా నిషేధించింది. దాంతో జనం భయంతో వాటిని కొనడం మొదలుపెట్టారు. (టెక్సాస్ నగరం డాలస్‌లో జనపు రద్దీని తెలియజేసే వీడియోను షేర్ చేశారు.)

– ఇయాన్ మైల్స్ చియాంగ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

కదా!



నిజంగానే ప్రార్థనలు పనిచేసి ఉంటే, ఔషధాలు కనిపెట్టవలసిన అవసరం ఉండేది కాదు.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

తప్పే!



మణిపుర్‌లో స్త్రీల పట్ల జరిగిన అతి దారుణ లైంగిక హింసకు సంబంధించిన నిందితుల్లో ఇద్దరు వ్యక్తులను గుర్తించారని చెప్పే ఒక తప్పుడు ట్వీట్‌ను నేను రీట్వీట్ చేసినందుకు నా తీవ్ర క్షమాపణలు. ఉద్దేశపూర్వకం కాని ఈ ఇబ్బందికి గురిచేయడం పట్ల నేను బేషరతుగా క్షమాపణ చెబుతున్నాను. ('వాళ్ల దుస్తులతో గుర్తించండి' అని ఇద్దరు ఆర్ఎస్ఎస్ తండ్రీ కొడుకుల ఫొటో షేర్ చేశారు.)

– సుభాషిణీ అలీ, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు

సాక్ష్యం



లద్దాఖ్‌లోని ఏ వివాదమూ లేని 4,056 చదరపు కిలోమీటర్ల భూమిని (ఏప్రిల్ 2020 నుంచి) చైనా లాక్కోవడానికి అనుమతించి, పైగా 'ఎవరూ రాలేదు' అని చెబుతూ, దురాక్రమణదారుగా కూడా చైనా పేరు ఎత్తడం లేదంటే– చైనాకు మోదీ లొంగిపోయారని చెప్పొచ్చు.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

మీకు మాత్రమేనా?



మెరుగైన జీవితం కోసం యూరప్, అమెరికాల లౌకిక దేశాలకు ముస్లిం పురుషులు వలస పోతారు. కానీ అదే మెరుగైన జీవితం వారి స్త్రీలకు ఉండాలని వారు కోరుకోరు. వాళ్లను అదే బుర్ఖాలు, నిఖాబులు, హిజాబుల్లోనే బంధించాలనుకుంటారు. ఆ దేశాల్లోని స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు అనుభవించే వీలు ఈ మహిళలకు లేదు.

– మెహ్రాజ్ వసీమ్, ఆర్టిస్ట్

ఇదో కోణం



మిగిలిన జనాలకు తెలియనివి, తాము మాత్రమే ప్రత్యేకంగా అనుభవించాలని అత్యంత శ్రీమంతులు అంతరిక్షంలోకి ఎగరడమో, మహాసముద్రాల లోతుల్లో ఈదడమో చేస్తున్నారంటే– ఇదొక విచిత్ర సంతృప్తిని కలిగించే ప్రపంచ స్థితిని తెలియజేస్తోంది. అత్యంత ధనవంతులు మాత్రమే అనుభవించే నిజ ఉత్పత్తులు అంటూ ప్రపంచంలో ఏమీ లేవు.

– మనూ జోసెఫ్, నవలా రచయిత

విలువైన వనరు



ఆర్ఎస్ఎస్ ప్రచారక్ మదన్ దాస్ దేవి ఈ ఉదయం (జూలై 24) వెళ్లిపోయారు. వాజ్‌పేయి హయాంలో జర్నలిస్టులకు మదన్ జీ వెల కట్టలేని సమాచార వనరుగా ఉండేవారు. ఆయన దగ్గర ఆన్ రికార్డ్, ఆఫ్ రికార్డ్ అనే మాట ఉండేది కాదు. అంతా అధికారికమే. బ్రజేశ్ మిశ్రా, ఇంకా ఇతరుల 'సలహా'ల వల్ల ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బీఎంఎస్, బీకేఎస్‌లతో ఘర్షణ ఎదురైన ప్రతిసారీ వాజ్‌పేయిని మదన్‌జీ ఒడ్డున పడేసేవారు.

– రాధికా రమేశన్, జర్నలిస్ట్

స్పందన

అది అర్థరహిత వాదం

'సంస్కృతంలో వాళ్ళెందుకు రాయరు?' అంటూ జూలై 19 నాటి 'సాక్షి' ఎడిటోరియల్ పేజీలో ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్ చేసిన వాదన చాలా అర్థరహితంగా కనిపిస్తుంది. కంచ ఐలయ్య పేర్కొన్న నలుగురు విదేశీ పండితులేకాక మాక్స్ ముల్లర్, వింటర్‌నెట్జ్ లాంటి పాశ్చాత్య సంస్కృత పండితులు కూడ ఇంగ్లిష్‌లోనే ప్రచురించారు. కారణం ఏమిటంటే ఇంగ్లిష్ అంతర్జాతీయ భాష. యూనివర్సిటీలలో కూడా ఇంగ్లిష్ మీడియం ఉంటుంది కాబట్టి. అలాగే భారతీయ సంస్కృత పండితులు రోమిలా థాపర్‌తో సహా ఇంగ్లిష్‌లోనే రాస్తున్నారు. సంస్కృతం మృతభాష అయితే మరి 'పాళి'? ఇది ఎలా ఉందంటే బుద్ధుడి గురించి అంబేడ్కర్ పాళి భాషలో ఎందుకు రాయలేదు అని ప్రశ్నించినట్లుంది. ప్రాచీన నాగరికతలలో ఈజిప్టు, మెసపటోమియా లాంటి నాగరికతల్లో కూడ ఆయా భాషల్లోనే రాశారు. కానీ ఆ భాషలు ఇప్పుడు కనుమరుగయ్యాయి. ఆలాగే భారతదేశంలో కూడ ప్రాచీన భాషలు చాలావరకు కనుమరుగయ్యాయి. అలాంటి భాషల్లోని విజ్ఞానాన్ని ఇంగ్లిష్‌లో బోధించి, ప్రచురించడం నేరమా? యూదుల వంటి వారు ఆధునిక పుస్తకాలను హీబ్రూలో, గ్రీకులు గ్రీకులో, అరబ్బులు అరబిక్‌లోనే రాస్తారు అంటున్నారు. మరి భారతదేశంలో హిందీ, తెలుగు, తమిళ్, ఉర్దూ, అస్సామి లాంటి భాషల్లో ఆధునిక పుస్తకాలు రావడం లేదా, కేవలం సంస్కృతంలోనే ఎందుకు రాయాలి?

ఇకపోతే సంస్కృత భాష శతాబ్దాల తరబడి రాజభాషగా, భారతదేశాన్ని ఏకీకరణ చేసే భాషగా చలామణీ అయింది. రామాయణ, మహాభారతాలు సంస్కృతంలోనే కాక తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లోకూడ వచ్చాయి. మాతృభాషలో అలాంటి ఇతిహాసాలను రాయడం ఏమైనా నేరమా? ఇకపోతే సంస్కృత భాష ఒక దేశానికి, నాగరికతకు సంబంధించినది. అది ఎవరినో మోసం చేయడానికి అని నిందించడం ఎంతవరకు సమంజసం?

సమస్య ఏమిటంటే శతాబ్దాల కిందటి సాహిత్యాన్ని, నాగరికతను, సంస్కృతిని, అది ఏ దేశానికి సంబంధించినదైనా 19–20 శతాబ్దాల సిద్ధాంతాలు – మార్క్సిజం, ఫెమినిజం లాంటి వాటి చట్రంలో అధ్యయనం చేయడం అశాస్త్రీయం. అనైతికం. ప్రాచీన సమాజాలు ఆయా కాల రీతుల చట్టాలు, ఆచారాలు, నైతికత అనుసరించాయి. వాటిని 20వ శతాబ్దపు కళ్ళతో చూడటం ఒక మాయా ప్రపంచాన్ని సృష్టించడమే. రాజీవ్ మల్హోత్రా లాంటి భారతీయ అమెరికన్‌ల సమూహం తమ పిల్లలను సంస్కృత విశ్వవిద్యాలయాలకు ఎందుకు పంపరు అని ప్రశ్నిస్తున్నారు. మరి సంస్కృత ప్రేమికులైన షెల్డన్ పొలాక్, వెండి డోనిగర్ తమ పిల్లలను సంస్కృత పాఠశాలలకు పంపిస్తారా? ఏ చదువు చదువుకోవాలి అనేది పిల్లల ఇష్టమా లేక తల్లిదండ్రుల ఇష్టమా?

– డా॥ పి. కృష్ణమోహన్ రెడ్డి
అసోసియేట్ ప్రొఫెసర్, ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి

ఇథనాల్‌తో రైతుకు మంచిరోజులు!

అభిప్రాయం



శ్యాంప్రసాద్ రెడ్డి కోర్శిపాటి

ఇవాళ వ్యవసాయం లాభసాటి కాదు. కాబట్టి అందరూ పల్లెల్ని వదిలి పట్టణాలకు సాగిపోతున్నారు. భూములన్నీ బీడుబారి పోతున్నాయి. ఎవరైనా... 'నేను వ్యవసాయం చేస్తున్నాను' అని చెప్పుకోవడానికి కూడా సిగ్గుపడే పరిస్థితి. రైతంటేనే కష్టాలకు సింబల్‌గా మారిపోయాడు. కుర్రాడెవరన్నా వ్యవసాయం చేస్తున్నాడంటే అతనికి పెళ్లి చెయ్యడానికి అమ్మాయి కూడా దొరకని పరిస్థితి! కానీ రాబోయే ఐదారేళ్లలో ఈ పరిస్థితులలో మార్పు రానుంది. పల్లెల్ని విడచి పట్టణాలకు వెళ్లిన వాళ్లు కూడా తిరిగి పల్లెల పంచన చేరే రోజు దగ్గర్లోనే ఉంది. వ్యవసాయం ఓ పెద్ద లాభసాటి వ్యాపకంగా, వృత్తిగా మారనుంది. నిజంగా 'రైతే రాజ'య్యే రోజు అతి దగ్గరలోనే ఉంది.

నమ్మలేకున్నారా? ఎందుకంటే... వాహనాలు నడవడానికి ఇప్పుడు మనం వాడుతున్న పెట్రోల్, డీజిల్ స్థానంలోకి ఇథనాల్ రానుంది. ఈ ఇథనాల్ ప్రధానంగా బియ్యం, చెరకు, మొక్కజొన్న, వెదురు, పత్తి వంటి వ్యవసాయ ఉత్పత్తుల నుంచి తయారవుతుంది. ఇంకేం రైతన్నలకు మంచి రోజులొచ్చినట్టే కదా?

మనం పెట్రోలు, డీజిల్‌ను ఇప్పటివరకూ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఒక ఏడాదికి ఎంత విలువైన ఇంధనాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామో తెలుసా? ఏడాదికి 16 లక్షల కోట్ల రూపాయలు! పైగా ఈ ఇంధనం... అంటే పెట్రోల్, డీజిల్ వాడినందువల్ల వాహనాల నుంచి కర్బన ఉద్గారాలు విడుదలై 90 శాతం పర్యావరణం కలుషితమవుతోంది. అందుకే కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఆధారిత దేశమైన మనదేశంలో అటు రైతులకు లాభసాటిగా ఉంటూ, ఇటు దేశ ఆర్థిక వ్యవస్థకు లాభం చేకూర్చి పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో ఉపకరించే 'ఇథనాల్'ను భారతీయ ఇంధన రంగంలోకి ప్రవేశపెట్టే ప్రయత్నం యుద్ధ ప్రాతిపదికన చేస్తోంది.

ఈ బయో ఆయిల్ తయారీకి, మిగిలిపోయిన, పాడైపోయిన ఆహార ధాన్యాలను వాడతాం కనుక దేశంలో ఆహార కొరత ఏర్పడుతుందనే భయం కూడా అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఎప్పుడైతే కేంద్ర ప్రభుత్వం 'బయో ఫ్యూయల్' తయారీపైన దృష్టి పెట్టిందో వెంటనే కమ్యూనిస్టులూ, మరి కొన్ని రాజకీయ వర్గాలూ ఇథనాల్ తయారీ పరిశ్రమ వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందనీ, దేశంలో ఆహార కొరత ఏర్పడుతుందనీ విమర్శించడం ప్రారంభించారు. అవేవీ నిజాలు కాదు. ఇథనాల్ పరిశ్రమలు స్థాపిస్తే... పర్యావరణానికి నష్టం కలుగుతుందని గగ్గోలు పెడుతున్న ఈ ప్రగతి నిరోధకులకు ఇప్పుడు వాహనాల్లోంచి వెలువడుతున్న కర్బన ఉద్గారాల వల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం కనపడటం లేదా? మనదేశంలో ఇథనాల్ తయారు చేసుకోవడం వల్ల పెద్ద ఎత్తున విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. సామాన్య ప్రజలకు, ముఖ్యంగా రైతులకు విశేషమైన ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయి. మధ్య ప్రాచ్య దేశాల నుంచి ఇంధనం దిగుమతి చేసుకుంటున్న కారణంగా వారితో తప్పనిసరి చెలిమి చేయాల్సి వస్తోంది. ఇథనాల్‌ను మనమే తయారుచేసుకోగలిగితే మన విదేశాంగ విధానంలో మరింత స్వతంత్ర ప్రతిపత్తిని అనుసరించవచ్చు. అలాగే విదేశీ మారకద్రవ్యమూ గణనీయంగా ఆదా అవుతుంది.



మనదేశంలో ఇథనాల్ తయారీ గనక మొదలైతే... మనమిక పత్తి రైతుల ఆత్మహత్యలను చూడం. వరి, చెరకు, మొక్కజొన్న వంటివి పండించే రైతుల ముఖాలలో ఆనందం తాండవించనుంది. ఈ ఇథనాల్‌ను విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా మన దేశానికి మరింత ఆర్థిక ప్రయోజనం కూడా కలిగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఈ బయో ఫ్యూయల్ తయారీ కోసం దేశంలో నాలుగు ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. పూర్తి స్వదేశీ టెక్నాలజీతో ఏర్పాటవుతున్న ఈ ప్లాంట్లలో ఒక్కొక్క ప్లాంట్ 2 లక్షల మంది రైతులకు ఉపయోగపడుతుంది. అంతేకాదు దేశవ్యాప్తంగా విడుదలవుతున్న కర్బన ఉద్గారాలలో రెండు లక్షల టన్నులను ఒక్కొక్క ప్లాంటు తగ్గిస్తుంది. మరి ఈ ఇథనాల్‌ను వాహనాలలో నింపాలంటే ఇథనాల్ పంపులు కావాలి కదా? కాబట్టి వాటిని ఏర్పాటు చేస్తే దేశంలోని నిరుద్యోగ యువతకు ఉపాధీ దొరుకుతుంది.

దేశవ్యాప్తంగా ఇథనాల్ పంపుల ఏర్పాటుకు ఒక విధానాన్ని రూపొందించే ప్రయత్నంలో కూడా కేంద్ర ప్రభుత్వం ఉంది. ఇప్పటికే పుణేలో మూడు ఇథనాల్ పంపులు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో పూర్తి స్థాయిలో ఇథనాల్ వాహనాలను వాడుకులోకి తెచ్చే ప్రయత్నం పెద్ద ఎత్తున జరుగుతోంది.

కేవలం పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలంటేనే 1000 కోట్ల టన్నుల ఇథనాల్ అవసరం అవుతోంది. మరి పూర్తిస్థాయిలో ఇథనాల్‌తో నడిచే వాహనాలు అందుబాటులోకి వస్తే... అప్పుడు దేశంలో ఎంత ఇథనాల్ అవసరం అవుతుందో ఒక్కసారి ఊహించండి. బజాజ్, హీరో, టీవీఎస్ కంపెనీలు ఇప్పటికే 100 శాతం బయో ఇథనాల్‌తో నడిచే వాహనాల తయారీకి ముందుకొచ్చాయి. టయోటా కంపెనీ అయితే ఇప్పటికే పూర్తిగా ఇథనాల్‌తో నడిచే కార్‌ను తయారు చేసింది. దానిని ఆగస్టులో ప్రారంభించనుంది. మొత్తం మీద ఇథనాల్ దేశంలో రైతుల స్థితిగతుల్లోనే కాదు... వాతావరణ కాలుష్యం, విదేశీమారకద్రవ్యం, నిరుద్యోగం వంటి అనేక విషయాల్లో పెనుమార్పును తీసుకు రానుంది.

వ్యాసకర్త ఫ్రీలాన్స్ జర్నలిస్ట్। 95504 63236

మనోవ్యాయామం

ఒకానొక భక్తుడు కృష్ణాలయానికి వెళ్లి గద్గద స్వరంతో పైకి వినిపించేలా మొర పెట్టుకుంటున్నాడు: 'కృష్ణా! నాతో ఎందుకింతలా ఆడుకుంటున్నావు? నువ్వంటే నాకు అమితమైన ఇష్టం. నిన్నెప్పుడూ పల్లెత్తు మాట అనలేదు. పైపెచ్చు వాళ్ళతో వీళ్ళతో నీ గురించి గొప్పలు చెప్తుంటాను. అలాంటి నన్నెందుకు ఇలా ఆట పట్టిస్తున్నావు? నీకు ఇంకెవరూ దొరక లేదా? నాతోనేనా నీకు ఈ ఆటలు?' అక్కడే ఉన్న పూజారి ఆ మాటలు విని చిన్న నవ్వు నవ్వాడు. 'నువ్వు బలే ఉన్నావుగా... ఎవరైనా వారికి ఇష్టమున్న వారితోనేగా ఆడుకుంటారు. పాడుకుంటారు. కబుర్లు చెప్తారు. చెప్పించుకుంటారు. వింటారు. నువ్వంటే ఆయనకు ఇష్టం. అందుకే నీతో ఆడుకుంటున్నాడు. అంతేతప్ప మరొకటి కాదు' అన్నాడు.



భక్తుడు, 'జగన్నాథుడంతటివాడు నాతో ఆడటం నాకిష్టమే. కాదనను. కానీ ఆయన నాతో ఆడుతున్నానని అనుకుంటున్నాడేమో గానీ ఆ ఆటలన్నీ నన్ను నొప్పిస్తున్నాయి. ఒత్తిడి పెరిగిపోతోంది. తట్టుకోవడం కష్టంగా ఉంది. భరించలేకపోతున్నాను. మానసికంగా ఎంత కష్టంగా ఉందో?' అన్నాడు.

అందుకు పూజారి 'శారీరక వ్యాయామం చేస్తున్నప్పుడూ ఒళ్ళంతా నొప్పెడుతుంది. కానీ దేహం గట్టి పడుతుంది కదా? అలాగే నీ మనసు కష్టంతో నొప్పెట్టే కొద్దీ ఓ పరిపక్వత కలుగుతుంది. మానసిక ఒత్తిడిని అధిగమించే శక్తి వస్తుంది' అన్నాడు. పరమార్థం బోధించిన పూజారి కాళ్లకు మొక్కి ప్రశాంతంగా వెనక్కి మళ్లాడు భక్తుడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** శు.సప్తమి ఉ.10.04 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** చిత్త రా.8.05 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** రా.1.53 నుండి 3.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.58 నుండి 11.44 వరకు, **అమృతఘడియలు:** ప.1.20 నుండి 3.01 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.40, **సూర్యాస్తమయం:** 6.32.

క్లుప్తంగా...

శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలకు గవర్నర్‌కు ఆహ్వానం


ఆహ్వాన పత్రికను అందజేస్తున్న శ్రీ మఠం అధికారులు

మంత్రాలయం (కర్నూలు): మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు ఆగస్టులో అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. శ్రీ మఠం మేనేజర్ ఎస్.కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ.నరసింహామూర్తి, అధికారులు వేడుకలకు హాజరు కావాలని గవర్నర్ నజీర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. శ్రీరాఘవేంద్రస్వామి మెమొంటో, ఫల మంత్రాక్షితలిచ్చి, శాలువాతో సన్మానించారు.

శ్రీవారి సేవలో ఏపీ ఈఆర్సీ చైర్మన్


ఆలయం వెలుపల జస్టిస్ నాగార్జున రెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

కృష్ణానదిలో పురాతన దేవతావిగ్రహాలు లభ్యం


విగ్రహాలను వెలికితీసిన యువకులు

అచ్చంపేట: పల్నాడు జిల్లా అంబడిపూడి వద్ద కృష్ణానదిలో 11 పురాతన రాతి దేవతా విగ్రహాలు లభించాయి. వీటిలో పానివట్టంతో కూడిన శివలింగం, విష్ణుమూర్తి, లక్ష్మీ అమ్మవారు, రెండు నందీశ్వర విగ్రహాలు, విఘ్నేశ్వరుడు, రెండు ద్వారపాలకుల విగ్రహాలు, రెండు గ్రామదేవతల విగ్రహాలు, మరో విగ్రహం ఉన్నాయి. అంబడిపూడికి చెందిన యువకులు ఆదివారం స్నానాలు చేసేందుకు కృష్ణా నదిలో దిగారు. వారి కాళ్లకు రాళ్లు తగలడంతో పరిశీలించగా, 11 విగ్రహాలు కనిపించాయి. సోమవారం గ్రామస్తులు విగ్రహాలను బయటకు తీశారు.

ఏకసభ్య కమిషన్ సిఫార్సులు మాకొద్దు

- ఏపీ విద్యుత్ సంస్థల జాయింట్ యాక్షన్ కమిటీ

సాక్షి, అమరావతి: విద్యుత్ ఉద్యోగుల జీతభత్యాలకు సంబంధించి ఏకసభ్య కమిషన్ చేసిన సిఫారసులను పక్కనపెట్టి పీఆర్సీ అమలు చేయాలని ఏపీ విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. కమిటీ చైర్మన్ పి.చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ పి.ప్రతాపరెడ్డి, కన్వీనర్ వి.సాయికృష్ణ సోమవారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత, విశ్రాంత ఉద్యోగులెవ్వరికీ నష్టం వాటిల్లకుండా వేతన సవరణ ఖరారు చేయాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సింగిల్ మాస్టర్ స్కేల్ విధానాన్ని కొనసాగించాలని, కొత్త జిల్లాలకు కొత్త పోస్టులతో సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కారుణ్య నియామకాలు, విశ్రాంత ఉద్యోగులకు జీపీఎఫ్, పెన్షన్ సౌకర్యాలు తదితర డిమాండ్ల సాధన కోసం ఈ నెల 27 నుంచి అన్ని విద్యుత్ సంస్థల ఉద్యోగులంతా తమ కార్యాలయాల వద్దే ఆందోళనలు చేపడతారని తెలిపారు. దశల వారీగా పలు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని, అప్పటికీ విద్యుత్ సంస్థల యాజమాన్యాలు స్పందించకపోతే ఆగస్టు 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

నల్ల బెలూన్లతో అమరావతి రైతుల నిరసన



తాడికొండ: ఆర్–5 జోన్‌లో ఇళ్ల నిర్మాణం పేరుతో పేదలను సీఎం వైఎస్ జగన్ మోసం చేస్తున్నారని అమరావతి రైతులు ఆరోపించారు. సీఆర్డీయే పరిధిలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ సభ నిర్వహించడాన్ని నిరసిస్తూ సోమవారం కృష్ణాయపాలెం, తుళ్లూరు అమరావతి దీక్ష శిబిరాల వద్ద నల్ల బెలూన్లు, జెండాలతో నిరసన తెలిపారు. ఆర్–5 జోన్ అంశంపై హైకోర్టులో తీర్పు రిజర్వులో ఉంటే ఇళ్ల నిర్మాణంపై ముందుకెళ్తున్నారని, కోర్టులంటే సీఎంకు పట్టింపు లేదన్నారు. అమరావతి రైతులను కావాలనే ఇబ్బంది పెడుతున్నారని, వారిని కోర్టులకు తిప్పుతూ అమరావతి రైతుల సమాధులపై నుంచి ఎన్నికలకు వెళ్తున్నారన్నారు.

హామీ అమలుచేస్తున్నా హాహాకారాలేనా?

- పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసంపై రామోజీ నీతిమాలిన రాతలు
- హామీని చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు
- నిర్వాసితులను రోడ్డున పడేసి ప్రజాధనాన్ని దోచేసిన చంద్రబాబు, రామోజీ
- ఈ దాష్టీకంపై కేంద్రానికి నిర్వాసితుల ఫిర్యాదు
- పునరావాసం కల్పిస్తూ కాఫర్ డ్యామ్‌ల పనులు చేపట్టాలని సీడబ్ల్యూసీ ఆదేశం
- కాఫర్ డ్యామ్‌లను మధ్యలోనే ఆపేసి, చేతులెత్తేసిన చంద్రబాబు
- సీఎంగా బాధ్యతలు స్వీకరించాక వాస్తవ పరిస్థితులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన జగన్
- నిర్వాసితులకు చెల్లించే పరిహారాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమచేయాలని వినతి



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టువల్ల ప్రయోజనం పొందే రైతులకు దీటుగా ఆ ప్రాజెక్టు కోసం త్యాగం చేస్తున్న నిర్వాసితుల జీవన ప్రమాణాలు పెంచేలా సీఎం వైఎస్ జగన్ పునరావాసం కల్పిస్తుండటాన్ని చూసి ఓర్వలేని రామోజీరావు 'ఈనాడు'లో ఎప్పటిలాగే రోతరాతలతో యథేచ్ఛగా విషం చిమ్మారు. సర్వస్వం త్యాగంచేసిన నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా వారిని రోడ్డున పడేసి.. ప్రాజెక్టు ప్రోటోకాల్‌ను తుంగలో తొక్కి కొడుకు వియ్యంకుడి సంస్థతో కలిసి ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ పనులను రామోజీరావు, చంద్రబాబు చేపట్టి ప్రజాధనాన్ని దోచుకుని, పంచుకు తిన్నారన్నది బహిరంగ రహస్యం. కమీషన్ల కోసం పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంగా మార్చుకున్నారని సాక్షాత్తూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక.. చంద్రబాబు చేసిన ఘోర తప్పిదాలను సరిదిద్దుతూ నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టును పూర్తిచేస్తుంటే రామోజీరావు దానిని జీర్ణించుకోలేకపోతున్నారు. కాంట్రాక్టు నుంచి రామోజీ కొడుకు వియ్యంకుడి సంస్థను జగన్ తప్పించడంతో తమ డీపీటీ (దోచుకో, పంచుకో, తినుకో)కి అడ్డుకట్ట పడిందనే రామోజీరావు అక్కసు సోమవారం 'ఈనాడు'లో 'గోదాట్లో కలిసిన జగన్ హామీ' శీర్షికన ప్రచురించిన కథనంలోని ప్రతి అక్షరంలోనూ కన్పిస్తుంది. ఆ క్షుద్ర పాత్రికేయంలోని ఆరోపణలు, వాస్తవాలు ఇవీ..

ఈనాడు ఆరోపణ: నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ ఇవ్వలేదు.. పునరావాస కాలనీలకు తరలించలేదు. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగంచేస్తే రోడ్డున పడేస్తారా?

వాస్తవం: రాష్ట్రానికి హక్కుగా దక్కాల్సిన ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టేందుకు చంద్రబాబు అంగీకరించడంతో.. 2016, సెప్టెంబరు 7న అర్ధరాత్రి పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్రానికి కేంద్రం అప్పగించింది. ఈ క్రమంలో 2013–14 ధరల ప్రకారం 2014, ఏప్రిల్ 1 నాటికి నీటిపారుదల విభాగంలో మిగిలిపోయిన వ్యయాన్ని మాత్రమే రీయింబర్స్ చేస్తామని కేంద్రం పెట్టిన షరతుకు అంగీకరించారు. 2013–14 ధరల ప్రకారం ప్రాజెక్టు నీటిపారుదల విభాగం వ్యయం రూ.20,398.61 కోట్లు. ఇందులో 2014, ఏప్రిల్ 1 నాటికి రూ.4,730.71 కోట్లు వ్యయం చేశారని.. మిగిలిన రూ.15,667.9 కోట్లు మాత్రమే ఇస్తామంటూ 2016, సెప్టెంబరు 30న కేంద్ర ఆర్థిక శాఖ తెగేసిచెబితే.. దానికి చంద్రబాబు తలూపారు. అందులో భూసేకరణ, నిర్వాసితుల పునరావాస వ్యయం రూ.9,477 కోట్లే. భూసేకరణ చట్టం–2013 అమల్లోకి వచ్చిన నేపథ్యంలో.. భూసేకరణ, నిర్వాసితుల పునరావాస వ్యయం రూ.28,172.21 కోట్లు. అలాంటప్పుడు రూ.9,477 కోట్లతోనే భూసేకరణతోపాటు 373 ముంపు గ్రామాల్లోని 1,06,006 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పిస్తానని చంద్రబాబు అంగీకరించడంలో అంతర్యమేమిటన్నది బహిరంగ రహస్యమే. నిర్మాణ బాధ్యతలు దక్కగానే రామోజీరావు కొడుకు వియ్యంకుడి సంస్థకు నామినేషన్‌పై పనులు కట్టబెట్టిన చంద్రబాబు.. ప్రాజెక్టు ప్రోటోకాల్‌ను తుంగలో తొక్కి.. సులభంగా చేయగలిగి,



అధికంగా లాభాలు వచ్చే పనులకే ప్రాధాన్యమిచ్చి కమీషన్లు దండుకున్నారు. ఈ క్రమంలో నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండానే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులు చేపట్టారు. పునరావాసం కల్పించకుండా కాఫర్ డ్యామ్‌లు నిర్మిస్తూ తమను ముంచేస్తున్నారంటూ కేంద్ర జల్‌శక్తి శాఖ, సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం)కు నిర్వాసితులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కేంద్ర జల్‌శక్తి శాఖ.. నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ కాఫర్ డ్యామ్‌ల పనులు చేయాలని అప్పట్లో చేసిన సూచనలను చంద్రబాబు తోసిపుచ్చారు. కమీషన్లు రావనే నెపంతో పునరావాసం పనులు చేపట్టకుండా.. కాఫర్ డ్యామ్‌ల పనులు మధ్యలోనే ఆపేసి చేతులెత్తేశారు. ఇప్పుడు చెప్పండి రామోజీ.. సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులను రోడ్డున పడేసి వియ్యంకుడితో కలిసి పోలవరంలో దోచుకుంది మీరు, చంద్రబాబు కాదా?

ఈనాడు: తొలిదశ పునరావాసానికీ దిక్కులేదు. ఆందోళనలో 24 వేల కుటుంబాలు, ఊళ్లు. మాట తప్పను.. మడమ తిప్పను అనే సీఎం జగన్ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఇచ్చిన ఒక్కటంటే ఒక్క మాటనూ ఇప్పటికీ నిలబెట్టుకోలేదు.

అప్పుడు, ఇప్పుడూ అవే గ్రామాలు..

భద్రాచలం వద్ద గోదావరికి వరద వచ్చే సమయంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినప్పటికీ కుక్కునూరు, వేలేరుపాడు, కూనవరం, వరరామచంద్రాపురం మండలాల్లో పోలవరం ప్రాజెక్టు నిర్మించకముందు కూడా అనేక గ్రామాలు ముంపునకు గురయ్యేవి. ఆ గ్రామాల ప్రజలను రెవిన్యూ అధికారులు పునరావాస శిబిరాలకు తరలించేవారు. ఇప్పుడు పోలవరం ప్రాజెక్టు 48 గేట్లను పూర్తిగా ఎత్తివేసి, వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగువకు వదిలేస్తున్నారు. అంటే నీటిని ఏమాత్రం నిల్వచేయడంలేదని స్పష్టమవుతోంది. ప్రాజెక్టు కట్టనప్పుడు ఏ గ్రామాలైతే ముంపునకు గురయ్యేవో ఇప్పుడు అవే గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. ఆ గ్రామాల ప్రజలను రెవిన్యూ అధికారులు పునరావాస శిబిరాలకు తరలిస్తున్నారు.

వాస్తవం: ప్రాజెక్టులో 41.15 మీటర్ల పరిధిలో 20,946 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించాలని తొలుత గుర్తించారు. ఇందులో 2014–2019 మధ్య 3,073 నిర్వాసిత కుటుంబాలకు రూ.96.80 కోట్లను పరిహారంగా అందించారు. 3,066 ఇళ్లను రూ.96.60 కోట్లతో నిర్మించి పునరావాసం కల్పించారు. అంటే.. ఐదేళ్లలో కేవలం రూ.193.4 కోట్లు వెచ్చించి 3,073 కుటుంబాలకు మాత్రమే చంద్రబాబు సర్కార్ పునరావాసం కల్పించినట్లు స్పష్టమవుతోంది. కానీ, జగన్ సీఎం అయ్యాక పునరావాసంపై ప్రత్యేక దృష్టిపెట్టారు.

- 2019, మే 30 నుంచి ఇప్పటివరకూ 10,720 కుటుంబాలకు పునరావాస పరిహారంగా రూ.722.27 కోట్లు చెల్లించారు.
- రూ.1,006.15 కోట్ల వ్యయంతో పునరావాస కాలనీల్లో 11,575 ఇళ్లను నిర్మించారు. 8,878 కుటుంబాలను కాలనీలకు తరలించి పునరావాసం కల్పించారు.
- అంటే.. నాలుగేళ్లలో.. అందులో కరోనా విపత్తువల్ల రెండేళ్లు తీవ్ర ఇబ్బందులున్నా సరే రూ.1,728.42 కోట్ల వ్యయంతో 8,878 కుటుంబాలకు సీఎం జగన్ పునరావాసం కల్పించినట్లు స్పష్టమవుతోంది.
- నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి చంద్రబాబు ఐదేళ్లలో చేసిన వ్యయం కంటే జగన్ నాలుగేళ్లలోనే తొమ్మిది రెట్లు అధికంగా ఖర్చుచేశారన్నది స్పష్టమవుతోంది.
- మిగిలిన 8,228 కుటుంబాలకు నాలుగు నెలల్లో పునరావాసం కల్పించేందుకు జగన్ సర్కారు సిద్ధమైంది. ఇందుకు సంబంధించి రూ.830.14 కోట్ల బిల్లులు చెల్లించడానికి సిద్ధంగా ఉంది.
- జగన్ ఇచ్చిన హామీ మేరకు పోలవరం నిర్వాసిత కుటుంబాలకు రూ.పది లక్షల నగదు ప్యాకేజీ ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ 2021, జూన్‌లో జారీచేసిన జీఓ–224 అమలుకు కూడా సిద్ధమైంది.

ఈనాడు: 'ప్రధాని అపాయింట్‌మెంట్ తీసుకున్నాను.. మీ కష్టాలను ప్రధానికి వివరించి.. మీరే బటన్ నొక్కి నిర్వాసితులకు ఖాతాల్లో పరిహారం జమచేయాలని ప్రధానిని కోరుతా' అని 2022, జూలై 28న పోలవరం నిర్వాసితులకు ఇచ్చిన హామీని సీఎం జగన్ నిలుపుకోలేదు.

వాస్తవం: జగన్ 2022, ఆగస్టు 22న ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీతో సమావేశమై.. వాస్తవంగా భూసేకరణ, నిర్వాసితుల పునరావాస వ్యయమే రూ.28,172.21 కోట్లని.. కానీ, 2016లో నాటి సీఎం చంద్రబాబు 2013–14 ధరల ప్రకారం రూ.15,667.9 కోట్లకే పూర్తిచేస్తానని అంగీకరించారని.. కానీ, ఆ ధరలతో ప్రాజెక్టును పూర్తిచేయడం అసాధ్యమని మరోసారి వివరించారు. 2017–18 ధరల ప్రకారం సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లను ఆమోదించి.. ప్రాజెక్టును పూర్తి చేయడానికి సహకరించాలని విజ్ఞప్తిచేశారు. నిర్వాసితులకు చెల్లించాల్సిన నగదు పరిహారాన్ని వారి ఖాతాల్లోనే నేరుగా జమచేయాలని ప్రధానిని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కేంద్రం.. నిర్వాసితుల పునరావాసంతో సహా తొలిదశ పూర్తికి రూ.12,911.15 కోట్లను అదనంగా ఇచ్చేందుకు అంగీకరిస్తూ జూన్ 5న కేంద్ర ఆర్థికశాఖ ప్రకటించింది. ఇటీవల నిర్వహించిన లైడార్ సర్వేలో 41.15 కాంటూర్ పరిధిలోకి 36 గ్రామాలు ముంపునకు గురవుతాయని తేలింది. అందులో నివసిస్తున్న 16,642 కుటుంబాలకు పునరావాసం కల్పించడానికి రూ.4,223 కోట్లు వ్యయం అవుతుందని.. ఈ నేపథ్యంలో తొలిదశ పనుల పూర్తికి రూ.17,144 కోట్లు విడుదల చేయాలని జూలై 5న ప్రధానిని సీఎం జగన్ మరోసారి కోరారు. నిర్వాసితులకు జగన్ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నిలబెట్టుకునే దిశగా చిత్తశుద్ధితో అడుగులు వేస్తుంటే నీకెందుకంత కడుపు మంట రామోజీ?

అమెరికాలో ముగిసిన
శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

- దాదాపు 60వేల మందికిపైగా ఎన్నారై భక్తులకు కల్యాణ దర్శన భాగ్యం



స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు, హాజరైన ఎన్నారై భక్తులు

సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అమెరికా, కెనడా దేశాల్లో రెండు నెలలుగా నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ మేరకు ఏపీఎన్ఆర్టీఎస్ అధ్యక్షుడు వెంకట్ మేడపాటి ఓ ప్రకటనలో వివరించారు. అమెరికాలో జూన్ 4వ తేదీ నుంచి జూలై 22 వరకు 14 నగరాల్లో కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించగా.. దాదాపు 60 వేల మంది ఎన్నారై భక్తులు ప్రత్యక్షంగా స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారన్నారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సూచనలతో కెనడాలోని టొరంటో, మాంట్రియల్, అట్టావా, అమెరికాలోని ర్యాలీ (నార్త్ కరొలినా), జాక్సన్ విల్, డెట్రాయిట్, చికాగో, అట్లాంటా, డల్లాస్ (నాటా), సెయింట్ లూయిస్, ఫిలడెల్ఫియా (తానా), మొర్గాన్విల్–న్యూజెర్సీ, హ్యూస్టన్, ఇర్వింగ్ (టెక్సాస్) నగరాల్లో తెలుగు, భారతీయ సంస్థల సహకారంతో స్వామి కల్యాణ క్రతువులు జరిపించినట్లు పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని తెలిపారు. గత 13 నెలల్లో ప్రపంచ వ్యాప్తంగా 36 నగరాల్లో టీటీడీ స్వామివారి కల్యాణం నిర్వహించిందని పేర్కొన్నారు. జూలై 15న మొర్గాన్విల్–న్యూజెర్సీలో మహేందర్, శ్రీ, రామ్మోహన్, 16న హ్యూస్టన్‌లో మారుతి, మహేష్, బ్రహ్మ, దుర్గా ప్రసాద్, 22న ఇర్వింగ్(టెక్సాస్) నగరాల్లో గిరి, విజయ మోహన్ స్వామి వారి కల్యాణ ఏర్పాట్లను చేశారని వివరించారు. టీటీడీ ఏఈవో బి.వెంకటేశ్వర్లు, ఎస్వీబీసీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారని తెలిపారు.

వేద పరిరక్షణ బాధ్యత తీసుకోండి

- కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయ కమిటీ అధ్యక్షుడికి స్వరూపానందేంద్ర సూచన


స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్రలతో కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయ అధ్యక్షుడు అజేంద్ర అజయ్

సింహాచలం(పెందుర్తి): ఉత్తర భారతదేశంలో వేద పరిరక్షణకు ప్రాధాన్యత కొరవడుతోందని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆవేదన వ్యక్తం చేశారు. వేద పరిరక్షణ బాధ్యత చేపట్టాలని కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయ కమిటీ అధ్యక్షుడు అజేంద్ర అజయ్‌కు సూచించారు. రుషికేష్‌లోని శారదా పీఠం ఆశ్రమంలో చాతుర్మాస్య దీక్ష చేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతిని అజేంద్ర అజయ్ సోమవారం కలిసి.. ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు స్వరూపానందేంద్ర పలు సూచనలు చేశారు. ఉత్తరభారతదేశంలోని పవిత్ర పుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లలో నిత్యం వేద పారాయణం జరగాలని సూచించారు. వేద పారాయణం జరిగిన చోట భక్తులపై దేవుని అనుగ్రహం మరింత పెరుగుతుందన్నారు. వేద పరిరక్షణ బాధ్యతను చేపట్టాలని ఆయనకు సూచించారు. దీనిపై ఆలయ బోర్డు సమావేశంలో చర్చిస్తామని అజేంద్ర అజయ్ తెలిపారు. చాతుర్మాస్య దీక్ష ముగిసిన అనంతరం కేదార్‌నాథ్, బద్రీనాథ్ క్షేత్రాలను సందర్శించాలని ఆహ్వానించారు. తమ కమిటీ ఆధ్వర్యంలో ఏడు సంస్కృత పాఠశాలల ద్వారా ఉచిత విద్యను అందిస్తున్నామని వివరించారు. కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లకు వెళ్లే మార్గంలో ఉన్న 45 ఆలయాలు, 20 ధర్మశాలలు తమ ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే శారదాపీఠం నిర్వహణలోని జగద్గురు శంకరాచార్య వేద పాఠశాల విద్యార్థులు వేదాలను పఠించగా అజేంద్ర అజయ్ వారిని అభినందించారు.

నర్సరీ రైతులకు ప్రత్యేక శిక్షణ

- ఇండియన్ నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు వై.పి.సింగ్
- నూతన కార్యవర్గం ఎన్నిక


గంగూరులో నూతన కార్యవర్గాన్ని సన్మానించిన దృశ్యం

పెనమలూరు: ఏపీలో నర్సరీ రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారి ఎదుగుదలకు సాంకేతిక సహకారం అందిస్తామని ఇండియన్ నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు వై.పి.సింగ్ అన్నారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం గంగూరులో సోమవారం నందనవనం నర్సరీలో ఆంధ్ర ఫార్మర్స్ అసోసియేషన్ ఆవిర్భావ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఏపీలో నర్సరీ రంగం అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కడియపులంక సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.పోలరాజు ప్రసంగించారు. అనంతరం ఆంధ్ర ఫార్మర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవ అధ్యక్షుడిగా దండా వీరాంజనేయులు, అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బి.ప్రసాద్ రెడ్డి, కేవీవీ సత్యనారాయణ, కార్యదర్శిగా తూము శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కె.కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సభ్యులను సత్కరించారు.

రేషన్ డీలర్లకు కమీషన్ బకాయిలు విడుదల చేస్తాం : మంత్రి కారుమూరి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని రేషన్ డీలర్లకు 2012 నుంచి కమీషన్ బకాయిలు వెంటనే విడుదల చేసేలా చర్యలు చేపడుతున్నట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. కేంద్రం సాయంతో గ్రామాల్లోనే చౌక దుకాణాలకు గదులు, సరుకు నిల్వకు గోడౌన్ల నిర్మాణం చేపడతామన్నారు. సోమవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించకపోగా టీడీపీ ప్రభుత్వం మరిన్ని బకాయిలను పెండింగ్ పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం డీలర్లకు కేజీకి 90 పైసలు మాత్రమే కమీషన్ కేటాయించగా.. రాష్ట్ర ప్రభుత్వం దానిని రూపాయిగా ఇస్తోందన్నారు. డీలర్ల విజ్ఞప్తి మేరకు కమీషన్ పెంపు, గోనె సంచులు, కరోనా సమయంలో చనిపోయిన డీలర్ల కుటుంబాలకు రూ.లక్ష సాయం అంశాలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పారు. డీలర్ల ఆరోగ్య భద్రతలో భాగంగా ఆరోగ్యశ్రీ ద్వారా సంపూర్ణ హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించడంతో పాటు అవసరమైతే ప్రత్యేకంగా ఎల్ఐసీ కూడా ఇప్పిస్తామని తెలిపారు. ప్రతి రెండేళ్లకోసారి ఆన్‌లైన్‌లోనే డీలర్‌షిప్‌ను రెన్యువల్ చేసుకునేలా ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా రేషన్ డీలర్లను తొలగిస్తారంటూ ప్రభుత్వంపై బురదజల్లే కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దురదృష్టకర సంఘటనలు రాజకీయం చేయటం సరికాదు

- విపక్షాలకు హోంమంత్రి తానేటి వనిత హితవు
- అత్యాచారానికి గురైన బాలిక కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం


మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న మంత్రులు వనిత, రమేశ్, ఎమ్మెల్యే అనిల్ కుమార్, కలెక్టర్ రాజాబాబు

నిభానుపూడి (పామర్రు): దురదృష్టకరమైన సంఘటనలను సైతం ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని ఇది మంచి పద్ధతి కాదని హోంమంత్రి తానేటి వనిత ప్రతిపక్షాలకు హితవు పలికారు. కృష్ణాజిల్లా పామర్రు మండలం నిభానుపూడి గ్రామంలో అత్యాచారానికి గురై మరణించిన మైనర్ బాలిక తల్లిదండ్రులు ముత్యాల రాజారావు, వాణి దంపతులను మంత్రులు తానేటి వనిత, జోగి రమేష్, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి మనోధైర్యం చెప్పి ప్రభుత్వం తరఫున తక్షణ సహాయంగా రూ.10లక్షల చెక్కును అందజేశారు. ఈ ఘటన బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. ఒక్క కుమార్తె కావడంతో తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతమన్నారు. పోలీసులు నిందితులను అరెస్టుచేశారని తానేటి వనిత చెప్పారు. ఇక దుర్ఘటన విషయాన్ని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సీఎం జగన్ దృష్టికి తీసురావడంతో వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందజేయమని ఆదేశించారని తెలిపారు. నిందితులను వదిలిపెట్టే ప్రసక్తేలేదని.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టంచేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయటంవల్ల ప్రభుత్వం నుంచి మరింత ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు చెప్పారు. జోగి రమేష్ మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

పామర్రులో బాలిక మృతిపై సమగ్ర దర్యాప్తు

- కృష్ణా జిల్లా ఎస్పీకి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఆదేశం

సాక్షి, అమరావతి: కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన దళిత బాలిక అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఎస్పీ పి.జాషువాను ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆదేశించారు. ఈ మేరకు ఎస్పీకి రాసిన లేఖను ఆమె సోమవారం మీడియాకు విడుదల చేశారు. తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికపై సామూహిక అత్యాచారం జరగడం, అనుమానాస్పద స్థితిలో ఆమె మృతిచెందడంపై సమగ్ర దర్యాప్తు చేయాలని వాసిరెడ్డి పద్మ సూచించారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ సీసీ కెమెరా ఫుటేజ్ వివరాలు పరిశీలించామని, అన్ని కోణాల్లోనూ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కేవలం 15 రోజుల్లోనే చార్జ్‌షీట్ కూడా దాఖలు చేస్తామని, నిందితులకు కఠిన శిక్ష పడే విధంగా విచారణను వేగవంతంగా పూర్తి చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

కర్ణాటక ఆర్టీసీ బస్సులో 'కొప్పల' కొట్లాట

- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు


బస్సులో కొట్టుకుంటున్న మహిళ, యువతి

తుమకూరు: ఆర్టీసీ బస్సుల్లో సీట్ల కోసం మహిళలు జుట్టు పట్టుకుని కొట్టుకునే ఘటనల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కర్ణాటకలో ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి కల్పించింది. దీంతో రద్దీ పెరిగి సీట్ల కోసం గొడవలు జరుగుతున్నాయి. నిత్యం ఏదో ఒకచోట రగడ సాగుతూనే ఉంది. బెంగళూరు నుంచి బెళగావికి వెళుతున్న ఆర్టీసీ బస్సులో సీటు కోసం మహిళలు తన్నుకున్నారు. తుమకూరు నగరం సమీపంలో బస్సులో ఓ యువతి, మహిళ మధ్య ఘర్షణ మొదలైంది. మహిళ యువతి జుట్టు పట్టుకుని దాడి చేసింది. దీంతో డ్రైవర్ బస్సును నేరుగా తుమకూరు నగర పోలీస్ స్టేషన్‌కు తరలించాడు. పోలీసులు మహిళలకు సర్దిచెప్పిన తర్వాత బస్సు బయల్దేరింది. ఘర్షణ ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి.

డీవోపీ నియామకంపై మధ్యంతర ఉత్తర్వులకు హైకోర్టు నో

- ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టీకరణ
- సుదర్శన్‌రెడ్డితో పాటు ప్రభుత్వానికి నోటీసులు
- విచారణ ఆగస్టు 21కి వాయిదా



సాక్షి, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (డీవోపీ)గా జల్లా సుదర్శన్‌రెడ్డి నియామక ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. సుదర్శన్‌రెడ్డి వాదనలు వినకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పింది. డీవోపీగా సుదర్శన్‌రెడ్డి నియామకంపై హోం శాఖ ముఖ్య కార్యదర్శి, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, డీవోపీలతో పాటు వ్యక్తిగత హోదాలో సుదర్శన్‌రెడ్డికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 21కి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని అర్హతలున్న తనను కాదని సుదర్శన్‌రెడ్డిని డీవోపీగా నియమించడం చట్ట విరుద్ధమంటూ ప్రాసిక్యూషన్స్ అదనపు డైరెక్టర్ బి.రామకోటేశ్వరరావు దాఖలు చేసిన వ్యాజ్యంపై ఏసీజే ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎం.రవీంద్రనాథ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. చట్ట విరుద్ధంగా జరిగిన సుదర్శన్‌రెడ్డి నియామకానికి హైకోర్టు పాలనాపరంగా సమ్మతిని తెలియజేయడం ఎంత మాత్రం సరికాదన్నారు. కేవలం సుదర్శన్‌రెడ్డిని డీవోపీగా నియమించేందుకే నిబంధనలను సవరించారని తెలిపారు. డీవోపీ అయ్యేందుకు పిటిషనర్‌కు అన్ని అర్హతలున్నాయన్నారు. హైకోర్టు సైతం గతంలో సానుకూల ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. చట్ట నిబంధనలను అనుసరించే సుదర్శన్‌రెడ్డిని డీవోపీగా నియమించినట్లు చెప్పారు. హైకోర్టు పరిపాలనపరంగా లేవనెత్తిన సందేహాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం నివృత్తి చేసిందన్నారు. హైకోర్టు సంతృప్తి చెందిన తర్వాతే డీవోపీగా సుదర్శన్‌రెడ్డి నియామకానికి పరిపాలనాపరమైన సమ్మతిని తెలియజేసిందని వివరించారు. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పారు.

క్లుప్తంగా...

ఈపీఎఫ్‌ఓ డిపాజిట్లపై వడ్డీ రేటు 8.15 శాతం

న్యూఢిల్లీ: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌ఓ) ఖాతాదారులకు శుభవార్త. ఖాతాదారుల డిపాజిట్లపై వడ్డీరేటును కేంద్ర ప్రభుత్వం స్వల్పంగా పెంచింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గానూ డిపాజిట్లపై 8.15 శాతం వడ్డీ రేటును చెల్లించనుంది. గత ఆర్థిక సంవత్సరం ఈ వడ్డీ రేటు 8.10 శాతంగా ఉండేది. తాజాగా 5 బేసిస్ పాయింట్లు పెరిగింది. వడ్డీ రేటును 8.15 శాతానికి పెంచాలంటూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఈ ఏడాది మార్చి 28న చేసిన ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు సోమవారం సర్క్యులర్ విడుదల చేసింది. వడ్డీ రేటు పెంపుతో దేశవ్యాప్తంగా ఐదు కోట్ల మందికి పైగా వేతన జీవులకు లబ్ధి చేకూరనుంది. 2020–21 ఆర్థిక సంవత్సరంలో ఈపీఎఫ్‌ఓ డిపాజిట్లపై వడ్డీ రేటు 8.50 శాతంగా ఉండేది. 2021–22లో ఏకంగా 40 పాయింట్లు తగ్గిపోయింది.

మద్యం సేవించి డ్రైవింగ్.. న్యూజిలాండ్ మంత్రి రాజీనామా



వెల్లింగ్టన్: మోతాదుకు మించి మద్యం సేవించి కారు నడుపుతూ మరో కారును ఢీకొట్టినందుకు న్యూజిలాండ్ న్యాయ శాఖ మంత్రి కిరీ అలాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. కిరీ అలాన్ ఆదివారం రాత్రి 9 గంటలకు రాజధాని వెల్లింగ్టన్‌లో పార్కింగ్‌లో నిలిపి ఉంచిన కారును తన కారుతో ఢీకొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. 4 గంటలపాటు ప్రశ్నించారు. శ్వాస పరీక్ష నిర్వహించగా పరిమితికి మించి మద్యం సేవించినట్లు తేలింది. అనంతరం విడిచిపెట్టారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఆరోపణల కింద సోమవారం కేసు నమోదు చేశారు. దీంతో ప్రధానమంత్రి క్రిస్ హిప్‌కిన్స్ సూచన మేరకు కిరీ అలాన్ తన పదవి నుంచి తప్పుకున్నారు. అభియోగాలు రుజువైతే జరిమానాతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే అవకాశం ఉంది. న్యూజిలాండ్ మంత్రులు ఇటీవలి కాలంలో తరచుగా కేసుల్లో, కుంభకోణాల్లో చిక్కుకుంటుండడం ప్రధానమంత్రి క్రిస్ హిప్‌కిన్స్‌కు తలనొప్పిగా మారింది.

2050 కల్లా మధుమేహ బాధితులు 130 కోట్లు

లాన్సెట్ అధ్యయనం వెల్లడి



వాషింగ్టన్: ప్రపంచవ్యాప్తంగా 2050 నాటికి 130 కోట్ల మంది వరకు మధుమేహం బారినపడే అవకాశం ఉన్నట్లు లాన్సెట్ చేపట్టిన ఓ అధ్యయనం తేల్చింది. 1990–2021 మధ్య కాలంలో 204 దేశాలు, ప్రాంతాల్లో మరణాలు, అశక్తత, డయాబెటిస్ వ్యాప్తి వంటి అంశాలకు సంబంధించి 27 వేలకు పైగా రకాల గణాంకాల ఆధారంగా ఈ అధ్యయనం చేపట్టినట్లు లాన్సెట్ తెలిపింది. 2050 నాటికి మధుమేహం వ్యాప్తి సామాజిక, భౌగోళిక అంశాలు, ఒబేసిటీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకునే మోడల్‌ను అనుసరించినట్లు వివరించింది. ప్రజలు తమ ఆరోగ్య విషయాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉందని తెలిపింది.

ఎక్కువ మందికి టైప్-2నే

టైప్–1, టైప్–2 డయాబెటిస్‌లలో వచ్చే మూడు దశాబ్దాల్లో టైప్–2 బాధితులే ఎక్కుమంది ఉంటారని సర్వేలో వెల్లడైంది. టైప్–1 అనేది ఆటో ఇమ్యూన్ వ్యాధి, దీనివల్ల శరీరం ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేదు. ఇది ఎక్కువగా పిల్లల్లో కనిపిస్తుంది. టైప్–2 డయాబెటిస్‌తో ఇన్సులిన్ నిరోధకత క్రమంగా పెరుగుతుంటుంది. ఈ పరిస్థితి ఎక్కువగా పెద్దల్లో కనిపిస్తుంది. ముందుగానే గుర్తించి, దీనిని నివారించవచ్చు.

అప్రమత్తతే ఆయుధం

డయాబెటిస్‌తో సంబంధం ఉన్న అనేక సమస్యల కారణంగా ఈ సర్వేలో తేలిన వివరాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. మధుమేహ బాధితులు గుండెజబ్బు, గుండెపోటు, కంటి చూపు కోల్పోవడం, పాదాలకు అల్సర్లు వంటివి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అవగాహన లేకపోవడం, సరైన చికిత్స లేకపోవడం వల్ల చాలా మంది ఈ సమస్యల బారిన పడతారు. మధుమేహం ప్రమాదాన్ని పెంచేవి సాధారణంగా వయస్సు, ఊబకాయం. ఎక్కువ బీఎంఐకి అధిక-క్యాలరీ ఉత్పత్తులు, అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారం, కొవ్వు, చక్కెర, జంతు ఉత్పత్తుల వినియోగం. వీటితోపాటు తగ్గిన శారీరక శ్రమ డయాబెటిస్‌కు కారణాలుగా ఉన్నాయి. జన్యు సంబంధమైన కారణాలతోపాటు అనారోగ్యకర జీవన శైలితో కూడా మధుమేహం బారినపడే ప్రమాదముంది.

జాగ్రత్తలు మేలు..

- ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లను పాటించాలి.
- ఎక్కువ రిస్క్ ఉన్న వారు ఫైబర్ ఎక్కువగా ఉండే, తృణ ధాన్యాలను ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.
- ఒకే చోట గంటల కొద్దీ కూర్చోరాదు. అప్పుడప్పుడు నడక వంటి వాటితో శారీరక శ్రమ అలవాటు చేసుకోవాలి.
- రోజులో కనీసం అరగంటపాటు వ్యాయామం చేయాలి. బరువు పెరక్కుండా జాగ్రత్తపడాలి.
- దాహం అతిగా అవుతున్నా, నీరసంగా ఉన్నా, తెలియకుండానే బరువు కోల్పోతున్నా, కంటి చూపు మందగించినా, తరచూ మూత్రానికి వెళ్లాల్సి వస్తున్నా వెంటనే వైద్యుడిని సంప్రదించి సరైన వైద్య చికిత్సలు తీసుకోవాలి.

'జ్ఞానవాపి'లో ఏఎస్‌ఐ సర్వేపై సుప్రీం స్టే

హైకోర్టుకు వెళ్లొచ్చని మసీదు కమిటీకి సూచన

న్యూఢిల్లీ/వారణాసి: వారణాసిలోని జ్ఞానవాపి మసీదు ఆలయంపై నిర్మించిందా కాదా తేల్చేందుకు శాస్త్రీయ సర్వే చేపట్టాలంటూ స్థానిక కోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. ప్రఖ్యాత కాశీ విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదు ఆవరణలో అవసరమైతే తవ్వకాలు సైతం జరపొచ్చంటూ భారత పురాతత్వ శాఖ(ఏఎస్ఐ)ని వారణాసి కోర్టు శుక్రవారం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులను మసీదు కమిటీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అక్కడ యథాతథ పరిస్థితి అమలయ్యేలా చూడాలని యూపీ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది. తమ ఉత్తర్వులను మసీదు ఆవరణలో ఉన్న ఏఎస్ఐ అధికారులకు తక్షణమే చేరవేయాలని కోరింది. మసీదు ఆవరణలో ఎటువంటి తవ్వకాలు జరపరాదని స్పష్టం చేసింది. ఏఎస్ఐ అధికారులు మసీదు ఆవరణలో ఫొటోగ్రఫీ, రాడార్ ఇమేజింగ్ మాత్రమే చేపట్టారని, ఎలాంటి తవ్వకాలు జరపలేదని, ఒక్క ఇటుకను కూడా తొలగించలేదని సొలిసిటర్ జనరల్ తెలిపారు. దీంతో, మసీదు కమిటీ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించేందుకు ధర్మాసనం స్వేచ్ఛనిచ్చింది. వారణాసి కోర్టు ఆదేశాల మేరకు 30 మంది ఏఎస్ఐ అధికారులు సోమవారం ఉదయం జ్ఞానవాపి మసీదు వద్దకు చేరుకున్నారు. మసీదు కాంప్లెక్స్‌ను పరిశీలించి, కొలతలు తీసుకున్నారు. మసీదులోపల ఏర్పాటు చేసిన కెమెరాల్లో వారు నాలుగు గంటలపాటు నిర్వహించిన కార్యకలాపాలు నమోదయ్యాయి. సుప్రీంఆదేశాలు అందిన వెంటనే సర్వే నిలిపివేసినట్లు డివిజనల్ కమిషనర్ కౌశల్‌రాజ్ తెలిపారు.



కెనడాలో దుండగుల దాడిలో

మన విద్యార్థి దుర్మరణం

టొరంటో: కెనడాలో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న భారతీయ విద్యార్థి ఒకరు దుండగుల చేతిలో హత్యకు గురయ్యారు. పంజాబ్‌లోని కరీంపూర్ చావ్లా గ్రామానికి చెందిన గుర్వీందర్ నాథ్(24) టొరంటోలోని బ్రామ్‌టన్‌లో ఉంటూ బిజినెస్ స్కూల్‌లో చదువుకుంటున్నాడు. పిజ్జా డెలివరీ బాయ్‌గా పార్ట్ టైం జాబ్ చేస్తున్నాడు. మిస్సిస్సాగాలో ఈ నెల 9న అర్ధరాత్రి దాటాక 2.10 గంటల సమయంలో నాథ్ ఒక ఇంట్లో పిజ్జా డెలివరీ చేసేందుకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా కొందరు దుండగులు తీవ్రంగా కొట్టి అతడి దగ్గరున్న విలువైన వస్తువులతోపాటు, కారును తీసుకెళ్లారు. తీవ్రంగా గాయపడిన నాథ్‌ను చుట్టుపక్కల వారు ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 14న నాథ్ ఆస్పత్రిలోనే తుదిశ్వాస విడిచాడు. దుండగులు అతడి కారును అక్కడికి 5 కిలోమీటర్ల దూరంలో వదిలేసి వెళ్లారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆ కారులో పలు ఆధారాలు లభ్యమైనట్లు చెప్పారు. నాథ్, దుండగులకు మధ్య గతంలో ఎటువంటి పరిచయం లేదన్నారు. అతడి కారు ఎత్తుకెళ్లేందుకే దుండగులు పిజ్జా డెలివరీ చేసినట్లుగా భావిస్తున్నామన్నారు. ఘటనపై టొరంటోలోని భారత్ కాన్సుల్ జనరల్ సిద్ధార్థ నాథ్ విచారం వ్యక్తం చేశారు. అతడి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్నామన్నారు. ఈ నెల 27న నాథ్ మృతదేహాన్ని భారత్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 2021 జులైలో కెనడా వెళ్లిన నాథ్ చివరి సెమిస్టర్‌లో ఉన్నాడని, చదువు పూర్తయ్యాక సొంతంగా వ్యాపారం ప్రారంభించాలని ఎన్నో కలలు కన్నాడని అతడి స్నేహితులు తెలిపారు. ఆదివారం నాథ్ స్మృత్యర్థం సుమారు 200 మంది భారతీయ విద్యార్థులు మిస్సిసాగాలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు.





వరద ధాటికి హిమాచల్ ప్రదేశ్‌లో కులూ-మనాలీ రహదారి కొట్టుకుపోయిన దృశ్యం

న్యాయ వ్యవస్థ సంస్కరణల బిల్లుకు

ఇజ్రాయెల్ పార్లమెంట్ ఆమోదం

జెరూసలేం: వివాదాస్పద న్యాయ వ్యవస్థ సంస్కరణల బిల్లును ఇజ్రాయెల్ పార్లమెంట్ ఆమోదించింది. సోమవారం తుది ఓటింగ్ నిర్వహించారు. ఈ ఓటింగ్‌ను ప్రతిపక్షం బహిష్కరించింది. బిల్లుకు అనుకూలంగా 64 ఓట్లు లభించగా, వ్యతిరేకంగా ఒక్క ఓటు కూడా పడలేదు. ఈ బిల్లుపై ఏకంగా 30 గంటలపాటు పార్లమెంట్‌లో చర్చ జరిగింది. ఒకవైపు చర్చ జరుగుతుండగానే, మరోవైపు దేశవ్యాప్తంగా బిల్లుకు వ్యతిరేకంగా నిరసనలు, ఆందోళనలు కొనసాగాయి. జనం వీధుల్లోకి వచ్చి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ న్యాయ వ్యవస్థలో మార్పులు తలపెట్టడాన్ని అమెరికాతోపాటు పశ్చిమ దేశాలు సైతం వ్యతిరేకిస్తున్నాయి. న్యాయ వ్యవస్థను సంస్కరిస్తామంటూ ప్రజలకు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చామని, ఇప్పుడు ఆ హామీని నెరవేరుస్తున్నామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ చెబుతున్నారు. ఈ కొత్త బిల్లు ప్రకారం.. ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలను కోర్టులు అడ్డుకోరాదు. అంటే న్యాయ వ్యవస్థపై ప్రభుత్వానిదే పైచేయి అవుతుంది.

ఆరని మంటలు

పార్లమెంట్‌ను కుదిపేస్తున్న మణిపూర్ హింసాకాండ ● మూడో రోజూ ఉభయ సభల్లో ప్రతిష్టంభన

- కొనసాగిన వాయిదాల పర్వం
- రాజ్యసభ నుంచి 'ఆప్' ఎంపీ సంజయ్ సింగ్ సస్పెన్షన్
- పార్లమెంట్ ఆవరణలో విపక్ష ఎంపీల నిరసన
- పార్లమెంట్‌లో ప్రధాని సమాధానమివ్వాలని కాంగ్రెస్ డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో మణిపూర్ హింసాకాండ మంటలు కొనసాగుతున్నాయి. మణిపూర్ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తక్షణమే సమాధానం ఇవ్వాలంటూ విపక్షాలు పట్టుబడుతున్నాయి. ప్రతిపక్ష సభ్యుల నినాదాలు, ఆందోళనలు, నిరసనలతో ఉభయ సభలు స్తంభిస్తున్నాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో వరుసగా మూడో రోజూ సోమవారం సైతం ఇదే అంశంపై విపక్షాలు ఉభయ సభలను అడ్డుకున్నాయి. దీంతో పలుమార్లు సభలను వాయిదా వేయాల్సి వచ్చింది. ఇదే సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎంపీ సంజయ్ సింగ్ సస్పెన్షన్ వ్యవహారం రాజ్యసభను మరింత వేడెక్కించింది.

డిమాండ్‌పై వెనక్కి తగ్గని విపక్షాలు

మణిపూర్ ఘటనలపై చర్చించాలని కోరుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్షాలు లోక్‌సభలో సోమవారం వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టాయి. ఉదయం సభ ప్రారంభం కాగానే మణిపూర్ అంశంపై ప్రధాని మోదీ సభలో సమాధానం ఇవ్వాలని ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదరీ డిమాండ్ చేశారు. ఆయనకు మద్దతుగా విపక్ష ఎంపీలు తమ స్థానాల్లోంచి లేచి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలతో హోరెత్తించారు. స్పీకర్ ఓంబిర్లా స్పందిస్తూ.. దీనిపై సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే కేంద్రం తరఫున ఎవరూ సమాధానమివ్వాలో మీరు ఆదేశించలేరని అన్నారు. ఇదే సమయంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. అయినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు వెనక్కి తగ్గకపోగా మరింత తీవ్రస్వరంతో నినాదాలు చేశారు. 'ఇండియా ఫర్ మణిపూర్' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు. లోక్‌సభలో బీజేపీ ఎంపీలు కూడా ఎదురుదాడికి దిగారు. పశ్చిమ బెంగాల్, రాజస్తాన్‌లో మహిళలపై అరాచకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రతిపక్ష ఎంపీల నినాదాల మధ్యే స్పీకర్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. నినాదాల హోరు ఆగకపోవడంతో కొద్దిసేపటికే సభను మధ్యాహ్నం 12 గంటల దాకా, ఆ తర్వాత మధ్యాహ్నం 2.30 గంటల దాకా.. అనంతరం మంగళవారానికి వాయిదా వేశారు. నేషనల్ డెంటల్ కమిషన్ బిల్లు–2023, నేషనల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కమిషన్ బిల్లు–2023, కానిస్టిట్యూషన్(ఎస్సీలు) ఆర్డర్(సవరణ) బిల్లు–2023ని కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది.



గాంధీజీ విగ్రహం వద్ద విపక్షాల నిరసన దృశ్యం

సంజయ్ సింగ్ సస్పెన్షన్

మణిపూర్ హింసపై రాజ్యసభలోనూ విపక్షాలు ఆందోళన కొనసాగించాయి. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పదే పదే విజ్ఞప్తి చేసినప్పటికీ ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్), కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సహా విపక్షాలు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా సభా కార్యకలాపాలను అడ్డుకున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటల వరకూ సభ వాయిదా పడింది. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా ఆందోళన కొనసాగించారు. సభా కార్యక్రమాలకు అడ్డు తగులుతున్న 'ఆప్' ఎంపీ సంజయ్ సింగ్ తీరుపై చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను సభ నుంచి సస్పెండ్ చేయాలని ప్రతిపాదించారు. దీంతో సంజయ్ సింగ్‌ను సస్పెండ్ చేయాలనే తీర్మానాన్ని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టారు. దీనిని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. దీంతో వర్షాకాల సమావేశాల్లో సభ జరిగే మిగిలిన దినాలకు సంజయ్ సింగ్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. 'ఆప్' ఎంపీని సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. దీంతో సభను చైర్మన్ వాయిదా వేశారు. ఆ తర్వాత అన్ని పార్టీల సభాపక్ష నేతలతో రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సభ సక్రమంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. మణిపూర్ అంశంపై పార్లమెంట్‌లో సజావుగా చర్చ జరిగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని హోంమంత్రి అమిత్ అన్నారు. ఆయన సోమవారం లోక్‌సభలో మాట్లాడారు. మణిపూర్ అంశంలో నిజాలు బయటకు రావాల్సిందేనని, వాస్తవాలు దేశ ప్రజలకు తెలియాలని పేర్కొన్నారు.

పార్లమెంట్ వెలుపల నిరసన

మణిపూర్‌లో మహిళలపై అకృత్యాలపై ప్రధాని నరేంద్ర మోదీ సమగ్ర ప్రకటన చేయాలని ప్రతిపక్ష కూటమి 'ఇండియా' పార్లమెంట్ ఆవరణలో సోమవారం ఆందోళన చేపట్టింది. 'మణిపూర్ కోసం భారత్', 'భారత్ డిమాండ్ మణిపూర్' అని రాసి ఉన్న ప్లకార్డులు, బ్యానర్‌లు చేతపట్టుకుని ప్రతిపక్ష ఎంపీలు బిగ్గరగా నినాదాలు చేశారు.



మణిపూర్ రాష్ట్రంలో శాంతినెలకొనాలంటూ నినాదాలు చేస్తున్న మెయిటీ వర్గానికి చెందిన కడంగ్‌బాంగ్ గ్రామ మహిళలు. సోమవారం ఇంఫాల్ వెస్ట్‌లో తీసిందీ ఫొటో.

కునో నేషనల్ పార్కులోని 6 చీతాలకు

రేడియో కాలర్ల తొలగింపు

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కు(కేఎన్‌పీ)లో ఉన్న చీతాల్లో ఆరింటికి రేడియో కాలర్లను తొలగించినట్లు అధికారులు సోమవారం తెలిపారు. కేఎన్‌పీ వైద్యులు, నమీబియా దక్షిణాఫ్రికాల నుంచి వచ్చిన నిపుణులు వీటి ఆరోగ్య పరిస్థితిపై పరిశీలన జరుపుతారని వెల్లడించారు. కేఎన్‌పీలో ప్రస్తుతం 11 చీతాలున్నాయి. ఈ ఏడాది మార్చి నుంచి 5 పెద్ద చీతాలు, 3 కూనలు చనిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కేఎన్‌పీలో ఉన్న ఆరు చీతాల ఆరోగ్యాన్ని పరిశీలిస్తామని, మరో నాలుగు చీతాలకు ఏర్పాటు చేసిన రేడియో కాలర్లను కూడా తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. రేడియో కాలర్ల వల్లే చీతాలు మృతి చెంది ఉంటాయనే అనుమానాలున్నాయా అన్న ప్రశ్నకు.. అటువంటిదేమీ లేదని ఆ అధికారి అన్నారు. ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసే అవసరమున్న చీతాలకు మాత్రమే రేడియో కాలర్లను తొలగిస్తున్నామని వివరించారు.

చైనాలో కూలిన జిమ్ పైకప్పు..

11 మంది మృతి

బీజింగ్: స్కూల్ జిమ్ పైకప్పు కూలిన ఘటనలో 11 మంది చనిపోయారు. చైనాలో హెయిలాంగ్‌జియాంగ్ ప్రావిన్స్‌లోని క్విక్విహార్ నగరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పైకప్పు కూలింది. ఆ సమయంలో జిమ్‌లో 19 మంది వరకు ఉన్నారు. ప్రమాదం నుంచి అయిదుగురు సురక్షితంగా బయటపడగా మరో నలుగురు స్వల్ప గాయాలపాలయ్యారు.

ఇండోనేసియాలో పడవ మునిగి...

15 మంది మృతి

జకార్తా: ఇండోనేసియాలోని సులవేసి దీవి సమీపంలో పడవ మునక ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. బుటోన్‌లోని లాంటో గ్రామం నుంచి సమీప లాగిలి గ్రామం వైపు 48 మందితో వస్తున్న పడవ సోమవారం అర్ధరాత్రి మునిగింది. సమాచారం అందిన వెంటనే సహాయక సిబ్బంది అక్కడికి చేరుకుని 33 మందిని రక్షించారు. మరో 15 మృతదేహాలను వెలికి తీశారు.



మరో 'వాణిజ్య సవాలు'కు...

ఇస్రో సన్నద్ధం

30న నింగిలోకి 7 సింగపూర్ శాటిలైట్లు

బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వాణిజ్య ప్రయోగాల పరంపరలో మరో ముందడుగు. సింగపూర్‌కు చెందిన సమాచార ఉపగ్రహం సింథటిక్ అపర్చర్ రాడార్ (డీఎస్-ఎస్ఏఆర్)తో పాటు మరో 6 బుల్లి ఉపగ్రహాలను సంస్థ పీఎస్ఎల్‌వీ-సి56 ద్వారా అంతరిక్షంలోకి పంపనుంది. జూలై 30న ఉదయం శ్రీహరికోటలో మొదటి లాంచింగ్ ప్యాడ్ నుంచి జరిగే ఈ ప్రయోగం కోసం ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఎస్ఏఆర్‌ను సింగపూర్ ప్రభుత్వ డిఫెన్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సింగపూర్ టెక్నాలజీస్ సంయుక్తంగా ఇంజనీరింగ్ లిమిటెడ్ అభివృద్ధి చేశాయి. ఇది పూర్తి వాణిజ్య ప్రయోగమని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ సోమవారం పేర్కొన్నారు.

- తొలుత జూలై 26న తలపెట్టిన ఈ ప్రయోగం 30కి వాయిదా పడింది.
- 360 కిలోల ఎస్ఏఆర్‌తో పాటు మొత్తం ఏడు ఉపగ్రహాలను భూమి నుంచి 535 కిలోమీటర్ల ఎత్తులో నియర్ ఈక్విటోరియల్ ఆర్బిట్ (ఎన్ఈఓ-నియో) కక్ష్యలోకి పీఎస్ఎల్‌వీ-సి56 ప్రవేశపెట్టనుంది.
- మిగతా ఆరు ఉపగ్రహాలు వెలోక్స్-ఏఎం (23 కిలోలు), ఆర్కేడ్, స్కూబ్-2, న్యూలియోన్, గలాసియా-2, ఆర్బ్-12 స్ట్రైడర్.

మనీ లాండరింగ్ కేసుల్లో 93 శాతం నేర నిరూపణలు

న్యూఢిల్లీ: దేశంతో గత తొమ్మిదేళ్లలో మనీ లాండరింగ్ కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) 93.54 శాతం నేరాలను నిరూపించిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద 31 కేసుల్లో దర్యాప్తు పూర్తి చేసిందని, ఇందులో 29 కేసుల్లో 54 మందిని దోషులుగా గుర్తించిందని వెల్లడించారు. పీఎంఎల్ఏ కింద నేర నిరూపణ రేటు 93.54 శాతం ఉందని పేర్కొన్నారు. అలాగే ఈడీ గత తొమ్మిదేళ్లలో రూ.16,507.86 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసిందని తెలియజేశారు.

వాట్సాప్ స్టేటస్‌తోనూ సమాచార వ్యాప్తి

ముంబై: వాట్సాప్ యాప్ ద్వారా ఇతరులకు సమాచారం అందించాలనుకునే వారు బాధ్యతాయుత వైఖరి కలిగి ఉండాలని బాంబే హైకోర్టు నాగ్‌పూర్ ధర్మాసనం పేర్కొంది. వాట్సాప్ ద్వారా మతాల మధ్య విద్వేషాలను పెంచుతున్నారంటూ ఓ వ్యక్తిపై నమోదైన కేసును కొట్టివేసేందుకు నిరాకరించింది. వాట్సాప్ స్టేటస్‌తో యూజర్లు తమ ఉద్దేశాలను ఇతరులకు తెలియజేస్తున్నారని తెలిపింది. ఈ మేరకు డివిజన్ బెంచ్ ఈ నెల 12న ఇచ్చిన ఉత్తర్వుల్లో తెలిపింది.





కళ్లుసహా ఒళ్లంతా బొబ్బలతో అరుదైన వ్యాధితో పుట్టినప్పటి నుంచి బాధపడుతున్న టీనేజర్ ఇతను. వాపుతో నరక యాతన అనుభవించిన ఇతనికి అమెరికాలో ఆల్ఫోన్సో సబేటర్ అనే వైద్యుడు జన్యుమార్పిడి కంటిచుక్కల మందుతో మళ్లీ చూడగలిగేలా చేశాడు. క్యూబాకు చెందిన ఈ పిల్లాడి కుటుంబం గత పదేళ్లుగా వైద్యం కోసం అమెరికాలోనే ఉంటోంది. చికిత్స సమయంలో మయామీ నగరంలో తీసిన ఫొటోలివి.

ఢిల్లీ - చెన్నై విమాన సర్వీసు రద్దు

తిరువొత్తియూరు: చెన్నై నుంచి సోమవారం ఉదయం ఢిల్లీ వెళ్లాల్సిన విమానం రద్దయ్యింది. ఫలితంగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వివరాలు.. ఢిల్లీ నుంచి చెన్నైకి రోజూ ఉదయం 8.50 గంటలకు ప్రయాణికుల విమానం వచ్చి చేరుతుంది. ఆ విమానము తిరిగి చెన్నై నుంచి ఢిల్లీకి ఉదయం 10.05 గంటలకు బయలుదేరి వెళ్తుంది. కానీ ఆ విమానము సోమవారం ఉదయం ఢిల్లీలో నుంచి చెన్నైకి రాలేదు. మరమ్మతుల కారణంగా సర్వీసును రద్దు చేసినట్లు తెలుస్తోంది. చెన్నై నుంచి వెళ్లాల్సిన విమానాన్ని రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో 140 మంది ప్రయాణికులను మరో విమానంలో ఢిల్లీకి పంపేందుకు ఏర్పాట్లు చేశారు.

న్యూస్‌రీల్

మోదీ చర్యలతో ప్రజాస్వామ్యానికి ముప్పు

• సీతారాం ఏచూరి

సాక్షి, చెన్నై: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రూపంలో సామాజిక న్యాయానికి, ప్రజాస్వామ్యానికి, రాజకీయ శాసనాలకు పెను ముప్పు ఎదురై ఉందని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ ఆరోపించారు. మదురైలో ఆదివారం రాత్రి సీపీఎం రాష్ట్ర కమిటీ నేతృత్వంలో ప్రజా హక్కుల మహానాడు జరిగింది. ఇందులో ఆ పార్టీ నేత సీతారాం ఏచూరీతో పాటుగా, ఎంపీ వెంకటేషన్, డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ, మంత్రులు మూర్తి, పళని వేల్ త్యాగరాజన్ పాల్గొన్నారు. ఇందులో ఏచూరీ మాట్లాడుతూ, ఇండియా కూటమి రూపంలో ప్రధాని నరేంద్ర మోదీలో భయం పెరిగిందన్నారు. దేశం ప్రమాదపుటంచున చిక్కుకొని ఉందనేందుకు మణిపూర్ ఘటనలే నిదర్శనంగా పేర్కొన్నారు. దేశ సమైక్యతకు తీవ్ర భంగం కలిగే పరిణామాలు చోటు చేసుకుంటోన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు సామాజిక వర్గాల మధ్య చిచ్చు పెట్టి ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్రం చోద్యం చూస్తోందని, అక్కడ పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నాలు జరగడం లేదని ధ్వజమెత్తారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, రాజకీయ శాసనాలకు ముప్పు కలిగిస్తున్న ఈ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో సాగనంపేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

శశికళ, సెమ్మలై పిటిషన్లను విచారణకు స్వీకరించండి

• హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆదేశించిన సుప్రీంకోర్టు

కొరుక్కుపేట: శశికళ, సెమ్మలైకి సంబంధించిన పిటిషన్లను త్వరితగతిన విచారించాలని మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. వివరాలు.. దివంగత మాజీ సీఎం జయలలిత మరణానంతరం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా శశికళను పార్టీ జనరల్ కమిటీ ఎంపిక చేసింది. ఈ క్రమంలో శశికళ ఆస్తులు కూడబెట్టిన కేసులో జైలుకు వెళ్లడంతో ఆమెను పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి కూడా తప్పించారు. తర్వాత పార్టీలో సమన్వయకర్త, కో-ఆర్డినేటర్ పోస్టులను సృష్టిస్తూ తీర్మానాలు చేశారు. కాగా ఈ నిర్ణయాలను రద్దు చేయాలని కోరుతూ శశికళ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. అయితే శశికళ పిటిషన్‌ను తిరస్కరించాలని కోరుతూ ఎడప్పాడి పళనిస్వామి తరఫున అన్నాడీఎంకే సంస్థాగత కార్యదర్శి సెమ్మలై పిటిషన్ వేశారు. కాగా ఈ ఏడాది ఫిబ్రవరి 23న సెమ్మలై పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. దీంతో సెమ్మలై మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు, శశికళ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సవాల్ చేస్తూ అప్పీల్ పిటిషన్ సుప్రీంకోర్టులో వేశారు. దీన్ని సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్ అధ్యక్షతన విచారణ చేపట్టారు. సెమ్మలై, శశికళ పిటిషన్‌లను మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్ లిస్ట్ చేయాలని న్యాయమూర్తులు ఆదేశించారు.

ఎంపీ కనిమొళిపై అనుచిత వ్యాఖ్యలు

• బీజేపీ నేత అరెస్ట్

కొరుక్కుపేట: మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి, ఎంపీ కనిమొళిని దూషించిన కేసులో విల్లుపురం బీజేపీ నేత కలివరదన్‌ను పోలీసులు సోమవారం ఉదయం అరెస్టు చేశారు. వివరాలు.. విల్లుపురం బీజేపీ సౌత్ జిల్లా అధ్యక్షుడు వీఏడీ కలివరదన్ (60). తిరుక్కోవిలూరు సమీపంలోని దేవనూర్ కూట్రోట్‌లో నివసిస్తున్నాడు. అతడు తన పార్టీ మహిళా నేతలతో అసభ్యకరంగా మాట్లాడిన ఆడియో సామాజిక మాధ్యమాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. మరోవైపు తన ప్రసంగంలో డీఎంకే నేత ఎంపీ కనిమొళిపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని సోమవారం అరెస్టు చేశారు. అనంతరం విక్రవాండిని న్యాయమూర్తి సెల్వం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఏ జిల్లాలోనూ ప్రభుత్వ వృద్ధాశ్రమం లేదా?

• తప్పుడు సమాచారం ఇస్తే రూ.50 వేల జరిమానా
• పిటిషనర్‌కు హైకోర్టు హెచ్చరిక

అన్నానగర్: తమిళనాడులోని అన్ని జిల్లాల్లో వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేసేలా ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌పై స్పందించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని చెన్నై హైకోర్టు ఆదేశించింది. తూత్తుక్కుడికి చెందిన భాస్కర్ హైకోర్టులో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సోమవారం విచారణ సాగింది. ఇందులో పిటిషనర్ తరఫు న్యాయవాదులు స్పందిస్తూ.. పేరెంట్స్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ యాక్ట్ కింద రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకో ప్రభుత్వ వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. అయితే ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వీఎస్ గంగాపూర్వాలా, ఆదికేశవులు స్పందిస్తూ.. 'ఎన్ని జిల్లాల్లో ప్రభుత్వ వృద్ధాశ్రమాలు లేవు' అని పిటిషనర్‌ను ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ ఒక్క జిల్లాలోనూ ప్రభుత్వ వృద్ధాశ్రమం లేదని పిటిషనర్ సమాధానమిచ్చారు. దీంతో న్యాయమూర్తులు, రాష్ట్రంలో ఎక్కడా ప్రభుత్వ వృద్ధాశ్రమం లేదన్న పిటిషనర్ వాదన తప్పని తేలితే రూ.50 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు.

ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్



మహిళలతో మాట్లాడుతూ..



అర్హులందరికీ.. రూ. 1000

అర్హులైన మహిళలు అందరికీ రూ. 1000 నగదు పంపిణీ పథకం వర్తింపజేస్తామని సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. ప్రతి నెలా బ్యాంక్ ఖాతాల్లో నేరుగా ఈ మొత్తాన్ని జమ చేస్తామన్నారు. ఆర్థిక కష్టాల కారణంగా ఈ పథకం అమలు కాస్త ఆలస్యమైందని పేర్కొన్నారు. ధర్మపురిలో కలైంజ్ఞర్ మహిళ హక్కు పథకం (రూ.1000) పంపిణీ కోసం దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల వివరాల నమోదు ప్రత్యేక శిబిరాన్ని సోమవారం సీఎం స్టాలిన్ ప్రారంభించారు.

• ప్రతినెలా నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ
• ఆర్థిక కష్టాలతోనే ఆలస్యంగా పథకం అమలు
• ధర్మపురిలో సీఎం స్టాలిన్
• కలైంజ్ఞర్ మహిళ హక్కు పథకం దరఖాస్తుల స్వీకరణ
• ప్రత్యేక శిబిరాల ద్వారా నమోదు



శిబిరంలో దరఖాస్తుల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: కలైంజ్ఞర్ మహిళ హక్కు పథకం లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం గత నాలుగు రోజులు దరఖాస్తులు, టోకెన్లను ఇంటింటా వెళ్లి రేషన్ సిబ్బంది పంపిణీ చేస్తూ వచ్చిన విషయం తెలిసిందే. పూర్తి చేసిన దరఖాస్తుల స్వీకరణ, అందులోని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం కోసం ప్రత్యేక శిబిరాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. ధర్మపురి జిల్లా, తోప్పూర్ ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ప్రత్యేక శిబిరాన్ని సీఎం స్టాలిన్ ప్రారంభించారు. దరఖాస్తుల్లోని వివరాల నమోదు, బయోమెట్రిక్ నమోదును సీఎం పరిశీలించారు. ఇక్కడ ఈ పథకం నిమిత్తం 1,500 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారితో సీఎం స్టాలిన్ మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు.

మహిళా సంక్షేమమే లక్ష్యంగా..

డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానంతరం ఆస్తిహక్కు, స్థానిక సంస్థల్లో ప్రత్యేక రిజర్వేషన్ కల్పన, బస్సుల్లో ఉచిత ప్రయాణం అంటూ మహిళా సంక్షేమమే లక్ష్యంగా, మహిళల భద్రతకు భరోసా ఇచ్చే విధంగా చర్యలు విస్తృతం చేశామని వివరించారు. ప్రస్తుతం కుటుంబ పెద్దగా ఉన్న మహిళకు నెలకు రూ. 1000 పంపిణీకి సిద్ధమయ్యామన్నారు. ఎన్నికల వాగ్దానంగా ఉన్న ఈ పథకాన్ని తొలుత ప్రారంభించాలని నిర్ణయించామని, అయితే, అధికార పగ్గాలు చేపట్టిన సమయంలో రాష్ట్రంలో కరోనా తీవ్రంగా ఉండేదని విషయాన్ని గుర్తుచేశారు. ఈ కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సంక్లిష్టంగా మారాయని, ప్రస్తుతం కొంత మేరకు గట్టెక్కడంతో ఈ పథకం అమలుకు సిద్ధమయ్యామన్నారు. సెప్టెంబరు 15వ తేదీ నుంచి అర్హులైనలబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో ప్రతి నెలా రూ. 1000 జమ చేయడం జరుగుతుందని ప్రకటించారు. ఈ పథకం కోసం రూ. 7 వేల కోట్లు కేటాయించామని గుర్తు చేస్తూ, ఈ పథకం ద్వారా ఒక లబ్ధిదారుకు ఏడాదికి రూ. 12 వేలు అందజేయనున్నామని వివరించారు. మహిళల జీవనోపాధికి, పేదరిక నిర్మూలనకు, జీవన ప్రమాణాల పెంపు, తోడ్పాటుకు ఈ మొత్తం ఉపయోగపడుతుందన్నారు. ఈ సమాజానికి మహిళలు చేస్తున్న కృషి, శ్రమ వెలకట్టలేమని, ఇందుకు గుర్తింపుగా మహిళా హక్కు పథకం అమల్లోకి తెస్తున్నామన్నారు. అర్హులైన లబ్ధిదారులు అందరినీ ఈ పథకం పరిధిలోకి తీసుకొస్తామన్నారు. ఈ పథకం సక్రమంగా అమలు కావాలనే లక్ష్యంగా బాధ్యతలను జిల్లాల కలెక్టర్లకు అప్పగించామన్నారు. అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుకు అన్యాయం జరగకూడదని స్పష్టమైన ఆదేశాలు అధికారులకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఒక మహిళకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని, 21 సంవత్సరాలు నిండిన వారు అర్హులుగా ప్రకటించారు. ఇ-గవర్నెన్స్ ఏజెన్సీ అభివృద్ధి చేసిన మొబైల్ అప్లికేషన్ ద్వారా శిబిరాల్లో దరఖాస్తులను నేరుగా నమోదు చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. తమిళనాడులోని మహిళలు ఆత్మ విశ్వాసంతో, ఆత్మ గౌరవంతో జీవించాలని, ఎవరో ఒకరిపై ఆధార పడకుండా వారి కాళ్లపై వారే నిలబడే విధంగా మహిళా స్వయం సహాయక బృందాలను ప్రభుత్వం మరింత బలోపేతం చేయనుందని ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 4.57 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, ఇందులో 51.46 లక్షల మంది మహిళలు ఉన్నట్లు గుర్తు చేశారు. కాగా, ఈ పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం రాష్ట్రవ్యాప్తంగా 35,925 శిబిరాలను ఏర్పాటు చేశారు. 68,190 మంది వలంటీర్లు లబ్ధిదారుల ఎంపిక సేవల్లో నిమగ్నమయ్యారు. ఆగస్టు 28వ తేదీ వరకు శిబిరాలు నిర్వహించనున్నారు. ఆదివారం కూడా శిబిరాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఎంఆర్‌కే పన్నీరు సెల్వం, పీఎంకే శాసన సభా పక్ష నేత జీకే మణి తదితరులు పాల్గొన్నారు.

చెన్నైకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ

• ఆగస్టు 6న రాక



ద్రౌపది ముర్ము

సాక్షి, చెన్నై: రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించినానంతరం తమిళనాడు రాజధాని నగరం చెన్నైకు ద్రౌపది ముర్ము తొలిసారి రానున్నారు. ఆగస్టు 6వ తేదీన ఆమె పర్యటనకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. చెన్నై వర్సిటీలో జరిగే స్నాతకోత్సవంలో ఆమె పాల్గొనున్నారు. వివరాలు.. రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఓ రోజున ఆధ్యాత్మిక నగరం మదురైలోని మీనాక్షి అమ్మవారి దర్శనార్థం, క్లాసికల్ సిటీ కోయంబత్తూరులోని ఈషా యోగా కేంద్రం సందర్శనార్థం వ్యక్తిగత పర్యటన నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రానికి వచ్చారు. అధికారిక పర్యటనలో భాగంగా ఇంత వరకు ఆమె రాష్ట్రానికి రాలేదు. దివంగత డీఎంకే నేత కరుణానిధి స్మారక మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి ఆమె వస్తారని రెండు సార్లు ఎదురు చూశారు. ఆమె రాకపోవడంతో చివరికి ఆస్పత్రిని వైద్యులు, నర్సులు, ఇతర టెక్నికల్ సిబ్బంది చేతుల మీదుగా సీఎం స్టాలిన్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 6వ తేదీన రాష్ట్రంలోనే పురాతన విశ్వవిద్యాలయమైన చెన్నై వర్సిటీ 165వ స్నాతకోత్సవం జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు ద్రౌపది ముర్ము చెన్నైకు రాబోతున్నారు. ఆమెకు విమానాశ్రయంలో సీఎం స్టాలిన్‌తో పాటు మంత్రులు ఆహ్వానం పలుకుతారు. ఈ వేడుకలో ద్రౌపది ముర్ముతో పాటు గవర్నర్ ఆర్ఎన్ రవి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి పాల్గొననున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఆ వర్సిటీ పరిసరాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, భద్రతపై అధికారులు సోమవారం పరిశీలించారు.

ఎస్‌ఐ పరీక్షల్లో వెసులుబాటు కోరుతూ హిజ్రాల కేసు

• ప్రభుత్వం స్పందించాలని హైకోర్టు సూచన

కొరుక్కుపేట: ఎస్‌ఐ పరీక్షల్లో హిజ్రాలకు ప్రత్యేక వెసులుబాటు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. వివరాలు.. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎస్‌ఐ నోటిఫికేషన్‌లో హిజ్రాలకు వయోపరిమితితో పాటు క్రీడల్లో వెసులుబాటు కల్పించాలని కోరుతూ గ్రేస్ బాను రిజ్వాన్ భారతి అనే హిజ్రా మద్రాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. స్పందించిన న్యాయమూర్తులు సెప్టెంబర్ 26లోగా తమిళనాడు ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది.

స్వదేశీ టెర్మినల్!

• ప్రయాణికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
• పాత విదేశీ టెర్మినల్‌కు కొత్త హంగులు



స్వదేశీ టెర్మినల్

సాక్షి, చెన్నై : మీనంబాక్కం విమానాశ్రయంలో స్వదేశీ విమానాల టెర్మినల్ భారీస్థాయిలో రూపుదిద్దుకోనుంది. పాత విదేశీ టెర్మినల్‌ను అంతర్జాతీయ హంగులతో తీర్చిదిద్దనున్నారు. వివరాలు.. చెన్నై మీనంబాక్కం విమానాశ్రయం నుంచి స్వదేశంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో అన్ని ప్రధాన నగరాలకు, దేశాల రాజధానులకు విమానాల సేవలు అందుతున్న విషయం తెలసిందే. గతంలో ఈ విమానాశ్రయాన్ని సుందరంగా తీర్చిదిద్దే విధంగా స్వదేశీ టెర్మినల్, అంతర్జాతీయ టెర్మినల్స్‌ను సిద్ధం చేశారు. ప్రయాణికుల సంఖ్య మరింతగా పెరుగుతుండడం, విమానాల సంఖ్య, సేవలు క్రమంగా విస్తరించడంతో బ్రహ్మాండ హంగులతో విదేశీ టెర్మినల్‌ను రూపొందించారు. ఫేజ్-1లో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ -2గా సరికొత్త హంగులతో 1,36,295 చదరపు అడుగుల్లో రూ. 1,260 కోట్లతో ఈ నిర్మాణాలు పూర్తి చేశారు. ఈ టెర్మినల్ ను తమిళ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దక్షిణ భారతదేశ ఆలయాలు, ఇతర పురాతనను చాటే విధంగా ప్రత్యేక నిర్మాణాలు చేశారు. ఏప్రిల్‌లో దీనిని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ట్రైల్ రన్ విజయవంతం కావడంతో పూర్తిస్థాయిలో ఈ కొత్త విదేశీ టెర్మినల్‌లో విమాన సేవలకు చర్యలు తీసుకున్నారు.

స్వదేశీ టెర్మినల్

ప్రస్తుతం చెన్నై నుంచి పలు నగరాలు, రాష్ట్రాల రాజధానులకు స్వదేశీ విమానాల సేవలు విస్తృతమయ్యాయి. దీంతో స్వదేశీ టెర్మినల్‌ను విస్తరించాల్సిన అవసరం ఏర్పడింది. స్వదేశీ టెర్మినల్‌లో రద్దీ అధికం కావడంతో స్థల సమస్య తప్పడం లేదు. దీనిని అధిగమించేందుకు విమానాయాన శాఖ చర్యలు చేపట్టింది. ఇది వరకు ఉపయోగిస్తున్న విదేశీ టెర్మినల్‌ను స్వదేశీ టెర్మినల్‌కు ఉపయోగించుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం విదేశీ సేవలకు 3,4 టెర్మినల్స్‌ను ఉపయోగిస్తున్నారు. ఎప్పుడో నిర్మించిన 3-డీ విదేశీ టెర్మినల్ పాతది కావడంతో దీనిని మరికొద్ది రోజుల్లో కూల్చి వేసి కొత్తగా టెర్మినల్ పనులు చేపట్టబోతున్నారు. 4-డీ విదేశీ టెర్మినల్ గతంలో ఆధునీకరించిన సందర్భంగా తీర్చిదిద్దిన టెర్మినల్. ఇందులో కస్టమ్స్, విదేశీ వ్యవహారాలు, తదితర వాటికి అప్పగించిన గదులను తొలగించి, అక్కడున్న సౌకర్యాలను మరింతగా మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.ఈ పనులు నెల రోజుల్లో పూర్తి చేసిన సెప్టెంబరులో రెండు లేదా మూడో వారంలో స్వదేశీ టెర్మినల్‌ను అంతర్జాతీయ హంగులతో మెరుగులు దిద్దేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ దృష్ట్యా, 4-డీ టెర్మినల్ ఉపయోగంలోకి వస్తే స్వదేశీ విమాన సేవలను రెండుగా విభజించేందుకు కార్యాచరణ సిద్ధం చేసి ఉన్నారు. డీ-1 టెర్మినల్ నుంచి ఎయిర్ ఇండియా, విస్తారా, స్పైస్‌జెట్ , ఎయిర్ ఏషియా, తదితర విమాన సేవలు, డీ-2 టెర్మినల్ నుంచి జెట్ తదితర మరికొన్ని స్వదేశీ విమానాలకు డీ-4లో ఇండిగో తదితర విమానాల సేవలకు ప్రత్యేక నిర్మాణాలు, ఏర్పాట్లు చేసే విధంగా కార్యాచరణ సిద్ధం చేసి ఉండడం విశేషం.

కదంతొక్కిన డీఎంకే మహిళా నేతలు

• కేంద్రానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు



చెన్నైలోని వివిధ ప్రాంతాల్లో ఆందోళన చేస్తున్న డీఎంకే నాయకులు



వేలూరులో..



తిరువళ్లూరులో..

సాక్షి, చెన్నై: మణిపూర్‌లో చోటు చేసుకుంటున్న అమానవీయ ఘటనలను అస్త్రంగా చేసుకుని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరుపై సోమవారం డీఎంకే మహిళా విభాగం నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రాలు, నగరాల్లో ఆందోళనలు చేపట్టారు. మణిపూర్‌లో ఇరు సామాజిక వర్గాల మధ్య రేగిన చిచ్చు ఆ రాష్ట్రాన్ని దహించి వేస్తున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో కేంద్రం వైఖరిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్రం తీరును నిరసిస్తూ డీఎంకే మహిళా విభాగం నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఉదయం నిరసన కార్యక్రమాలు జరిగాయి. మణిపూర్‌లో శాంతియుత వాతావరణం నెలకొల్పడంలో కేంద్రం విఫలమైందంటూ వారు నినాదాలతో హోరెత్తించారు. మణిపూర్‌ను రక్షించాలని, మహిళలకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తీరును ఎండగట్టారు. చెన్నై, మదురై, తిరునల్వేలి, తూత్తుకుడి, తిరుచ్చి తదిత నగరాలలో పెద్దఎత్తున మహిళా నేతలు తరలివచ్చి నిరసనలను విజయవంతం చేశారు. ఇదిలా ఉండగా, తెన్‌కాశిలో డీఎంకే మహిళ నేతలు నిరసనల్లో పరస్పరం ఘర్షణ పడడం చర్చకు దారితీసింది.

విద్యార్థుల పోరుబాట: మణిపూర్‌ను రక్షించాలని కోరుతూ రాష్ట్రంలో విద్యార్థి సంఘాలు సైతం పోరుబాట పట్టాయి. సోమవారం ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు తరగతులను బహిష్కరించి ఆందోళనలు నిర్వహించారు. మణిపూర్ బాధితులను ఆదుకోవాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని, ఆ రాష్ట్రంలో అల్లర్లకు కారకులైన వారిని గుర్తించి శిక్షించాలని విద్యార్థులు నినాదించారు.

వేలూరులో..

వేలూరు: మణిపూర్ అల్లర్లను నిరోధించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని వీటిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆరోపిస్తూ డీఎంకే మహిళా సంఘం అధ్యర్యంలో సోమవారం ఉదయం అన్నా రోడ్డులో ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. ధర్నాలో మేయర్ సుజాత మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలకు జరిగిన అన్యాయంపై కనీసం ప్రధాని మోదీ స్పందించి పార్లమెంట్‌లోని ప్రతి పక్ష నాయకులకు, దేశ ప్రజలకు సమాధానం చెప్పకుండా విదేశాల్లో పర్యటిస్తుండడం దారుణమన్నారు. మోదీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని దేశ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనే తగిన గుణపాఠం చెపుతారన్నారు. బీజేపీ పాలనలో దేశంలోని మహిళలకు రక్షణ లేదనే వాటికి మణిపూర్ ఒక్కటే నిదర్శనమన్నారు. అనంతరం కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మహిళా సంఘాలు నినాదాలు చేశారు. ఈ ధర్నాలో ఎమ్మెల్యే ఎమ్మెల్యే అములు, మాజీ ఎమ్మెల్యే జయంతి, కార్పొరేషన్ మొదటి జోన్ చైర్మన్ పుష్పలత, మహిళా కార్పొరేటర్‌లు, మహిళా సంఘాల ప్రతినిధులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

తిరువళ్లూరులో..

తిరువళ్లూరు: మణిపూర్‌లో మహిళలపై పెరుగుతున్న అకృత్యాలను నిరసిస్తూ డీఎంకే పిలుపు మేరకు తిరువళ్లూరు, గుమ్మిడిపూండి, ఆవడి, గుమ్మిడిపూండి, మధురవాయల్ తదితర ప్రాంతాల్లో ఆ పార్టీ మహిళా విభాగం నాయకులు ఆందోళన నిర్వహించారు. తిరువళ్లూరులో జరిగిన ఆందోళనకు డీఎంకే జిల్లా కన్వీనర్ తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఉపకార్యదర్శి సేలం సుజాత హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సేలం సుజాత మాట్లాడుతూ మణిపూర్ ఘటనలపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. తక్షణం విచారణ చేపట్టి బాధ్యులకు ఉరిశిక్షను వేయాలని సూచించారు. ఆవడిలో జరిగిన ఆందోళనలో మాజీ మంత్రి ఆవడి నాజర్ హాజరై ప్రసంగించారు. మణిపూర్‌లో జరిగిన సంఘటన దేశసమగ్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గుమ్మిడిపూండిలో జరిగిన ఆందోళనకు స్థానిక ఎమ్మెల్యే టీజే గోవిందరాజన్ హాజరై ప్రసంగించారు. ఈ ఆందోళనలో ఎమ్మెల్యేలు కృష్ణస్వామి, కారపాక్కం గణపతి, జోసెఫ్‌సామువేల్ పార్టీ నేతలు తిరుత్తణి భూపతి, జెడ్పీ చైర్‌పర్సన్ ఉమామహేశ్వరి, శివశంకరి, సరస్వతి చంద్రశేఖర్, సరస్వతి రమేష్, ఉదయమలర్, మహాలక్ష్మి, ప్రియదర్శినితో పాటు పలువురు పాల్గొన్నారు. అలాగే న్యాయవాదులు కూడా తమ విధులను బహిస్కరించి ఆందోళన నిర్వహించారు. కాగా ఆదీవాసి తమిళుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలోనూ మణిపూర్ ఘటననూ నిరసిస్తూ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు.

పళణికి అన్నామలై ఆహ్వానం



సాక్షి, చెన్నై: తాను చేపట్టనున్న పాదయాత్ర ప్రారంభోత్సవానికి హాజరు కావాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సోమవారం ఆహ్వానం పంపించారు. నా మట్టి...నా ప్రజలు నినాదంతో అన్నామలై ఈనె 28వ తేదీ నుంచి 234 అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుతూ పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్న విషయం తెలిసిందే. రామనాథపురంలో ఈ యాత్రకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జెండా ఊపనున్నారు. అదే రోజు రామేశ్వరంలో భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ పరిస్థితుల్లో ఈ యాత్రకు హాజరు కావాలని ఎన్‌డీఏ మిత్ర పక్షాలకు అన్నామలై ఆహ్వానం పలికారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా పళణి స్వామిని ఈ కార్యక్రమానికి అన్నామలై ఆహ్వానించారు. అయితే, ఈ కార్యక్రమానికి పళణి హాజరవుతారా..? లేదా..? అన్నది వేచి చూడాల్సిందే. అన్నామలై వ్యవహరిస్తున్న తీరుపై పళణిస్వామి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఏదైనా వ్యవహారాలు ఉంటే జాతీయ పార్టీ పెద్దలతో మాట్లాడుకుంటామని పళణి స్పష్టం చేసి ఉన్నారు. ఈ పరిస్థితుల్లో అన్నామలై ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి హాజరు అయ్యేనా అన్నది వేచి చూడాల్సిందే. అమిత్ షా ఈ కార్యక్రమానికి హాజరు కాబోతున్న దృష్ట్యా, ఆయనతో భేటీకి అవకాశం ఉంది. ఇది వరకు అమిత్ షా చెన్నైకు వచ్చిన సందర్భంలో భేటీకి అన్నామలై ఏర్పాట్లు చేసినా అనారోగ్య కారణాలతో పళణి దూరంగా ఉండటం గమనార్హం.

క్లుప్తంగా

నిరుద్యోగి ఆత్మహత్య

అన్నానగర్: ఉద్యోగం రాలేదని మనస్తాపం చెంది ఓ యువకుడు ఆదివారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. తేని జిల్లా బోడి తిరుమలాపురం ప్రాంతానికి చెందిన రంజిత్ కుమార్ (28) డిప్లొమా పూర్తి చేసి ఉద్యోగం కోసం వెతుకుతున్నాడు. కానీ అతనికి సరైన ఉద్యోగం లభించలేదు. దీంతో విసుగు చెందిన రంజిత్ కుమార్ 20వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో అరలి విత్తనాలు (విషం) మింగాడు. తల్లిదండ్రులు గుర్తించి తేని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ రంజిత్ కుమార్ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. బోడి టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి..

తిరువళ్లూరు: కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తిరువళ్లూరు జిల్లా తొయూదావూర్ గ్రామంలో నెలకొంది. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా తొయుదావూర్‌కు చెందిన మురుగన్ భార్య సరళ (37). కుటుంబ సమస్యలతో పాటు భర్తతో విభేదాలు రావడంతో ఆత్మహత్యకు యత్నించింది. ఆలస్యంగా గుర్తించిన మహిళ బంధువులు ఆమెను తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్, బైకు ఢీ

- ఇద్దరు యువకుల మృతి

అన్నానగర్: కడయనల్లూరు సమీపంలో సోమవారం ఉదయం వ్యాన్, బైకు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. వివరాలు.. తెన్‌కాశి జిల్లా పులియంగుడి సమీపంలోని మేళపులియంగుడి అరుంధతియార్ వీధికి చెందిన మహదేవన్ కుమారుడు మణికంఠన్ (19). పులియంగుడి సైకాలజీ కళాశాలలో 2వ సంవత్సరం చదువుతున్నాడు. ఇతని స్నేహితుడు పులియంగుడి చింతామణి ప్రాంతానికి చెందిన వేలుచ్చామి కుమారుడు అరుణ్ కుమార్ (19). ఆదివారం మణికంఠన్‌ను తీసుకుని అరుణ్‌కుమార్ కుట్రాలంలో స్నానం చేసేందుకు బైకులో వెళ్లాడు. బైకు కడయనల్లూర్ సమీపంలోని చొక్కంపట్టి పోలీస్ స్టేషన్ మీదుగా వస్తున్నప్పుడూ ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో బైకు నుంచి కిందపడిన మణికంఠన్, అరుణ్ కుమార్ తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఘటన స్థలంలోనే మృతి చెందారు. చొక్కంపట్టి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాదం నెలకొంది.

ఏ కూటమితోనూ సంబంధం లేదు

- రాజకీయం వేరు.. సినిమా వేరు..
- డీఎండీకే కోశాధికారి ప్రేమలత విజయకాంత్ వ్యాఖ్య
- పార్టీ కార్యదర్శులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమలత విజయకాంత్

సాక్షి, చెన్నై: డీఎండీకే ప్రస్తుతం ఏ కూటమిలోనూ లేదని ఆ పార్టీ కోశాధికారి ప్రేమలత విజయకాంత్ స్పష్టం చేశారు. రాజకీయాలు వేరు...సినిమాలు వేరు...అని పేర్కొంటూ, కెప్టెన్ విజయకాంత్ తరహాలో రాజకీయాల్లోకి ప్రస్తుతం కొత్త వారు రావాలనుకుంటే సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కోక తప్పదన్నారు. వివరాలు.. కోయంబేడులోని పార్టీ కార్యాలయంలో డీఎండీకే జిల్లాల కార్యదర్శుల సమావేశం జరిగింది. పార్టీ పరంగా 77 జిల్లాలు ఉండగా 72 మంది కార్యదర్శులు ఈ సమావేశానికి హాజరయ్యారు. పార్టీ సీనియర్ నేత ఎల్‌కే సుదీష్‌తో పాటుగా ముఖ్యులతో కలిసి కోశాధికారి ప్రేమలత లోక్‌సభ ఎన్నికల కార్యాచరణపై సమీక్షించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, తదితర అంశాల గురించి చర్చించారు. మహిళలు అందరికీ రూ. 1000 అందజేయాలన్న పలు డిమాండ్లతో తొమ్మిది తీర్మానాలను ఈ సమావేశంలో చేశారు.

విజయ్‌కు అభినందన..

ఈ సమావేశానంతరం ప్రేమలత విజయకాంత్ మీడియాతో మాట్లాడారు. అన్నాడీఎంకే కాదు, తాము ఏ కూటమిలోనూ ప్రస్తుతం లేదని ఓ ప్రశ్నకు స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరితో పొత్తు, ఇతర కార్యక్రమాల గురించి త్వరలో పార్టీ అధ్యక్షుడు విజయకాంత్ ప్రకటన చేస్తారన్నారు. ఇండియా కూటమిలో నేతల మధ్య భిన్న బేధాలు, అభిప్రాయాలు రావడం ఖాయమని అభిప్రాయపడ్డారు. దళపతి విజయ్ సేవా కార్యక్రమాలు, విద్యార్థులకు ప్రోత్సాహకాలను గుర్తు చేస్తూ అభినందించారు. రాజకీయాల్లోకి ఎవరైనా రావచ్చు అని పేర్కొంటూ, రాజకీయాలు వేరు..సినిమాలు వేరు అన్నది ఓ సారి గుర్తుంచుకోవాలని సూచించారు. సినిమాల నుంచి వచ్చిన విజయకాంత్ రాజకీయ చదరంగంలో అభిమానుల మద్దతుతో సుస్థిర స్థానం సంపాదించారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం కొత్త పార్టీ అంటూ నటులు ఎవరైనా విజయకాంత్ తరహాలో రాజకీయాల్లోకి రావాలనుకుంటే సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

ప్రేమ వ్యవహారంలో యువకుడి హత్య

అన్నానగర్: నెల్‌లై జిల్లా దిసైయాన్ విలై తాలూకా స్వామిదాస్ పట్టణంలో చెప్పులు కుట్టే కార్మికుడు కన్నియప్పన్ కుమారుడు ముత్తయ్య (19). సంగనాన్ కుళం గ్రామంలో వివాహ ఆహ్వాన పత్రికలు తయారు చేసే ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. అదే కంపెనీలో ఓ యువతి పని చేస్తోంది. వేర్వేరు కులాలకు చెందిన చెందిన ముత్తయ్య, సదరు యువతి ప్రేమించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు ముత్తయ్య ఇంటికి ప్రియురాలు వచ్చింది. అనంతరం 4.30 గంటలకు ముత్తయ్య తన బైకులో యువతిని ఇడమొళిలో వదిలేసి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే రాత్రి 8 గంటల సమయంలో స్నేహితుడిని కలిసేందుకు వెళుతున్నానని చెప్పి వెళ్లిన ముత్తయ్య చాలా సేపటి వరకు ఇంటికి రాలేదు. సోదరులు అతన్ని వెతకగా ఆ ప్రాంతంలో మృతదేహమై పడివున్నాడు. దిసైయాన్‌విలై పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ముత్తయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. నెల్‌లై ఎస్పీ శిలంబరసన్, వల్లియూరు డీఎస్పీ యోగేష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నిందితుల కోసం గాలిస్తున్నారు. ప్రేమ వ్యవహారం వల్లే ఈ హత్య చోటు చేసుకుందని భావిస్తున్నారు.

హత్య కేసులో ఐదుగురి అరెస్టు


పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

అన్నానగర్: సైదాపేటలో మహిళా వ్యాపారిని హత్య చేసిన కేసులో ఆమె చెల్లెలు సహా ఐదుగురిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలు.. చెన్నై సమీపంలోని ఆదంబాక్కం ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన భువనేష్ భార్య రాజేశ్వరి(34). చెన్నై బీచ్ – తాంబరం మధ్య ఎలక్ట్రిక్ రైలులో పండ్ల వ్యాపారం చేస్తోంది. గత 19వ తేదీ రాత్రి యధావిధిగా ఎలక్ట్రిక్ రైలులో వ్యాపారం చేసుకుని సైదాపేట రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి ప్లాట్ ఫారమ్‌పై నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు నలుగురు వ్యక్తులు రాజేశ్వరిని అడ్డగించి కొట్టి చంపి అదే రైలు ఎక్కి పరారయ్యారు. ఈ మేరకు మాంబళం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హంతకులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పాత కక్షల కారణంగా రాజేశ్వరి చెల్లె నాగవల్లి ఓ ముఠాతో కలిసి అక్కను హత్య చేసినట్లు తెలిసింది. దీంతో నాగవల్లి (23), ఆమె భర్త శక్తివేల్ (23), జగదీషన్ (23), సూర్య(19), జాన్సన్(19)ను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

లారీ ఢీకొని వ్యాన్ బోల్తా

- రూ.4.5 లక్షల విలువైన గుడ్లు ధ్వంసం


బోల్తా పడిన వ్యాను

అన్నానగర్: పెరంబలూరు సమీపంలో సోమవారం ఉదయం లారీ ఢీకొని వ్యాన్ బోల్తా పడడంతో రూ.4.5 లక్షల విలువైన గుడ్లు పగిలిపోయాయి. వివరాలు.. నామక్కల్ నుంచి గుడ్ల లోడ్‌తో ఉన్న వ్యాన్ ఆదివారం ఉదయం కడలూరు జిల్లా చిదంబరానికి బయలుదేరింది. వ్యాన్‌ని నామక్కల్ జిల్లా రాశిపురానికి చెందిన సెంథిల్‌కుమార్ (50) నడుపుతున్నాడు. తురైయూర్–పెరంబలూరు రోడ్డులోని సెంజేరీ బైపాస్ సమీపంలో వ్యాన్ వస్తుండగా సిమెంట్ మిశ్రమంతో వెళ్తున్న లారీ వ్యాను వెనుక భాగం అనూహ్యంగా ఢీకొంది. వ్యాన్ డ్రైవర్ అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లోని 90 వేల గుడ్లు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ సెంథిల్‌కుమార్, కార్మికుడు పెరియసామి అదృష్టవశాత్తూ సురక్షితంగా బయటపడ్డారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఎంకే ప్రభుత్వంలో కుగ్రామాలకూ బస్సు వసతి


పీంజమందై అటవీ గ్రామానికి తారు రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి దురై మురుగన్

వేలూరు: డీఎంకే ప్రభుత్వంలో కుగ్రామాలకు సైతం బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు మంత్రి దురై మురుగన్ అన్నారు. వేలూరు జిల్లా అనకట్టు నియోజకవర్గంలోని పీంజమందై, పాలంపట్టు, జార్థాన్‌మలై వంటి గ్రామ పంచాయతీల్లో సుమారు 86 కొండ గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 35 వేల మందికి పైగా గిరిజనులు నివసిస్తున్నారు. వీరు గత 50 సంవత్సరాలుగా తమ ప్రాంతాలకు రోడ్డు వసతి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కనీసం ముత్తుకుమరన్ అటవీ ప్రాంతం నుంచి పీంజిమందై కొండ వరకు రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ప్రభుత్వం ముత్తుకుమరన్ గ్రామం నుంచి పీంజమందై కొండ గ్రామం వరకు సుమారు 6.55 కిలో మీటరు దూరం రోడ్డు నిర్మించేందుకు రూ.15 కోట్లు కేటాయించి రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేశారు. దీంతో రోడ్డు ప్రారంభోత్సవాన్ని కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అధ్యక్షతన మంత్రి దురై మురుగన్ సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతాల్లోని 764 మంది కొండవాసులకు రూ. 19.30 కోట్లు విలువ చేసే వివిధ సంక్షేమ పథకాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పీంజమందై, అల్లేరి కొండ గ్రామాల్లో ఆసుపత్రికి వెళ్లాలంటే డోలి కట్టి వెళ్లేవారిని ఇక్కడి వారి కష్టాన్ని గుర్తించి తమ ప్రభుత్వంలో రోడ్డు వసతి ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక నిధులు కేటాయించి ఇక్కడి ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. త్వరలోనే బస్సు సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు మంత్రులు తంగం తెన్నరసు, చక్రపాణి, ఎమ్మెల్యే నందకుమార్, జడ్పీ చైర్మన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రెండు తలలు, 7 కాళ్లతో దూడ జననం


దూడ

అన్నానగర్: దిండుక్కల్ జిల్లా పళని సమీపంలో ఆదివారం రెండు తలలు, 7 కాళ్లతో ఓ గేదెకు దూడ పుట్టింది. పులియంపట్టి గ్రామానికి చెందిన మకుటీశ్వరన్, రైతు. తన ఇంట్లో ఆవులు, గేదెలను పెంచుకుంటున్నాడు. అతను పెంచే గేదెలలో ఓ గేదే ఆదివారం రెండు తలలు, 4 కళ్లు, 7 కాళ్లు, 2 తోకలతో ఉన్న దూడ జన్మించింది. తర్వాత కొద్దిసేపటికే ఇది మరణించింది. ఇక జన్యుపరమైన లోపాల వల్లే ఇలాంటి దూడలు జన్మిస్తాయని పశు వైద్యులు తెలిపారు.

బాలికను లైంగికంగా వేధించిన వ్యక్తి అరెస్ట్

అన్నానగర్: కోయంబత్తూరులోని సూలూర్ సమీపంలోని గ్రామానికి చెందిన 13 ఏళ్ల విద్యార్థి ఆ ప్రాంతంలోని పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. సోమవారం తన అమ్మమ్మతో కలిసి సూలూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఓ ఫిర్యాదు చేసింది. అందులో.. '' నేను సూలూరు ప్రాంతంలో అమ్మతో కలిసి ఉంటున్నాను. మా అమ్మ ఇక్కడ బ్యూటీ పార్లర్ నడుపుతోంది. 11 ఏళ్ల క్రితం మా అమ్మ నాన్న నుంచి విడిపోయింది. దీంతో నేను, మా అమ్మ ఒంటరిగా జీవించాం. మా నాన్న ఎవరో నాకు తెలియదు. కొన్నేళ్ల క్రితం మా ఇంటికి చెన్నై అయనవరం నుంచి బాలప్రవీణ్ (35)ని మా అమ్మ తీసుకొచ్చింది. ఎవరని అడిగితే మీ తండ్రి అని చెప్పింది. నేను అతనితో తండ్రిగా అలవాటు పడ్డాను. నేను కూడా తండ్రిగానే మాట్లాడాను, అయితే రోజులు గడిచేకొద్దీ ఆ వ్యక్తి దారుణంగా ప్రవర్తించే వాడు. ల్యాప్‌టాప్‌లో అశ్లీల చిత్రాలను చూపించేవాడు. రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చిన బాలప్రవీణ్ నాపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని మా అమ్మకి చెప్పాను. కానీ మా అమ్మ అతనితో ఏం మాట్లాడకుండా నన్ను తిట్టి దాడి చేసింది. ఇది నాకు చాలా బాధ కలిగించింది. నన్ను లైంగికంగా వేధిస్తున్న మా అమ్మ, ఆమె ప్రియుడిపై తగిన చర్యలు తీసుకోవాలి.'' అని పేర్కొంది. దీంతో పోలీసులు విద్యార్థిని తల్లిని, బాలప్రవీణ్‌ని అరెస్టు చేశారు. వీరిద్దరిపై పోక్సో చట్టం కింద కేసు దర్యాప్తు చేశారు.

ఆనందంలో.. అమ్మతనం


తమిళ సినిమా: నటిగా ఎంతగా లేడీ సూపర్ స్టార్ అయినా నయనతార కూడా స్త్రీ మూర్తినే కదా! సినిమాల్లో ప్రియురాలుగా, భర్తకు భార్యగా, బిడ్డకు తల్లిగా ఎంతగా ప్రేమను చూపిన అది నటనే కాబట్టి అందులో మమతానురాగాలు ఉండవు. అయితే నిజ జీవితంలో ఇప్పుడు నయనతార అమ్మతనాన్ని పరిపూర్ణంగా ఆస్వాదిస్తున్నారు. అందులో సహజ సిద్ధంగా కలిగే మాధుర్యాన్ని అనుభవిస్తున్నారు. గత ఆరేళ్లకు పైగా ప్రేమించుకుంటూ సహజీవనం చేసిన దర్శకుడు విఘ్నేష్ శివన్, నయనతార రెండేళ్ల క్రితం పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. కాగా ఆ మధ్య ఈ సంచలన జంట సరోగసి విధానం ద్వారా ఇద్దరు కవల పిల్లలకు తల్లిదండ్రులు అయిన విషయం తెలిసిందే. కాగా నయనతార నటిగా బిజీగా ఉన్నా తన పిల్లల కోసం తగిన సమయాన్ని కేటాయిస్తూ వారి ఆలనా పాలనా చూసుకుంటున్నారు. అలా ఆదివారం తన బిడ్డను లాలిస్తూ మురిసి పోతున్న దృశ్యాన్ని ఆమె భర్త ఫొటో తీసి దాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అందులో ఈ ఆదివారం మధురంగా సాగిపోయింది. తమ ప్రాణాలతో (పిల్లలతో) సమయాన్ని ఆనందంగా గడిపినట్లు పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం నయనతార హిందీలో షారుక్ ఖాన్‌తో తొలిసారిగా జతకట్టిన జవాన్ చిత్ర విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు తన 75 చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నట్లు తెలిసింది.


బిడ్డతో నయనతార

కోలీవుడ్ టాక్స్

మహేంద్రసింగ్ ధోనీ నటనావతారం

తమిళ సినిమా: ఇప్పటి వరకూ క్రికెట్ దుమ్ము రేపిన క్రికెట్ క్రీడాకారుడు ఎంఎస్ ధోని ఇప్పుడు చిత్ర నిర్మాణంలో ప్రవేశం చేసిన విషయం తెలిసిందే. ఈయన ధోని ఎంటర్‌టైన్‌మెంట్ చిత్ర నిర్మాణ సంస్థను ప్రారంభించి ఎల్‌జీఎం అనే చిత్రాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. హరీష్ కల్యాణ్, ఇవనా జంటగా నటించిన ఇందులో నటి నదియా, యోగిబాబు తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. రమేష్ తమిళమణి దర్శకుడిగా పరిచయం అయిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 28న విడుదల కానుంది. ఇదంతా తెలిసిన కథే. ఈ చిత్రం ద్వారా నిర్మాతగా మారిన ధోనీ అక్కడితో ఆగలేదు. ఈ చిత్రంతో ఆయన నటుడిగానే అవతారమెత్తారు. తాజా సమాచారం. నటుడు కమలహాసన్ కథానాయకుడిగా నటించిన సూపర్ హిట్ చిత్రం చివరి ఘట్టంలో రోలెక్స్ పాత్రలో నటుడు సూర్య మెరిసిన విషయం తెలిసిందే. అది 10 నిమిషాల గెస్ట్ పాత్ర అయినా సూర్య అభిమానుల్లో రోలెక్స్ పాత్ర పెద్దగా ముద్ర వేసుకుంది. సూర్య కనిపిస్తే వారు రోలెక్స్ అంటూ గోల చేస్తున్నారు. కాగా ఎల్‌జీఎం చిత్రంలో ఎంఎస్ ధోనీ ఆ తరహా పాత్రలో మెరవనున్నట్లు తెలిసింది. ఇది ఆయన అభిమానులు సంబరపడే విషయమే అవుతుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు.


భార్య సాక్షితో ధోని

ఆకలితో ఉన్న వ్యక్తికి సాయం చేస్తే..!

తమిళ సినిమా: నటుడు విశాల్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం మార్క్ ఆటోని. ఎస్ జే.సూర్య ప్రతినాయకుడిగా నటించిన ఇందులో నటి రీతు వర్మ నాయకిగా నటించారు. నటి అభినయ, ఈ చిత్రాన్ని సునీల్, వైజీ మహేంద్రన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఆదిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో మినీ స్టూడియోస్ పతాకంపై ఎస్.వినోద్ కుమార్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్ కథా చిత్రం షూటింగ్‌ను పూర్తి చేసుకుని ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్ర ప్రమోషన్ కార్యక్రమాలను యూనిట్ వర్గాలు సిద్ధం అయ్యాయి. అందులో భాగంగా చిత్ర యూనిట్ ఇటీవల పుదుచ్చేరిలోని ఓ కళాశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా నటుడు విశాల్ ను ఒక విద్యార్థి నటుడు విజయ్ రాజకీయ రంగ ప్రవేశానికి సిద్ధం అవుతున్నట్లు ప్రచారం జరుగుతోందని, ఆయన మీకు మంచి స్నేహితుడు కాబట్టి ఆయన పార్టీలో చేరుతారా? అని అడిగాడు. అందుకు విశాల్ బదులిస్తూ అది ఆ దేవుడే నిర్ణించాలన్నారు. అయితే చాలా కాలంగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నానని చెప్పారు. ఆకలితో ఉన్న వారికి చేతనైన సాయం చేస్తున్నానని అన్నారు. ఆకలితో ఉన్న వారికి రూ.50 సాయం చేసినా రాజకీయ నాయకుడేనే.. అనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. కాగా మార్క్ ఆంటోని చిత్రంలో విశాల్ ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు సమాచారం.


మార్క్ ఆంటోనీ చిత్రంలో విశాల్

ఇండియన్- 2కీ సీక్వెల్?


కమలహాసన్‌తో నటి కాజల్ అగర్వాల్, దర్శకుడు శంకర్

తమిళ సినిమా: విశ్వ నటుడు కమలహాసన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం ఇండియన్- 2. రెండున్నర దశాబ్దాల క్రితం విడుదలై సంచలన విజయాన్ని సాధించిన ఇండియన్ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న సినిమా ఇది. ఆ చిత్రానికి దర్శకత్వం వహించిన శంకర్‌ని ఈ చిత్రాన్నీ తెరకెక్కిస్తున్నారు. నిర్మాణ సంస్థ మాత్రం మారింది. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభమై కూడా నాలుగైదు ఏళ్లు గడుస్తోంది. పలు అవరోధాలను అధిగమించి ఇప్పటికి చిత్ర షూటింగ్ చివరి దశకు చేరుకుంది. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీతిసింగ్, ప్రియ భవానీ శంకర్, సముద్రఖని, బాబీసింహ తదితరులు ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. నిర్మాణంలో జాప్యం జరిగినా చిత్రంపై మాత్రం సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. వ్యాపారంలోనూ ఈ చిత్రం కొత్త రికార్డులు నమోదు చేస్తుందనే ప్రచారం జరుగుతోంది. చిత్ర బడ్జెట్ రూ.200 కోట్లని సమాచారం. అయితే చిత్ర ఆడియో హక్కులను ఇంతకు ముందే సరిగమ సంస్థ రూ.23 కోట్లకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. తాజాగా ఈ చిత్ర డిజిటల్ హక్కులను నెట్ ఫ్లిక్ సంస్థ రూ.220 కోట్లకు పొందినట్లు తాజా సమాచారం. దీంతో ఇప్పటికే ఇండియన్- 2 చిత్రం నిర్మాతలకు టేబుల్ ప్రాఫిట్ తెచ్చిపెట్టిందని భావించవచ్చు. ఇకపోతే ఫైనల్ స్టేజ్‌లో ఉన్న ఈ చిత్రాన్ని దర్శకుడు శంకర్ రెండు భాగాలుగా విడుదల చేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం కమలహాసన్ మరో 25 రోజులు అదనంగా కాల్ షీట్స్ కేటాయించాల్సి ఉంటుందని శంకర్ సూచించినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తెలుగు చిత్రం కల్కిలో కమల్ నటిస్తున్నారు. ఆ చిత్ర తొలి షెడ్యూల్ పూర్తి చేసిన తర్వాత ఇండియన్- 3 చిత్రంపై చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా ఈ చిత్రం ఈ ఏడాది చివరలో తెరపైకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

పోర్చుగల్‌కు అదితి శంకర్

తమిళ సినిమా : దర్శకుడు శంకర్ వారసురాలు అదితి శంకర్ కథానాయికగా రంగ ప్రవేశం చేసిన విషయం తెలిసిందే. ఆమె ఇప్పటికే కార్తీ, శివకార్తీకేయన్‌కు జంటగా నటించారు. ఈ రెండు చిత్రాలు ప్రేక్షక ఆదరణ పొందాయి. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే అతిథి శంకర్ తన ఫొటోలను తరచూ పోస్ట్ చేస్తూ ఇటు చిత్ర పరిశ్రమల దృష్టిని తనవైపు పడేలా చూసుకుంటూ, అటు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. కాగా ఇటీవల విధులైన మావీరన్ చిత్రంలో కథానాయికగా అదితి శంకర్ మంచి పాత్ర పోషించారు. తాజాగా ఈమె తన మూడో చిత్రానికి సిద్ధమయ్యారు నటుడు అధర్వ తమ్ముడు ఆకాష్ మురళి కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రంలో అదితి శంకర్ నాయికగా నటిస్తున్నారు. దీనికి విష్ణువర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎక్స్ బీ ఫిలిమ్ క్రియేటర్స్ పతాకంపై సేవియర్ బ్రిట్టో నిర్మిస్తున్న ఈ చిత్ర షూటింగ్ ఇప్పటికే ప్రారంభమై తొలి షెడ్యూల్‌ను చెన్నైలో పూర్తి చేసుకుంది. ప్రస్తుతం లిస్బన్‌లో రెండో షెడ్యూల్‌ను జరుపుకుంటోంది. కాగా ఈ చిత్ర షూటింగ్లో పాల్గొనటానికి నటి అది శంకర్ సోమవారం పోర్చుగల్ దేశానికి బయలుదేరారు. అక్కడ వచ్చే నెల చివరి వరకు షూటింగ్ జరుగుతుందని సమాచారం.



క్లుప్తంగా

క్రోంపేట జీహెచ్‌లో ఆరోగ్యశాఖ కార్యదర్శి తనిఖీ

కొరుక్కుపేట: తమిళనాడు రాష్ట్రంలోని ఆసుపత్రిల్లో ఆరోగ్య శాఖ కార్యదర్శి గగన్‌దీప్ సింగ్ బేదీ నేతృత్వంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం చెన్నై క్రోంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు చేశారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎక్స్‌రే తీసుకోవడానికి వచ్చిన వారికి కుర్చీలు ఏర్పాటు చేయాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. గగన్‌దీప్‌సింగ్ బేదీ విలేకరులతో మాట్లాడుతూ క్రోంపేట ఆసుపత్రిలో రూ.6 కోట్లతో ప్రయోగశాల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. తాంబరం ఆసుపత్రి కాంప్లెక్స్‌లో జిల్లా ఆసుపత్రి ఏర్పాటుకు రూ.100 కోట్లు కేటాయించినట్టు వివరించారు. అనుమతులు రాగానే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఆకట్టుకున్న ఫ్యాషన్ షో

- ప్రత్యేక ఆకర్షణగా సినీ నటులు భరత్, వాణి భోజన్



ఫ్యాషన్‌షోలో సినీ నటులు భరత్, వాణి భోజన్

కొరుక్కుపేట: చెన్నైలోని వేళచ్చేరిలో ఉన్న ఫీనిక్స్ మార్కెట్ సిటీలో ఆదివారం రాత్రి వివాహం పేరుతో నిర్వహించిన ప్రత్యేక ఫ్యాషన్ షో, ఎక్స్‌పో ఆకట్టుకుంది. ఇందులో ప్రముఖ మోడల్స్ పాల్గొని వెడ్డింగ్‌కు సంబంధించిన దుస్తులు ధరించి క్యాట్ వాక్ చేశారు. ఈ ఫ్యాషన్ షోలో ప్రఖ్యాత తమిళ నటీనటులు భరత్, వాణి భోజన్ తమ కొత్త సినిమా లవ్ చిత్రం ఈ నెల 28న విడుదలకు సిద్ధంగా ఉన్న సందర్భంగా ఫ్యాషన్ షోలో పాల్గొన్నారు. తమ సినిమాను విజయవంతం చేయాలంటూ అభిమానులతో సెల్ఫీలు తీసుకుంటూ హీరో హీరోయిన్‌లు సందడి చేశారు. వధూవరులు దుస్తులకు ఉత్తమ అనుభూతిని కలిగించడానికి సాంప్రదాయక సేకరణలను ప్రదర్శిస్తూ ఫ్యాషన్ షో ఆద్యంతం ఆకట్టుకుంది.

ప్లస్ టూ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల

తిరువొత్తియూరు: రాష్ట్రంలో నిర్వహించిన ప్లస్ టూ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు సోమవారం విడుదల చేశారు. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబరు, పుట్టిన తేదీ నమోదు చేసి ఫలితాలను తెలుసుకోవచ్చు. ఇందుకోసం http://www.dge.tn.in అనే వెబ్‌సైట్‌ను చూడాలని అధికారులు తెలిపారు.

బ్యాంకు ఏటీఎంలో చోరీకి యత్నం

తిరువొత్తియూరు: దుండగులు పలనిలో బ్యాంకు ఏటీఎం యంత్రాన్ని పగులగొట్టి చోరీ చేసేందుకు ప్రయత్నించారు. అలారం మోగడంతో పారిపోయారు. పలని తాలూకా కార్యాలయం పలని కార్యాలయం ఎదురుగా స్టేట్ బ్యాంక్ రోడ్డులో ఐవోబీ ఉంది. దాని ముందు ఏటీఎం సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ సోమవారం తెల్లవారుజాము 2 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎం యంత్రాన్ని పగులగొట్టి నగదు చోరీ చేయడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో అలారం మోగడంతో దుండగులు పారిపోయారు. దీనిపై మెసేజ్ మూలంగా బ్యాంకు మేనేజర్‌కు సమాచారం అందింది. ఆయన టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ టీవీ కెమెరాల మూలంగా దుండగుల కోసం ల కోసం గాలిస్తున్నారు.

బైకును ఢీకొన్న ప్రైవేటు బస్సు

తిరువొత్తియూరు: బైక్‌ను ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్సు ఢీకొంది. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చెన్నై తురైపాకం కామరాజర్ వీధికి చెందిన శశి కుమారు కుమారుడు కార్తీక్ (19) తాంబరంలో ఉన్న ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇతని బంధువు రితిక (20) హాస్టల్లో ఉంటూ ఐటీ సంస్థలు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. వీరు సోమవారం ఉదయం బైక్‌లో బయలుదేరారు. తురైపాకం పిల్లయార్ ఆలయం వీధిలో 200 అడుగుల రోడ్డును దాటుతుండగా పల్లావరం నుంచి తురైపాకం సిగ్నల్ వైపు వస్తున్న ప్రైవేటు కళాశాల బస్సు ఢీకొట్టింది. కార్తీక్, రితిక తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గిండి ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకొని ప్రమాదానికి కారణమైన బస్సును, బైకును రోడ్డుపై నుంచి తొలగించారు.

అటవీ ఏనుగు పట్టుబడింది

తిరువొత్తియూరు: సత్యమంగళం సమీపంలోని కడంబూర్ అడవి ప్రాంతం నుంచి బయటకు వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగును ఎట్టకేలకు అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. సత్యమంగళం సమీపం కడంబూర్ కొండ గ్రామాల అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన కట్టయన్ అనే అటవీ ఏనుగు సంవత్సరం రోజులుగా ఆహారం కోసం పుదిక్కాడు, చెంగాడు, మూలకంబుర్ కొండూరు, కడంబూరు బస్సు నిలయం తదితర ప్రాంతాలు, వ్యవసాయ పొలాల్లోకి చొరబడి పంటలను ధ్వంసం చేస్తోంది. ఈ క్రమంలో ఓసప్పాలయం ప్రాంతంలోనీ పొలాల్లో తిరుగుతున్న కట్టయన్ ఏనుగును అటవీ శాఖ అధికారులు, వెటర్నరీ డాక్టర్ల బృందం కలిసి డాక్టర్ సదాశివ నేతృత్వంలో ఏనుగుకు నాలుగు సార్లు మత్తు ఇంజక్షన్ ఇచ్చి పట్టుకున్నారు. అనంతరం దాన్ని క్రేన్ ద్వారా సోమవారం ఉదయం భవానిసాగర్ సమీపంలోని అడవిలో వదిలిపెట్టినట్లు అధికారులు తెలిపారు.

విపత్తులతో అభివృద్ధికి ఆటంకం

- జీ20 సదస్సులో ప్రతినిధుల వ్యాఖ్య

సాక్షి, చెన్నై: వాతావరణంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో తరచూ విపత్తులు సంభవించి అభివృద్ధికి ఆటంకం కలిగిస్తోందని జీ20 సదస్సులో వివిధ దేశాల ప్రతినిధులు వ్యాఖ్యానించారు. భారత్‌లో త్వరలో జరగనున్న జీ20 దేశాల మహానాడు నేపథ్యంలో ముందుగా పలు అంశాలపై ఆయా దేశాల ప్రతినిధుల సమావేశం పలు రాష్ట్రాలలో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆ దిశగా తమిళనాడులో మూడో సమావేశం సోమవారం ప్రారంభమైంది. చెన్నై గిండిలో విపత్తులు, వాతావరణ మార్పులు, ఎదురయ్యే ప్రమాదాలు, పర్యావరణ అంశాలపై జీ20 దేశాల ప్రతినిధుల సదస్సు జరిగింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును భారత ప్రధాని ప్రిన్సిపల్ కార్యదర్శి పీకే మిశ్రా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన పర్యావరణ అంశాలు, విపత్తులు, నిర్వహణ, ఆర్థిక పరిస్థితులు, ఆర్థిక విపత్తు ప్రమాదాల తగ్గింపు(డీఆర్ఆర్) తదితర అంశాలను గుర్తు చేస్తూ ప్రసంగించారు. ఇటీవల కాలంగా భారత్ డీఆర్ఆర్ ఫైనాన్స్ విధా



సదస్సులో పీకే మిశ్ర తదితరులు

నాన్ని పూర్తిగా మార్చేసినట్లు వివరించారు. విపత్తులను ఎదుర్కొనడమే కాకుండా, నివారణ , పునరుద్ధరణకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తూ వస్తున్నట్టు పేర్కొన్నారు. డీఆర్ఆర్ కోసం ప్రైవేటు రుణాల సమీరణ ఓ సవాలుగా పేర్కొన్నారు. దీనితో పని లేకుండా డీఆర్ఆర్ అవసరాలను తీర్చడం, పరిష్కరించడంలో భారత్ చాలా దూరం ముందుకెళ్లిందని పేర్కొన్నారు.

సమష్టిగా ముందుకు..

డీఆర్ఆర్ వర్కింగ్ గ్రూప్ అనుసరిస్తున్న ఐదు ప్రాధాన్యతల్లో అన్ని గణనీయ పురోగతిలో ఉన్నాయని, రాబోయే రోజుల్లో ఇక్కడ చర్చించే అంశాలు వ్యూహాత్మక ఎంజెండాకు దోహదకరంగా ఉంటాయన్నారు. మరికొందరు ప్రతినిధులు ప్రసంగిస్తూ, డీఆర్ఆర్‌కు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా జాతీయ ఆర్థిక , ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక అంశాల దృఢంగా ఉండే అవకాశాలు ఉన్నట్లు వివరించారు. వాతావరణ సంక్షోభం తీవ్రమవుతున్నందున, జాతీయ ఆర్థిక ప్రణాళిక, వ్యవయం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అంతా డీఆర్ఆర్‌నుని సమగ్ర పరచడంలో, ప్రాముఖ్యతను గుర్తించాలని సూచించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలతో భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవాలనే సంకల్పంలో భారత్ స్థిరంగా ఉందని, విపత్తుల వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎక్కువగా ప్రభావితమవుతోన్నందున, నష్టాలను తగ్గించేందుకు ప్రణాళికలు అవశ్యం అని వ్యాఖ్యానించారు. ఈ సమావేశానికి అమెరికా, రష్యా తదితర దేశాలకు చెందిన 80 మంది ప్రతినిధులు హాజరయ్యారు. విదేశీ ప్రతినిధులు హాజరైన నేపథ్యంలో గిండిలోని ఆ హోటల్ పరిసరాల్లో పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు.

'ఉలవన్' యాప్‌తో అద్దెకు వ్యవసాయ పనిముట్లు

- వ్యవసాయ మంత్రి ఎంఆర్‌కే పన్నీరు సెల్వం



సాక్షి, చెన్నై: ఉలవన్ యాప్ ద్వారా రైతులకు ఉపయోగపడే యంత్రాలు, పనిముట్లు అద్దెకు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు వ్యవసాయ శాఖమంత్రి ఎంఆర్‌కే పన్నీరు సెల్వం తెలిపారు. ఈ యాప్‌లో రైతులకు సంబంధించిన అన్ని అంశాలు, సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. సోమవారం ఈ యాప్ గురించి రైతులకు తెలియజేస్తూ, రైతులకు సబ్సిడీలను గురించి మంత్రి మీడియాకు వివరించారు. వ్యవసాయ ఉత్పత్తులు, రైతులకు ఆదాయ పెంపునకు కృషి చేస్తూ, చిన్న, సన్న కారు రైతులకు ప్రత్యేక సబ్సిడీ ఇవ్వనున్నామని ప్రకటించారు. ప్రస్తుతం సాగుబడిలో ఉన్న రైతులకు కలైంజ్ఞర్ ఆల్ విలేజ్ ఇంటిగ్రేటెడ్ అగ్రి కల్చరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను వర్తింప చేస్తున్నామన్నారు. ఈ మేరకు రైతులకు సబ్సిడీ ద్వారా 5,000 పవర్ టిల్లర్లు , పవర్ కలుపు తీసే పరికరాలను అందజేయనున్నామని వివరించారు. ఆన్‌లైన్‌లో వీటికోసం రైతుల నమోదు చేసుకోవాలని సూచించారు. సబ్సిడీలో వ్యవసాయ యంత్రాలను కొనుగోలు చేయడానికి సహకారం అందిస్తామన్నారు. యంత్రాలు కొనుగోలు చేసిన తర్వాత రైతులకు రోలింగ్ పద్ధతిలో సబ్సిడీ ఇస్తామన్నారు. ఈ పథకం చిన్న, మధ్యతరహా, ఆది ద్రవిడ, గిరిజన, మహిళా రైతులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందన్నారు. రైతులు 50 శాతం సబ్సిడీపై పవర్ టిల్లర్లను కొనుగోలు చేయవచ్చు అని సూచించారు.

సీఎండీఏ భేటీలో అభివృద్ధి పనులపై సమీక్ష

సాక్షి, చెన్నై: చెన్నై మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ(సీఎండీఏ) కమిటీ సమావేశం సోమవారం చెన్నైలో జరిగింది. సీఎండీఏ చైర్మన్, దేవదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కొత్తగా కిలాంబాక్కంలో నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్న బస్ టెర్మినల్ గురించి చర్చించారు. ప్రజా రవాణా వ్యవస్థను మెరుగు పరిచేందుకు తీసుకోవాల్సిన అంశాల గురించి సమీక్షించారు. అలాగే చెన్నై ఐల్యాండ్ అభివృద్ధి, క్రీడా నగరం నిర్మాణం, తదితర అంశాల గురించి ఈ సమావేశంలో చర్చించారు. చెన్నై మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ పరిపాలనా వ్యవహారాలు గురించి చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ, హౌసింగ్ బోర్డు చైర్మన్ మురుగన్, అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం ప్రధాన



సమావేశంలో మంత్రి శేఖర్‌బాబు

కార్యదర్శి అపూర్వ, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి పూజా కులకర్ణి, సీఎండీఏ సభ్యులు మాధవరం సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

629 ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు

తిరువళ్లూరు: మహిళలకు ప్రతి నెలా వెయ్యి రూపాయల ఆర్థిక సాయం అందించే ప్రభుత్వ పథకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమానికి జిల్లాలోని 629 ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో డీఎంకే అధికారంలోకి వస్తే ప్రతి మహిళ కుటుంబానికి ప్రతి నెలా వెయ్యి రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. దాదాపు రెండు సంవత్సరాలు దాటిన నేపథ్యంలో ప్రజలు, పలు పార్టీల నుంచి వస్తున్న వ్యతిరేకతను దృష్టిలో వుంచుకుని పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రెండు ధపాలుగా దరఖాస్తులను పంపిణీ చేసి స్వీకరించే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఇప్పటికే ఇంటింటికీ వెళ్లిన వలంటీర్లు దరఖాస్తులను అందజేశారు. కాగా దరఖాస్తులను స్వీకరించడానికి జిల్లా వ్యాప్తంగా 629 క్యాంపులను ఏర్పాటు చేసి సోమవారం నుంచి స్వీకరించారు. చాలా ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ మొరాయించడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని కేంద్రాల్లో కనీస సదుపాయాలు సైతం లేకపోవడంతో ప్రజలు అధికారులు అవస్థలకు గురయ్యారు.

ఆది ఆంధ్ర అరుంధతీయుల అభ్యున్నతే లక్ష్యం

కొరుక్కుపేట: ఆది ఆంధ్ర అరుంధతీయుల అభ్యున్నతే లక్ష్యంగా మాస్ సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కొల్లి రాజు తెలిపారు. చెన్నై ఎగ్మోర్‌లోని ఇక్సా జీవనజ్యోతి హాలులో మద్రాసు ఆది ఆంధ్ర ఆదివాసి సంక్షేమ సంఘం (మాస్) సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్ వ్యవస్థాపకులు జి.గోపాలకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్టేట్ సోషల్ జస్టిస్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎ.జైసన్, జనని సంస్థ ప్రధాన కార్యదర్శి, మాస్ సలహాదారు గుడిమెట్ల చెన్నయ్య సమక్షంలో సభ్యులు మాస్ 2023 - 2025 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో మాస్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ కొల్లి రాజు, ఉపాధ్యక్షులుగా నూనె శ్రీనివాసులు, కొత్త వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా ఆత్మకూరి అజరయ్య, కోశాధికారిగా ఎం.వీరయ్య, సంయుక్త కోశాధికారిగా వి.దీన దయాళన్, సంయుక్త కార్యదర్శులుగా పాల్ కొండయ్య, తిరుపతయ్య, ఎం.పి.తిరుపాలు, అసిస్టెంట్ కార్యదర్శిగా కె.పి.రావు నియమితులయ్యారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



కొత్త కార్యవర్గం తో అతిథులు

క్రీడాకారిణికి ఘన స్వాగతం



ఘనస్వాగతం పలుకుతున్న తల్లిదండ్రులు, విద్యార్థులు

తిరువళ్లూరు: ఢిల్లీలో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో పాల్గొని బంగారు పతకం సాధించిన క్రీడాకారిణికి పాఠశాల నిర్వాహకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. తిరువల్లూరు జిల్లా కాకలూరుకు చెందిన పురుషోత్తం, అనిత దంపతుల కుమార్తె ఆర్‌పి కీర్తన సెవ్వాపేటలోని వేళమ్మాల్ విద్యాశ్రమ్‌లో పదవ తరగతి చదువుతోంది. ఆమె వెయిట్‌లిఫ్టింగ్‌లో శిక్షణ తీసుకుంది. ఇటీవల ఢిల్లీలో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో 81 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో పాల్గొంది. పోటీల్లో 177 కేజీల బరువును ఎత్తి బంగారు పతకం సాధించింది. తిరిగి స్వగ్రామానికి చేరుకున్న ఆమెకు ఉపాధ్యాయు లు, పాఠశాల నిర్వాహకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. బాలిక ఉన్నత విద్యకు అయ్యే ఖర్చును తామే భరిస్తామని పాఠశాల కరస్పాండెంట్ సుడలైముత్తుపాండ్యన్, ప్రిన్సిపల్ సతీష్ ప్రకటించారు. కాగా 2026లో జరిగే ఒలింపిక్ క్రీడల్లో పాల్గొని బంగారు పతకం సాధించడమే ప్రధాన లక్ష్యమని కీర్తన స్పష్టం చేసింది.

నకిలీ ఐఏఎస్ అధికారి అరెస్టు

వేలూరు: వేలూరు జిల్లాలోని సర్పంచులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, యూనియన్ చైర్మన్లకు చెన్నై సచివాలయం నుంచి ముఖ్యమంత్రి ప్రత్యేక విభాగం ఐఏఎస్ అధికారి శివకుమార్ మాట్లాడుతున్నట్లు తరచూ ఒక వ్యక్తి ఫోన్ కాల్ చేసేవారు. ఆ సమయంలో ప్రజా ప్రతినిధుల వద్ద ఆ వ్యక్తి మీపై ఒక ఫిర్యాదు వచ్చిందని, మీరు చెన్నై వచ్చి తనను సంప్రదించాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని బెదిరించే వాడు. దీనిపై కొందరు ప్రజా ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సెల్‌ఫోన్ నంబరు ఆధారంగా విచారణ జరిపారు. విచారణలో శివకుమార్ అనే వ్యక్తి చెన్నై సచివాలయంలో ఎవరూ లేదని తెలిసింది. డీఎంకే యూనియన్ కార్యదర్శి, కన్నియంబాడి యూనియన్ వైస్ చైర్మన్ గజేంద్రన్ నురెండు రోజుల క్రితం సెల్‌ఫోన్ ద్వారా చెన్నై రావాలని ఒక వ్యక్తి బెదిరించినట్లు తెలిసింది. గజేంద్రన్ వేలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ జరిపి ఆ సెల్‌ఫోన్ ఆధారంగా చెన్నైలో ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. అనంతరం ఆ నకిలీ అధికారి వద్ద విచారణ జరపగా చెన్నై విరుగంబాక్కంకు చెందిన సుభాష్(29) అని తెలిసింది. ఇతను నకిలీ సెల్‌ఫోన్ నంబరు ద్వారా పలువురి ప్రజా ప్రతినిధులను బెదిరించి నగదు కాజేసినట్లు తెలిసింది.

దరఖాస్తుల పంపిణీ ప్రారంభం



తిరుత్తణిలో దరఖాస్తుల శిబిరాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దారు మదన్



వేలూరు : దరఖాస్తుల కోసం బారులు తీరిన మహిళలు

తిరుత్తణి: డీఎంకే ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు మహిళలకు వెయ్యి ఆర్థిక సాయం పంపిణీ పథకం అమలుచేస్తోంది. ఈ క్రమంలో సోమవారం దరఖాస్తుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసింది. మహిళలు శిబిరాలకు ఉత్సాహంగా చేరుకుని దరఖాస్తులు అందజేశారు. సెప్టెంబర్ 4 వరకు కొనసాగనున్న శిబిరాల్లో మహిళలు పాల్గొని దరఖాస్తులు స్వీకరించి పూర్తిచేసి తమ పేర్లు బయోమెట్రిక్ పద్ధతిలో నమోదు చేసుకుంటున్నారు. తిరుత్తణి డాక్టర్ రాధాకృష్ణన్ ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాల కేంద్రంలో దరఖాస్తుల శిబిరాన్ని తహసీల్దారు మదన్ ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ అరుల్, నోడల్ ఆఫీసర్ శాంతి, ఆర్ఐ కమల్ తదితరుల సమక్షంలో మహిళా స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలు దరఖాస్తులను బయోమెట్రిక్ పద్ధతిలో నమోదు చేశారు. అమ్మయార్‌కుప్పం పంచాయతీ కార్యాలయంలో ప్రారంభమైన శిబిరాన్ని బీడీఓ వెంకటేశన్ ప్రారంభించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని రూ. వెయ్యి సాయం అందేందుకు దరఖాస్తులు అందజేశారు.

వేలూరులో..

వేలూరు: తమిళనాడు ప్రభుత్వం కలైంజర్ మహిళా హక్కు చట్టం పథకం కింద రూ.1000ను సెప్టెంబర్ 15వ తేదీ నుంచి ఇవ్వనుంది. ఈ పథకం కోసం దరఖాస్తు నమోదు ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుంది. మొదటి దశ సోమవారం నుంచి దరఖాస్తుల నమోదు పక్రియ ప్రారంభమై ఆగస్టు 4వ తేదీ వరకు కొనసాగనుంది. వేలూరు కార్పొరేషన్ పరిధిలో మొత్తం 68 రేషన్ దుకాణాలు, మున్సిపాలిటీల్లో 38 దుకాణాలు, పట్టణ ప్రాంతాల్లో 312 దుకాణాలు ఏర్పాటు చేసి దరఖాస్తులను అప్‌లోడ్ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ప్రజలు ఒకే సారి ఈ శిబిరాలకు రాకుండా ముందుస్తుగా టోకెన్లు మంజూరు చేసినప్పటికీ సోమవారం ఉదయం ఉన్న ఫళంగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. కొన్ని శిబిరాల వద్ద తోపులాట జరిగింది. వేలూరు శలవన్‌పేటలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరానికి మహిళలు అధిక సంఖ్యలో తరలి రావడంతో విషయం తెలుసుకున్న పోలీసులు రద్దీని సరి చేశారు. మహిళలను క్యూలైన్‌లో నిలబెట్టి ఒకరి తరువాత ఒకరిని పంపారు. దరఖాస్తుల అప్‌లోడ్ రెండో దశ ఆగస్టు 5వ తేది నుంచి ప్రారంభం కానుంది.

ప్రమాద పరిహారం రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంపు

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

కొరుక్కుపేట: వికలాంగుల సంక్షేమ బోర్డు ద్వారా చెల్లించే ప్రమాద పరిహారం మొత్తాన్ని రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంచుతున్నట్టు తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మహిళా శాఖ కార్యదర్శి ఈరా ఆనందకుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తమిళనాడు బోర్డ్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబుల్ట్ ద్వారా అందించే ప్రమాద ఉపశమనం, వైద్యం, విద్య, ఇతర సహాయాన్ని అదనంగా రూ.2 కోట్లతో నిధిని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. తమిళనాడులోని వికలాంగుల సంక్షేమ మండలిలో సుమారు 10.11 లక్షల మంది వికలాంగులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. వారికి ఏటా రూ.3 కోట్ల 29 లక్షల 62 వేల చొప్పున అందజేస్తున్నామని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ఈ పథకం ద్వారా స్కాలర్‌షిప్, వైద్య చికిత్స, విద్య తదితర సహాయకాలు అందిస్తున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం రూ.2 కోట్లు అదనంగా నిధులు కేటాయించి ఆర్డినెన్స్ జారీ చేయాలని కమిషనర్ ప్రభుత్వానికి విన్నవించారు. వికలాంగుల కమిషనర్ సిఫార్సులను ప్రభుత్వం పరిశీలించింది తమిళనాడులోని వికలాంగులకు సంక్షేమ బోర్డు అందించే ప్రమాద సహాయాన్ని పెంచడానికి ఆమోదించింది. 2023-2024 ఆర్థిక సంవత్సరం నుంచి విద్య, ఇతర స్కాలర్‌షిప్‌ల కోసం ప్రభుత్వం రూ.2 కోట్ల అదనపు ఆర్థిక నిధిని మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ప్రమాదంలో వికలాంగులు మరణిస్తే రూ.2 లక్షలు ఇవ్వనున్నారు. చేయి, కాలు పోగొట్టుకోవడం, రెండు కళ్లు పోతే రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు, వైద్య ఖర్చులు రూ.25 వేల నుంచి రూ.50 వేలు, ఆల్ఫా బెడ్ కొనుగోలు రూ.6 వేలు, స్కాలర్‌షిప్‌గా రూ.2 వేలు, రూ.3 వేలు, పోస్ట్ గ్రాడ్యుయేట్, లా, మెడికల్, ఒకేషనల్ ఎడ్యుకేషన్ కోర్సు వారికి రూ.5 వేలు అందించనున్నట్టు వెల్లడించారు.

హిందూ ఆచారాలను కాపాడాల్సిన బాధ్యత యువతదే



మహిళలకు చీరలు అందజేస్తున్న తమిళనాడు హిందూ ప్రజాపార్టీ అధ్యక్షుడు అర్జునన్ సంపత్

తిరువళ్లూరు: హిందువుల, ఆచారాలు, సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదేనని హిందూ ప్రజా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అర్జునన్ సంపత్ స్పష్టం చేశారు. తిరువళ్లూరు జిల్లా హిందూ ప్రజాపార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హిందువుల సనాతన ధర్మం పురాతనమైందన్నారు. ఆ ధర్మాన్ని కొందరు మతమార్పిడితో నాశనం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హిందువుల ఐక్యతతో వారి ప్రయత్నాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా హిందూ దేవాలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని కొందరు తమ స్వంత ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని వాపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల నుంచి వచ్చే ఆదాయాన్ని ఆలయాల అభివృద్ధితో పాటు హిందువులకు మాత్రమే ఉపయోగించాలని డిమాండ్ చేశారు. చర్చీలు, మసీదుల ద్వారా వచ్చే ఆదాయాన్ని సైతం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సూచించారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా కొందరు వ్యవహరిస్తున్నారని, వారికి త్వరలో బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పరమపదం సెంథిల్, మణి, సోమసుందరం, వేల్‌రాజ్, మణిగండన్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి అశ్వత్థామన్, పిఎంకే బాలయోగి, వెంకటేషన్ హాజరై ప్రసంగించారు. అనంతరం మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

మహిళను బెదిరించి రూ.26 లక్షలు మోసం చేసిన దుండగులు

కొరుక్కుపేట: అసభ్యకర ఫొటోలను ఆన్‌లైన్‌లో పెడతామని బెదిరించి తిరుపూర్‌కు చెందిన మహిళ నుంచి రూ.26 లక్షలు మోసం చేసిన దుండగుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. తిరుపూర్ జిల్లా పల్లడంకు చెందిన కార్తీక్ భార్య కవిత (పేరు మార్పు) ఆన్‌లైన్ ట్రేడింగ్ కంపెనీలో పనిచేస్తోంది. 8 నెలల క్రితం ఆమె సెల్ ఫోన్‌కు క్రెడిట్ ప్రాసెసింగ్ కంపెనీ నుంచి లింక్ వచ్చింది. ఆమె దానిపై క్లిక్ చేయగా తక్కువ వడ్డీకి రూ.5 వేలు రుణం పొందవచ్చని వచ్చింది. ఆమె రూ.5 వేలు రుణం తీసుకుంది. తర్వాత వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయగా అందులో కవితకు సంబంధించిన అసభ్యకరమైన ఫొటోలు ఉన్నాయి. అదనపు వడ్డీ చెల్లించాలని, లేని పక్షంలో ఫొటోలను వెబ్‌సైట్‌కి, బంధువుల వాట్సాప్ నంబర్‌కు పంపుతామని వారు బెదిరించారు. దీంతో ఆమె రూ.26 లక్షల వరకు చెల్లించింది. అయినా వారు ఆమెను వదలకపోవడంతో విషయాన్ని భర్త కార్తీక్‌కు చెప్పింది. అతను సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టి దుండగుల బ్యాంకు ఖాతాలు గుజరాత్, పశ్చిమ బెంగాల్, అస్సాం, న్యూఢిల్లీకి చెందినవిగా గుర్తించారు. వాటిని స్తంభింపజేశారు. ఉత్తరాది రాష్ట్ర గ్యాంగ్ ఈ మోసానికి పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై విచారణ చేపట్టారు.

చింత చెట్టును ఢీకొన్న కారు

- అత్త, కోడలు మృతి
- ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

వేలూరు: బంధువుల ఇంటిలో శుభకార్యానికి వెళ్లి వస్తుండగా కారు రోడ్డు పక్కనున్న చింత చెట్టును ఢీకొంది. దీంతో అత్త, కోడలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. రాణిపేట జిల్లా షోళింగర్‌కు చెందిన కుమరేశన్ రిటైర్డ్ ఆర్మీ సిపాయి. ఇతని తండ్రి తుకారామన్, తల్లి లలిత(75), బార్య శశికళ(34), ఇతని కుమార్తె మహంతి కలిసి ఆదివారం సాయంత్రం కాట్పాడిలోని బంధువుల ఇంటిలో శుభకార్యానికి వెళ్లారు. ఆదివారం రాత్రి షోళింగర్‌కు అదే కారులో బయలుదేరారు. కారును కుమరేశన్ నడుపుతున్నాడు. తిరువలం- పొన్నై రోడ్డులోని మేల్‌పాడి వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చింత చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కుమరేశన్ భార్య శశికళ, తల్లి లలిత అక్కడికక్కడే మృతి చెందారు. కుమరేశన్ తండ్రి తుకారామన్, కుమార్తె మహంతికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు వేలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మేల్‌పాడి పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రూ.24 కోట్ల మోసం కేసులో ఇద్దరి అరెస్టు



అరెస్టు అయిన వాసుదేవన్, సురేష్

కొరుక్కుపేట: కాంచీపురంలో రూ.లక్ష పెట్టుబడి పెడితే రూ.3 లక్షలు ఇస్తామని చెప్పి డబ్బు వసూలు చేసి రూ 24 కోట్లు మోసం చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. కాంచీపురం కలెక్టర్ కార్యాలయం సమీపంలోని బంగారు అమ్మన్ తోటమ్ వీధిలో గత ఏడాది ఏప్రిల్‌లో డేపేడే అనే ఆర్థిక సంస్థను ప్రారంభించారు. దీనిని వాసుదేవన్, సురేష్ నిర్వహించారు. రూ.లక్ష ఇన్వెస్ట్ చేసే వారికి 200 రోజుల పాటు రోజుకు రూ.1500, ఇన్వెస్టర్లను పరిచయం చేసే ఏజెంట్లకు రోజుకు రూ.500 ఇన్సెంటివ్, ఇన్వెస్టర్లను పరిచయం చేసిన వ్యక్తికి 2 గ్రాముల బంగారు నాణెం ఇస్తామని ప్రకటించారు. దీంతో పరిసర ప్రాంతాలకు చెందిన 500 కంటే ఎక్కువ మంది సుమారు రూ.24 కోట్లకు పైగా డిపాజిట్ చేశారు. మొదట్లో 6 నెలల వరకు ఇన్వెస్టర్లకు ప్రకటించిన విధంగా డబ్బులు ఇచ్చి ఆ తర్వాత ఇవ్వలేదు. ఈ సందర్భంలో కొన్ని నెలల క్రితం నిర్వాహకులు వాసుదేవన్, సురేష్ కార్యాలయం మూసేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. బాధితులు కాంచీపురం జిల్లా పోలీసు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మరికొందరు కాంచీపురం మెటీరియల్ క్రైం బ్రాంచ్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆర్థిక నేరగాళ్లపై కేసు నమోదు చేసి వాసుదేవన్, సురేశ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కృష్ణగిరిలో ఉన్న వాసుదేవన్‌ను ఆదివారం అరెస్టు చేశారు. సురేష్ తన స్వగ్రామమైన రాణిపేట్ లోని పనప్పక్కంకు వచ్చినప్పుడు పోలీసులు అరెస్టు చేశారు.

తిరుత్తణిలో న్యాయవాదుల ధర్నా



ధర్నా చేస్తున్న న్యాయవాదులు

తిరుత్తణి: న్యాయస్థానాల్లో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాల ఏర్పాటుకు హైకోర్టు అనుమతి ఆంక్షలకు నిరసనగా న్యాయవాదులు సోమవారం ధర్నా చేపట్టారు. తిరుత్తణి సంయుక్త న్యాయస్థానం న్యాయవాదులు 40 మంది కోర్టు ఆవరణ వెలుపల ధర్నాకు దిగారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగ రూపకర్త బీఆర్.అంబేడ్కర్ విగ్రహం, చిత్రపటాలను కోర్టుల్లో ఏర్పాటు చేయరాదని హైకోర్టు రిజిస్ట్రార్ జిల్లా న్యాయస్థానాలకు ఆదేశాలు జారీచేయడం తీవ్రంగా కలచివేసిందన్నారు. అంబేడ్కర్ విగ్రహం, చిత్రపటాలను కోర్టుల్లో ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించాలని, మణిపూర్‌లో అణగారిన వర్గాల మహిళలను నగ్నంగా ఊరేగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవడంలో విఫలమైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా న్యాయవాదులు ధర్నా చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సన్నద్ధం చేసింది. వర్షాకాలం నేపథ్యంలో ఏజెన్సీ తదితర ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేసింది. గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు, విద్యా సంస్థల్లో పిల్లలకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా తక్షణం వైద్య సేవలందించేలా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ ఆదేశాలిచ్చింది. కాగా, విశాఖలో రెండు రోజుల కిందట జరిగిన సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ప్రాజెక్ట్ అధికారుల(పీవో), మైదాన ప్రాంత జిల్లాల జాయింట్ కలెక్టర్లు, ఏజెన్సీ ప్రాంత తహసీల్దార్ల సమావేశంలోని అజెండాలోనూ సీజనల్ వ్యాధులను అరికట్టడమే ప్రధానాంశంగా చర్చించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, ముందు జాగ్రత్తలు, నివారణ చర్యలపై ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆదేశాలిచ్చారు.

పెరిగిన డ్రోన్ పైలెట్లు!

దేశంలో ఈ ఏడాది జూలై 1 నాటికి 5,072 మంది పైలెట్లు

427 మందితో ఏపీకి దేశంలోనే మూడో స్థానం.. 1,087 మందితో తమిళనాడు తొలి స్థానంలో..

సాక్షి, అమరావతి: ఏడాది వ్యవధిలోనే దేశంలో డ్రోన్ పైలెట్లు 1,365 శాతం మేర పెరిగారని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సోమవారం పార్లమెంట్‌లో వెల్లడించింది. సాధారణ సేవల నుంచి అత్యవసర సేవల వరకు అంతటా డ్రోన్ల వినియోగం పెరుగుతోందని పేర్కొంది. గత ఏడాది జూలై 1 నాటికి దేశవ్యాప్తంగా కేవలం 346 మంది సర్టిఫైడ్ డ్రోన్ పైలెట్లుండగా.. ఈ ఏడాది జూలై 1 నాటికి ఆ సంఖ్య 5,072కు పెరిగిందని ఆ శాఖ తెలిపింది. 427 మంది సర్టిఫైడ్ డ్రోన్ పైలెట్లతో ఆంధ్రప్రదేశ్ దేశంలో మూడో స్థానంలో ఉంది. అత్యధికంగా తమిళనాడులో ఉన్నారు. ఆ తరువాత స్థానంలో మహారాష్ట్ర ఉంది.



అనేక రంగాల్లో వినియోగం..

ఇక డ్రోన్స్ వినియోగం వ్యవసాయంతో పాటు వ్యాక్సిన్ డెలివరీ, నిఘా, శోధన, రక్షణ, రవాణా, మ్యాపింగ్ రంగాల్లో ఉందని ఆ మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశంలోని మారుమూల ప్రాంతాల్లో కూడా వీటిని ఉపయోగించనున్నట్లు పేర్కొంది. మరో వైపు.. డ్రోన్స్ రిమోట్ పైలెట్ శిక్షణ కోసం వివిధ రాష్ట్రాల్లో 60 సంస్థలకు అనుమతులు మంజూరు చేశారు. ఏపీ విషయానికొస్తే గుంటూరులో రెండు సంస్థలకు, హిందూపురంలో ఒక సంస్థకు కేంద్రం అనుమతించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రధానంగా వ్యవసాయ రంగంలో వీటి వినియోగాన్ని పెంచడం ద్వారా రైతులకు చేదోడు వాదోడుగా ఉండేందుకు చర్యలు చేపట్టింది. అలాగే, వచ్చే నెలలో 500 కిసాన్ డ్రోన్స్ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది.

రైతుల ఖర్చులు తగ్గించేందుకు..

డ్రోన్ రిమోట్ పైలెట్ల శిక్షణకు రైతులతో పాటు గ్రామాల్లోని నిరుద్యోగ యువతను రాష్ట్ర ప్రభుత్వం ఎంపికచేసి వారికి శిక్షణ ఇప్పిస్తోంది. మానవ శ్రమను తగ్గించడంతో పాటు, వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి.. ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడానికి వ్యవసాయ యాంత్రీకరణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా డ్రోన్‌ల వినియోగం పెంచడం ద్వారా పంటల అంచనా, భూ రికార్డుల డిజిటలైజేషన్, పురుగు మందులు, పోషకాలను పిచికారీ చేయడానికి ఉపయోగిస్తారు. తద్వారా రైతుల ఉత్పాదకత వ్యయం తగ్గి, ఆదాయం పెరుగుతుంది.

పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లోనే ప్రసవాలు జరగాలి

- హైరిస్క్ కేసులను మాత్రమే జిల్లా ఆస్పత్రులకు రిఫర్ చేయాలి
- అక్టోబర్ 2 నుంచి క్యాన్సర్ నిర్ధారణ టెస్టులకు ఏర్పాట్లు చేయండి
- అధికారులకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సాధ్యమైనంత వరకు ప్రసవాలన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల (సీహెచ్‌సీలు) లోనే జరగాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. హైరిస్క్ కేసులను మాత్రమే జిల్లా ఆస్పత్రులకు రిఫర్ చేయాలన్నారు. ఇందుకు సంబంధించి ఆయా ఆస్పత్రుల వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు లక్ష్యాలను నిర్దేశించి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖపై సోమవారం సీఎస్ గుంటూరు జిల్లా తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పథకంలో 3,257 ప్రొసీజర్లు ఉన్నాయని.. వాటిలో సింపుల్ ప్రొసీజర్లను ప్రభుత్వ ఆస్పత్రులకే పరిమితం చేయాలని ఆదేశించారు. వాటిలో ఆరోగ్యశ్రీ ప్రీ ఆథరైజేషన్లు పెరిగి.. ఎక్కువ కేసుల్లో వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ఒక్క కేసు కూడా ప్రీ ఆథరైజేషన్ స్థాయిలో తిరస్కరణకు గురికాకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇందుకు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), ఏపీ వైద్యవిధాన పరిషత్ హెచ్‌వోడీలు పూర్తి బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వ్యక్తిగత ఆరోగ్యం పట్ల ప్రజల్లో పూర్తి అవగాహన రావాలన్నారు. మాతా శిశు మరణాల సంఖ్య తగ్గాలని.. ఇందుకు అందరికీ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. తలసేమియా వ్యాధి నిర్ధారణకు పెద్ద ఎత్తున స్క్రీనింగ్ టెస్టులు చేపట్టాలని ఆదేశించారు. అక్టోబర్ 2 నుంచి క్యాన్సర్ వ్యాధి నిర్ధారణకు స్క్రీనింగ్ టెస్టులు చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సమీక్షకుముందు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు కార్యక్రమాలను వివరించారు.

పేదల ఎదుగుదలను తట్టుకోలేని టీడీపీ


వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి: పేదల జీవన ప్రమాణాలు పెరగడాన్ని టీడీపీ తట్టుకోలేకపోతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి విమర్శించారు. వారికి మేలు చేసే ప్రతిపథకానికి ఆటంకాలు కల్పించడమో, విమర్శలతో అసహనాన్ని ప్రదర్శించడమో చేస్తోందని ఆయన సోమవారం తాడేపల్లిలో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం జగన్ చేపట్టిన 30 లక్షల గృహాల నిర్మాణం పూర్తయితే పేదలంతా లక్షాధికారులవుతారని తెలిపారు. ఇది దేశంలోనే అతిపెద్ద హౌసింగ్ స్కీమ్‌గా రికార్డులకు ఎక్కుతుందని పేర్కొన్నారు. దీనికి టీడీపీ నేతలు అడుగడుగున అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలిపారు. ఈ ఇళ్లన్నీ పూర్తిచేసే వైఎస్సార్‌సీపీ ఎన్నికలకు వెళ్తుందని తెలిపారు. 'ఇలా మంచిచేసే ప్రభుత్వానికి మరింతమేలుచేసే అవకాశాన్ని ప్రజలు తప్పకుండా ఇస్తారు. రాష్ట్ర ప్రజలంతా మా నమ్మకం.. మా భవిష్యత్తు నువ్వే జగన్.. అంటూ గొంతెత్తి చాటుతున్నారు. పేదలకు సీఎం జగన్ వెంకటాయపాలెంలో ఇచ్చినస్థలం విలువ పదిలక్షల వరకు ఉంటుంది. ఇళ్ల నిర్మాణంతో కలిపితే 12 లక్షల నుంచి 15 లక్షల విలువైన ఆస్తి పేదలకు అందిస్తున్నాం. మా ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే 70వేల టిడ్కో ఇళ్లు పూర్తిచేసి అందించాం. వచ్చే నెలాఖరుకు లక్ష ఇళ్లు పూర్తవుతాయి..' అని ఆయన పేర్కొన్నారు.

రాజ్యసభ — **ఏపీ ఇన్ పార్లమెంట్**

పోలవరం తొలిదశ పూర్తికి రూ.12,911 కోట్లు

- ఆర్థిక శాఖ గ్రీన్‌సిగ్నల్.. కేబినెట్ ఆమోదమే తరువాయి
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు తొలిదశలో పనుల పూర్తికి అదనంగా రూ.12,911 కోట్లు విడుదల చేయడానికి ఆర్థికశాఖ అనుమతించిందని కేంద్ర జల శక్తిశాఖ సహాయమంత్రి బిశ్వేశ్వర్ తుడు చెప్పారు. అయితే.. పోలవరం నిధులకు సంబంధించి గతంలో తీసుకున్న నిర్ణయాన్ని సవరిస్తూ కేంద్ర మంత్రివర్గం తాజా ప్రతిపాదనలు ఆమోదించాల్సి ఉందని తెలిపారు. రాజ్యసభలో సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. పోలవరం ప్రాజెక్టు తొలిదశ కింద చేపట్టిన నిర్మాణాల్లో మిగిలిన పనులు పూర్తి చేసి 41.15 మీటర్ల వరకు నీటిని నిల్వచేసేందుకు రూ.10,911.15 కోట్లు, వరదల కారణంగా దెబ్బతిన్న నిర్మాణాల మరమ్మతుల కోసం మరో రూ.2 వేల కోట్ల విడుదలకు అభ్యంతరం లేదని ఆర్థికశాఖలోని వ్యయ విభాగం తెలిపిందని చెప్పారు. పోలవరం తొలిదశ నిర్మాణంలో మిగిలిన పనులు పూర్తి చేయడానికి సవరించిన అంచనాల ప్రకారం రూ.17,144 కోట్లు అవసరమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదనలు సమర్పించిందని తెలిపారు. వీటిని త్వరితగతిన పరిశీలించి ప్రభుత్వ ఆమోదం పొందేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ ప్రక్రియ నిర్దిష్ట కాలపరిమితిలోగా పూర్తిచేయాలని కోరడం సబబు కాదన్నారు. పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయానికి సంబంధించి గత ఏడాది మార్చి 15న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సమర్పించిందని తెలిపారు. తక్షణం రూ.10 వేల కోట్లు విడుదల చేయాలని కోరుతూ ఏపీ ముఖ్యమంత్రి గత ఏడాది జూలై 15న రాసిన లేఖను కూడా ఆర్థికశాఖ వ్యయ విభాగం పరిగణనలోకి తీసుకుందన్నారు. ఆ తర్వాతే మొత్తం రూ.12,911 కోట్ల విడుదలకు ఆమోదం తెలిపిందని కేంద్రమంత్రి చెప్పారు.

విజయవాడ, తిరుపతి ఎయిర్‌పోర్టుల్లో కార్గో ఆపరేషన్ల నిలిపివేత

విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల్లో డొమెస్టిక్ ఎయిర్ కార్గో కార్యకలాపాలను నిలిపేసినట్లు పౌరవిమానయాన శాఖ సహాయమంత్రి వి.కె.సింగ్ తెలిపారు. విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ కార్గో రెగ్యులేటెడ్ ఏజెంట్ అభ్యర్థన మేరకు అవుట్ బౌండ్ డొమెస్టిక్ ఎయిర్ కార్గో కార్యకలాపాలను నిలిపేసినట్లు చెప్పారు. అన్ని ఎయిర్‌పోర్టుల్లో కామన్ యూజర్ డొమెస్టిక్ ఎయిర్ కార్గో టెర్మినల్ (సీయూడీసీటీ) కార్యకలాపాలను నిలిపేయాలని బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) తీసుకున్న నిర్ణయం కారణంగా విజయవాడ విమానాశ్రయంలో సైతం డొమెస్టిక్ ఎయిర్ కార్గో కార్యకలాపాలను నిలిపేసినట్లు వివరించారు.

పురోగతిలో భోగాపురం పనులు

గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుల్లో భాగంగా నిర్మిస్తున్న భోగాపురం విమానాశ్రయం పనులు పురోగతిలో ఉన్నాయని పౌరవిమానయాన శాఖ సహాయమంత్రి వి.కె.సింగ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు జవాబిచ్చారు.

ఏపీలో 203 స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులు పూర్తి



ఏపీలో స్మార్ట్ సిటీస్‌లో భాగంగా 203 ప్రాజెక్టులు పూర్తవగా 76 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాలశాఖ సహాయమంత్రి కౌశల్ కిషోర్ తెలిపారు. ఈ ప్రాజెక్టులకు అమరావతికి రూ.1,016 కోట్లు, కాకినాడకు రూ.978 కోట్లు, తిరుపతికి రూ.578 కోట్లు, విశాఖపట్నానికి రూ.966 కోట్లు విడుదల చేసినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఒంగోలులో అమృత్ పనులు

అమృత్ పథకంలో భాగంగా ఒంగోలులో మూడు మంచి నీటి పంపిణీ, రెండు మురుగు నిర్వహణ, మూడు పార్కుల అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టినట్లు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాలశాఖ సహాయమంత్రి కౌశల్ కిషోర్.. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మరో ప్రశ్నకు జవాబిచ్చారు.

ఏపీలో మూడేళ్లలో 4,22,355 ఇళ్లు పూర్తి

ఆంధ్రప్రదేశ్‌లో మూడేళ్లలో 4,22,355 ఇళ్లు పూర్తయ్యాయని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాలశాఖ సహాయమంత్రి కౌశల్ కిషోర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. ఆంధ్రప్రదేశ్ 37 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తితో నాలుగో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.

లోక్‌సభ

ఏపీలో సీఎస్ఆర్ వ్యయం



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద సంస్థలు వ్యయం చేస్తున్నాయని కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలశాఖ సహాయమంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. లోక్‌సభలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు చంద్రశేఖర్ బెల్లాన, మద్దిళ్ల గురుమూర్తి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, గొడ్డేటి మాధవి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. సంస్థలు 2017–18లో రూ.575.07 కోట్లు, 2018–19లో రూ.665.97 కోట్లు, 2019–20లో రూ.710.23 కోట్లు, 2020–21లో రూ.719.81 కోట్లు, 2021–22లో రూ.640.70 కోట్లు వ్యయం చేశాయని వివరించారు.

ఈఏసీకి సమాచారం ఇవ్వాల్సి ఉంది

రాయలసీమ ఎత్తిపోతల పథకానికి సంబంధించి పర్యావరణశాఖ నిపుణుల అప్రైజల్ కమిటీ (ఈఏసీ) కోరిన సమాచారం ఏపీ ప్రభుత్వం ఇవ్వాల్సి ఉందని కేంద్ర అటవీ, పర్యావరణశాఖ సహాయమంత్రి అశ్వినీకుమార్ చౌబే తెలిపారు. పర్యావరణ మదింపు అంచనా నోటిఫికేషన్ 2006 నిబంధనల ప్రకారం రాయలసీమ ఎత్తిపోతల పథకం చేర్చడానికి ప్రస్తుత పర్యావరణ అనుమతులకు సవరణ కోరుతూ ఏపీ ప్రభుత్వం2021 జూన్ 8న లేఖ రాసినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీలు మద్దిళ్ల గురుమూర్తి, పోచ బ్రహ్మానందరెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు. అనంతరం నిపుణుల అప్రైజల్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని సమాచారం కోరిందన్నారు.

మ్యూజియంల అభివృద్ధి

ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా మ్యూజియాల అభివృద్ధి, ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు మార్గాని భరత్‌రామ్, మద్దిళ్ల గురుమూర్తి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. మ్యూజియం గ్రాంట్ స్కీంలో భాగంగా మూడింటిని అభివృద్ధి/ఆధునీకీకరణ చేశామని, రెండింటిని ఏర్పాటు చేశామని చెప్పారు. స్కీం ఫర్ ప్రమోషన్ ఆఫ్ కల్చర్ ఆఫ్ సైన్సెస్‌లో భాగంగా ఒకటి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమరావతి, చంద్రగిరి, నాగార్జునకొండల్లోని పురావస్తుశాఖ మ్యూజియాలకు కొత్తరూపు తీసుకొస్తున్నట్లు చెప్పారు.

ఈ-క్రాప్.. రైతు సేవలో టాప్

ఖరీఫ్ పంట వివరాలు నమోదు ప్రారంభం

సాక్షి, భీమవరం: అన్నదాత సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం రైతుల మేలు కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది. వ్యవసాయం దండగంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులను తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురిచేయగా నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంలో తీసుకువచ్చిన అనేక వినూత్న పథకాల ద్వారా వ్యవసాయాన్ని పండుగ చేసి చూపించారు. ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాల్లో ఈ-క్రాప్ ఒకటి. దీనిలో రైతులు తమ వివరాలను నమోదు చేయించుకోవడం ద్వారా ప్రభుత్వం అనేక ప్రయోజనాలను కల్పిస్తోంది. తక్కువ ధరకే మేలైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడమేగాక వ్యవసాయ యంత్ర పరికరాలను పెద్ద మొత్తంలో సబ్సిడీపై అందిస్తోంది. ఈ-క్రాప్‌లో నమోదు ద్వారా వెబ్‌ల్యాండ్‌లో పొందుపర్చిన పంటల ఆధారంగా రాష్ట్రంలో ఏ పంట ఎంత విస్తీర్ణంలో పండిస్తున్నారు, ఎంత దిగుబడి వస్తుందనే అంచనా వేసి దానికి అనుగుణంగా మార్కెట్ సదుపాయం కల్పించేందుకు అవకాశం కలగనుంది.

ప్రయోజనాలివే..

ఈ-క్రాప్ నమోదు వల్ల రైతులకు అనేక ప్రయోజనాలున్నాయి. జిల్లాలో దాదాపు 2.19 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, 1,17,168 మంది రైతులు, దాదాపు 63 వేల మంది వరకు కౌలు రైతులున్నారు. వీరిలో 58 వేల మందికి ఇప్పటికే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించారు. ఈ-క్రాప్ ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే ఉచిత పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీ రాయితీ వంటివి పొందవచ్చు. అలాగే పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చు. ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీరాయితీ, పంట పెట్టుబడి సహాయం వంటివి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి. అంతేకాక అర్హులైన రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేరుతుంది.

నమోదు ఇలా..

వరిసాగు చేసే రైతులు సార్వా, దాళ్వా సీజన్‌లో గ్రామాల వారీగా ఆర్‌బీకే అసిస్టెంట్స్, వీఆర్వోలు రైతు వరినాట్లు వేసిన తరువాత వారు సాగుచేసిన పొలం వద్దనే ఆ రైతు ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో నాట్లు వేశారు, ఏ రకం వరి వంగడాలను సాగుచేశారనే వివరాలను నమోదు చేస్తారు. పొలం వద్దనే రైతు ఫొటోతో సహా వెబ్‌ల్యాండ్‌లో పొందుపరుస్తారు. ఆర్‌బీకే అసిస్టెంట్స్, వీఆర్వోలు నమోదు చేసిన ఈ వివరాలను మండల స్థాయిలో తహసీల్దార్, మండల వ్యవసాయ శాఖాధికారి, జిల్లా స్థాయిలో కలెక్టర్, జిల్లా వ్యవసాయశాఖాధికారి పరిశీలించి తుది జాబితాలను ఆర్బీకేల వద్ద ప్రదర్శిస్తారు. తరువాత ఏమైనా అభ్యంతరాలుంటే సరిచేస్తారు.

మంచి ఆదాయం వస్తోంది



ఈ ఫొటోలోని మహిళ పేరు జుబేదాబీ. కల్లూరు మండలం తడకనపల్లి వాసి. వెజిటబుల్ సోలార్ డ్రైయర్ ప్లాంటు తీసుకున్నారు. రోజూ రెండు క్వింటాళ్ల ఉల్లి ప్రాసెస్ చేస్తున్నారు. కిలోకు రూ.2.50 చొప్పున రోజుకు రూ.500, కరెంటు చార్జీల పేరుతో బస్తాకు రూ.20 చొప్పున మరో రూ.80 ఇస్తారు. ఇలా నెలకు రూ.17,400 వస్తోంది. టమాటాను ఫ్లేక్స్ చేస్తే మరింత వస్తుంది. అంటే ఏడాదికి రూ.2.8 లక్షలు సంపాదిస్తోంది.

రూపాయి పెట్టుబడి లేకుండా ఆదాయం

ఈమె పేరు సుబాన్‌బీ. కోడుమూరు నియోజకవర్గం గూడూరు వాసి. పొదుపు మహిళ. అధికారులు సోలార్ డ్రైయర్స్ గురించి చెప్పి తడకనపల్లిలో ఏర్పాటుచేసిన ప్లాంటు చూపించారు. వీటిని అధ్యయనం చేసిన ఆమె గత నెల 22న ప్లాంటు ఏర్పాటు చేసింది. ఎస్4ఎస్ కంపెనీ ప్రతినిధులు ఉల్లి సరఫరా చేస్తున్నారు. రోజూ రెండు క్వింటాళ్లు వస్తోంది. ప్లాంటు ఏర్పాటుకు రూ.10వేలు మాత్రమే చెల్లించారు. మిగతా మొత్తం బ్యాంకు రుణం. ఉల్లి, టమాటా కొనుగోలుకు రూపాయి పెట్టుబడి అవసరంలేదు. కంపెనీనే ఇస్తోంది. వారే ఉత్పత్తులు సేకరిస్తారు. మంచి ఆదాయం ఉంది.



పొదుపు మహిళ ఇంట.. సిరుల పంట

కర్నూలు జిల్లాలో సోలార్ డ్రైయర్స్‌తో ఉపాధి

మహారాష్ట్ర తర్వాత కర్నూలులోనే వీటి ఏర్పాటు

ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న ఎస్4ఎస్ కంపెనీ


- ఉల్లి, టమాటాను డ్రై చేసి బహుళజాతి కంపెనీలకు ఎగుమతులు
- సగటున ఒక్కో మహిళకు కనిష్టంగా రూ.20వేల ఆదాయం
- వంద యూనిట్లు ఏర్పాటు.. మూణ్నెల్లలో 5వేల యూనిట్ల ఏర్పాటు లక్ష్యం
- ఈ ఏడాది ముగిసేలోపు 10వేల యూనిట్లు లక్ష్యం
- ధరలు పతనమైతే ఉల్లి, టమాటా రైతులు ఆందోళన పడాల్సిన అవసరంలేదు

రాష్ట్రంలో అత్యధికంగా ఉల్లి పండించే జిల్లా కర్నూలు. రాష్ట్రానికి 90 శాతం ఈ పంట కర్నూలు జిల్లా నుంచే సరఫరా అవుతుంది. ధరల్లో ఆటుపోట్లు వచ్చినపుడు రైతులకు నష్టం వాటిల్లకుండా 'సోలార్ డ్రైయర్స్' తోడ్పాటునందిస్తాయి. మామూలు సమయంలో కూడా ఇవి రైతుకు, మహిళలకు ఆర్థికదన్ను ఇస్తున్నాయి. దేశంలో తొలిసారి మహారాష్ట్రలో ఏర్పాటుచేసిన వీటిని రాష్ట్రంలో ఏర్పాటుచేసి రైతుల కన్నీటిని తుడవాలని, మహిళలకు ఆర్థిక చేయూతనివ్వాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. గతనెల జూన్ 1న ఆయన పత్తికొండకు విచ్చేసినపుడు వీలైనన్ని గ్రామాల్లో ప్లాంట్లు ఏర్పాటుచేయాలని కలెక్టర్ సృజనను ఆయన ఆదేశించారు. సీఎం చెప్పిన వెంటనే జూన్‌లోనే ప్రయోగాత్మకంగా వంద యూనిట్లు ఏర్పాటుచేశారు. వీటి ఫలితాలు సంతృప్తికరంగా ఉండటంతో పాటు ఆర్థికంగా దోహదం చేయడంతో మూణ్నెల్లలో ఐదువేల ప్లాంట్లు, డిసెంబర్‌లోపు జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా ఉల్లిసాగు అధికంగా ఉన్న గ్రామాల్లో 10వేల ప్లాంట్లు ఏర్పాటుచేయాలని కలెక్టర్ సృజన లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

- సాక్షి ప్రతినిధి కర్నూలు

సబ్సిడీతో 'సోలార్ డ్రైయర్స్'..

పీఎంఎఫ్‌ఎంఈ (ప్రధానమంత్రి ఫార్మలేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజ్ స్కీం), ఏపీఎఫ్‌పీఎస్ (ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ) కలిసి 'సోలార్ డ్రైయర్స్'ను ఏర్పాటుచేస్తున్నారు. దేశంలో మహారాష్ట్రలో మాత్రమే ఈ ప్లాంట్లు ఉన్నాయి. రెండో రాష్ట్రం ఏపీ మాత్రమే. ఈ ప్లాంటు యూనిట్ ఖర్చు రూ.లక్ష. ఇందులో రూ.10వేలు లబ్ధిదారులు చెల్లించాలి. రూ.90వేలు బ్యాంకు రుణం ఇస్తుంది. ఇందులో రూ.35వేలు సబ్సిడీ ఉంటుంది. అంటే ప్లాంటు ఖర్చు కేవలం రూ.65వేలే. సోలార్ డ్రైయర్స్‌తో ఉల్లి, టమాటా ఫ్లేక్స్ చేయొచ్చు. ఇక ప్రస్తుతం ఉల్లిని మహారాష్ట్రకు చెందిన ఎస్4ఎస్ అనే కంపెనీ మహిళలకు సరఫరా చేస్తోంది. తక్కువ ధరకు దొరికే గ్రేడ్-3ని ఉల్లి దీనికి వినియోగిస్తున్నారు. ఉల్లిని శుభ్రంచేసి కటింగ్ మిషన్‌లో వేస్తారు. స్లైస్‌లా పల్చగా కట్ అవుతాయి. 50 కేజీల బస్తా 20 నిమిషాల్లో కట్ అవుతుంది. ఆపై వీటిని ఎఫ్‌బీడీలో వేస్తారు. అందులోని ఫ్యాన్ల సాయంతో 6–8 గంటలు ఉండి 80 శాతం డ్రై అవుతాయి. ఆపై 4–6 గంటలు సోలార్ ప్యానెల్స్‌పై ఉంచుతారు. వందశాతం డ్రై అవుతాయి. వంద కేజీలు ప్రాసెస్ చేస్తే పది కిలోల స్లైస్ వస్తాయి. వీటిని ఎస్4ఎస్ సంస్థే కొనుగోలు చేస్తుంది. వీటి నిల్వకు ప్లాంటు ఉన్న ప్రతీ గ్రామంలో చిన్న గోడౌన్ ఏర్పాటు చేశారు. రవాణా, ఇతర ఖర్చులు కంపెనీనే భరిస్తుంది. పది కిలోల స్లైస్‌ను గోరువెచ్చని నీటిలో వేస్తే తిరిగి వంద కిలోల ఉల్లి ముక్కలు వస్తాయి. ఇవి మహారాష్ట్ర నుంచి అరబ్ దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతాయి.



కర్నూలు జిల్లా తడకనపల్లిలో సోలార్ డ్రైయర్ల ద్వారా ఉల్లి ఫ్లేక్స్ తయారీ

100 యూనిట్లతో సత్ఫలితాలు..

పాణ్యం నియోజకవర్గం తడకనపల్లిలో 70 యూనిట్లు, కోడుమూరు పరిధిలోని గూడూరులో 10, ఇతర ప్రాంతాల్లో మరో 20 ఏర్పాటుచేశారు. మూణ్నెల్లలో ఐదువేల యూనిట్లు ఏర్పాటు చేయనున్నాయి. దీనికి పొదుపు మహిళలను గుర్తించారు. ఉల్లి అధికంగా పండించే ప్రాంతాలైన పత్తికొండ, సి. బెళగల్, కోడుమూరు, కర్నూలు, గోనెగండ్ల, కోసిగి, దేవనకొండ, వెల్దుర్తి, మద్దికెర, ఆదోని ప్రాంతాలను ప్రాధాన్యతగా తీసుకున్నారు. ఉల్లి ధర తక్కువగా ఉన్నపుడు ప్రాసెస్ చేసి ఎగుమతి చేయొచ్చు. రైతు దగ్గర కంపెనీ ఉల్లి కొనుగోలు చేసి ప్లాంట్ల నిర్వాహకులకు ఇస్తుంది. కాబట్టి రైతుకు గిట్టుబాటు అవుతుంది. సోలార్ డ్రైయర్స్ ఏర్పాటుతో ఉల్లి అవసరం కూడా పెరుగుతుంది. దీంతో ధర కూడా నిలకడగానే ఉంటుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా 35వేల హెక్టార్లలో ఉల్లి సాగవుతోంది. హెక్టార్‌కు 60 క్వింటాళ్ల చొప్పున 21లక్షల క్వింటాళ్ల ఉత్పత్తి వస్తుంది. ఈ క్రమంలో.. ఈ ఏడాది ఉల్లి, టమాటా సాగు మరింత పెంచాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ధర, నాణ్యత తక్కువగా ఉన్నా పారబోసే అవసరంలేకుండా 'సోలార్ డ్రైయర్స్'కు వినియోగిస్తారు. ఆదాయం కూడా ఎక్కువగా ఉండటంతో ప్లాంట్ల ఏర్పాటును ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తోంది.

పదెకరాల రైతు ఆదాయం కంటే ఎక్కువ ఆదాయం..

- రోజూ ఒక ప్లాంటు ద్వారా ఒకరు మూడు క్వింటాళ్లు ప్రాసెస్ చేయొచ్చు. అంటే రోజూ రూ.750 వస్తుంది.
- 50కిలోల బస్తాకు రూ.20 చొప్పున కరెంటు చార్జీలు చెల్లిస్తారు. ఇది మరో రూ.120 వస్తుంది.
- అంటే నెలకు రూ.26,100 సంపాదించొచ్చు.
- ఏడాదికి రూ.3,13,200 ఆదాయం వస్తుంది.
- ఈ ఆదాయం పదెకరాల రైతు ఆదాయం కంటే ఎక్కువే.
- వర్షాలు నిలిచాక రోజూ మూడు క్వింటాళ్లు ప్రాసెస్ చేస్తారు.
- జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ వర్షాకాలం. ఈ సీజన్‌లో రోజుకు రెండు క్వింటాళ్లు చేసుకుంటున్నారు.

రూ.18 వేలు ఆదాయం వస్తోంది



నా పేరు హజరాబీ. సోలార్ డ్రైయర్ ఏర్పాటు చేసి ప్రాసెస్ చేస్తున్నా. నెలకు రూ.18వేల ఆదాయం వస్తోంది. ఎస్4ఎస్ కంపెనీ వారు ఉల్లి, టమాటా బస్తాలు మాకు ఇస్తున్నారు. మేం ప్రాసెస్ చేసి తిరిగి వారికి ఇస్తున్నాం. సులభంగా ఫ్లేక్స్ తయారు చేయొచ్చు. పని తక్కువ.. ఆదాయం ఎక్కువ. ప్రస్తుతం రోజూ నాలుగు బస్తాలు (రెండు క్వింటాళ్లు) చేస్తున్నా. వర్షాలు తగ్గితే ఆరు బస్తాలు చేయొచ్చు. నెలకు రూ.18 వేలు చొప్పున ఏడాదికి రూ.2.16 లక్షల ఆదాయం వస్తాది. పదెకరాల రైతులకు కూడా ఈ ఆదాయం రాదు. మాకు చాలా సంతోషంగా ఉంది.

మరిన్ని యూనిట్లు ఏర్పాటుచేస్తాం..



సీఎం చెప్పిన వెంటనే వంద యూనిట్లు ఏర్పాటుచేశాం. మంచి ఫలితాలొచ్చాయి. ఆదాయం బాగుంది. దీంతో పొదుపు మహిళలను ప్రోత్సహించాం. ప్లాంట్లను వీరికి చూపిస్తున్నాం. వీటిపై అవగాహన వచ్చిన తర్వాత వాళ్లు ప్లాంటు ఏర్పాట్లు చేస్తారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో మూణ్నెల్లలో ఐదువేల యూనిట్లు, డిసెంబర్‌లోపు 10వేల యూనిట్లు ఏర్పాటుచేయడమే లక్ష్యం. ప్లాంటు ఖర్చులో 35శాతం సబ్సిడీ ఇస్తున్నాం. దీంతో ఆర్థికంగా కూడా మహిళలపై భారం ఉండదు. కర్నూలు జిల్లాలో ఇది మంచి పరిణామం. మ్యాగీ మసాల, ఇతర ఆహార ఉత్పత్తులు తయారుచేసే బహుళజాతి కంపెనీలను సంప్రదిస్తాం. మరిన్ని ఆహార ఉత్పత్తుల ప్లాంటు ఏర్పాటుచేస్తాం.

– డాక్టర్ జి. సృజన, కలెక్టర్, కర్నూలు

రికార్డు సృష్టించింది!

సాధించాలంటే కఠోర సాధన ఉండాలి. అంతకు మించిన అంకితభావం ఉండాలి. ఈ రెండూ ఉంటే రికార్డు సాధనకు వయసు అనేది ప్రధానం కాదని నిరూపించింది సృష్టి సుధీర్ జగ్‌తాప్. పదహారేళ్ల సృష్టి విరామం లేకుండా 127 గంటల సేపు నాట్యం చేసి లాంగెస్ట్ డాన్స్ మారథాన్ (ఇండివిడ్యుయల్ కేటగిరీ)లో గిన్నిస్ రికార్డు సాధించింది.



● నాట్యం చేస్తూ...



● రికార్డు అందుకుంటూ...

మహారాష్ట్రలోని లాతూర్‌కి చెందిన సృష్టి... లాతూర్‌లోని పోదార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతోంది. ఆమె అమ్మానాన్న సుధీర్, సంజీవని ఇద్దరూ టీచర్లు. వాళ్ల తాతగారు 'బాబన్ మనే' స్వయానా నాట్యగురువు. సృష్టికి చిన్నప్పటి నుంచి నాట్య సాధన అలవాటయింది. కానీ ఆమెకు రికార్డు కోసం నాట్యం చేయాలనే ఆకాంక్షకు కారణం బందనా నేపాల్. ఆమె 2018లో 126 గంటల సేపు నాట్యం చేసి లాంగెస్ట్ డాన్స్ మారథాన్‌లో గిన్నిస్ రికార్డు సాధించింది. అప్పుడు 'భారతీయ నాట్యరీతులు లెక్కలేనన్ని ఉన్నాయి. మన నాట్యరీతికి ఓ రికార్డు ఉంటే బావుణ్ను. ఆ రికార్డు ద్వారా ప్రపంచదేశాలకు మన శాస్త్రీయ నాట్యం గురించి తెలుస్తుంది'... అనే ఆలోచన సృష్టిలో రేకెత్తింది. ఆమె ఆలోచనకు తల్లిదండ్రులు, తాత అండగా నిలిచారు. గిన్నిస్ రికార్డు కోసం కథక్ నాట్య సాధన చేయాలనుకుంది. తాత పర్యవేక్షణలో 15 నెలల పాటు కఠోరసాధన చేసింది. ధ్యానంలో యోగనిద్ర కూడా సాధన చేయించారు బాబన్ మనే. రోజుకు నాలుగు గంటల సేపు ధ్యానం, మూడు గంటల సేపు వ్యాయామం, ఆరు గంటల సేపు నాట్యసాధన... ఇదీ రికార్డు కోసం ఆమె చేసిన దీక్ష.

గంటకు ఐదు నిమిషాల విరామం

సృష్టి 127 గంటల నాట్య ప్రదర్శన మే నెల 29వ తేదీన పోదార్ స్కూల్ వేదిక మీద మొదలైంది. నాట్యప్రదర్శన ఐదు రోజుల పాటు నిర్విరామంగా సాగింది. ఆహారం అందక దేహం నీరసించి, డీహైడ్రేషన్‌కు లోను కాకుండా ఉండడానికి గంటకోసారి ఐదు నిమిషాల సేపు విరామం తీసుకునేది. ఆ విరామంలో ఎనర్జీ డ్రింక్ తీసుకుంటూ తన నాట్యదీక్షను కొనసాగించింది. సృష్టి నాట్యం చేసినంత సేపూ ఆమె తల్లిదండ్రులు వేదిక పక్కనే ఉండి ఆమెకు కావలసినవి అందిస్తూ వచ్చారు. నాట్య ప్రదర్శనను వీక్షించిన గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి స్వప్నిల్ దంగారికర్ సర్టిఫికేట్ ప్రదానం చేస్తూ సృష్టిని ప్రశంసల్లో ముంచెత్తారు.


● జాతీయ పతాకంతో సృష్టి

''రికార్డు సాధనలో నా లక్ష్యం నెరవేరింది. ఐదు రోజుల ఐదు గంటల పాటు (విరామంతో కలిపి దాదాపు ఆరు రోజులు) సాగిన నాట్య ప్రదర్శన మధ్యలో అప్పుడప్పుడూ తల, శరీరం తూలిపోతున్న భావన కలిగాయి. నా లక్ష్యం 127 గంటలను పూర్తి చేయడం. లాంగెస్ట్ డాన్స్ మారథాన్‌లో ఇండియాకు రికార్డు సాధించడం. దేహం నిస్సత్తువతో ఇక చాలనే సంకేతాలు జారీ చేసినప్పుడు నా లక్ష్యాన్ని గుర్తు చేసుకుని క్షణాల్లో నన్ను నేను సంబాళించుకున్నాను. మానసికంగా స్థిరంగా ఉంటే దేహం కూడా సహకరిస్తుంది' అన్నది పదహారేళ్ల సృష్టి.


● అనుపమ, చారులత

ప్రకృతి మెచ్చిన పెళ్లి!

'ఆకాశం దిగివచ్చి మబ్బులతో వేయాలి మన పందిరి... ఊరంతా చెప్పుకునేలా జరగాలి పెళ్లంటే మరి!' అంటూ అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి నేటితరం పెళ్లిళ్లు. ఏమాత్రం పర్యావరణ స్పృహలేకుండా హంగు, ఆర్భాటాలు చేస్తూ తెగ గొప్పలు చెప్పేసుకుంటున్నారు. దీని వల్ల ప్రకృతమ్మ ఎంత తల్లడిల్లిపోతుందో కూడా పట్టడం లేదు. ఒకతల్లి మనసు మరో తల్లికే తెలుస్తుందేమో! అందుకే బెంగళూరుకు చెందిన ఇద్దరమ్మలు కలిసి తమ పిల్లల పెళ్లిని ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా ఎంతో ఘనంగా, ప్రకృతి మురిసేలా జరిపించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

బెంగళూరుకు చెందిన అనుపమ కుమారుడికి, చారులత కూతురుతో వివాహం నిశ్చయమైంది. రెండు కుటుంబాలకు అన్ని విషయాల్లో సఖ్యత కుదిరింది. కానీ 'పెళ్లిలో ప్లాస్టిక్‌ను అస్సలు వాడకూడదు' అని అనుపమ కండిషన్ పెట్టింది. ఇది చారులతకు నచ్చడంతో మరింత సంతోషంతో ఒప్పుకుని ''ఇద్దరం కలిసి ప్లాస్టిక్ రహిత పెళ్లి చేద్దాం వదినా!'' అని ఒక నిర్ణయానికి వచ్చారు.

తమ పిల్లల పెళ్లిని మూడురోజులపాటు అంగరంగా వైభవంగా ప్లాస్టిక్ లేకుండా జరిపేందుకు నామమాత్రపు పెళ్లిపత్రికలను కొట్టించారు. కొంత మందికి మాత్రమే ఆహ్వాన పత్రికలు ఇచ్చి, మిగతా వారిని నేరుగా పెళ్లికి పిలిచారు. పెళ్లికి పిలిచేటప్పుడే.. ''ఎవరూ బొకేలు, బహుమతులు వంటివి తీసుకు రావద్దు'' అని మనవి చేశారు.

అరిటాకులు.. స్టీల్ ప్లేట్లు... వచ్చిన వెయ్యిమంది అతిథులకు వడ్డించేందుకు అరటి ఆకులు, స్టీల్ ప్లేట్స్‌ను ఎంచుకున్నారు. ప్లాస్టిక్ కప్పులు, గ్లాసులు, ప్లేట్లు, వాటర్ బాటిల్స్ స్థానంలో స్టీల్ సామాన్లు వాడారు. తాజా పువ్వులు, లైట్లతో పెళ్లిమండపాన్ని అలంకరించారు.


● కొత్త జంటతో అనుపమ, చారులత దంపతులు

పంతొమ్మిదేళ్లనాటి పేపర్‌తో... అనుపమ కొడుకుకు 2004లో ఉపనయనం జరిగిన సందర్భంగా జరిపిన వేడుకలో బటర్‌పేపర్‌ను వాడారు. అప్పుడు మిగిలిన పేపర్ తో పెళ్లికి వచ్చిన అతిథులకు రిటన్ గిఫ్ట్స్ ఇచ్చారు. సహజసిద్ధ పద్ధతుల్లో రంగులద్దిన జాకెట్ ముక్కలు, కాగితం పొట్లాల్లో పసుపు, కుంకుమను పేరంటాళ్లకు పంచారు. పెళ్లిలో డెకరేషన్‌ల కోసం వాడిన తాజా పువ్వులను వేడుక ముగిసిన తరువాత ముంబైలోని సహజ రంగుల తయారీ స్టూడియోకి పంపించారు.


● స్టీలు ప్లేట్లు, గ్లాసులతో...

వెయ్యికేజీల వేస్ట్ నుంచి ... ప్లాస్టిక్ వాడక పోయినప్పటికీ, కొన్ని సహజసిద్ధ వ్యర్థాలు ఉత్పన్నమవుతాయి కాబట్టి వాటికోసం క్యాటరింగ్ సిబ్బంది తడి, పొడి చెత్తను విడివిడిగా డ్రమ్స్‌లో వేసేవాళ్లు. ఈ వ్యర్థాలను కోకోపీట్ నింపిన డ్రమ్స్‌లో వేసేది. కాగితాలను, పువ్వులను కలెక్షన్ సెంటర్‌కు పంపించారు. డ్రమ్‌లలో వేసిన వెయ్యి కేజీల వ్యర్థాల నుంచి మూడు వందల కేజీల సేంద్రియ ఎరువును తయారు చేశారు.

''పెళ్లిలో ప్లాస్టిక్ వాడకుండా చేయడం మాకు చాలెంజింగ్‌గా అనిపించినప్పటికీ ఇద్దరం కలిసి విజయవంతం చేశాం. మా అమ్మ, అమ్మమ్మల కాలంలో పెళ్లిళ్లకు ఇలానే స్టీల్ సామాన్లు వాడేవారు. మేము అలాగే మా పిల్లల పెళ్లి చేయాలనుకున్నాం. అందుకు అందరూ సహకరించడం సంతోషం'' అని అనుపమ, చారులతలు చెప్పుకొచ్చారు.

స్ఫూర్తి

రెయిన్‌బో

**తల్లిదండ్రులు చనిపోయారు.
బంధువులు దూరం జరిగారు.
తనకు తోడుగా ఎవరు ఉన్నా లేకపోయినా కన్నీళ్లు, కష్టాలు మాత్రం కచ్చితంగా ఉండేవి.
అయినా సరే ఆ చిన్నారి ఎప్పుడూ నిరాశపడలేదు.
చెత్త ఏరుకునే స్థాయి నుంచి ఢిల్లీలోని ప్రముఖ హోటల్‌లో చెఫ్ వరకు ఎదిగి,
కష్టాల చీకటిని ఛేదిస్తూ రెయిన్‌బోగా వెలిగి ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తోంది లిలిమా ఖాన్...**


● లిలిమా ఖాన్

ఢిల్లీ వసంత్‌కుంజ్‌లోని లె క్యాంటిన్ రెస్టారెంట్‌లో లిలిమాఖాన్ చెఫ్‌గా పనిచేస్తోంది. చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో అనాథగా మారింది. కడుపు నింపుకోవడం కోసం చెత్త ఏరింది. ఇటుకలు మోసింది. ఇండ్లలో పనిచేసింది... ఒకటా రెండా... పొట్టపోసుకోవడానికి ఎన్నెన్నో పనులు చేసింది.

డబ్బులు లేని సమయంలో ఆకలి తట్టుకోలేక చెత్తబుట్టల్లో నుంచి మెతుకులు ఏరుకుని తిన్న సందర్భాలూ ఉన్నాయి. ఆకలి తీర్చుకోవడం ఒక ఒక పనైతే పోకిరీలు, రౌడీల నుంచి తనను తాను రక్షించుకోవడం మరో పెద్ద పనిగా మారింది.

కష్టాల కత్తుల వంతెనపై నడుస్తున్న ఖాన్‌కు 'కిల్కరి రెయిన్‌బో హోమ్' రూపంలో దివ్యమైన దారి దొరికింది.

'ఇక్కడ నాకు ఆహారం, ప్రేమతో పాటు ఎన్నో దొరికాయి. అందులో చదువు ఒకటి' అంటుంది ఖాన్. కుటుంబంలేని తనకు 'రెయిన్‌బో' అనే స్వచ్ఛందసంస్థ పెద్ద కుటుంబమై ప్రేమను పంచింది. 'రెయిన్‌బో'లో ఖాన్‌కు ఇష్టమైన ప్రదేశం... వంటగది. వంటచేస్తున్న వాళ్లకు చిన్న చిన్న పనులలో సహాయపడేది. చదువు పూర్తయిన తరువాత 'రెయిన్‌బో' సహాయంతో ఖాన్ కుకింగ్‌లో అప్రెంటిస్‌షిప్ చేసింది.

శిక్షణ పూర్తయిన తరువాత ఢిల్లీలోని ఇటాలియన్ రెస్టారెంట్‌లో స్టాఫ్ కుక్‌గా ఖాన్‌కు అవకాశం వచ్చింది. ఆ తరువాత లె క్యాంటీన్‌లో చేరింది.

'ఇంత పెద్ద హోటల్‌లో నేను పనిచేయగలనా అని మొదట్లో భయపడ్డాను. కొన్ని రోజులకు ఆ భయం దూరమైంది' గతాన్ని గుర్తు తెచ్చుకుంటూ అంటుంది ఖాన్. 'స్త్రీలకు ప్రోత్సాహకరంగా ఉండని ఇండస్ట్రీని ఎందుకు ఎంచుకున్నారు' అనేది ఖాన్‌కు తరచుగా ఎదురయ్యే ప్రశ్న. 'చెఫ్ జూలియాకు ఇండస్ట్రీలో పెద్ద పేరు ఉంది. ఆమె నాకు ఆదర్శం. ప్రతిభ ఉంటే జెండర్ అనేది అడ్డంకి కాదు' అంటుంది ఖాన్.

ఖాన్ స్టోరీ ఎంతోమందిలో స్ఫూర్తి నింపింది.

ఒకరోజు హోటల్‌కు తనను కలవడానికి ఒక అమ్మాయి వచ్చింది. 'ఈ అమ్మాయికి నాతో పనేమిటి' అనుకుంది మనసులో. ఆ అమ్మాయి మాత్రం మనసు విప్పి మాట్లాడింది. 'పరీక్షలో ఫెయిల్ అయిన నాకు ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు వచ్చేవి. ఆ సమయంలో మీ గురించి చదివాను. నా సమస్య చాలా చిన్నదిగా అనిపించింది. ఎన్నో కష్టాలను తట్టుకొని మీరు సక్సెస్ అయ్యారు. మీ స్ఫూర్తితో నేను కూడా విజయం సాధించాలకుంటున్నాను' అని చెప్పింది. 'కష్టాలలో నలిగినా వెనకడుగు వేయకుండా సాధించిన విజయాలు మనకు మాత్రమే పరిమితం కావు. అవి పదిమందికీ స్ఫూర్తిని ఇచ్చి ముందుకు నడిపిస్తాయి అని నేను విన్న మాట ఆ సమయంలో గుర్తుకు వచ్చింది' అంటుంది లిలిమాఖాన్.



స్కాంపీ సాగుకు పునరుజ్జీవం!

- జన్యుపరంగా అభివృద్ధి చేసిన స్కాంపీ మంచినీటి రొయ్యల జాతిని దేశవ్యాప్తంగా విడుదల చేసిన 'సిఫా'
- ఏపీలో 5 హేచరీలకు సీడ్ ఉత్పత్తికి అనుమతి
- అనేక జిల్లాల్లో కార్పు చేపలతో కలిపి స్కాంపీ మిశ్రమ సాగు
- వ్యాధుల బాధ, పెరుగుదల సమస్యల్లేకపోవడంతో స్కాంపీ సాగుపై ఆక్వా రైతుల్లో పెరుగుతున్న ఆసక్తి

20 ఏళ్ల క్రితం ఆక్వా సాగును ఉర్రూతలూగించిన మంచినీటి స్కాంపీ రొయ్యలు (మాక్రోబ్రాచియం రోసెన్‌బర్గి) ఇప్పుడు తిరిగి అనేక ఇతర రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని అనేక జిల్లాల్లోని చేపల చెరువుల్లో సందడి చేస్తున్నాయి.

అప్పట్లో స్కాంపీ జాతి రొయ్యలు పెరుగుదల నెమ్మదించడం, పెరుగుదలలో ఆడ, మగ రొయ్యల మధ్య సారూప్యత కొరవడడం, ధర తగ్గటం, వ్యాధులు చుట్టుముట్టడం వంటి సమస్యల వల్ల సాగు క్రమంగా కనుమరుగైంది. అయితే, ప్రస్తుతం పరిస్థితులు మారాయని ఆక్వా వర్గాలు చెబుతున్నాయి.

ఉప్పునీటి రొయ్యల సాగులో సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో జన్యుపరంగా అభివృద్ధి చేసిన (జెనిటికల్లీ ఇంప్రూవ్‌డ్) స్కాంపీ రొయ్యల సాగు వైపు తిరిగి రైతులు దృష్టి సారిస్తుండటం విశేషం.



భువనేశ్వర్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్‌వాటర్ ఆక్వాకల్చర్(సిఫా) శాస్త్రవేత్తలు 10-12 ఏళ్లు కష్టపడి విస్తృత పరిశోధనల అనంతరం జన్యుపరంగా అభివృద్ధి చేసిన స్కాంపీ రొయ్యల తల్లి రొయ్యలను సీడ్ ఉత్పత్తి కోసం విడుదల చేసి, రైతులకు అందుబాటులోకి తెచ్చారు.

వేగంగా పెరగడం, నాలుగున్నర నెలల వరకు ఆడ, మగ రొయ్యల పెరుగుదల సమంగా ఉండటం వల్ల ఇప్పుడు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో రైతులు స్కాంపీ సాగుపై ఆసక్తి చూపుతున్నట్లు చెబుతున్నారు. సిఫా అభివృద్ధి చేసిన ఈ కొత్త రకం మంచినీటి రొయ్యలు జన్యుపరంగా మెరుగైన జాతికి చెందినవి. ఈ పురోగతి స్కాంపి ఉత్పాదకత మరియు లాభదాయకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించింది. స్కాంపీ సాగును పునరుజ్జీవింపజేయడంలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా కేంద్రం ప్రోత్సహిస్తోంది.

వేగంగా పెరిగే స్కాంపి జాతిని అభివృద్ధికి క్రమబద్ధమైన సెలక్టివ్ బ్రీడింగ్ ప్రోగ్రామ్‌ను మలేషియా కేంద్రంగా పనిచేసే వరల్డ్ ఫిష్ సంస్థతో కలిసి 2007లో సిఫా ప్రయత్నాలు ప్రారంభించింది. ఆ క్రమంలో అభివృద్ధి చేసిన స్కాంపీ జాతి పెంపకం కార్యక్రమం 14 తరాలకు విస్తరించింది. గుజరాత్, కేరళ, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని భౌగోళికంగా విభిన్న ప్రాంతాల నుంచి సేకరించిన స్కాంపి తల్లి రొయ్యలను ఉపయోగించి కొత్త జాతిని అభివృద్ధి చేశారు. కఠినమైన ఎంపిక ప్రోటోకాల్‌లు పాటించడం ద్వారా సిఫా–జిఐ స్కాంపీ అనే పేరుతో జన్యుపరంగా మెరుగైన, వేగంగా పెరిగే మంచినీటి రొయ్యల జాతిని అభివృద్ధి చేసింది. 2020లోనే జిఐ స్కాంపీ అధికారిక గుర్తింపును పొందటం ఆక్వాకల్చర్ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా చెబుతున్నారు.

మల్టిప్లైయర్ హేచరీల నెట్‌వర్క్‌కు మెరుగైన తల్లి రొయ్యలను సరఫరా చేయడం ద్వారా సీడ్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడానికి పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా రూ. 4 కోట్లను సిఫాకు అందించింది.

ఈలోగా, కార్పు చేపలతో కలిపి స్కాంపి రొయ్యల మిశ్రమ సాగును సిఫా ప్రోత్సహిస్తోంది. ఒడిషాలోని జాజ్‌పూర్ జిల్లాకు చెందిన బాటా కృష్ణ జెనా అనే రైతు స్కాంపీ సాగులో అసాధారణమైన ఫలితాలు పొందినట్లు సిఫా శాస్త్రవేత్తలు తెలిపారు. 'కేవలం ఏడు నెలల్లో హెక్టారుకు 950 కిలోల 'సిఫా–జిఐ స్కాంపి' రొయ్యలతో పాటు, 7,530 కిలోల కార్పు చేపల దిగుబడి సాధించటం గొప్ప విశేషం. చేపల పెంపకందారులకు ఈ వార్త మంచి అవకాశాలను అందిస్తుంద'ని 'సిఫా'లో స్కాంపి ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డా. బి.ఆర్. పిళ్లై వ్యాఖ్యానించారు.

దేశంలో స్కాంపి ఉత్పత్తి గత ఏడాది 8,303 నుంచి 21,317 టన్నులకు 2.5 రెట్లు పెరిగింది. దేశవ్యాప్తంగా జన్యుపరంగా అభివృద్ధి చేసిన వేగంగా పెరిగే స్కాంపీ రొయ్యల సాగు రానున్న రోజుల్లో వేగంగా విస్తరిస్తుందనడానికి ఇదొక ఉదాహరణ అని డా. పిళ్లై వ్యాఖ్యానించారు.

దేశవ్యాప్తంగా స్కాంపి సాగును విస్తృతం చేయడం కోసం సీడ్ ఉత్పత్తికి గాను ఐదు హేచరీలకు గత నవంబర్‌లోనే 'సిఫా' అనుమతి మంజూరు చేసింది. 2026 నాటికి 25,000 హెక్టార్లను స్కాంపి సాగు కిందకు తీసుకు రావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ క్రమంలో మరిన్ని హేచరీలకు సీడ్ ఉత్పత్తి అనుమతులు ఇవ్వనున్నామని 'సిఫా' సంచాలకులు డాక్టర్ పి.కె. సాహూ ప్రకటించారు.


● జన్యుపరంగా అభివృద్ధి చేసిన స్కాంపీ రొయ్య

ఎగుమతిదారులు ముందుకొస్తే స్కాంపీ సాగు పెరుగుతుంది

జన్యుపరంగా అభివృద్ధి చేసిన స్కాంపీ రొయ్యల సాగు గత ఏడాది నుంచి పునఃప్రారంభమైంది. ప్రస్తుతం వెయ్యి ఎకరాల్లో మంచినీటి కార్పు చేపలతో పాటు మిశ్రమ సాగు జరుగుతోంది. ఎకరానికి 6 వేల స్కాంపీ పిల్లలను చేప పిల్లలతో కలిపి వేస్తున్నారు. పెరుగుదల సంతృప్తికరంగా ఉందని రైతులు చెబుతున్నారు. 45 రోజుల నర్సరీ తర్వాత.. నాలుగున్నర నెలల నుంచి 150 రోజుల వరకు పెరుగుదలలో ఎటువంటి సమస్యలూ లేవు. ఆ తర్వాత నుంచి మగ రొయ్యల పెరుగుదల కొంచెం ఎక్కువగా ఉంటుంది. అది సహజమే. కొందరు రైతులు స్కాంపీని మాత్రమే ఎకరానికి 10 వేల నుంచి 15 వేల వరకు సీడ్ వేసి సాగు చేసే ప్రయత్నాలు ప్రారంభించారు. కొత్త రకం స్కాంపీ సాగులో సమస్యల్లేవు. రాష్ట్రంలో 5 హేచరీలు నాణ్యమైన సీడ్‌ను అందిస్తున్నాయి. కాబట్టి, ఎగుమతి దారులు ముందుకొస్తే ఆంధ్రప్రదేశ్‌లో కూడా స్కాంపీ రొయ్యల సాగు మరింత వేగంగా విస్తృతమయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

– డా. రమేశ్ రాథోడ్,
సీనియర్ శాస్త్రవేత్త, కేంద్రీయ మంచినీటి ఆక్వాకల్చర్ పరిశోధనా సంస్థ(సిఫా), ప్రాంతీయ కార్యాలయం, విజయ



సాగుబడి
పుష్యమి కార్తె : జూలై 20 నుంచి

- ఏపీ ప్రకృతి సేద్యంపై జిస్ట్ ఇంపాక్ట్, గ్లోబల్ అలియన్స్ ఫర్ ద ఫ్యూచర్ ఆఫ్ ఫుడ్ స్వచ్ఛంద సంస్థల అధ్యయన నివేదిక
- రసాయనిక సాగుతో పోల్చితే ప్రకృతి సేద్యంలో అనేక ప్రధాన పంటల్లో సగటున 11% పెరిగిన దిగుబడి
- కూలీల అవసరం 21% పెరిగినా.. ఎరువులు, పురుగుమందులు మానటంతో 44% తగ్గిన ఖర్చు
- 49% పెరిగిన రైతుల నికరాదాయం
- 26% తగ్గిన ఆరోగ్య సంబంధమైన ఖర్చు
- అనారోగ్యం వల్ల కోల్పోయే పనిదినాలు మూడో వంతు తగ్గాయి.

ఆర్థిక, ఆరోగ్య ప్రదాత ప్రకృతి సేద్యం!



ప్రకృతి వ్యవసాయంతో పంట దిగుబడులను పెరిగే జనానికి సరిపోయేంత సాధ్యమేనా? వంటి ప్రాథమిక ప్రశ్నలకు, అనుమానాలకు ఇప్పుడు పూర్తిగా కాలం చెల్లింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పోత్సాహంతో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 8 లక్షల మందికి పైగా రైతులు ఇటువంటి ప్రశ్నలన్నిటినీ తమ అనుభవాల ద్వారా పటాపంచలు చేశారు. దిగుబడులు సరే, ప్రకృతి సేద్యంలో శాస్త్రీయత ఎంత? అనే ప్రశ్నకు కూడా ఇటీవల విడుదలైన అంతర్జాతీయ స్థాయి అధ్యయన నివేదిక దీటుగా బదులిచ్చింది.

జిస్ట్ ఇంపాక్ట్, గ్లోబల్ అలియన్స్ ఫర్ ద ఫ్యూచర్ ఆఫ్ ఫుడ్ అనే స్వచ్ఛంద సంస్థలు ఏపీ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో 2020 నుంచి మూడేళ్లు లోతుగా అధ్యయనం చేసి, 'నాచురల్ ఫార్మింగ్ త్రో ఎ వైడ్ యాంగిల్ లెన్స్' పేరిట నివేదికను వెలువరించాయి. ఈ నివేదికను ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార–వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.)కి కూడా సమర్పించాయి.

హరిత విప్లవానికి ప్రతీకైన డెల్టా ప్రాంతంలోని పశ్చిమగోదావరి, నీటి ఎద్దడి ప్రాంతాలకు ప్రతీకైన అనంతపురం, కొండ ప్రాంత గిరిజన వ్యవసాయానికి ప్రతీకైన విజయనగరం జిల్లాల్లో 12 గ్రామాలను ఎంపిక చేసుకొని, ఆయా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం, రసాయనిక వ్యవసాయం చేసే రైతుల క్షేత్రాల్లో లోతుగా అధ్యయనం చేశాయి. ఖరీఫ్, రబీ పంటలు, దీర్ఘకాలిక పంటలతో పాటు పశువుల పెంపకానికి సంబంధించిన విషయాలను అధ్యయనం చేశాయి. దిగుడులు, ఖర్చులు, నికరాదాయంతో పాటు.. రసాయనిక పురుగుమందులు, ఎరువుల ప్రభావం రైతులు, గ్రామీణుల ఆరోగ్యంపై ఎలా ఉందన్న విషయాన్ని పరిశీలించిన తొలి అధ్యయనం కావటం మరో విశేషం. ప్రకృతికి సంబంధించిన అంశాలపై నోబెల్ ప్రైజ్‌గా భావించే టేలర్ పురస్కారం(2020) అందుకున్న ప్రముఖ పర్యావరణ ఆర్థికవేత్త పవన్ సుఖదేవ్ ఆధ్వర్యంలో ఈ అధ్యయనం జరగటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆ నివేదికలో ఏముందంటే..?


పవన్ సుఖదేవ్

ప్రకృతి సేద్యంతో 49% పెరిగిన నికరాదాయం

● రసాయనిక సేద్యం జరిగే పొలాల్లో ఒకటో రెండో పంటలు పండిస్తూ ఉంటే.. ప్రకృతి వ్యవసాయంలో సగటున 4 పంటలు పండిస్తున్నారు. ● వరి, మొక్కజొన్న, మినుము, రాగులు, కంది వంటి ప్రధాన పంటల దిగుబడి రసాయనిక వ్యవసాయంతో పోల్చితే ప్రకృతి వ్యవసాయంలో సగటున 11% పెరిగింది. ● ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో శ్రమ అవసరం రసాయనిక సేద్యంతో పోల్చితే సగటున 21% పెరిగింది. రైతు కుటుంబం, కూలీల శ్రమ మొత్తాన్నీ లెక్కగట్టారు. గోదావరి డెల్టాలో రసాయన వ్యవసాయంలో ఏడాదికి 313 గంటలు పని చేస్తే, ప్రకృతి సేద్యంలో ఇది 377 గంటలకు పెరిగింది. రాయలసీమలో 258 నుంచి 322 గంటలకు పెరిగింది. ఉత్తరాంధ్ర గిరిజన ప్రాంతాల్లో 234 నుంచి 268 గంటలకు పెరిగింది.

● అయితే, రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం మానెయ్యటంతో ఖర్చు సగటున 44% తగ్గింది. మొత్తంగా చూస్తే.. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లోని ప్రకృతి వ్యవసాయదారుల సగటు నికరాదాయం 49% పెరిగింది.

చిన్న రైతులే 'సామాజిక మూలధనం'

● ప్రకృతి సేద్య అనుభవాలను ఒకరితో మరొకరు పంచుకోవటం వల్ల మీకు తోడుగా మేం ఉన్నాం అన్న భావం విస్తరించింది. పరస్పర విశ్వాసం, మద్దతు, సాంఘిక సమన్వయం పెరిగాయి. అన్యోన్యతకు దారితీసింది. ● ఈ విధంగా రసాయనాల్లేని సాగు అనుభవాలను పంచుకోవడం ద్వారా సామాజిక మూలధనం గణనీయంగా పెరగడానికి మహిళా స్వయం సహాయక బృందాలు ప్రభావశీలంగా పనిచేస్తున్నాయి. ● ప్రకృతి వ్యవసాయానికి మళ్లటంలో, ఈ క్రమంలో ఒకరికి మరొకరు తోడుగా నిలబడటంలో పెద్ద రైతుల కంటే చిన్న కమతాల రైతులు ముందంజలో ఉన్నారు. సామాజిక మూలధనాన్ని పెంపొందిచటంలో చిన్న రైతుల పాత్ర చాలా ప్రధానమైనదని తేటతెల్లమైంది. మన రైతుల్లో 83% మంది చిన్న, సన్నకారు రైతులే.

మెరుగైన ఆరోగ్యం...

● రసాయనిక వ్యవసాయం చేసే రైతులు, ఆ పొలాల్లో పనిచేసే కూలీలు అనారోగ్యాల పాలవుతూ చాలా పని దినాలు కోల్పోతూ ఉంటారు. వీరితో పోల్చితే ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో పనిచేసే కూలీలు, రైతులు అనారోగ్యం వల్ల పనికి వెళ్లటం మానుకోవాల్సిన రోజులు మూడింట ఒక వంతు (33%) తగ్గినట్లు అధ్యయనంలో వెల్లడైంది. ● రసాయనిక పురుగుమందులు, ఎరువుల వాడే రైతులకు ఆరోగ్య ఖర్చులు ఎక్కువ. వారి జీవన నాణ్యత, పని సామర్థ్యం కూడా దెబ్బతింటుంది. సాధారణంగా ఇటువంటి ఆరోగ్యంపై దుష్ప్రభావం కలిగించే నష్టాన్ని లెక్కలోకి తీసుకోవటం లేదు. ● ప్రకృతి సేద్యం చేసే రైతుల ఆస్పత్రి ఖర్చులు 26% తగ్గినట్లు తేలింది. ● ప్రకృతి వ్యవసాయదారులు ఎక్కువ రకాల పంటలు పండించడమే కాదు ఎక్కువ రకాల ఆహారాన్ని తినగలుగుతున్నారు. పోషకాలతో కూడిన రకరకాల ఆహారం తినటం వల్ల వీరి ఆరోగ్యం కూడా మెరుగ్గా ఉంది.



జాతీయ ఫుట్‌బాల్ శిబిరానికి సౌమ్య గుగులోత్

పారిస్ ఒలింపిక్స్ రెండో రౌండ్ క్వాలిఫయింగ్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే భారత మహిళల జట్టును ఎంపిక చేసేందుకు 34 మంది క్రీడాకారిణులతో కూడిన జాబితాను ప్రకటించారు. ఈ జాబితాలో తెలంగాణ అమ్మాయి, నిజామాబాద్ జిల్లాకు చెందిన సౌమ్య గుగులోత్‌కు స్థానం లభించింది. సౌమ్య ఇప్పటికే భారత సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. తాష్కెంట్‌లో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత జట్టు అక్టోబర్ 26న జపాన్‌తో, అక్టోబర్ 29న వియత్నాంతో, నవంబర్ 1న ఉజ్బెకిస్తాన్‌తో ఆడుతుంది.

ఐటీఎఫ్ టోర్నీ విజేత కర్మన్‌కౌర్

భారత మహిళా టెన్నిస్ ప్లేయర్ కర్మన్‌కౌర్ థండి తన కెరీర్‌లో నాలుగో సింగిల్స్ టైటిల్‌ను సాధించింది. అమెరికాలోని ఈవాన్స్‌విల్లేలో జరిగిన ఐటీఎఫ్ డబ్ల్యూ60 టోర్నీలో కర్మన్‌కౌర్ చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో కర్మన్ 7–5, 4–6, 6–1తో యులియా స్టారోడట్సెవా (ఉక్రెయిన్)పై గెలిచింది. తాజా విజయంతో కర్మన్‌కౌర్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 51 స్థానాలు ఎగబాకి 210వ ర్యాంక్‌కు చేరుకుంది.



రూ. 2,716 కోట్లు!

ఎంబాపెకు 'అల్–హిలాల్' క్లబ్ ఆఫర్



సిడ్నీ: సమకాలీన ఫుట్‌బాల్‌లో అత్యుత్తమ ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్న కిలియాన్ ఎంబాపె కోసం సహజంగానే క్లబ్‌లు క్యూ కడతాయి. 2018 వరల్డ్‌కప్‌ను ఫ్రాన్స్ గెలవడంతో పాటు 2022లో తమ జట్టు ఫైనల్ చేరడంలో కూడా అతను కీలకపాత్ర పోషించాడు. ఈ క్రమంలో ఎంబాపెకు సౌదీ అరేబియా క్లబ్ అల్–హిలాల్ బంపర్ ఆఫర్ ఇచ్చింది. అతనితో ఒప్పందం కోసం 332 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 2 వేల 716 కోట్లు) ఇచ్చేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం ఎంబాపె పారిస్ సెయింట్ జెర్మయిన్ (పీఎస్‌జీ) టీమ్‌తో ఉన్నాడు. ఈ టీమ్‌తో అతను కాంట్రాక్ట్ పొడిగించుకునే అవకాశం కనిపించడం లేదు. ఇలాంటి నేపథ్యంలో అల్–హిలాల్ ముందుకు వచ్చింది. ప్రస్తుతం దీనిపై చర్చలు కొనసాగుతున్నాయి.

టాప్–100లోకి అనిరుధ్

న్యూఢిల్లీ: అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) డబుల్స్ ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ తన కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. సోమవారం విడుదల చేసిన ఈ ర్యాంకింగ్స్‌లో అనిరుధ్ తొమ్మిది స్థానాలు ఎగబాకి సరిగ్గా 100వ ర్యాంక్‌లో నిలిచాడు.



గతవారం అమెరికాలో జరిగిన 'హాల్ ఆఫ్ ఫేమ్' ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్)తో కలిసి ఆడిన అనిరుధ్ డబుల్స్‌లో సెమీఫైనల్ చేరుకోవడంతో అతని ర్యాంక్ మెరుగైంది. వెటరన్ రోహన్ బోపన్న ఒక స్థానం పడిపోయి ఎనిమిదో ర్యాంక్‌లో ఉండగా... యూకీ బాంబ్రీ నాలుగు స్థానాలు మెరుగుపర్చుకొని 60వ ర్యాంక్‌లో, సాకేత్ మైనేని నాలుగు స్థానాలు పురోగతి సాధించి 77వ ర్యాంక్‌లో నిలిచారు. జీవన్ నెడుంజెళియన్ 91వ ర్యాంక్‌లో, శ్రీరామ్ బాలాజీ 94వ ర్యాంక్‌లో ఉన్నారు. మరోవైపు సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో సుమిత్ నగాల్ ఏకంగా 53 స్థానాలు ఎగబాకి 178వ ర్యాంక్‌లో నిలిచాడు.

వదలని వాన... అందని విజయం



- భారత్, వెస్టిండీస్ రెండో టెస్టు 'డ్రా'
- చివరి రోజు సాధ్యం కాని ఆట
- సిరీస్ 1–0తో భారత్ సొంతం

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: భారత్ గెలుపు ఆశలపై వరుణదేవుడు నీళ్లు చల్లాడు! కచ్చితంగా గెలిచే అవకాశం ఉన్న మ్యాచ్ 'డ్రా' కావడంతో టీమిండియా వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో కీలక పాయింట్లు కోల్పోయింది. క్వీన్స్ పార్క్ ఓవల్‌లో భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన రెండో టెస్టులో వాన కారణంగా ఫలితం తేలకుండా పోయింది. భారీ వర్షంతో మ్యాచ్ చివరి రోజు సోమవారం ఒక్క బంతి కూడా సాధ్యం కాలేదు. పలుమార్లు వాన రావడం, తగ్గడం, మళ్లీ రావడం జరిగాయి. ఆట ఆరంభమవుతుందని అనిపించడం, పిచ్‌ను సిద్ధం చేసే ప్రయత్నం చేయడం, అంతలోనే చినుకులతో పరిస్థితి మారిపోవడం తరచుగా జరిగింది. చివరకు స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం గం. 2:50కు అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. తొలి టెస్టు గెలిచిన భారత్ సిరీస్‌ను 1–0తో సొంతం చేసుకుంది. గత మ్యాచ్‌లో 12 పాయింట్లు సాధించిన టీమిండియా ఖాతాలో ఈ 'డ్రా' కారణంగా 4 పాయింట్లే చేరాయి. అంతకు ముందు నాలుగో రోజు 365 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ ఆట ముగిసే సమయానికి తమ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 76 పరుగులు చేసింది. బ్రాత్‌వైట్ (28), చందర్‌పాల్ (24 నాటౌట్) ఫర్వాలేదనిపించారు. ఆఖరి రోజు ఆట సాగితే మిగిలిన ఎనిమిది వికెట్లు తీయడం భారత్‌కు కష్టం కాకపోయేది. కానీ వానతో లెక్క మారిపోయింది. నాలుగో రోజు చివరి సెషన్‌లో భారత్ దూకుడైన బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చింది. ఈ సెషన్‌లో ఆడిన 9 ఓవర్లలోనే టీమిండియా 63 పరుగులు చేసింది. రోచ్ ఓవర్లో ఇషాన్ 'సింగిల్ హ్యాండ్'తో వరుసగా రెండు భారీ సిక్సర్లు బాది 33 బంతుల్లోనే కెరీర్‌లో తొలి అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో బంతి తర్వాత భారత్ తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి విండీస్‌కు 365 పరుగుల లక్ష్యాన్ని విధించింది. భారీ ఛేదనలో విండీస్‌కు సరైన ఆరంభం లభించలేదు. బ్రాత్‌వైట్ పరుగులు జోడించేందుకు ప్రయత్నించగా, చందర్‌పాల్ పూర్తిగా డిఫెన్స్‌కే పరిమితమయ్యాడు. ఒకదశలో అతను 50 బంతుల్లో 3 పరుగులే చేశాడు. అశ్విన్ ఈ జోడీని విడదీసి భారత్‌కు తొలి వికెట్ అందించాడు. స్వీప్ చేయబోయిన బ్రాత్‌వైట్ ఫైన్‌లెగ్‌లో క్యాచ్ ఇచ్చాడు. అశ్విన్ తన తర్వాతి ఓవర్లోనే మెకెన్జీ (0)ని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. అయితే ఆ తర్వాత చందర్‌పాల్, బ్లాక్‌వుడ్ (20 నాటౌట్) వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడి రోజును ముగించారు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 438; **వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్:** 255; **భారత్ రెండో ఇన్నింగ్స్:** యశస్వి (సి) సిల్వ (బి) వారికాన్ 38; రోహిత్ (సి) జోసెఫ్ (బి) గాబ్రియెల్ 57; గిల్ (నాటౌట్) 29; ఇషాన్ కిషన్ (నాటౌట్) 52; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (24 ఓవర్లలో 2 వికెట్లకు) 181 డిక్లేర్డ్. వికెట్ల పతనం:** 1–98, 2–202. **బౌలింగ్:** రోచ్ 4–0–46–0, జోసెఫ్ 4–0–37–0, హోల్డర్ 4–0–26–0, గాబ్రియెల్ 6–0–33–1, వారికాన్ 6–0–36–1. **వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్:** బ్రాత్‌వైట్ (సి) ఉనాద్కట్ (బి) అశ్విన్ 28; చందర్‌పాల్ (నాటౌట్) 24; మెకెన్జీ (ఎల్బీ) (బి) అశ్విన్ 0; బ్లాక్‌వుడ్ (నాటౌట్) 20; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (32 ఓవర్లలో 2 వికెట్లకు) 76. వికెట్ల పతనం:** 1–38, 2–44. **బౌలింగ్:** సిరాజ్ 8–2–24–0, ముకేశ్ 5–4–5–0, ఉనాద్కట్ 3–2–1–0, అశ్విన్ 11–2–33–2, జడేజా 5–1–10–0.

పసిడి పతకాలతో ముగింపు

17 పతకాలతో భారత్‌కు రెండో స్థానం



కమల్‌జీత్

చాంగ్వాన్ (కొరియా): ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీలను భారత షూటర్లు పసిడి పతకాలతో ముగించారు. ఈ టోర్నీ చివరిరోజు సోమవారం భారత్‌కు మూడు స్వర్ణాలు, ఒక రజత పతకం లభించాయి. పురుషుల 50 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కమల్‌జీత్ 544 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణ పతకాన్ని సాధించాడు. కమల్‌జీత్, అంకిత్ తోమర్, నందీప్ బిష్ణోయ్‌లతో కూడిన భారత జట్టు 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో 1617 పాయింట్లతో పసిడి పతకాన్ని దక్కించుకుంది. మహిళల 50 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో టియానా 519 పాయింట్లతో రజత పతకాన్ని సొంతం చేసుకుంది. టియానా, యశిత షోకీన్, వీర్పాల్ కౌర్‌లతో కూడిన భారత జట్టు మహిళల 50 మీటర్ల పిస్టల్ టీమ్ విభాగంలో 1498 పాయింట్లతో బంగారు పతకాన్ని గెల్చుకుంది. ఈ మెగా ఈవెంట్‌లో భారత షూటర్లు ఓవరాల్‌గా ఆరు స్వర్ణాలు, ఆరు రజతాలు, ఐదు కాంస్య పతకాలతో కలిపి మొత్తం 17 పతకాలతో రెండో స్థానంలో నిలిచారు. 28 పతకాలతో చైనా టాప్ ర్యాంక్‌లో నిలిచింది.

భారత సాఫ్ట్‌బాల్ జట్టులో తెలంగాణ అమ్మాయి

ఆసియా క్రీడలకు మమత గుగులోత్ ఎంపిక



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక ఆసియా క్రీడల్లో అరంగేట్రం చేయనున్న సాఫ్ట్‌బాల్ క్రీడాంశంలో పాల్గొనే భారత మహిళల సాఫ్ట్‌బాల్ జట్టును సోమవారం ప్రకటించారు. 16 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో తెలంగాణ అమ్మాయి మమత గుగులోత్‌కు చోటు దక్కింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన మమత గత ఎనిమిదేళ్లుగా జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తోంది. అండర్–14, అండర్–17, అండర్–19 వయో విభాగాల్లో కలిపి మొత్తం 18 సార్లు జాతీయ పోటీల్లో పాల్గొన్న ఆమె పలుమార్లు 'ఉత్తమ క్యాచర్'గా అవార్డులు అందుకుందని తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి కె. శోభన్ బాబు తెలిపారు. నిజామాబాద్ సుద్దపల్లిలోని సాంఘిక సంక్షేమ స్పోర్ట్స్ అకాడమీలో నీరజ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తీసుకున్న మమత ప్రస్తుతం భువనగిరిలోని సోషల్ వెల్ఫేర్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ డిగ్రీ కాలేజీలో బీఏ రెండో సంవత్సరం చదువుతోంది. ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత జట్టు రెగ్యులర్ గా పోటీపడుతుండటంతో ఆసియా సాఫ్ట్‌బాల్ సంఘం భారత జట్టుకు వైల్డ్ కార్డు ఎంట్రీ కేటాయించింది. ఆసియా క్రీడలు సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8 వరకు చైనాలోని హాంగ్జౌలో జరుగుతాయి.

సౌత్ జోన్ శుభారంభం



విద్వత్ (5/17)

పుదుచ్చేరి: దేవధర్ ట్రోఫీ దేశవాళీ జోనల్ వన్డే క్రికెట్ టోర్నీలో సౌత్ జోన్ జట్టు శుభారంభం చేసింది. నార్త్ జోన్ జట్టుతో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో సౌత్ జోన్ వీజేడీ పద్ధతిలో 185 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ముందుగా సౌత్ జోన్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 303 పరుగులు చేసింది. రోహన్ కున్నుమ్మల్ (70; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), మయాంక్ అగర్వాల్ (64; 7 ఫోర్లు), జగదీశన్ (72; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. అనంతరం వర్షం కారణంగా నార్త్ జోన్ జట్టు విజయలక్ష్యాన్ని 28 ఓవర్లలో 246 పరుగులుగా నిర్ణయించారు. సౌత్ జట్టు పేసర్ విద్వత్ కావేరప్ప (5/17) ధాటికి నార్త్ జోన్ జట్టు 23 ఓవర్లలో 60 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది. ఇతర మ్యాచ్‌ల్లో ఈస్ట్ జోన్ ఆరు వికెట్లతో సెంట్రల్ జోన్‌పై, వెస్ట్ జోన్ తొమ్మిది వికెట్లతో నార్త్ ఈస్ట్ జోన్‌పై గెలిచాయి.

శ్రీలంక 166 ఆలౌట్

పాక్‌తో రెండో టెస్టు



నసీమ్ షా, బాబర్

కొలంబో: పాకిస్తాన్‌తో సోమవారం ప్రారంభమైన రెండో టెస్టులో శ్రీలంక బ్యాటింగ్ కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 48.4 ఓవర్లలో 166 పరుగులకే ఆలౌటైంది. ధనంజయ డిసిల్వా (57; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా, దినేశ్ చండీమల్ (34) ఫర్వాలేదనిపించాడు. పాక్ బౌలర్లలో అబ్రార్ అహ్మద్ 4 వికెట్లు పడగొట్టగా, నసీమ్ షాకు 3 వికెట్లు దక్కాయి. అనంతరం పాకిస్తాన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో దూకుడుగా ఆడింది. ఆట ముగిసే సమయానికి పాక్ 28.3 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేసింది. అబ్దుల్లా షఫీక్ (99 బంతుల్లో 74 బ్యాటింగ్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), షాన్ మసూద్ (47 బంతుల్లో 51; 4 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలు సాధించగా, ప్రస్తుతం షఫీక్‌తో పాటు కెప్టెన్ బాబర్ ఆజమ్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. శ్రీలంక స్కోరుకు పాక్ మరో 21 పరుగులు మాత్రమే వెనుకబడి ఉంది. తొలి టెస్టులో గెలిచిన పాక్ సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలో ఉంది.

మెయిన్ 'డ్రా'కు అంకిత రైనా



వార్సా (పోలాండ్): భారత మహిళా టెన్నిస్ నంబర్‌వన్ అంకిత రైనా వార్సా ఓపెన్ డబ్ల్యూటీఏ–250 టోర్నీలో మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 200వ ర్యాంక్‌లో ఉన్న అంకిత సోమవారం జరిగిన క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో 4–6, 6–3, 6–1తో జోనా గార్లాండ్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించింది. 2 గంటల 15 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసి తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది. అంతకు ముందు క్వాలిఫయింగ్ తొలి రౌండ్ మ్యాచ్‌లో అంకిత 6–3, 6–1తో ఒలివియా లిన్సెర్ (పోలాండ్)పై గెలిచింది. డబుల్స్ విభాగంలో చైనా ప్లేయర్ యు యువాన్‌తో జతకట్టి అంకిత బరిలోకి దిగనుంది.

యంగ్ కమల్.. ఓ టెక్నిక్



కమల్‌హాసన్

పాతికేళ్ల క్రితం కమల్‌హాసన్ వయసుకు మించి కనిపించిన పాత్రల్లో 'ఇండియన్'లో సేనాపతి, 'భామనే సత్యభామనే'లో వృద్ధురాలి పాత్రల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. నాలుగు పదుల వయసులో ఆరు పదుల వయసుకి మించి కమల్ కనిపించిన పాత్రలివి. ఇప్పుడు ఇంకో ఏడాదికి కమల్ ఏడు పదుల వయసుని టచ్ చేస్తున్న నేపథ్యంలో యువకుడిలా కనిపించాల్సి వస్తోంది. 'ఇండియన్'లో కమల్‌ని యంగ్ అండ్ ఓల్డ్ పాత్రల్లో చూపించిన దర్శకుడు శంకర్ ఈ చిత్రం సీక్వెల్ 'ఇండియన్ 2'లో కూడా వృద్ధుడిగా, యువకుడిగా చూపించనున్నారు. యువకుడి పాత్ర కోసం సాంకేతిక సహాయం తీసుకుంటున్నారట. ప్రస్తుతం శంకర్ లాస్ ఏంజిల్స్‌లో ఉన్నారు. ''లాస్ ఏంజిల్స్‌లోని లోలా వీఎఫ్‌ఎక్స్‌లో అధునాతన సాంకేతికతను పర్యవేక్షిస్తున్నాను'' అని శంకర్ పేర్కొన్నారు. కమల్‌ని యువకుడిగా చూపించడానికే లోలా సంస్థని శంకర్ సంప్రదించి ఉంటారనే ఊహాగానాలు నెలకొన్నాయి. ఎందుకంటే 'డీ–ఏజింగ్' (యంగ్‌గా చూపించడం) టెక్నాలజీకి లోలా పాపులర్.

ఎవరు వాళ్లు?



వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా నటించిన చిత్రం 'గాండీవధారి అర్జున'. ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సాక్షీ వైద్య హీరోయిన్‌గా నటించారు. బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడు నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 25న రిలీజ్ కానుంది. సోమవారం టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'మీరిప్పుడు హై రిస్క్ టార్గెట్.. ఈ పనికి నేను అర్జున్‌ని మాత్రమే నమ్మగలను', 'తనతో వర్క్ చేయడం చాలా కష్టం', 'అయినా ఎవరు వాళ్లు..' వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. బీవీఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ– ''ఔట్ అండ్ ఔట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'గాండీవధారి అర్జున'. దేశ రక్షణకు సంబంధించి పెద్ద సమస్య ఏర్పడుతుంది. ఆ సమస్య నుంచి దేశాన్ని అర్జున్ (వరుణ్ తేజ్) ఎలా కాపాడాడు? అనేది ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె. మేయర్, కెమెరా: ముఖేష్.



కృతీ సనన్

అందుకే యష్‌ని హీరోని చేశాను

– 'దిల్' రాజు



'దిల్' రాజు, హర్షిత, కార్తీక, యష్

''ఆకాశం దాటి వస్తావా' మంచి మ్యూజికల్ మూవీ. కొత్త ప్రతిభని పరిచయం చేయాలనే దిల్ రాజు ప్రొడక్షన్ బ్యానర్‌లో శశి, యష్‌లతో ఈ యూత్‌ఫుల్ సినిమా చేస్తున్నాం'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. కొరియోగ్రాఫర్ యష్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'ఆకాశం దాటి వస్తావా'. శశి కుమార్ ముతులూరి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో కార్తీక మురళీధరన్ హీరోయిన్. 'దిల్' రాజు ప్రొడక్షన్ బ్యానర్‌లో 'బలగం' తర్వాత హర్షిత్, హన్షిత ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మూవీ టైటిల్, పోస్టర్‌ని సోమవారం విడుదల చేశారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''నా సినిమాలో కొరియోగ్రాఫర్‌గా అవకాశం ఇస్తానని యష్‌తో అన్నాను. కానీ లుక్ పరంగా బాగున్నాడు. అందుకే హీరోగా పరిచయం చేస్తున్నాం. సింగర్ కార్తీక్ ఈ సినిమా ద్వారా మ్యూజిక్ డైరెక్టర్‌గా పరిచయమవుతున్నారు'' అన్నారు. ''జీవితంలో అన్ని బంధాలకు ప్రేమ, టైమ్, డబ్బులను సమానంగా ఇవ్వాలి. ఈ మూడింటిలో ఏది తగ్గినా ఆ బంధంలో గొడవలు జరుగుతాయి. ఇదే పాయింట్‌తో ఈ సినిమా కథ సాగుతుంది'' అన్నారు శశి కుమార్ ముతులూరి. ''నన్ను నమ్మి హీరోగా అవకాశం ఇచ్చినందుకు 'దిల్' రాజు, శశి, హర్షిత్, హన్షితగార్లకు థ్యాంక్స్'' అన్నారు యష్.

బంధాల గురించి చెప్పే సినిమా ఇది – సాక్షీ సింగ్



త్రిపుర, నదియా, సాక్షీ సింగ్, ఇవానా, సుధీర్‌బాబు, హరీష్ కల్యాణ్

''ఇప్పటివరకు నేను చేసిన సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఎలా ఎంజాయ్ చేశారో.. 'ఎల్‌జీఎమ్' మూవీని కూడా అలాగే ఎంజాయ్ చేస్తారని భావిస్తున్నాను. తెలుగువారి ప్రేమ, అభిమానాలను ఎప్పటికీ మరచిపోలేను'' అని నటి నదియా అన్నారు. ఇండియన్ క్రికెటర్ ఎంఎస్ ధోని చిత్ర నిర్మాణంలోకి అడుగు పెట్టిన సినిమా 'ఎల్‌జీఎమ్' (లెట్స్ గెట్ మ్యారీడ్). హరీష్ కల్యాణ్, ఇవానా, నదియా, యోగిబాబు కీలక పాత్రల్లో రమేష్ తమిళ్ మణి దర్శకత్వం వహించారు. ధోని భార్య సాక్షీ సింగ్ ధోని, వికాస్ హస్జా నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళంలో ఆగస్ట్ 4న రిలీజవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగులో జేపీఆర్ ఫిల్మ్స్ త్రిపుర ప్రొడక్షన్స్ విడుదల చేస్తున్నాయి. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ– ''ధోనీగారు క్రికెట్‌లో ఎలాంటి విజయాలను సాధించారో అలాంటి సక్సెస్‌ను సినిమా రంగంలోనూ సాధించాలి'' అన్నారు. ''అల్లు అర్జున్ సినిమాలన్నింటినీ హిందీలో (తెలుగు డబ్బింగ్) చూశాను. నేను తనకు పెద్ద అభిమానిని. మన జీవితంలోని బంధాల గురించి చెప్పే సినిమా 'ఎల్‌జీఎం'' అన్నారు సాక్షీ సింగ్ ధోని.

విషాద నటి బయోపిక్ నిజమే

హిందీ

చిత్రసీమలో విషాద పాత్రల్లో మెప్పించిన అలనాటి నటి ఎవరు అంటే? 'మీనా కుమారి' పేరు చెబుతారు. తన అందం, అభినయంతో నాటి తరం ప్రేక్షకులను అలరించారు మీనా కుమారి. ప్రస్తుతం ఆమె బయోపిక్ రూపొందించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. బాలీవుడ్ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా, ఈ బయోపిక్ గురించి మనీషా మల్హోత్రా మాట్లాడుతూ– ''ఏ చిత్రానికైనా కథే కీలకం. బయోపిక్‌లకి మరీను. మీనా కుమారి మీద వచ్చిన పుస్తకాల ఆధారంగా కథ తయారు చేస్తున్నా'' అన్నారు. ఇటీవల రిలీజైన 'ఆది పురుష్'లో సీత పాత్ర చేసిన కృతీ సనన్ 'మీనా కుమారి' బయోపిక్‌లో టైటిల్ రోల్ చేయనున్నారు. ఇదిలా ఉంటే.. మీనా కుమారి బయోపిక్ తీయడా నికి ఆమె కుటుంబ సభ్యులు సుముఖంగా లేరని భోగట్టా.

జవాన్ రిస్క్



షారుక్ ఖాన్

'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్, కెప్టెన్ అమెరికా, వెనోమ్, స్టార్ ట్రెక్' వంటి హాలీవుడ్ చిత్రాల్లో యాక్షన్ సీన్స్ థ్రిల్‌కి గురి చేసే విధంగా ఉంటాయి. అలాంటి ఫైట్స్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేయడానికి రెడీ అయ్యారు షారుక్ ఖాన్. ఆ హాలీవుడ్ చిత్రాలకు యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా చేసిన స్పీరో రజటోస్ ఆధ్వర్యంలో షారుక్ 'జవాన్' కోసం రిస్కీ ఫైట్స్ చేశారు. షారుక్ ఖాన్, నయనతార జంటగా తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో గౌరీ ఖాన్ నిర్మించిన చిత్రం 'జవాన్'. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 7న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలోని రిస్కీ స్టంట్స్‌ని హాలీవుడ్ యాక్షన్ మాస్టర్ స్పీరో రజటోస్ సమకూర్చారని యూనిట్ పేర్కొంది. ''జవాన్'లో షారుక్ చేసిన రిస్కీ ఫైట్స్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే విధంగా ఉంటాయి. స్పీరో రజటోస్ డిజైన్ చేసిన యాక్షన్ సీన్స్ ఓ విజువల్ ట్రీట్‌లా ఉంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

రీల్స్

హాయిగా నవ్వుకుంటారు

– అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి



అప్పిరెడ్డి, వెంకట్

''స్లమ్ డాగ్ హజ్బెండ్' వినోదాత్మక చిత్రం. మూఢ నమ్మకాలపై సెటైర్‌లా ఉండే ఈ కథ కొత్తగా అనిపించింది.. అందుకే నిర్మించాం. మా సినిమా చూసి ప్రేక్షకులు రెండు గంటలు హాయిగా నవ్వుకుంటారు'' అన్నారు నిర్మాతలు అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి. సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ సినిమాని రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈ నెల 29న విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి మాట్లాడుతూ– ''వ్యాపారరీత్యా అమెరికా వెళ్లాం. అక్కడ 2016లో ఓ హాలీవుడ్ మూవీ నిర్మించాం. 2017కి ఇండియా వచ్చి, తెలుగులో మొదటి సినిమాగా 'జార్జ్ రెడ్డి' నిర్మించాం. ఏఆర్ శ్రీధర్ చెప్పిన కథ నచ్చడంతో 'స్లమ్ డాగ్ హజ్బెండ్' తీశాం. మా బ్యానర్‌లో నిర్మించిన 'మిస్టర్ ప్రెగ్నెంట్' ఆగస్టు 18న రిలీజ్ చేస్తాం'' అన్నారు.

పొలిటికల్ థ్రిల్లర్



నారా రోహిత్

కొంత గ్యాప్ తర్వాత నారా రోహిత్ హీరోగా నటిస్తున్న చిత్రానికి 'ప్రతినిధి 2' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. మూర్తి దేవగుప్తపు దర్శకత్వంలో కుమార్ రాజా బత్తుల, ఆంజనేయులు శ్రీ తోట, కొండకళ్ల రాజేందర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం ఫస్ట్ లుక్ రిలీజ్ చేసి, 2024 జనవరి 25న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తామని ప్రకటించారు. ''నారా రోహిత్ నటించిన 'ప్రతినిధి' ఫ్రాంచైజీలో భాగంగా పొలిటికల్ థ్రిల్లర్‌గా 'ప్రతినిధి 2'ని రూపొందిస్తున్నాం. సామాజిక సమస్యల నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.


స్త్రీ ఆత్మగౌరవంతో...



లక్ష్మణ్ చిన్నా, కావ్య రమేష్

లక్ష్మణ్ చిన్నా హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'నచ్చినవాడు'. కావ్య రమేష్ హీరోయిన్. స్ట్రీట్ డాగ్ సమర్పణలో లక్ష్మణ్ చిన్నా, వెంకట రత్నం నిర్మించారు. ఆగస్టు 18న విడుదలకానున్న ఈ సినిమా ట్రైలర్‌ని సోమవారం విడుదల చేశారు. హీరో–దర్శక–నిర్మాత లక్ష్మణ్ చిన్నా మాట్లాడుతూ– ''మహిళల ఆత్మగౌరవం కథాంశంగా చేసుకుని అల్లిన సరికొత్త ప్రేమ కథా చిత్రం 'నచ్చినవాడు'' అన్నారు. ''ఈ చిత్రంలో అను పాత్ర చేశాను'' అన్నారు కావ్య రమేష్.

మదర్ సెంటిమెంట్



సదా

సదా హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'నంద'. గోణుగుంట్ల విజయ్ కుమార్ సమర్పణలో కళ్యాణ్ ఎర్రగుంట్ల నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ''మదర్ సెంటిమెంట్ నేపథ్యంలో సాగే యాక్షన్ ఎంటర్ టైనర్ చిత్రమిది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుపుతున్నాం. మా చిత్రానికి చరణ్ అర్జున్ అద్భుతమైన పాటలు సమకూర్చారు'' అన్నారు హీరో, దర్శకుడు సదా.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	299	66,385
నిఫ్టీ ▽	73	19,672

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,069	△	35
డోజోన్స్	35,440	△	213
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,679	△	15
డాక్స్	16,191	△	14
షాంఘై	3,164	▽	4
నికాయ్	32,701	△	397

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)	ముంబై
బంగారం (24 క్యారట్)	59,434
బంగారం (22 క్యారట్)	59,196
వెండి (కిలో)	74,190

ఐటీసీ నుంచి హోటల్స్ వ్యాపారం విభజన



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ తమ హోటల్స్ వ్యాపార విభాగాన్ని ప్రత్యేక అనుబంధ సంస్థ ఐటీసీ హోటల్స్ కింద విడగొట్టనున్నట్లు ప్రకటించింది. ఇన్వెస్టర్లు, వ్యూహాత్మక భాగస్వాములను ఆకర్షించేందుకు ఇది తోడ్పడగలదని ఆశిస్తున్నట్లు వివరించింది. గత కొన్నేళ్లుగా హోటల్స్ వ్యాపారం మెరుగ్గా రాణిస్తోందని, ప్రత్యేక సంస్థగా వృద్ధి చెందే సామర్థ్యాలను సంతరించుకుందని ఐటీసీ తెలిపింది. జూలై 24న జరిగిన సమావేశంలో ఈ వ్యాపారాన్ని విభజించే ప్రతిపాదనకు బోర్డు సూత్రప్రాయంగా ఆమోదముద్ర వేసినట్లు వివరించింది. కొత్త సంస్థలో ఐటీసీకి దాదాపు 40 శాతం వాటాలు ఉంటాయి. తమ తమ వాటాల ప్రకారం ఇతరత్రా షేర్‌హోల్డర్లకు 60 శాతం వాటాలు లభిస్తాయి. 'ప్రతిపాదిత పునర్‌వ్యవస్థీకరణతో, అటు కొత్త సంస్థ, ఇటు ఐటీసీ.. సమష్టి సంస్థాగత సామర్థ్యాలను వినియోగించుకోవడం ద్వారా ప్రయోజనాలు పొందడం కొనసాగుతుంది' అని ఐటీసీ లిమిటెడ్ చైర్మన్ సంజీవ్ పురి తెలిపారు. 1975లో లగ్జరీ హోటల్స్ చెయిన్‌గా ఐటీసీ హోటల్స్ ప్రారంభమైంది. ప్రస్తుతం 70 పైచిలుకు ప్రాంతాల్లో 11,600 గదులతో 120 హోటల్స్ ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో హోటల్స్ వ్యాపార విభాగం ఆదాయం రెట్టింపై రూ. 2,689 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది రూ. 1,347 కోట్లు.

టీవీఎస్ లాభం హైజంప్

క్యూ1లో రూ. 434 కోట్లు



న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన రంగ దిగ్గజం టీవీఎస్ మోటార్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 42 శాతం జంప్‌చేసి రూ. 434 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 305 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,348 కోట్ల నుంచి రూ. 9,142 కోట్లకు బలపడింది. ఎగుమతులతోసహా ద్విచక్ర, త్రిచక్ర వాహన విక్రయాలు 5 శాతం పుంజుకుని 9.53 లక్షల యూనిట్లకు చేరాయి. వీటిలో మోటార్‌సైకిళ్ల విక్రయాలు 7 శాతం ఎగసి 4.63 లక్షలను తాకగా.. స్కూటర్ అమ్మకాలు 11 శాతం వృద్ధితో 3.5 లక్షల యూనిట్లకు చేరాయి. ఎలక్ట్రిక్ స్కూటర్ విక్రయాలు నాలుగు రెట్లుపైగా జంప్‌చేసి 39,000 యూనిట్లను తాకాయి.

ఫలితాల నేపథ్యంలో టీవీఎస్ షేరు బీఎస్‌ఈలో 2.7 శాతం క్షీణించి రూ. 1,307 వద్ద ముగిసింది.

పిట్ట పోయే.. 'X' వచ్చే...

మారిన ట్విటర్ లోగో



న్యూఢిల్లీ: అమెరికన్ దిగ్గజం ఎలాన్ మస్క్ కొన్నప్పటి నుంచి సోషల్ మీడియా నెట్‌వర్క్ సైట్ ట్విటర్‌లో మార్పుల పరంపర కొనసాగుతూనే ఉంది. తాజాగా రీబ్రాండింగ్‌లో భాగంగా సోమవారం నాడు ట్విటర్ లోగో నీలి పిట్ట స్థానంలో ఆంగ్ల అక్షరం ఎక్స్(X)ను తీసుకొచ్చారు మస్క్. నల్లని బ్యాక్‌గ్రౌండ్‌లో తెల్లగా కనిపించే X అక్షరంతో దీన్ని డిజైన్ చేశారు. 'నేటి నుంచి మధ్యంతర లోగోగా X ఉంటుంది' అని మస్క్ ట్వీట్ చేశారు. అలాగే X.కామ్ వెబ్‌సైట్ నేరుగా ట్విటర్‌లో తెరుచుకుంటుందని పేర్కొన్నారు. ట్విటర్ అధికారిక అకౌంటులో X వచ్చి చేరగా, ఎలాన్ మస్క్ అధికారిక అకౌంటులో కొత్త లోగోను డిస్‌ప్లే పిక్చర్‌గా ఉంచారు. భారత్‌లో ట్విటర్ ఐవోఎస్, ఆండ్రాయిడ్ యాప్స్‌లో కొత్త మార్పులను ఇంకా అప్‌డేట్ చేయాల్సి ఉన్నట్లుగా సంబంధిత వర్గాలు తెలిపాయి. లోగో ఎంపికను ట్విటర్ సీఈవో లిండా యాకారినో ధృవీకరించారు. 'జీవితంలో కావచ్చు వ్యాపారంలో కావచ్చు మరోసారి పెద్ద ఎత్తున ప్రభావం చూపడానికి రెండో అవకాశం చాలా అరుదుగా వస్తుంది. మనం సంభాషించుకునే విధానంలో మార్పులు తేవడం ద్వారా ట్విటర్ ఓ గొప్ప ప్రభావం చూపింది. ఇక ఇప్పుడు X దాన్ని మరింత ముందుకు తీసుకెడుతుంది. ఆడియో, వీడియో, మెసేజింగ్, చెల్లింపులు, బ్యాంకింగ్ వంటి కార్యకలాపాలకు కేంద్రంగా మారుతుంది' అని ఆమె పేర్కొన్నారు. చైనాకు చెందిన వుయ్‌చాట్ తరహా 'సూపర్ యాప్'ను తీర్చిదిద్దే క్రమంలోనే మస్క్ కొత్త మార్పులు చేస్తున్నారనే అభిప్రాయం నెలకొంది. అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధినేత అయిన మస్క్ 44 బిలియన్ డాలర్లు వెచ్చించి ట్విటర్‌ను కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ట్విటర్‌ను దక్కించుకున్న తర్వాత పెద్ద యెత్తున ఉద్యోగులను తొలగించిన మస్క్.. గతంలో ఉచితంగా ఉన్న సర్వీసులకు కూడా చార్జీల విధానం ప్రవేశపెట్టడం మొదలైన చర్యలు తీసుకున్నారు.

'X'తో మస్క్ అనుబంధం

ఎక్స్(X) అక్షరంతో మస్క్ అనుబంధం ఈ నాటిది కాదు. 1999లో ఆయన ఎక్స్‌డాట్‌కామ్ పేరిట ఆన్‌లైన్ ఆర్థిక సేవల సంస్థను స్టార్టప్‌గా ప్రారంభించారు. అదే నేడు పేపాల్‌గా మారింది. మస్క్ రాకెట్ కంపెనీ అయిన స్పేస్ ఎక్స్‌ప్లొరేషన్ టెక్నాలజీస్ కార్పొరేషన్‌ను సాధారణంగా స్పేస్‌ఎక్స్‌గా వ్యవహరిస్తుంటారు.

టర్మ్ లోన్‌పై బైజూస్‌కు ఊరట

సవరణకు రుణదాతల కమిటీ ఓకే..

న్యూఢిల్లీ: ఎడ్‌టెక్ కంపెనీ బైజూస్‌కు టర్మ్ లోన్ విషయంలో కాస్త ఊరట లభించింది. 1.2 బిలియన్ డాలర్ల రుణ నిబంధనలను సవరించేందుకు రుణదాతల కమిటీ అంగీకరించింది. సవరణ విజయవంతంగా అమలైతే లోన్‌ను బైజూస్ మరింత వేగవంతంగా తీర్చాల్సిన అవసరం, లిటిగేషన్‌లో చిక్కుకునే అవకాశాలు తప్పినట్లవుతుందని కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆగస్టు 3 నాటికి ఈ సవరణకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉందని భావిస్తున్నట్లు వివరించింది. బైజూస్ తీసుకున్న 1.2 బిలియన్ డాలర్ల రుణంలో ఈ కమిటీలోని సంస్థల వాటా 85 శాతం పైచిలుకు ఉంది. ఈ రుణ చెల్లింపులను వేగవంతం చేయాలని డిమాండ్ చేయడం, వివాదం కారణంగా మొత్తానికే కట్టబోమంటూ బైజూస్ నిరాకరించడం ప్రతిష్టంభనకు దారి తీసింది.

టాటా స్టీల్ లాభం నేలచూపు

- క్యూ1లో రూ. 525 కోట్లు
- ఆదాయం రూ. 60,666 కోట్లు

న్యూఢిల్లీ: మెటల్ రంగ దిగ్గజం టాటా స్టీల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 93 శాతంపైగా క్షీణించి రూ. 525 కోట్లకు పరిమితమైంది. అధిక వ్యయాలు లాభాలను దెబ్బతీశాయి. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 7,714 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 63,698 కోట్ల నుంచి రూ. 60,666 కోట్లకు బలహీనపడింది. ఇది 5 శాతం తక్కువకాగా.. మొత్తం వ్యయాలు మాత్రం రూ. 51,912 కోట్ల నుంచి రూ. 58,553 కోట్లకు పెరిగాయి. జూన్‌కల్లా



నికర రుణ భారం రూ. 71,397 కోట్లకు చేరగా.. రూ. 30,569 కోట్లతో పటిష్ట లిక్విడిటీని సాధించినట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీ సీఈవో, ఎండీ టీవీ నరేంద్రన్‌ను 2023 సెప్టెంబర్ 19 నుంచి తిరిగి ఐదేళ్ల పాటు బాధ్యతలు నిర్వహించేందుకు బోర్డు ఎంపిక చేసినట్లు టాటా స్టీల్ వెల్లడించింది. పూర్తి ఏడాదిలో దేశ, విదేశీ కార్యకలాపాలపై రూ. 16,000 కోట్లు వెచ్చించే ప్రణాళికల్లో ఉంది. 5 ఎంటీ వార్షిక సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న కళింగనగర్ ప్లాంటు విస్తరణ కొనసాగుతున్నట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో టాటా స్టీల్ షేరు బీఎస్‌ఈలో 1 శాతం క్షీణించి రూ. 116 దిగువన ముగిసింది.

డాక్టర్ ష్నైడర్ కంపెనీల ఆస్తులు సంవర్ధన మదర్సన్‌కు

డీల్ విలువ రూ.1,070 కోట్లు

న్యూఢిల్లీ: వాహన విడిభాగాల తయారీలో ఉన్న సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ తాజాగా జర్మనీకి చెందిన డాక్టర్ ష్నైడర్ గ్రూప్ సంస్థల ఆస్తులు, వాటాలను కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. డీల్ విలువ సుమారు రూ.1,070 కోట్లు. ఎయిర్ వెంట్స్, ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రానిక్ ఇంటీరియర్ పాలిమర్ విడిభాగాలు, స్మార్ట్ సర్ఫేస్, లైటింగ్ మాడ్యూల్స్ వంటి సిస్టమ్స్ తయారీలో డాక్టర్ ష్నైడర్ గ్రూప్ నిమగ్నమైంది. 200లకుపైగా పేటెంట్లు కంపెనీ సొంతం. 90 శాతంపైగా ఉత్పత్తులు జర్మనీలోని పరిశోధన, అభివృద్ధి కేంద్రంలో రూపుదిద్దుకుంటున్నాయి. 240 మంది ఇంజనీర్లు దీనికోసం పనిచేస్తున్నారు.



బీవైడీ, మేఘా ప్రతిపాదనకు కేంద్రం నో

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహన రంగంలో ఉన్న చైనా దిగ్గజం బీవైడీ, హైదరాబాద్‌కు చెందిన మౌలిక రంగ సంస్థ మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) సంయుక్తంగా ఏర్పాటు చేయతలపెట్టిన ప్రతిపాదిత ప్లాంటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి బ్రేకులు పడ్డాయి. తెలంగాణలో సుమారు రూ. 8,200 కోట్లతో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రాన్ని నెలకొల్పాలని ఇరు సంస్థలు భావించిన సంగతి తెలిసిందే. బీవైడీ, మేఘా ప్రతిపాదనను కేంద్రం తిరస్కరించింది.

జీఎంఆర్ స్మార్ట్ ఎలక్ట్రిసిటీకి రూ.7,593 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎంఆర్ స్మార్ట్ ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నుంచి భారీ ఆర్డర్‌ను దక్కించుకుంది. దీని విలువ రూ. 7,593 కోట్లు అని జీఎంఆర్ పవర్, అర్బన్ ఇన్‌ఫ్రా ప్రకటించింది. ఆర్డర్‌లో భాగంగా డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఓన్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన యూపీలో 75.69 లక్షల ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

అధిక వెయిటేజీ షేర్లలో అమ్మకాలు

- సూచీలకు రెండోరోజూ నష్టాలే
- సెన్సెక్స్ నష్టం 299 పాయింట్లు
- 19,700 దిగువకు నిఫ్టీ

ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లలో అమ్మకాలు చోటు చేసుకోవడంతో సూచీలు రెండోరోజూ నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు, క్రూడాయిల్ ధరల పెరుగుదల, ఫెడ్ రిజర్వ్ ద్రవ్య పాలసీ ప్రకటన ముందు అప్రమత్తత అంశాలూ సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం ఫ్లాటుగా మొదలయ్యాయి. సెన్సెక్స్ 55 పాయింట్ల నష్టంతో 66,629 వద్ద, నిఫ్టీ మూడు పాయింట్ల స్వల్ప లాభంతో 19,748 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. జాతీయ, అంతర్జాతీయ ప్రతికూలాంశాల నేపథ్యంలో సూచీలు రోజంతా బలహీనంగా కదలాడాయి. సెన్సెక్స్ ఒక దశలో 358 పాయింట్లు క్షీణించి 66,326 వద్ద, నిఫ్టీ 87 పాయింట్లు పతనమై 19,658 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. చివరికి సెన్సెక్స్ 299 పాయింట్లు నష్టపోయి 66,385 వద్ద ముగిసింది. నిఫ్టీ 73 పాయింట్లు క్షీణించి 19,672 వద్ద స్థిరపడింది. గతవారంలో విడుదలైన ఐటీ, ఎఫ్‌ఎంసీజీ కంపెనీల జూన్ క్వార్టర్ ఫలితాలు నిరాశపరచడంతో ఈ రంగ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి.



మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్ షేర్లలోనూ అమ్మకాలు తలెత్తాయి. బ్యాంకింగ్ షేర్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి. ఫార్మా, రియల్టీ, ఆటో షేర్లకు డిమాండ్ నెలకొనడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ షేర్లు వరుసగా 0.30%, 0.10 శాతం చొప్పున లాభపడ్డాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- క్యూ1 నికర లాభం 11% క్షీణించడంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 2% నష్టపోయి రూ.2,488 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 2.50% క్షీణించి రూ.2469 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.
- హోటల్స్ వ్యాపార విభాగాన్ని ప్రత్యేక అనుబంధ సంస్థ ఐటీసీ హోటల్స్ కింద విడదీసేందుకు బోర్డు ఆమోదం తెలపడంతో ఐటీసీ షేరు 4% నష్టపోయి రూ.471 వద్ద ముగిసింది.
- కోటక్ మహీంద్రా బ్యాంకు 4% నష్టపోయి రూ.1,896 వద్ద ముగిసింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్ఎస్‌సీ-ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్‌లో 1876 ఎస్ఐ పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఢిల్లీ పోలీసు, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్)లో.. సబ్–ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ) నియామక పరీక్ష–2023కు సంబంధించి నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. ఈ పరీక్ష ద్వారా ఢిల్లీ పోలీసు విభాగంతోపాటు కేంద్ర సాయుధ బలగాలైన(సీఏపీఎఫ్) బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీలో సబ్–ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1876
» **పోస్టుల వివరాలు:** సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ)లో సబ్–ఇన్‌స్పెక్టర్(జీడీ) –1714, ఢిల్లీ పోలీసు విభాగంలో సబ్–ఇన్‌స్పెక్టర్(ఎగ్జిక్యూటివ్)–పురుషులు/మహిళలు–162.
» **అర్హత:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ డిగ్రీతోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 01.08.2023 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.35,400 నుంచి రూ.1,12,400 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** సీబీటీ రాతపరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష(పీఈటీ)/ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(సీఎస్‌టీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, నెల్లూరు, చీరాల, విజయనగరం, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.08.2023.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 16.08.2023 నుంచి 17.08.2023 వరకు.
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** అక్టోబర్ 2023
» **వెబ్‌సైట్:** https://ssc.nic.in

ఆంధ్ర యూనివర్శిటీలో ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్శిటీ, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏ, ఎంసీఏ(ఫుల్‌టైమ్) కోర్సుల్లో సెల్ఫ్ సపోర్ట్ మోడ్ కేటగిరీ సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

స్పెషలైజేషన్, సీట్ల వివరాలు

» ఎంబీఏ–మార్కెటింగ్ మేనేజ్‌మెంట్–44 సీట్లు; ఎంబీఏ–ఫైనాన్స్ మేనేజ్‌మెంట్–44 సీట్లు; ఎంబీఏ–హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్–44 సీట్లు; ఎంబీఏ–44 సీట్లు; ఎంసీఏ–50 సీట్లు.
» **కోర్సు అందించే కళాశాలలు:** ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, విశాఖపట్నం.
» **అర్హత:** 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీతో పాటు ఏపీఐసెట్–2023 ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్శిటీ, విజయనగర్ ప్యాలెస్, పెద్దవాల్తేర్, విశాఖపట్నం.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.07.2023.
» **కౌన్సెలింగ్ తేది:** 27.07.2023.
» **వెబ్‌సైట్:** www.audoa.in

ఐఐటీ తిరుపతిలో ప్రాజెక్ట్ అసోసియేట్,ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ),తిరుపతి.. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఏడాది కాలపరిమితితో ప్రాజెక్ట్ అసోసియేట్, ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అసోసియేట్(మెకానికల్)–01, ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఆర్కిటెక్ట్)–01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు పీఏ పోస్టుకు రూ.22,000 నుంచి రూ.35,000, పీవో పోస్టుకు రూ.30,000 నుంచి 40,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** outsourcingrect@iittp.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 25.07.2023.
» **వెబ్‌సైట్:** iittp.ac.in

ఐఐటీ తిరుపతిలో స్పోర్ట్స్ కోచ్, జిమ్ ట్రైనర్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), తిరుపతి.. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఏడాది కాలపరిమితితో స్పోర్ట్స్ కోచ్, జిమ్ ట్రైనర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **పోస్టుల వివరాలు:** స్పోర్ట్స్ కోచ్ (వాలీబాల్, చెస్)–02, జిమ్ ట్రైనర్–01.
» **అర్హత:** బీపీఈడీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.25,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** sports@iittp.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 25.07.2023.
» **వెబ్‌సైట్:** iittp.ac.in

ఇంటర్వ్యూలో విజయం ఇలా

» ఏపీపీఎస్సీ గ్రూప్ 1-2022 మెయిన్స్ ఫలితాలు విడుదల
» రెగ్యులర్, స్పోర్ట్స్ కోటా కలిపి 259 మంది ఇంటర్వ్యూకు ఎంపిక
» ఆగస్ట్ 2 నుంచి 11 వరకు ఇంటర్వ్యూలు
» విజేతలుగా నిలిస్తే.. రాష్ట్ర స్థాయిలో ఉన్నత కొలువు



ఏపీపీఎస్సీ గ్రూప్-1 సర్వీసెస్.. రాష్ట్ర స్థాయిలో ఆర్డీఓ, డీఎస్పీ, సీటీఓ తదితర ఉన్నత కొలువులకు మార్గం. ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-1(2022) ఎంపిక ప్రక్రియకు సంబంధించి తుది దశ ఇంటర్వ్యూలకు రంగం సిద్ధమైంది! గ్రూప్ 1 ఎంపిక ప్రక్రియలో రెండో దశ మెయిన్ పరీక్షల ఫలితాలను ఏపీపీఎస్సీ ఇటీవల విడుదల చేసింది. ఇంటర్వ్యూలను ఆగస్ట్ 2వ తేదీ నుంచి నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. వేల సంఖ్యలో పోటీని ఎదుర్కొని ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులు.. చివరి దశలో చూపే ప్రతిభ అంతిమ విజయంలో నిర్ణయాత్మకం కానుంది. ఈ నేపథ్యంలో.. ఏపీపీఎస్సీ గ్రూప్-1 ఇంటర్వ్యూలో విజయానికి నిపుణుల సలహాలు..

- **87,718:** ఏపీపీఎస్సీ గ్రూప్–1(2022) ప్రిలిమ్స్‌కు హాజరైన వారి సంఖ్య.
- **5,028:** ప్రిలిమ్స్‌లో విజయం సాధించి మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు.
- **259:** మొత్తం 111 గ్రూప్ 1 పోస్టులకు నిర్వహించిన మెయిన్స్‌లోనూ విజయం సాధించి చివరి దశ ఇంటర్వ్యూకు అర్హత పొందిన వారు. వీరిలో 39 మంది స్పోర్ట్స్ కోటా నుంచి ఎంపికయ్యారు.
- గ్రూప్–1 ఎంపిక ప్రక్రియలో తొలి రెండు దశలైన ప్రిలిమ్స్, మెయిన్‌లో అభ్యర్థులు పుస్తక పరిజ్ఞానంతో విజయం సాధించే అవకాశం ఉంది. కాని ఇంటర్వ్యూ మాత్రం దీనికి భిన్నంగా ఉంటుంది. సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు సామాజిక, ఆర్థిక, పాలన, జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి అవగాహనతో బోర్డ్ రూమ్‌లో అడుగుపెట్టాలి అంటున్నారు నిపుణులు.

విభిన్న వ్యూహం

ఇంటర్వ్యూలో వ్యక్తిగత విషయాలతోపాటు, అకడమిక్ నేపథ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, సమకాలీన అంశాలపై అవగాహనను పరిశీలిస్తారు. కాబట్టి ఇంటర్వ్యూలో రాణించాలంటే.. భావ వ్యక్తీకరణ, సమాధానం చెప్పే తీరు, ఆలోచనల్లో స్పష్టత అవసరం.

సమకాలీన అవగాహన

గ్రూప్–1 స్థాయి అధికారిగా ఎంపికయ్యే అభ్యర్థులకు అవసరమైన సమస్యల పట్ల స్పందన, నిర్ణయ నేర్పు వంటి వాటిని ఇంటర్వ్యూలో పరిశీలిస్తారు. కాబట్టి అభ్యర్థులు ప్రధానంగా తాజా పరిణామాలపై పట్టు సాధించాలి. ముఖ్యంగా రాష్ట్ర స్థాయిలో కీలకంగా మారిన అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఇంటర్వ్యూకు ప్రిపరేషన్‌లో అభివృద్ధి కారక అంశాలకు పెద్దపీట వేయాలి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, లక్షిత వర్గాలు–లబ్ధిదారులు తదితర విషయాలపై సంపూర్ణ పట్టు సాధించాలి.

వ్యక్తిగతం, వృత్తిగతం

గ్రూప్–1 ఇంటర్వ్యూలో.. వ్యక్తిగతం మొదలు వృత్తి నేపథ్యం వరకూ.. ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. అకడమిక్ నైపుణ్యాలను విధి నిర్వహణలో ఎలా అన్వయిస్తారో సమర్థంగా చెప్పగలిగేలా సన్నద్ధంగా ఉండాలి. ఇప్పటికే వేరే ఉద్యోగాలు చేస్తూ గ్రూప్–1 ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులకు వారు ప్రస్తుతం నిర్వహిస్తున్న విధులపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రస్తుత కొలువులో తమ విధులు, సాధించిన ఫలితాలు, ప్రత్యేకంగా తీసుకున్న నిర్ణయాలు, అవి విధుల పరంగా ఉపయోగపడిన తీరు గురించి ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. కాబట్టి అందుకు అనుగుణంగా సన్నద్ధమై ఇంటర్వ్యూకు వెళ్లాలి. ప్రభుత్వ ఉద్యోగి అయితే.. తాము పని చేస్తున్న శాఖల్లో అమలవుతున్న పథకాలు, తమ పరిధిలో వాటి అమలు తీరు, విధి నిర్వహణ పరంగా సదరు అభ్యర్థుల ప్రమేయం వంటి అంశాలకు సమాధానాలను సిద్ధం చేసుకోవాలి.

స్వీయ అభిప్రాయం

ఇంటర్వ్యూలో విజయానికి అభ్యర్థులు మెరుగుపరచుకోవాల్సిన మరో నైపుణ్యం.. స్వీయ అభిప్రాయాల వ్యక్తీకరణ. సహజంగా బోర్డ్ సభ్యులు.. ఆయా అంశాలపై అభ్యర్థుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తారు. కాబట్టి సదరు విషయాలపై అభ్యర్థులు తమకంటూ ఒక స్పష్టమైన అభిప్రాయం ఏర్పరచుకోవాలి. అందుకోసం దిన పత్రికలను చదవాలి. వాటిలోని ఎడిటోరియల్స్‌ను, ఆయా విషయాలపై ప్రముఖుల విశ్లేషణలను చదవడతోపాటు వాటిపై తమ సొంతం అభిప్రాయాల్ని సిద్ధం చేసుకోవాలి. బోర్డు సభ్యులను మెప్పించాలంటే.. ప్రతి అంశంపైనా స్వీయ అభిప్రాయంతోపాటు విశ్లేషించే నైపుణ్యం ఉండాలి.

నిర్ణయ సామర్థ్యం

- గ్రూప్–1 ఇంటర్వ్యూలో అభ్యర్థుల్లోని డెసిషన్ మేకింగ్ స్కిల్స్‌ను కూడా పరిశీలిస్తారు. గ్రూప్–1 స్థాయి అధికారిగా ఏదైనా సమస్య ఎదురైతే ఎలా స్పందిస్తారు? సదరు నిర్ణయం తీసుకోవడానికి సహేతుక కారణాలను వివరించే నేర్పు కూడా ఉండాలి.
- ఇంటర్వ్యూ సమయంలో ఎదురయ్యే ప్రశ్నలకు సానుకూల దృక్పథంతో సమాధానాలు ఇచ్చే ప్రయత్నం చేయాలి. ముఖ్యంగా రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రశ్నలు ఎదురైనప్పుడు నిర్మాణాత్మక దృక్పథంతో విశ్లేషించగలగాలి.

బోర్డ్ సభ్యులకు అభివాదం

ఇంటర్వ్యూ బోర్డ్‌లో సాధారణంగా ఒక చైర్మన్, నలుగురు లేదా అయిదుగురు సభ్యులు ఉంటారు. బోర్డ్ రూమ్‌లోకి అడుగుపెట్టిన అభ్యర్థులు ముందుగా చైర్మన్‌కు అభివాదం చేస్తూ.. మిగతా సభ్యులకు కూడా అభివాదం చేయాలి. అదే విధంగా సమాధానాలు ఇచ్చే సమయంలోనూ ప్రశ్న అడిగిన బోర్డ్ సభ్యుడినే చూస్తూ చెప్పకుండా.. మిగతా వారికి కూడా ఆ సమాధానం చెబుతున్నట్లుగా వ్యవహరించాలి. అందరితో ఐ కాంటాక్ట్‌ను కొనసాగించడం అలవర్చుకోవాలి.

హావ, భావాలు

ఇంటర్వ్యూ సమయంలో సమాధానాలు ఇచ్చేటప్పుడు అభ్యర్థులు తమ హావ, భావాలపై నియంత్రణ పాటించాలి. ముఖ్యంగా ముఖ కవళికలు, అనవసరంగా కాళ్లు, చేతులు కదిలించడం వంటివి చేయకూడదు. అదే విధంగా సీట్లో బిడియంగా కూర్చుని సమాధానం ఇవ్వడం కూడా సరికాదు. దీంతోపాటు ఇంటర్వ్యూ బోర్డ్ సభ్యుల ముందు వినమ్రంగా వ్యవహరించడం అవసరం.

చర్చకు ఆస్కారం

గ్రూప్–1 ఇంటర్వ్యూలో కొన్ని సందర్భాల్లో అడిగిన ప్రశ్నకు నేరుగా జవాబు చెప్పడంతోనే ముగియకుండా..దానికి కొనసాగింపుగా అనుబంధ ప్రశ్నలు, బోర్డ్ సభ్యుల అభిప్రాయాలతో కలిసి చర్చగా మారే పరిస్థితి కూడా ఏర్పడుతుంది. ఇలాంటప్పుడు సదరు అంశంపై లోతైన అవగాహన లేకపోతే ఇబ్బందిగా మారుతుంది. నిజాయతీగా తమకు తెలిసినంత వరకు చెప్పి.. మిగతా విషయాలు తెలియవని అంగీకరించాలి. అలా కాకుండా తాము చెప్పిందే కరెక్ట్ అనే రీతిలో వాదనకు దిగితే.. ప్రతికూల అభిప్రాయం ఏర్పడే ఆస్కారముంది.

సమాజ సేవకోసం

గ్రూప్–1 స్థాయి పోస్ట్‌ల ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు.. తాము ఆ పోస్ట్‌లకు ఎలా సరితూగుతాం, విధుల నిర్వహణ క్రమంలో తమకున్న లక్షణాలు ఏంటి.. అనే ప్రశ్నలు సంధించుకొని.. ఇంటర్వ్యూకు సన్నద్ధమవ్వాలి. ఇలాంటి ప్రశ్నలు బోర్డు అడిగినప్పుడు.. చాలామంది సమాజ సేవ కోసం అంటూ జవాబిస్తారు. ఈ సమాధానం చెబుతూనే.. అప్పటి వరకు తాము వృత్తి పరంగా పొందిన అనుభవం, లేదా సమకాలీన అంశాలపై తమకున్న అవగాహన ద్వారా విధి నిర్వహణలో సమర్థంగా వ్యవహరిస్తామనేలా సమాధానం చెప్పాలి.

ఎంట్రీ నుంచి ఎగ్జిట్ వరకు

ఇంటర్వ్యూ రూమ్‌లోకి అడుగుపెట్టినప్పటి నుంచి బయటికి వచ్చే వరకూ.. హుందాగా, వినమ్రంగా వ్యవహరించాలి. ముందుగా డోర్ నాక్ చేసి.. బోర్డ్ సభ్యుల అనుమతి తీసుకున్నాకే గదిలోకి వెళ్లాలి. అందరినీ చూస్తూ విష్ చేయడం మరవొద్దు. తర్వాత బోర్డ్ సభ్యులు ఆఫర్ చేసే వరకు సీటులో కూర్చోవద్దు. ఇక సీట్లో కూర్చుకున్నాక.. తాము కూర్చునే శైలి కూడా హుందాగా ఉండేలా చూసుకోవాలి. నిటారుగా కూర్చోవాలి. ఇందులోనే సగం ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతుంది. ఎదురుగా ఉన్న టేబుల్‌పై చేతులు పెట్టడం వంటివి చేయకూడదు. ఇంటర్వ్యూ ముగిసిన తర్వాత బోర్డ్ సభ్యులందరికీ ఆపాదించేలా ధన్యవాదాలు తెలుపుతూ బయటికి రావాలి.

పేపర్ రీడింగ్ మస్ట్

ఇంటర్వ్యూకు హాజరయ్యే రోజు దినపత్రికలను చదవాలి. గతంలో చాలా సందర్భాల్లో పలువురు అభ్యర్థులకు 'ఈ రోజు న్యూస్ పేపర్లో మీరు ప్రాధాన్యంగా భావించిన వార్తలు ఏవి?' లేదా 'ఈ రోజు ఫలానా వార్తా కథనంలో పేర్కొన్న అంశాలపై మీ అభిప్రాయం ఏంటి?' వంటి ప్రశ్నలు సైతం ఎదురయ్యాయి. కాబట్టి ఇంటర్వ్యూ రోజు కనీసం ఒక తెలుగు దిన పత్రిక, ఇంగ్లిష్ దినపత్రిక చదవాలి. అంతేకాకుండా వాటిల్లోని ముఖ్యమైన అంశాలను గుర్తించుకోవాలి.

75 మార్కులే కానీ

ఏపీపీఎస్సీ గ్రూప్–1 ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు 75. మెయిన్స్ మార్కులతో పోలిస్తే ఇవి తక్కువగానే కనిపిస్తుండొచ్చు. కానీ గత ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటే.. మెయిన్స్‌లో మంచి మార్కులు వచ్చినా.. ఇంటర్వ్యూలో సరైన మార్కులు రాక అవకాశం చేజార్చుకున్న వారెందరో ఉన్నారు. కాబట్టి ప్రతి మార్కు కీలకంగా నిలిచే గ్రూప్1 ఎంపిక ప్రక్రియలో.. ఇంటర్వ్యూలోనూ అత్యుత్తమ ప్రదర్శన చూపేలా సన్నద్ధమవ్వాలి.

క్లుప్తంగా...

ఒంగోలు ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లు ప్రారంభం



సత్యసాయి జిల్లాకు చెందిన అతీఫాకు అడ్మిషన్ పత్రాలు అందిస్తున్న డైరెక్టర్లు

వేంపల్లె: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభించినట్లు డైరెక్టర్లు జయరామిరెడ్డి, సంధ్యారాణి తెలిపారు. సోమవారం ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీలో అడ్మిషన్ల ప్రక్రియను వారు ప్రారంభించారు. మొదటగా సత్యసాయి జిల్లాకు చెందిన ఎం.అతీఫా, బాపట్ల జిల్లాకు చెందిన జి.జశ్వంత్ నాగ సాయి వరుణ్, జనగామ జిల్లాకు చెందిన ఎస్.ఆదిత్య, సిద్దిపేట జిల్లాకు చెందిన వై.పార్వతి, కె.దినేష్ అడ్మిషన్ పత్రాలను అందుకున్నారు. మొదటి రోజు 542 మంది విద్యార్థులకు కాల్ లెటర్స్ పంపగా, 402 మంది హాజరై అడ్మిషన్లు పొందారు.

ఉద్యోగుల సర్దుబాటు సమస్యలు పరిష్కరిస్తాం

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ఆ సంస్థ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు హామీ ఇచ్చారు. ఉద్యోగుల సర్దుబాటుతో ఉత్పన్నమవుతున్న సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఉద్యోగ సంఘాలతో విజయవాడలోని ఆర్టీసీ భవన్‌లో సోమవారం ఆయన సమావేశమయ్యారు. హెచ్‌ఆర్‌ఏలు, ఇతర అలవెన్స్‌లలో ఉద్యోగులు నష్టపోతున్న విషయాన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఈ సమావేశంలో లేవనెత్తారు. అన్ని అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామని ద్వారకా తిరుమల రావు స్పష్టం చేశారు. కొత్తగా డ్రైవర్ల నియామకానికి త్వరలోనే ప్రభుత్వ అనుమతి కోరతామని తెలిపారు. ఆర్టీసీ ఈడీ(అడ్మిన్) కేఎస్‌బీ రెడ్డి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

29న జాతీయ విద్యా విధానం వార్షికోత్సవం



తిరుపతి సిటీ: ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఈ నెల 29న జాతీయ విద్యా విధానం మూడో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించనున్నారని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ చెప్పారు. ప్రధాని మోదీతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు. సోమవారం ఎస్వీ యూనివర్సిటీలో తిరుపతిలోని కేంద్ర విద్యాసంస్థలు, యూనివర్సిటీల సంయుక్త ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానం వల్ల విద్యార్థి స్వేచ్ఛగా తనకు నచ్చిన కోర్సును ఎంచుకునే వెసులుబాటు కలిగిందన్నారు. ఎస్వీయూ వీసీ రాజారెడ్డి, శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ వీసీ భారతి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ శంకరనారాయణ, కేంద్రీయ విద్యాలయాల డిప్యూటీ కమిషనర్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

వన సంరక్షణ సమితులకు రూ.9 కోట్లు

ఐటీసీ, అటవీశాఖల మధ్య ఒప్పందం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జామాయిల్ మొక్కల పునరుద్ధరణ కోసం అటవీశాఖ, ఐటీసీ కంపెనీ మధ్య భాగస్వామ్య ఒప్పందం కుదిరింది. దీనిప్రకారం రాష్ట్రంలోని 1,453 వన సంరక్షణ సమితుల పరిధిలో జామాయిల్ మొక్కలు నాటేందుకు ఐటీసీ సహాయం చేయనుంది. రానున్న మూడేళ్లలో 30 వేల ఎకరాల్లో అటవీ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కోసం వన సంరక్షణ సమితులకు దాదాపు రూ.9 కోట్లు సాయం అందించనుంది. ఈ మేరకు సోమవారం అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అటవీ దళాల అధిపతి వై.మధుసూదనరెడ్డి, ఐటీసీ డివిజనల్ హెడ్ సునీల్ పాండే ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఐటీసీ డివిజనల్ హెడ్ సునీల్ పాండే, పీసీసీ ఎఫ్‌లు బీకే సింగ్, ఆర్పీ ఖజూరియా పాల్గొన్నారు.

ఇక శరవేగంగా ఆర్సీ కార్డులు

సాక్షి, అమరావతి: పెండింగ్ డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్సీ కార్డులను శరవేగంగా అందించేందుకు రవాణా శాఖ చర్యలు చేపట్టింది. పాత టెండర్ కాలపరిమితి ముగియడంతో కార్డుల జారీ ప్రక్రియ వాయిదా పడింది. దాంతో దాదాపు 25 లక్షలకు పైగా కార్డులు పెండింగ్‌లో ఉండిపోయాయి. కొత్తగా టెండర్ల ప్రక్రియ చేపట్టేలోగా.. పెండింగ్‌లో ఉన్న పాత కార్డులను వాహనదారులకు అందించాలని రవాణా శాఖ భావించింది. అందుకోసం ప్రతిపాదనలు పంపించగా.. ప్రభుత్వం వాటిని ఆమోదించింది. దీంతో కొత్త కార్డుల ప్రింటింగ్, పంపిణీ కోసం రూ.33.39 కోట్లు కేటాయిస్తూ రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వచ్చే ఐదేళ్ల పాటు కొత్త కార్డుల జారీ కోసం రవాణా శాఖ టెండర్ల ప్రక్రియ చేపట్టింది. తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది.

‘మెడికల్’ రికార్డు!



రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా..

మచిలీపట్నం తరహాలోనే నంద్యాల, ఏలూరు, రాజమండ్రి, విజయనగరం వైద్య కళాశాలలు కూడా ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభానికి సిద్ధమయ్యాయి. అన్ని చోట్ల నేడో రేపో కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధన సిబ్బంది కొత్తగా నిర్మించిన తమ చాంబర్లలో కార్యకలాపాలు ప్రారంభించనున్నారు. ఒక్కో చోట 150 చొప్పున 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా రాష్ట్రానికి సమకూరనున్నాయి. ఆంధ్రా మెడికల్ కాలేజీ 1923లో ఏర్పాటు కాగా వందేళ్ల తరువాత ప్రభుత్వ రంగంలో ఒకే ఏడాది ఐదు కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతుండటం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

▶ మొదటి పేజీ తరువాయి

చారిత్రక నగరంలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో తీర ప్రాంత ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్యం అవసరమైతే 70 కి.మీ ప్రయాణించి విజయవాడ వెళ్లాల్సిందే. ఈ అవస్థలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బందరు మెడికల్ కాలేజీని మంజూరు చేసి శాశ్వత పరిష్కారం చూపారు. 64.3 ఎకరాల్లో రూ.550 కోట్లతో మచిలీపట్నం వైద్య కళాశాల, బోధనాస్పత్రి నిర్మాణానికి 2021 జూలై 7 సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. ఇప్పటికే ఉన్న జిల్లా ఆస్పత్రిని బోధనాస్పత్రిగా అభివృద్ధి చేశారు. 150 ఎంబీబీఎస్ సీట్లతో నూతన వైద్య కళాశాల తరగతులు ప్రారంభించేలా సదుపాయాలను సమకూర్చారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మచిలీపట్నం వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను ‘సాక్షి’ ప్రతినిధి పరిశీలించారు.

బందరు తీర ప్రాంత ప్రజలకు ఆరోగ్య భద్రత

తొలి ఏడాది ఎంబీబీఎస్‌లో చేరే విద్యార్థులకు అకడమిక్ కార్యకలాపాల కోసం అడ్మినిస్ట్రేషన్, ల్యాబొరేటరీ, లెక్చర్ గ్యాలరీ, ఎగ్జామినేషన్ డిపార్ట్‌మెంట్, హాస్టళ్లతో కలిపి 7 బ్లాక్‌లను నిర్మించారు. లెక్చర్ గ్యాలరీ బ్లాక్‌లో 184 మంది కూర్చునే సామర్థ్యంతో ఎల్‌ఈడీ స్క్రీన్స్, ప్రొజెక్టర్స్, సెంట్రల్ ఏసీ లాంటి అత్యాధునిక వసతులతో రెండు లెక్చర్ హాల్స్, ఇన్‌సైడ్, అవుట్‌సైడ్ రీడింగ్ రూమ్స్, జర్నల్, స్టాఫ్ రీడింగ్, లైబ్రరీ రూమ్‌లు ఏర్పాటు చేశారు. అమ్మాయిలు, అబ్బాయిల కోసం విడివిడిగా రెండు హాస్టల్ బ్లాక్‌లు సిద్ధం చేశారు. నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా హ్యూమన్ అనాటమీ, క్లినికల్ ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ/హెమటాలజీ, సెంట్రల్ ల్యాబొరేటరీ, స్కిల్ డెవలప్‌మెంట్, రీసెర్చ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు అనుగుణంగా అన్ని వనరులు సమకూర్చారు. ఆయా బ్లాక్‌లలో ఫర్నిచర్ సమకూర్చే సమకూర్పు పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ నెలాఖరు లోపు భవనాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నాయి.

విద్య, వైద్యం.. రెండు రకాల లాభాలు

కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు ద్వారా మన విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలు పెరగడంతో పాటు ఆయా ప్రాంతాల్లోని పేద ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు మరింత చేరువ కానున్నాయి. ఐదు చోట్ల సేవలు అందించిన జిల్లా ఆస్పత్రుల స్థానంలో బోధనాస్పత్రులు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా నిపుణులైన వైద్యులు అందుబాటులోకి వస్తారు. సేవలు రెట్టింపవుతాయి. అధునాతన వైద్య పరికరాలు, ల్యాబ్‌లు సమకూరడంతో వైద్య సేవలు, రోగ నిర్ధారణ సేవల్లో నాణ్యత పెరుగుతుంది. రేడియాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ విభాగాల వల్ల వివిధ రకాల వ్యాధులు, జబ్బులపై రీసెర్చ్ జరుగుతుంది. ప్రస్తుతం ఎంబీబీఎస్‌లో చేరనున్న విద్యార్థులు నాలుగేళ్ల అనంతరం హౌస్ సర్జన్‌లుగా సేవలు అందిస్తారు. 24/7 ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండటంతో సేవలు మరింత మెరుగవుతాయి. మరోవైపు ఎన్‌ఎంసీ ప్రవేశపెట్టిన ఫ్యామిలీ అడాప్షన్ విధానం ద్వారా ప్రతి విద్యార్థి ఐదు కుటుంబాలకు సంబంధించిన ఆరోగ్య బాధ్యతలను పర్యవేక్షిస్తారు. నాలుగైదేళ్ల తర్వాత పీజీ సీట్లు కూడా సమకూరడంతో స్పెషలిస్ట్ వైద్యుల సంఖ్య పెరుగుతుంది.

ప్రభుత్వ రంగంలో ఎంబీబీఎస్ సీట్లు పెరుగుతాయి ఇలా

సంవత్సరం	కళాశాలలు	సీట్లు
2019-20	12	2,360
(((వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చే నాటికి))		
2023-24	17	3,110
2024-25	22	3,860
2025-26	29	4,910

శరవేగంగా పెండింగ్ పనులు



ఈ ఏడాది ఐదు కొత్త వైద్య కళాశాలల్లో తరగతులు ప్రారంభించడానికి వీలుగా పనులన్నీ దాదాపు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి ఆల్ ఇండియా కోటా సీట్లు పొందిన విద్యార్థులు రిపోర్ట్ చేస్తారు. పెండింగ్ పనులన్నీ శరవేగంగా నెలాఖరులోగా పూర్తి చేసేలా పర్యవేక్షిస్తున్నాం. వచ్చే ఏడాది మరో ఐదు కళాశాలలను ప్రారంభించేలా కసరత్తు చేపట్టాం.

– ఎం.టి.కృష్ణబాబు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ

వైద్యుల నిష్పత్తి పెరుగుతుంది



కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుతో మన విద్యార్థులకు వైద్య విద్య అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయి. డబ్ల్యూహెచ్‌వో మార్గదర్శకాల ప్రకారం ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక వైద్యుడు ఉండాలి. మన దేశంలో వెయ్యి మందికి ఒకరి కంటే తక్కువ వైద్యులున్నారు. కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుతో ఎక్కువ మంది వైద్యులు అందుబాటులోకి వస్తారు. తద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతాయి.

– డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ కర్నూలు జీజీహెచ్

స్థానికులకు ఎంతో మేలు

ఇప్పటిదాకా బందరు ప్రాంతంలో మెరిట్ విద్యార్థులు వైద్య విద్య చదవాలంటే కాకినాడ, విజయవాడ, వైజాగ్ వెళ్లాల్సి వచ్చేది. ఇక్కడే వైద్య కళాశాల ఏర్పాటుతో స్థానికులకు ఎంతో మేలు జరగనుంది. పూర్తి స్థాయిలో బోధనాస్పత్రి సిద్ధం అయింది. భవిష్యత్తులో పీజీ విద్యార్థులు కూడా వస్తారు. బందరు చుట్టు పక్కల ప్రాంత ప్రజలకు ఆరోగ్య భద్రత చేకూరుతోంది.

– డాక్టర్ బి.శ్రీనివాసాచార్య, ఐఎంఏ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, మచిలీపట్నం

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్



పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా చేసి ప్రతి చోటా వైద్య కళాశాల ఏర్పాటు చేస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారు. ఆమేరకు నంద్యాలలో కొత్త వైద్య కళాశాలను నెలకొల్పారు. త్వరలోనే తరగతులు ప్రారంభం కానున్నాయి. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో వైద్య కళాశాలల ఏర్పాటుతో ప్రజలకు మేలు జరుగుతోంది. విద్యార్థుల వైద్య విద్య కల కూడా నెరవేరుతుంది. సూపర్ స్పెషాలిటీ వైద్యం మరింత చేరువ అవుతుంది.

– చెన్నకేశవ, నంద్యాల

నాలుగేళ్లలో వైద్యరంగం బలోపేతం ఇలా..



- రూ.16 వేల కోట్లతో నాడు–నేడు ద్వారా ప్రభుత్వ వైద్య రంగం బలోపేతం.
- నాలుగేళ్లలో ఏకంగా దాదాపు 51 వేల వైద్య పోస్టుల భర్తీ. ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేసేలా సీఎం జగన్ ఆదేశాలు. వైద్య శాఖలో పోస్టుల భర్తీ కోసమే ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఏర్పాటు.
- గ్రామాల్లో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ద్వారా 12 రకాల వైద్య సేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులతో సొంత ఊళ్లలోనే ప్రజలకు వైద్య సేవలు.
- దేశంలోనే తొలిసారిగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్. నెలకు రెండు సార్లు గ్రామాలకు పీహెచ్‌సీ వైద్యులు. ఇప్పటివరకూ 1.70 కోట్ల మందికి సొంత ఊళ్లలోనే వైద్యం.
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో ప్రొసీజర్లు 1,059 నుంచి 3,257కి పెంపు. 40 లక్షల మందికి ఉచిత వైద్యం కోసం రూ.8 వేల కోట్ల వ్యయం. వైఎస్సార్ ఆరోగ్య ఆసరాతో విశ్రాంతి సమయంలో జీవన భృతి చెల్లింపు. ఇప్పటివరకూ 17.25 లక్షల మందికి రూ.1,074.69 కోట్లు అందించిన ప్రభుత్వం.
- 108, 104 అంబులెన్స్‌ల సేవలు బలోపేతం. కొత్తగా 768 అంబులెన్స్‌ల సేవలు అందుబాటులోకి. 2020 జూలై నుంచి 33.35 లక్షలకు పైగా అత్యవసర కేసుల్లో సేవలందించిన అంబులెన్స్‌లు.
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా జీఎంపీ, డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాలతో మందులు.

‘మార్గదర్శి’ డిపాజిట్‌దారుల సొమ్ము ఏమైంది?

- మార్గదర్శి ప్రధాన కార్యాలయంలో ఏం జరిగింది?
- అక్కడికి వెళ్లిన సొమ్ము ఏమైంది?
- ఇదే ఆలోచిస్తున్నామన్న సుప్రీం కోర్టు
- మార్గదర్శి నిధులు దారి మళ్లించారని ఏపీ వాదన
- తెలంగాణ హైకోర్టులోని కేసులు ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని విజ్ఞప్తి
- విచారణ ఆగస్టు4 కు వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి చిట్‌ఫండ్స్ డిపాజిట్‌దారుల సొమ్ముకు సంబంధించి ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏం జరిగిందో చూడాల్సి ఉందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. వేర్వేరు శాఖల నుంచి ప్రధాన కార్యాలయానికి సొమ్ము తరలించడం సాధారణమేనని, అదే విధంగా ఈ కేసులోనూ జరిగిందని చెబుతున్న నేపథ్యంలో ప్రధాన కార్యాలయానికి వెళ్లిన సొమ్ము ఏమైందోనన్న అంశంపై ఆలోచిస్తున్నామని పేర్కొంది. మార్గదర్శి కేసుల న్యాయపరిధిపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సీటీ రవికుమార్, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరఫున నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపిస్తూ.. మార్గదర్శి చిట్ ఫండ్స్ నిధులు ఏపీ సహా ఇతర రాష్ట్రాల్లోని శాఖల నుంచి ప్రధాన కార్యాలయానికి తరలిస్తున్నారని చెప్పారు. ప్రధాన కార్యాలయ్యం ఎక్కడుందని ధర్మాసనం ప్రశ్నించగా.. హైదరాబాద్‌లో ఉందని కౌల్ తెలిపారు. ప్రధాన కార్యాలయానికి తరలించిన నిధులు దారి మళ్లించారని ధర్మాసనం దృష్టికి కౌల్ తీసుకొచ్చారు. ఏపీలోని పలు శాఖల నిధుల మళ్లింపునకు సంబంధించి అసిస్టెంట్ రిజిస్ట్రార్ల ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని తెలిపారు. ఏపీలో నేరం జరిగిందని, ఏపీకి చెందిన ఖాతాదారులు సొమ్ము డిపాజిట్లు చేశారని తెలిపారు. కేసులు ఏపీ హైకోర్టు పరిధిలోకి వస్తాయన్నారు. తెలంగాణ హైకోర్టులోని కేసులు ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీం కోర్టులో బదిలీ పిటిషన్లు దాఖలు చేశామన్నారు. ఇవన్నీ కలిపి వినాల్సి ఉందన్నారు. ఏపీలో జారీ చేసిన సెర్చ్ వారెంట్లపై తెలంగాణ హైకోర్టులో కాకుండా ఏపీ హైకోర్టులో విచారించడం సబబని అన్నారు. న్యాయ పరిధిపై తెలంగాణ హైకోర్టు కసరత్తు చేసిందన్నారు. పలు కేసులకు సంబంధించి బదిలీ పిటిషన్లు సుప్రీంకోర్టులో వేయగా నోటీసులు జారీ అయ్యాయన్నారు. తెలంగాణ హైకోర్టుకి కూడా పరిధి ఉంటే ఉండొచ్చని, న్యాయాన్ని దృష్టిలో ఉంచుకొని పిటిషన్లు ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలన్నారు. ఈ సమయంలో ఇతర బదిలీ పిటిషన్లపై ధర్మాసనం ఆరా తీసింది. పిటిషన్లు బదిలీ చేయడంలో సదరు కోర్టుకు పరిధి ఉందా లేదా అనేది ప్రశ్న కాదని కౌల్ తెలిపారు. కౌల్ వాదనలతో మార్గదర్శి తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి విభేదించారు. సొమ్ము ఏపీ నుంచి తెలంగాణలోని హెడ్ ఆఫీసుకు తరలించారని, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టారనేది ఆరోపణ అని తెలిపారు. కాజ్ ఆఫ్ యాక్షన్ ఎక్కడ జరిగిందో అక్కడి హైకోర్టు కేసులు విచారించొచ్చన్నారు. రామోజీరావు ఈనాడు పత్రిక ఎడిటర్‌గా ఉన్నారని, రాజకీయ కక్షతోనే కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. సబ్‌స్క్రైబర్లు ఎవరూ ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు. వాదనల అనంతరం బదిలీ పిటిషన్లు అన్నింటినీ కలిపి విచారించాల్సి ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. తదుపరి విచారణ ఆగస్టు 4కు వాయిదా వేసింది.

‘ఆడుదాం ఆంధ్ర’కు ఏర్పాట్లు

- సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ‘ఆడుదాం ఆంధ్ర’ కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సుమారు మూడు లక్షల మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి చెప్పారు. ఈ మ్యాచ్‌ల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ‘ఆడుదాం ఆంధ్ర’పై సీఎస్ క్యాంపు కార్యాలయంలో సోమవారం రాష్ట్ర స్థాయి ఎపెక్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. జవహర్‌రెడ్డి మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి ప్రారంభమయ్యే ‘ఆడుదాం ఆంధ్ర’లో క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో సుమారు 3 లక్షల మ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు చెప్పారు. వీటికి అదనంగా 3కే మారథాన్, యోగా, టెన్నికాయిట్ ఈవెంట్లను కూడా నిర్వహిస్తామని వివరించారు. ప్రముఖ క్రీడాకారులు అంబటి రాయుడు, కరణం మల్లేశ్వరి, పీవీ సింధు, డి.హారిక, శ్రీకాంత్, వి.జ్యోతి సురేఖ వంటివారిని అంబాసిడర్లుగా ప్రకటించి భాగస్వాములను చేయాలన్నారు. అనంతరం 2023–28 క్రీడా విధానంపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శి వాణీమోహన్, రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, శాప్ ఎండీ హర్షవర్ధన్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ అర్జునరావు, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ మురళి పాల్గొన్నారు.

హైడ్రోజన్ ఎనర్జీనే ప్రత్యామ్నాయం

పెట్రోలియం మంత్రిత్వ శాఖ కార్యదర్శి పంకజ్ జైన్

సాక్షి, విశాఖపట్నం: భవిష్యత్తులో ప్రపంచానికి హైడ్రోజన్ ఎనర్జీనే సరైన ప్రత్యామ్నాయమని భారత ప్రభుత్వ పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి పంకజ్ జైన్ చెప్పారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) ఆధ్వర్యంలో హైడ్రోజన్‌పై విశాఖలో జరిగే మూడు రోజుల ‘గ్లోబల్ ఎనర్జీ ఎన్విరాన్‌మెంట్ సమ్మిట్’ సోమవారం ప్రారంభమైంది. ఈ సదస్సులో పంకజ్ జైన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 2050 నాటికి దేశంలో 25 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీల) హైడ్రోజన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. హైడ్రోజన్ ప్రొడక్షన్ క్లస్టర్‌గా వైజాగ్ నిలుస్తుందని చెప్పారు. దక్షిణ కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం హైడ్రోకార్బన్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ జీకే సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఆంత్రోపోజెనిక్ ప్రక్రియ ద్వారా 38 బిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ వాతావరణంలోకి పంప్ అవడంతో సముద్రం ఆమ్లీకరణ, భూతాపం పెరుగుతోందని, మంచు కరుగుతోందని చెప్పారు. హైడ్రోజన్ రవాణా, పంపిణీ, నిల్వల్లో సవాళ్లున్నాయని తెలిపారు. హైడ్రోజన్, కార్బన్ డయాక్సైడ్‌లను ఉపయోగించి మిథనాల్ మార్పిడిపై దృష్టి సారించాలని సూచించారు. ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ ఎండీ ఎం.కమలాకర్‌బాబు, ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్, కన్వీనర్ ప్రొఫెసర్ సోమనాథ్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధికి దోహదపడే పనులపై దృష్టి

గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే

అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా): గిరిజనుల అభివృద్ధికి దోహదపడే పనులపై అధికారులు దృష్టి పెట్టాలని, ఇందుకనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అనంతగిరి, డుంబ్రిగుడ, అరకులోయ మండలాల్లో సోమవారం ఆయన పర్యటించారు. కాఫీ తోటలను పరిశీలించారు. కాంతిలాల్ దండే మాట్లాడుతూ గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని, ప్రతి రూపాయి గిరిజనులకు ఉపయోగపడేలా ఖర్చు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని, సారవానిపాలెం, జీలుగులపాడు వద్ద వంతెనల నిర్మాణ పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. ఐటీడీఏ పీవో అభిషేక్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ శ్రీనివాస్, డీఈఈ సుబ్బారావు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు పాల్గొన్నారు.

కృష్ణాలో పెరిగిన వరద

▶ మొదటి పేజీ తరువాయి

వదులుతున్నారు. శ్రీశైలం డ్యామ్‌లోకి సోమవారం సాయంత్రం 6 గంటలకు 4,045 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 35.47 టీఎంసీలకు చేరుకుంది. మూసీ ప్రవాహంతో నాగార్జునసాగర్‌కు దిగువన వరద స్థిరంగా కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టులోకి 8,532 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 18.73 టీఎంసీలకు చేరుకుంది. మున్నేరు, వాగులు, వంకల నుంచి ప్రకాశం బ్యారేజ్‌లోకి 10,917 క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణా డెల్టాకు 7,785 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 3,132 క్యూసెక్కులను అధికారులు సముద్రంలోకి వదిలేస్తున్నారు.

తుంగభద్ర డ్యాంకు వరద

కృష్ణా నది ప్రధాన ఉపనది తుంగభద్రలో వరద ప్రవాహం జోరందుకుంది. తుంగభద్ర డ్యాంలో నీటి నిల్వ 30 టీఎంసీలను దాటింది. సోమవారం ఉదయం 64,023 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. నీటి చేరిక ఇలాగే ఉంటే నెలాఖరు నాటికి డ్యాం నిండి ఎల్‌ఎల్‌సీ కింద వరి సాగుకు అవకాశం కలుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. శివమొగ్గ, ఆగుంబే, వరనాడు, తీర్థనహళ్లి తదితర డ్యాంల ఎగువ ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వరద నీరు చేరికపై వారు నమ్మకంగా ఉన్నారు. ప్రస్తుతం దిగువ కాలువకు తాగునీటి అవసరాలకు బోర్డు అధికారులు ఈ నెల 28 తర్వాత నీటిని విడుదల చేయనున్నారు. తుంగభద్ర డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 1,633 అడుగులు కాగా సోమవారం ఉదయం 1,602.84 అడుగులకు చేరుకుంది. అలాగే పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 30 టీఎంసీల నిల్వ ఉంది.

గోదావరి వరద తగ్గుముఖం

సాక్షి, అమరావతి/ధవళేశ్వరం/పోలవరం రూరల్: ఎగువన నదీ పరీవాహక ప్రాంతంలో వర్షాలు తగ్గడంతో సోమవారం గోదావరిలో వరద ప్రవాహం కూడా తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద సోమవారం సాయంత్రం నీటిమట్టం 36.8 అడుగులకు తగ్గింది. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీటిని 48 గేట్ల ద్వారా అధికారులు దిగువకు వదిలేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 9,18,142 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 11,400 క్యూసెక్కులను వదులుతున్న అధికారులు మిగులుగా ఉన్న 9,06,742 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. అయితే గోదావరి బేసిన్‌లో అల్పపీడనం కారణంగా సోమవారం మధ్యాహ్నం నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మంగళవారం మళ్లీ గోదావరిలో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే భద్రాచలం దిగువన శబరి నీటితో పాటు కొండవాగుల నీరు కూడా గోదావరిలోకి చేరుతోంది.

మరో 2 ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్లు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏర్పాటయ్యే చిన్న, మధ్యతరహా తయారీ రంగాన్ని మరింత ప్రోత్సహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో మరో రెండు ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయనుంది. విశాఖపట్నం సమీపంలో అచ్యుతాపురం సెజ్‌లో రూ.250 కోట్లతో 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన టెక్నాలజీ సెంటర్ తరహాలోనే గుంటూరు, కొప్పర్తిల్లో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలను పంపింది. ఈ ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపింది. విశాఖపట్నంలోని టెక్నాలజీ సెంటర్ ఆటోమేషన్ డిజైనింగ్, ప్రెసిషన్ మాన్యుఫాక్చరింగ్, ఎలక్ట్రానిక్స్, 3డీ ప్రింటింగ్, రోబోటిక్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తోంది. విశాఖ చుట్టుపక్కల ఉన్న తయారీ రంగానికి అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించాలన్న లక్ష్యంతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఆరునెలల నుంచి రెండేళ్ల వరకు కాలపరిమితి ఉండే వివిధ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులను ఈ కేంద్రం అందిస్తోంది. ఇదే తరహాలో ఇప్పుడు గుంటూరు, కొప్పర్తిల్లో టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపిందని, భూకేటాయింపులు కాగానే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఏపీ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.గోపాలకృష్ణ ‘సాక్షి’కి తెలిపారు. వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్, వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టరలో ఏర్పాటయ్యే యూనిట్లకు నైపుణ్యం కలిగిన స్థానిక యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఈ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గుంటూరు టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు వెంటనే భూమి కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టరుకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. కనీసం 20 ఎకరాల విస్తీర్ణంలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

అమరావతిలో ఇళ్లు కాదు.. ఊళ్లే నిర్మిస్తున్నాం

- మంత్రి ఆదిమూలపు సురేష్

సాక్షి, అమరావతి: అమరావతి ప్రాంతంలో ఇళ్లు కాదు.. ఊళ్లే నిర్మిస్తున్నామని, ఇక్కడి ఇళ్లన్నీ ఆరు నెలల్లో పూర్తి చేసి చూపిస్తామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు ఆనాడు ఇక్కడ బడుగులకు భూమి ఇవ్వలేదు కానీ.. సింగపూర్ కంపెనీకి మాత్రం వందలాది ఎకరాలు కట్టబెట్టారని అన్నారు. రాజధానిలో పేదల ఇళ్లను రైతుల ముసుగులో టీడీపీ పెత్తందార్లు అడ్డగించారని చెప్పారు. ముఖ్యమంత్రి జగనన్న సంకల్పం ముందు చంద్రబాబు కుట్రలు నిలవలేదని, ఇళ్లకు పండుగలా శంకుస్థాపన జరిగిందన్నారు. 5 రోజుల్లోనే షీర్‌వాల్ టెక్నాలజీతో నిర్మించిన ఇంటిని మొదటి లబ్ధిదారునికి సీఎం జగన్ అందించారని చెప్పారు. పేదల ఆవేదన తెలిసిన వ్యక్తిగా సీఎం తీసుకున్న నిర్ణయాన్ని కోర్టులు సైతం సమర్థించాయన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943